This announcement is not an offer of securities for sale in the United States or elsewhere. This announcement has been prepared for publication in India only and is not for publication or distribution, directly or indirectly, in or into the United States. The Equity Shares described in this announcement have not been, and will not be, registered under the U.S. Securities Act of 1933, as amended ("**U.S. Securities Act**") or any state securities laws in the United States, and unless so registered, may not be offered or sold within the United States, or to, or for the account or benefit of, U.S. Persons (as defined in Regulation S under the U.S. Securities Act, except pursuant to an exemption from, or in a transaction not subject to, the registration requirements of the U.S. Securities Act and applicable U.S. state securities laws. The Company has not registered and does not intend to register under the U.S. Investment Company Act of 1940 ("**Investment Company Act**"). Accordingly, the Equity Shares are being offered and sold (i) to persons in the United States or to, or for the account or benefit of, U.S. persons, in each case that are both "qualified institutional buyers" as defined in Rule 144A under the Securities Act and "qualified purchasers" as defined under the Investment Company Act in transactions exempt from or not subject to the registration requirements of the Securities Act and in reliance on Section 3(c)(7) of the Investment Company Act and (ii) outside the United States to non-U.S. persons in offshore transactions in reliance on Regulation S under the Securities Act and the applicable laws of the jurisdictions where such offers and sales are made. There will be no public offering in the United States.



ఈనాడు



విజయవాడ 7-11-2025 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 87

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఆధారాలు చెరిపేయొద్దు



ఇంట్లో చోరీ జరిగితే ఏమేం పోయాయోనని ఆందోళనతో ఇల్లంతా వెతికేస్తాం..
బీరువా, లాకర్లు తీసి చూస్తాం..
తలుపులు, గేట్లు, గోడలు అన్నీ ముట్టుకుంటాం.
ఇలా చేయటం వల్ల నేర ఆధారాలు చెరిగిపోయి
అసలైన దొంగలు తప్పించుకుపోయే ప్రమాదం ఉంది!!

ఇల్లు, బ్యాంకు, వర్తక, వాణిజ్య సంస్థల్లో ఎక్కడ చోరీ జరిగినా పోలీసులొచ్చి నేరం జరిగిన ప్రదేశంలో ఆధారాలు సేకరించే దాకా ఆ ఛాయలకు ఎవర్నీ వెళ్లకుండా, తిరగకుండా చూసుకోవాలి. ఫింగర్ ప్రింట్ యంత్రాలతో పోలీసులు క్లూస్ సేకరించుకుని వాటిని తమ వద్ద ఉన్న పాత రికార్డులతో ధ్రువీకరించుకుంటారు. చోరీ చేసింది పాత నేరస్థులైతే అప్పటికప్పుడే తెలిసిపోతుంది. పోలీసులు క్లూస్ సేకరించకుండా మనమే వెతికితే దొంగల వేలి, పాద ముద్రలకు బదులు ఇంట్లో వారి వేలి, పాదముద్రలొస్తాయి. తద్వారా కేసు దర్యాప్తు త్వరగా కొలిక్కిరాదు.

ఇవి జాగ్రత్తగా ఉంచుకోవాలి

- బంగారు ఆభరణాలు కొంటే బిల్లులు తీసుకుని దాచుకోవాలి.
- వాటి ఫొటోలు, వీడియోలు తీసి పెట్టుకోవాలి.
- హాల్‌మార్క్, బరువు, క్యారెట్లు, సీరియల్ ఐడీ నంబర్లతో సహా వివరాలు ఉండాలి.

రికవరీ కోసం ఇలా...

- దొంగలు కొల్లగొట్టిన ఆభరణాలను షాపుల్లో విక్రయించటం, తాకట్టు పెట్టడం చేస్తారు. వాటిని వ్యాపారులు కొనకుండా వర్తకులను అప్రమత్తం చేయాలి. బులియన్ మర్చంట్స్ అసోసియేషన్‌కు చెందిన వాట్సప్ గ్రూప్‌లో చోరీకి గురైన వస్తువుల వివరాలు పోస్టు చేయాలి.
- అనుమానిత వ్యక్తులు అవి తీసుకొస్తే కొనుగోలు చేయకుండా సమాచారమివ్వాలని సూచించాలి. చోరీ జరిగిన ఇంట్లో, చుట్టుపక్కల సీసీ కెమెరాలు ఉంటే వాటి ఫుటేజీలు తీసి పోలీసులకు అందజేయాలి. వస్తువులకు బీమా సౌకర్యం ఉంటే క్లెయిమ్ కోసం దరఖాస్తు చేసుకోవాలి.



మోషన్ డిటెక్షన్ కెమెరాలతో అడ్డుకట్ట

-కేపీఎస్ కిశోర్, ఎస్పీ, ఏలూరు


మోషన్ డిటెక్షన్ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే చోరీలు జరగకుండా చూసుకోవచ్చు. వీటి ధర రూ.5వేల నుంచి 10 వేల లోపే ఉంటుంది. ఇతరులెవరైనా ఇంటికి వస్తే వారి కదలికలను కెమెరాలు అనుసంధానమై ఉన్న సెల్‌ఫోన్‌కు అలర్ట్ మెసేజ్ వస్తుంది. ఫొటో తీసి పంపిస్తాయి. తెలియజేసి పట్టుకోవడానికి ఇవి బాగా పనిచేస్తాయి. సాధారణ సీసీ కెమెరాలకు అలర్ట్ సమాచారం రాదు. - ఈనాడు, ఏలూరు

భం.. భం.. భలే శుభలేఖలు!



సాధారణంగా వివాహ శుభలేఖలను పెళ్లి అయ్యాక పక్కన పెట్టేస్తారు. మధ్యప్రదేశ్ ఉజ్జయినిలోని ఆజాద్ నగర్‌కు చెందిన సచిన్ గోయల్ తమ కుటుంబంలో జరుగుతున్న పెళ్లి శుభలేఖను ఆహ్వానితులు అలా పడేసేయకుండా దాచుకోవాలని భావించారు. ఈయన కుమారుడు పార్థ్ గోయల్ పెళ్లి నవంబరు 27న జరగనుంది. ఈ వివాహ ఆహ్వాన పత్రికలను త్రిశూలం, ఢమరుకం, మహాకాళ్ విభూతి పొట్లంతో కాంబోగా రూపొందించారు. కుటుంబంలోని 10 మంది సభ్యులు నెల రోజులు కష్టపడి మొత్తం 400 ఆహ్వాన పత్రికలను సిద్ధం చేశారు. ఇందుకు రూ.లక్ష ఖర్చు చేశారు. ఉజ్జయిని జ్యోతిర్లింగ క్షేత్రం కావడంతో పసుపు బియ్యానికి బదులు విభూతి చేర్చారు. -ఈటీవీ భారత్

అష్టపదుల హస్తం



సాధారణంగా కర్పూర అరటి గెలలో హస్తానికి 14 నుంచి 20 వరకు కాయలుంటాయి. తణుకులోని అరటిపండ్ల వ్యాపారి నానికి చెందిన తోటలో కాసిన ఓ గెలలోని హస్తంలో ఏకంగా 80 కాయలు ఉండటం విశేషం. స్థానికులు దీన్ని ఆసక్తిగా తిలకించారు. ఈ విషయమై ఉద్యానశాఖ అధికారిణి ప్రియదర్శిని మాట్లాడుతూ తణుకు, పెరవలి పరిసర ప్రాంతాల్లో అరటి సాగుకు అనుకూలమైన నేలలు ఉండటంతో గెలల పొడవు ఎక్కువగా ఉంటుందని, పోషకాలు అధికమైనప్పుడు అదనంగా కాయలు కాస్తాయని చెప్పారు. - న్యూస్‌టుడే, తణుకు

బెలూన్ గ్యాస్.. కనిపెట్టింది గుంటూరులోనే బాస్!

- ఫ్రెంచ్ ఖగోళ శాస్త్రవేత్త పియరీ జాన్సన్ ఘనత
- 157 ఏళ్ల క్రితం సూర్యగ్రహణం రోజున ప్రయోగం



గుంటూరు అంటే టక్కున గుర్తొచ్చేది మిరప ఘాటు.. పులిహోర దోశ.. ఈ రెండింటితో పాటు, చరిత్రలో ఓ బృహత్తర ఆవిష్కరణకు వేదిక. అదేమిటో తెలుసుకుందామా.. హీలియం.. దీనిని మనం బెలూన్ గ్యాస్‌గా పిలుచుకుంటాం. ఇది గాలి కంటే తేలికైనది. రంగు, రుచి, వాసన లేని.. విషపూరితం కాని తటస్థమైన ఒకే అణువు కలిగిన రసాయన మూలకం. భూమిపై అరుదుగా, విశ్వంలో హైడ్రోజన్ తర్వాత ఎక్కువగా లభిస్తుంది. హీలియానికి.. గుంటూరుకు విడదీయరాని అనుబంధం ఉంది. ఫ్రెంచ్ ఖగోళ శాస్త్రవేత్త పియరీ జాన్సన్.. 1868 ఆగస్టు 18న గుంటూరులో హీలియం మూలకాన్ని కనుగొన్నారు. ఆయన ఆ రోజు సూర్యగ్రహణాన్ని గమనిస్తూ క్రోమోస్ఫియర్‌లో పసుపు వర్ణపట ఉద్గారాన్ని గుర్తించారు. ఆ క్రోమోస్ఫియర్ వాయురూపంలో ఉందని చూపి, హీలియాన్ని ఆవిష్కరించారు. గ్రీకులో హీలియోస్ అంటే సూర్యుడని అర్థం.

మన దగ్గరే ఎందుకు?

అప్పట్లో సూర్యుని ఉపరితలాన్ని గ్రహణం రోజు మాత్రమే చూడగలమనే భావన ఉండేది. 1868 ఆగస్టు 18 నాటి సంపూర్ణ సూర్యగ్రహణ మార్గంలో మన దేశం ఉంది. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి గ్రహణాన్ని వీక్షించే అవకాశం ఉంది. భౌగోళికంగా నాటి మద్రాసు ప్రెసిడెన్సీలోని గుంటూరు, మచిలీపట్నం అందుకు మరింత అనుకూలంగా ఉన్నాయి. ప్రయోగాలు చేసేందుకు బ్రిటన్, ఫ్రాన్స్ నుంచి పలువురు శాస్త్రవేత్తలు భారత్‌కు వచ్చారు. అలా వచ్చిన పియరీ జాన్సన్ గుంటూరులో ఓ ఫ్రెంచ్ వ్యాపారికి చెందిన ఎత్తయిన భవనంపై ప్రయోగాలు చేశారు. ఈ క్రమంలోనే ఆయన హీలియాన్ని కనుగొన్నారు.



1868 ఆగస్టు 18న ఏర్పడిన సంపూర్ణ సూర్యగ్రహణ మార్గం (ఎర్రగీత)

ఆ తర్వాత 1868 అక్టోబరు 20న లండన్‌లో ఖగోళ శాస్త్రవేత్త నార్మన్ లాక్యర్ కూడా సూర్యుని ఉపరితలంపై హీలియాన్ని గుర్తించారు. వీరి పరిశోధనల ఫలితాలు ఒకేసారి ఫ్రెంచ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌కు చేరడంతో కొత్త మూలకాన్ని కనుగొన్న ఘనతను ఇద్దరికీ ఇచ్చారు. - ఈనాడు, అమరావతి

టైం కాదు.. మధుమేహం రీడింగ్!

ఐఐటీ మద్రాస్ ఆవిష్కరణ



మధుమేహ పరీక్ష అంటే.. సూదిని వేలికి గుచ్చి, రక్తపు చుక్క తీసి గ్లూకోమీటర్ ద్వారా చూసుకోవాలి. ఈ బాధకు స్వస్తి చెప్పేలా ఐఐటీ మద్రాస్ స్వదేశీ పరికరాన్ని అందుబాటులోకి తెస్తోంది. ఈ నిరంతర గ్లూకోజ్ పర్యవేక్షణ (కంటిన్యుయస్ గ్లూకోజ్ మానిటరింగ్-సీజీఎం) వ్యవస్థతో రియల్ టైమ్‌లో మధుమేహ స్థాయిని తెలుసుకోవచ్చు. చేతికి వాచీలా ఉండే పరికరంలోని సెన్సర్ ద్వారా మధుమేహ స్థాయి తెలుస్తుంది. ప్రస్తుతం ప్రొటోటైప్ పరికరం పూర్తవగా, ల్యాబ్ పరీక్షల్ని ముగించుకుని రెండు పేటెంట్లను ఈ పరికరం సాధించినట్లు ఐఐటీ మద్రాస్ ప్రకటించింది.

'సీజీఎంలు ఇప్పటికే మార్కెట్‌లో ఉన్నాయి. కాకపోతే వాటికి మొబైల్ లేదా మరో డిస్‌ప్లే పరికరం అనుసంధానించాలి, అవి ఖరీదెక్కువ. మేం తెచ్చిన పరికరాన్ని మాత్రం చేతికి కట్టుకుని ఎప్పుడు కావాలన్నా మధుమేహ స్థాయి తెలుసుకోవచ్చు. ఈ పరికరంలో డిస్‌ప్లే యూనిట్, రీడర్ యూనిట్, మధుమేహ స్థాయి గుర్తించేందుకు సీజీఎం ప్యాచ్ ఉంటుంది. అందులో డిస్పోజబుల్ మైక్రోనీడిల్ సెన్సర్లుంటాయి. ఇవి షుగర్ లెవెల్స్‌ను తీసుకుంటాయి. ఈ ప్యాచ్‌ను 14-21 రోజులకోసారి మారిస్తే చాలు' అని ప్రొఫెసర్ పరశురామన్ స్వామినాథన్ వివరించారు. 'ఈ పరికరం ధర రూ. 4,300 దాకా ఉండొచ్చు. 14-21 రోజులకు మార్చే మైక్రోనీడిల్ ధర రూ.300-450 దాకా ఉండొచ్చు' అని మరో పరిశోధకుడు ఎల్.బాలమురుగన్ వివరించారు. -ఈనాడు, చెన్నై

ఏ పాటకో ఈ కోరస్..



కొంగలు వరుసగా నిల్చుని.. నోరుతెరిచి కోరస్ పాడుతున్నట్టున్న ఈ దృశ్యం హైదరాబాద్ శివారు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ చెరువులో కనిపించింది. వర్షాలకు చెరువు నిండడంతో అందులోని హద్దురాళ్లపై వరసగా వాలిన నీటి కొంగలు త్వరగా చేపలు దొరికి.. ఆకలి తీరాలని సామూహికంగా ప్రార్థిస్తున్నాయేమో మరి!! - ఈనాడు, హైదరాబాద్



సంతా.. మావూరి సంత వస్తుమార్పిడే మాకంతా!

పాత రోజుల్లో మన బజార్లలో వస్తుమార్పిడి జరిగేదని విన్నాం. ఇప్పుడు నగదు చెల్లింపుల దశను కూడా దాటి, యూపీఐ స్కానింగులు చేస్తున్నాం. దక్షిణ అమెరికా ఖండంలోని ఈక్వెడార్‌లో గల మారుమూల పట్టణం గ్వామోట్‌లో ఇప్పటికీ వస్తుమార్పిడి కొనసాగుతుండటం విశేషం. గ్వామోట్ ఒక్కటే కాదు.. ఈ ప్రాంతంలోని ఇతర పట్టణాల్లోనూ ఈ వ్యవస్థను చూడవచ్చు. గ్వామోట్‌లో ప్రతి గురువారం సంత జరుగుతుంది. స్థానికులు తమ దగ్గరున్న మేకలు, పందులు, గొర్రెల వంటివి తెచ్చి వాటికి బదులుగా ఇంటికి అవసరమయ్యే వస్తువులు, దుస్తులు, కూరగాయలతో మారకం చేసుకుంటారు. కరెన్సీ అంటే వీరికి పెద్దగా తెలియదు. సంతలో దూరపు బంధువులను కలుసుకొని క్విచ్వా భాషలో కబుర్లు చెప్పుకొంటారు. ఒకరకంగా ఈ తెగల సమ్మేళనానికి సంతలు వేదికలుగా చెప్పవచ్చు. ఆధునిక ప్రపంచానికి దూరంగా ఆండిస్ పర్వతాల్లో నివసించే ఇక్కడి ప్రజల స్వచ్ఛమైన జీవితాలను చూసేందుకు ఏటా వేలాది విదేశీ పర్యాటకులు వస్తుంటారు. స్థానికులు ఎక్కువగా చేనేత దుస్తులను ధరిస్తారు. వాటిని రంగు రంగుల్లో నేయడంతో సంతల్లో రంగులలోకం కనిపిస్తుంది. -ఇంటర్నెట్ డెస్క్

పదే పదే... అదే డ్రెస్సు!

...అసలు మంచిది కాదు గురూ..!



ఉతికే ఓపిక లేకనో, ఏమీ కాదులే అన్న ఉద్దేశంతోనో కొంతమంది వేసిన బట్టలే మళ్లీ మళ్లీ వేసుకుంటూ ఉంటారు. జీన్స్ ప్యాంట్లు, షర్టులు, జాకెట్లనైతే అప్పుడప్పుడూ మాత్రమే ఉతుకుతుంటారు. ఇలా చేయడం మంచిదికాదని, ఫంగల్, బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్లు వస్తాయని చెబుతున్నారు వైద్యులు. ఉస్మానియా చర్మ వ్యాధుల విభాగానికి వచ్చే ఓపీలో 10-15 శాతం ఈ తరహా కేసులే ఉంటున్నాయని పేర్కొంటున్నారు. వీటిని ఒకటి, రెండుసార్లు వేసుకున్న తర్వాత ఉతికి మళ్లీ ధరిస్తే పెద్దగా ఇబ్బంది లేదు. కానీ కొంతమంది వారం, పది రోజులు వాటినే వేసుకుంటూ చర్మ సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు.

ఈ సమస్యలతో జాగ్రత్త...

- చర్మం రంగు మారడం
- ఎర్రగా దద్దుర్లు రావడం
- దురద, మంట, వాపు
- పుండుగా మారి చీము కారడం
- సహజతత్వాన్ని కోల్పోవడం
- చర్మం బిరుసుగా మారడం

అంటుకుంటాయి...

- హాస్టళ్లలో యువత ఒకరి బట్టలు మరొకరు వేసుకోవడం, ఒకరు వాడిన సబ్బులు, క్రీములు మరొకరు వాడడం చూస్తుంటాం. దీనివల్ల ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు వ్యాప్తి చెందుతున్నాయి.
- ఎండ వల్ల చెమట, బయట తిరగడం వల్ల దుమ్ము, ధూళి బట్టలపై పేరుకుపోతుంటాయి. వీటినే మళ్లీ మరుసటి రోజు వేసుకోవడంతో చర్మానికి అతుక్కుంటాయి.
- చర్మానికి అంటిపెట్టుకునే స్కిన్‌ఫిట్ డ్రెస్సులు వేసుకుంటే చర్మానికి గాలి తగలదు. దీంతో లోపల చెమట పట్టి వివిధ రకాల ఫంగల్, బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్లకు దారి తీస్తాయి.
- దద్దుర్లు(అర్టికేరియా), గజ్జి(స్కేబిస్), ఎండుగజ్జి(ఎగ్జిమా), తామర(రింగ్‌వార్మ్) లాంటి ఇబ్బందులతో చాలామంది చికిత్స కోసం వైద్యులను సంప్రదిస్తున్నారు. ముఖ్యంగా 0-18 వయసు పిల్లలు, యువతలో 30-40 శాతం మందిలో ఏదో ఒక చర్మ సంబంధిత సమస్య వేధిస్తోందని చెబుతున్నారు.
- పోషకాహార లోపం, పరిశుభ్రత లోపించడం, గాలి, వెలుతురు సోకని ఇళ్లు, వసతి గృహాల్లో పరిమితికి మించి ఎక్కువ మంది ఉండటం, కాలుష్యం వల్ల కూడా సమస్యలు వస్తాయని వివరిస్తున్నారు.

ఇవీ నియమాలు...

- వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం
- షర్ట్, ప్యాంటు ఒకటి, రెండు రోజులకు మించి వాడకపోవడం
- వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించడం
- రోజుకు రెండుసార్లు స్నానం చేయడం
- ఎండలో నల్లని దుస్తులను ధరించకపోవడం
- చర్మం తేమగా ఉండేలా మాయిశ్చరైజర్లు వాడాలి.
- తగినన్ని నీళ్లు తాగడం
- నిత్యం వ్యాయామం
- ఆకు కూరలు, స్ట్రాబెర్రీలు, యాపిల్స్, పుచ్చకాయ, అరటి పండ్లు తీసుకోవడం
- చర్మం కాలుష్యం బారిన పడకుండా కాపాడుకోవడం
- రోజూ కాసేపైనా చర్మానికి ఎండ తగిలేలా చూసుకోవడం
- జంక్‌ఫుడ్స్‌కు దూరంగా ఉండడం

- ఈనాడు, హైదరాబాద్

10-15 శాతం ఇలాంటి కేసులే...

ఉస్మానియా డెర్మటాలజీ ఓపీలో 10-15 శాతం ఫంగల్, బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ కేసులు ఉంటున్నాయి. వీటికి పైపూత మందులు వాడితే అప్పటికప్పుడు తగ్గినట్లు అన్పించినా...మళ్లీ మళ్లీ వేధిస్తుంటాయి. కొన్ని రకాల రక్త పరీక్షలతో ఫంగల్ రకాలను గుర్తించి వాటి మూలాల్లోకి వెళ్లి చికిత్స చేస్తే శాశ్వత పరిష్కారం ఉంటుంది. వైద్యుల సూచనలు లేకుండా సొంతంగా మందులు వాడటం మంచిది కాదు. కొన్నిసార్లు చిన్న మచ్చలే కదా...అని నిర్లక్ష్యం చేస్తే అవి వేరే పెద్ద వ్యాధికి దారితీసే ప్రమాదం ఉంటుంది. కాబట్టి తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ భూమేశ్‌కుమార్, హెచ్‌వోడీ, డెర్మటాలజీ, ఉస్మానియా



చింతించాల్సిందే!

అయ్యో ఏమైంది.. ఈ చెట్టుకు! ఉన్నదున్నట్టే ఎండిపోతుందే. ఏమై ఉంటుంది.. అంటూ ఆ మార్గంలో వెళ్లేవారిని ఆలోచింపచేస్తోంది ఈ చింత చెట్టు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి నుంచి జోడేఘాట్ వెళ్లే మార్గంలో టోకెన్ మోవాడ్ గ్రామ సమీప అటవీ ప్రాంతంలో చుట్టూ పచ్చని చెట్ల మధ్య ఈ వృక్షం ఒక్కటే ఎండిపోతూ ఇలా కనిపించింది. చింత చెట్టు వేర్ల తీపిదనం కారణంగా చెదలు తినేసి ఉండవచ్చని.. చెట్టు ఎండిపోవడానికి అదే కారణం కావచ్చని కెరమెరి ఎఫ్ఆర్ఓ మజిరొద్దీన్ తెలిపారు.

–ఈనాడు, ఆదిలాబాద్; న్యూస్‌టుడే, కెరమెరి

ప్లే కార్డ్‌కు ప్లకార్డు శిక్ష



జరిమానా విధించినా, జైలు శిక్ష వేసినా జూదరుల్లో మార్పు రావడం లేదని భావించిన జడ్జి.. వారికి వినూత్న శిక్ష విధించారు. ఇటీవల శ్రీకాకుళంలో జూదమాడుతున్న ఐదుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిపై ఒకటో పట్టణ ఎస్సై హరికృష్ణ కేసు నమోదు చేసి.. బుధవారం సెకండ్ క్లాస్ జడ్జి కె.శివరామకృష్ణ ఎదుట హాజరుపరిచారు. ఆయన నిందితులకు రూ.1,000 అపరాధ రుసుం విధించడంతో పాటు జూదం వల్ల తలెత్తే సమస్యలపై ప్లకార్డులతో అవగాహన కల్పించాలని తీర్పు చెప్పారు. గురువారం నుంచి ఈ నెల 15 వరకు రోజూ ఉదయం 9 నుంచి 11 గంటలు వరకు సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు ఇలా చేయాలని సూచించారు. ఆ మేరకు గురువారం అరసవల్లి కూడలి వద్ద డీఎస్పీ సీహెచ్ వివేకానంద పర్యవేక్షణలో నిందితులు ప్లకార్డులు ప్రదర్శించారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నేరవార్తావిభాగం



ఈ ప్రశ్నకు వెంటనే సమాధానం చెప్పగలరా?

గత మూడు నెలల్లో మీరు కొత్త అంశాలేమైనా నేర్చుకున్నారా? విదేశీ భాషగానీ, ఉద్యోగానికి లేదా వ్యక్తిగత పురోగతికి అవసరమైన నైపుణ్యంగానీ, ఇంకేదైనా మెలకువలుగానీ సాధన చేశారా? ఈ ప్రశ్నకు వెంటనే సమాధానం చెప్పగలిగితే మీరు పరవళ్లు తొక్కుతున్న సెలయేరులా అభివృద్ధి పథంలో పయనిస్తున్నట్లు. లేదంటే నిలువనీరులా ఒక్కచోటే ఆగిపోయినట్లు. అలాంటి పరిస్థితి ఏర్పడకుండా ఉండాలంటే నిత్యవిద్యార్థిలా ఉండండి.

– గ్రెగర్ పుర్డీ, లీడర్‌షిప్ కోచ్

డ్రోన్ల ముప్పునకు చెక్



యాంటీ డ్రోన్ టెక్నాలజీ వ్యవస్థ



డాక్టర్ కృష్ణనాయక్

దేశవ్యాప్తంగా వాణిజ్య డ్రోన్ల వినియోగం బాగా పెరిగింది. వీటితో లాభాలతోపాటు నష్టాలు కూడా ఉన్నాయి. కొందరు నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత ప్రాంతాల్లో ఫొటోలు, వీడియోలు తీస్తున్నారు. అంతేకాకుండా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలపై దాడులు చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో డ్రోన్లు ఎగురవేయాలంటే అనుమతులు తప్పనిసరి చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీ చేశాయి. అయినా పలువురు వాటిని బేఖాతరు చేస్తున్నారు. దీన్ని అడ్డుకోవడానికి ప్రజావసరాలకు వీలుగా ఉండేలా కర్నూలు ట్రిపుల్‌ఐటీ డీఎం(ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజైన్ మ్యానుఫ్యాక్చరింగ్) సంస్థ ఆచార్యుడు డాక్టర్ కృష్ణనాయక్, పరిశోధక విద్యార్థి వెంకటరాజులు 'యాంటీ డ్రోన్ టెక్నాలజీ'ని అభివృద్ధి చేశారు.

ఎలా పనిచేస్తుందంటే?

డ్రోన్లు గాల్లో ఎగరడానికి సాధారణంగా వినియోగించే ఐఎస్ఎం (ఇండస్ట్రియల్, సైంటిఫిక్, మెడికల్) బ్యాండ్ ద్వారా ఫ్రీక్వెన్సీని పొందుతుంటాయి. లేదంటే ప్రభుత్వ అనుమతితో లైసెన్స్ బ్యాండ్ వినియోగించాలి. సంబంధిత ఫ్రీక్వెన్సీతో డ్రోన్ అనుసంధానమై ఉండడంతోనే పైలట్ ఇచ్చే సూచనలకు అనుగుణంగా పనిచేస్తుంది. ట్రిపుల్‌ఐటీ డీఎం ఆచార్యులు రూపొందించిన డ్రోన్ రక్షణ వ్యవస్థతో ఆ రేడియో తరంగాలను స్తంభింపజేస్తారు. నిర్ణీత విస్తీర్ణం పరిధిలో అనుమతి ఉన్న ఫ్రీక్వెన్సీలు మినహా ఇతర ఫ్రీక్వెన్సీలు పనిచేయకుండా చేస్తాయి. ఏదైనా ఇల్లు లేదా సంస్థ ప్రాంగణానికి ప్రహరీ ఎలా రక్షణగా ఉంటుందో.. ఈ వ్యవస్థ విడుదల చేసే రేడియో తరంగాలు ఆ ఇల్లు/సంస్థ చుట్టూ రక్షణ కవచంలా నిలుస్తాయి. పైలట్ నుంచి సంకేతాలను స్వీకరించే డ్రోన్ రిసీవర్‌తో పాటు జీపీఎస్ రిసీవర్‌ను సైతం నిర్వీర్యం చేస్తుంది. దీంతో కొంతసేపటికి డ్రోన్ కూలిపోతుంది. 'ప్రస్తుతం 100 మీటర్ల ఎత్తు వరకు పనిచేసేలా దీన్ని తయారుచేశాం. మరిన్ని పరిశోధనలకు భారత ప్రభుత్వ శాస్త్రసాంకేతిక విభాగం (డీఎస్టీ) రూ.40 లక్షలు విడుదల చేసింది' అని ఆచార్య కృష్ణనాయక్ తెలిపారు. – ఈనాడు, కర్నూలు



ఈనాడు



విజయవాడ 7-11-2025 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 87
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 16
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

100% సేవలు ఆన్‌లైన్‌లో

- ఆ దిశగా చర్యలు తీసుకోవాలి
- ప్రజల్ని ఇంకా కార్యాలయాలకు పిలవడం ఏంటి?
- ఇక నుంచి అంతా డేటా ఆధారిత పాలనే
- మంత్రులు, కార్యదర్శులు, శాఖాధిపతులదే బాధ్యత
- డిసెంబరు రెండో వారంలో జిల్లా కలెక్టర్ల సదస్సు
- డేటా ఆధారిత పాలనపై సదస్సులో సీఎం చంద్రబాబు స్పష్టీకరణ

ఈనాడు – అమరావతి



డేటా ఆధారిత పాలనపై సదస్సులో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రులు సత్యప్రసాద్, లోకేశ్, అనిత, సీఎస్ విజయానంద్, డీజీపీ హరీశ్‌కుమార్

అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో 100% సేవల్ని ఆన్‌లైన్‌లో అందించాల్సిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. 'ఆన్‌లైన్, వాట్సప్, యాప్‌ల ద్వారా ప్రభుత్వ సేవలు అందుబాటులోకి రావాలి. అంతా ఆన్‌లైన్ అవుతుంటే ఇంకా ప్రజల్ని కార్యాలయాలకు రమ్మని పిలవడం ఏంటి? ఏ శాఖలోనూ అలాంటి పరిస్థితి ఉండకూడదు' అని నిర్దేశించారు. 'డేటా ఆధారిత పాలన'పై గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి నిర్వహించిన సదస్సులో మంత్రులు, కార్యదర్శులు, శాఖాధిపతులు పాల్గొన్నారు. వర్చువల్ విధానంలో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, నియోజకవర్గ స్థాయి టాస్క్‌ఫోర్స్ అధికారులు హాజరయ్యారు. 'డేటా ఆధారిత పాలన అమలుకు మంత్రులు, కార్యదర్శులు, శాఖాధిపతులు బాధ్యత తీసుకోవాలి. అనుకున్న పని నిర్దేశిత సమయంలో పూర్తిచేయాలి. ఇది శుక్రవారం నుంచే అమల్లోకి వస్తుంది. సందేహాలుంటే ఆర్టీజీఎస్‌లో తెలుసుకోండి. కానీ ఆర్టీజీఎస్ అమలు ఏజెన్సీ కాదు. డేటా సేకరించడం, నిర్వహించడమే చేస్తుంది. శాఖలవారీ జవాబుదారీతనం మీదే. ఫలితాలు చూపాల్సింది మీరే' అని చంద్రబాబు పేర్కొన్నారు.

తెలియకపోతే నేర్చుకుందాం.. భేషజాలు వద్దు

'ఇకనుంచి అంతా డేటా ఆధారిత పాలనే. డిసెంబరు రెండోవారంలో కలెక్టర్ల సదస్సు నిర్వహిస్తున్నాం. అప్పుడు మరోసారి ఇదే అంశంపై సమీక్షిస్తా. ఈలోగా మీ సామర్థ్యం చూపాలి. భేషజాలు వద్దు. సాంకేతికత తెలియకపోతే నేర్చుకుందాం. కార్యదర్శులు, శాఖాధిపతులు క్షేత్రస్థాయికి (మిగతా 8లో)

డిజిలాకర్ తరహాలోనే ప్రత్యేక వ్యవస్థ

కేంద్ర ప్రభుత్వ డిజిలాకర్ తరహాలోనే అవసరమైతే రాష్ట్రంలోనూ ఓ వ్యవస్థ ఏర్పాటు చేద్దాం. ఆధార్‌తో ప్రజలు తమకు సంబంధించిన అన్ని పత్రాలూ చూసుకునే వెసులుబాటు కల్పిస్తాం. ప్రజలు, సమాచారం అంతా కుటుంబం యూనిట్‌గా జియో ట్యాగింగ్ చేశాం. దీన్ని అన్ని శాఖలూ ఉపయోగించుకోవాలి. డేటా ఆటోమేటిక్‌గా వస్తుంది. దాన్ని ఉపయోగించుకోవాలి.

– చంద్రబాబు

సచివాలయాల పేరు త్వరలో మార్పు!

విజన్ యూనిట్లుగా వాడుకోవాలన్న సీఎం

సాంకేతికత సాయంతో కోర్టు కేసుల్లో కౌంటర్లు అద్భుతం

అన్ని శాఖలూ దీనిపై దృష్టి సారించాలి

ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశం

లోపలి పేజీల్లో

కనుల ముందుకు కలల సౌధం

ఈ నెలలోనే పేదల చేతికి 6,552 టిడ్కో గృహాలు

- ఎనిమిది ఏళ్ల నిరీక్షణకు తెర
- పక్కాగా మౌలిక వసతుల కల్పన..
- వచ్చే ఏడాది మార్చి నాటికి 1.18 లక్షల ఇళ్లు అందించేలా ప్రణాళిక

ఈనాడు – అమరావతి


పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో లబ్ధిదారులకు అందించనున్న టిడ్కో గృహాలు

కలల సౌధం కోసం.. 8 ఏళ్లకు పైగా వేచిచూస్తున్న పేదల ప్రతీక్షణ ఫలించనుంది. 2017-19 మధ్యలో తెదేపా ప్రభుత్వ హయాంలో చాలా వరకు గృహాల నిర్మాణం పూర్తయినా.. వైకాపా ప్రభుత్వం కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా ఐదేళ్లపాటు కాలక్షేపం చేసి వారిని ఇబ్బందులకు గురిచేసింది. అద్దె ఇళ్లలోనే మగ్గేలా చేసింది. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలతోపాటు కీలకమైన మౌలిక సదుపాయాలను కల్పించే చర్యలు చేపట్టింది. క్రమం తప్పకుండా నిధులు కేటాయిస్తూ పనులు సకాలంలో పూర్తయ్యేలా చూస్తోంది. నవంబర్ నెల మొదలు.. వచ్చే ఏడాది మార్చి నాటికి 1.18 లక్షల గృహాలను పూర్తి చేసి దశల వారీగా లబ్ధిదారులకు అప్పగించనుంది. ఇప్పటికే పూర్తయిన 6,552 గృహాలను నవంబరులో, 8,312 గృహాలను డిసెంబరులో పేదలకు అందజేస్తారు. టిడ్కో గృహాలను 300 చ.అ. విస్తీర్ణం, 365 చ.అ. విస్తీర్ణం, 430 చ.అ. విస్తీర్ణం చొప్పున వివిధ కేటగిరీల్లో నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

నాడు రంగులు వేసి ఆర్భాటం

2017-19 మధ్యలో తెదేపా ప్రభుత్వ హయాంలో దాదాపుగా 90 శాతానికిపైగా పూర్తయిన ఇళ్లకు వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటికున్న రంగులను మార్చి ఆ పార్టీ రంగులను వేయించింది. దీని కోసమే దాదాపుగా రూ.7 కోట్ల వరకు ఖర్చు చేశారు. మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టిపెట్టలేదు. కొన్ని ఇళ్ల విషయంలో ఎన్నికలు సమీపిస్తున్నాయని అప్పటికప్పుడు లబ్ధిదారులకు అప్పగించినట్లు (మిగతా 8లో)

ఆప్కో వస్త్ర నిల్వలతో రెడీమేడ్ దుస్తులు

లోపలి పేజీలో

వందేమాతరానికి నేటితో 150 ఏళ్లు

- ఉదయం 9.50 గంటలకు దేశవ్యాప్తంగా జాతీయ గేయాలాపన
- ఏడాది పొడవునా వేడుకలు
- ప్రారంభించనున్న ప్రధాని

దిల్లీ: భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్ల మంది భారతీయుల్లో స్ఫూర్తి నింపిన 'వందేమాతరం' గేయానికి శుక్రవారంతో 150 ఏళ్లు పూర్తికానున్నాయి. ఈ సందర్భంగా ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. వీటిని దిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. అనంతరం స్మారక స్టాంపు, నాణేన్ని విడుదల చేయనున్నారు. ఈ మేరకు ప్రధానమంత్రి కార్యాలయం నుంచి ఓ ప్రకటన వెలువడింది. వేడుకల్లో భాగంగా (మిగతా 8లో)



వాడవాడలా వందేమాతరం!

కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రత్యేక వ్యాసం

4లో

సురాజ్యానికి స్ఫూర్తిమంత్రం

సంపాదకీయం

బిహార్‌లో రికార్డుస్థాయి పోలింగ్

తొలిదశలో ఓటువేసినవారు 65%

పట్నా: బిహార్ శాసనసభ ఎన్నికల తొలిదశ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 121 నియోజకవర్గాల్లో గురువారం పండుగ వాతావరణంలో జరిగిన ఓటింగులో ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సుమారు 65% మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వినోద్ సింగ్ గుంజియాల్ విలేకరులకు తెలిపారు. తుది గణాంకాలతో ఇది కొద్దిగా పెరిగే అవకాశం ఉందని చెప్పారు. లఖిసరాయ్, సారణ్ వంటిచోట్ల (మిగతా 8లో)


పట్నాలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు



విశాఖలో ఏపీ గ్లోబల్ ఎంఎస్ఎంఈ సదస్సు

ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహణ

పాల్గొననున్న 16 దేశాల కొనుగోలుదారులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రాన్ని ప్రధాన ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో విశాఖపట్నంలో 'ఏపీ గ్లోబల్ ఎంఎస్ఎంఈ ఎగుమతుల అభివృద్ధి సదస్సు' నిర్వహిస్తున్నట్లు ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9, 10 తేదీల్లో రెండు రోజుల పాటు ఇండియా ఎంఎస్ఎంఈ ఫోరం సహకారంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. 'రష్యా, శ్రీలంక, హంగరీ, బ్రిటన్, ఆస్ట్రియా, జపాన్, న్యూజిలాండ్, ఈజిప్ట్, బహ్రెయిన్, నేపాల్, జింబాబ్వే, టాంజానియా, ఉగాండా, కెన్యాతో పాటు 16 దేశాలకు చెందిన 34 మంది అంతర్జాతీయ కొనుగోలుదారులు (మిగతా 8లో)

500 ఆస్తులకు ఒకటే ఫోన్ నంబరు!

- మ్యాపింగ్‌లో పంచాయతీ కార్యదర్శుల ఘోర తప్పిదాలు
- 3వేల పంచాయతీల్లో తప్పుడు నంబర్ల వినియోగం
- నిర్లక్ష్యాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం
- జిల్లాకు ఒకరి చొప్పున 26 మంది సస్పెన్షన్

ఈనాడు – అమరావతి



గ్రామ పంచాయతీల్లో ఆస్తులకు(ప్రాపర్టీ) వాటి యజమాని ఫోన్ నంబరును మ్యాపింగ్ చేయడం సహజం. 500 వేర్వేరు ఆస్తులకు ఒకే మొబైల్ నంబరు ఉండటం ఎక్కడైనా చూశారా? కొందరు పంచాయతీ కార్యదర్శుల ఘనత ఇది. స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో ప్రజల ఆస్తులను అప్‌లోడ్ చేస్తూ యజమానుల ఫోన్ నంబర్లను మ్యాపింగ్ చేయడంలో వారు అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించారు. 3 వేలకుపైగా పంచాయతీల్లో 300 నుంచి 500 ఆస్తులను ఒకే నంబరుతో మ్యాపింగ్ చేసేశారు. ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణించింది. జిల్లాకు ఒకరు చొప్పున 26 మంది పంచాయతీ కార్యదర్శులను పంచాయతీరాజ్ శాఖ గురువారం సస్పెండ్ చేసింది. మిగతా పంచాయతీల్లోనూ తనిఖీలు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఒకేసారి ఇంతమంది కార్యదర్శులను సస్పెండ్ చేయడం సంచలనమైంది. రాబోయే రోజుల్లో మరికొందరిపైనా వేటు పడే అవకాశముంది.

పారదర్శకతకు మోకాలడ్డు

- ఆస్తిపన్ను వసూళ్లలో పారదర్శకతకు.. ప్రభుత్వం ఏడాది క్రితం స్వర్ణ పంచాయతీ పోర్టల్‌ను ప్రారంభించింది. నగదు రహిత చెల్లింపులు చేయాలన్న సర్కారు ఉద్దేశానికి.. పన్ను మొత్తాలను జేబుల్లో వేసుకుని జల్సాలు చేసే కొందరు కార్యదర్శులు మొదటి నుంచీ మోకాలడ్డే ప్రయత్నం చేస్తున్నారు.
- రాష్ట్రవ్యాప్తంగా 13,351 పంచాయతీల్లో 87 లక్షల ఆస్తుల (ఇళ్లు, భవనాలు, దుకాణాలు తదితరాలు) వివరాలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేసేటప్పుడు యజమానుల ఫోన్ నంబర్లను జత చేయాలని పంచాయతీరాజ్ శాఖ స్పష్టమైన ఆదేశాలిచ్చింది. ఆస్తిపన్ను చెల్లింపుల నుంచి బకాయిల వరకు యజమానుల నంబర్లకు తాజా సమాచారం పంపి అప్రమత్తం చేయాలన్నది ప్రధానోద్దేశం. (మిగతా 8లో)

రాష్ట్రంలో మైక్రోసాఫ్ట్ భారీ క్వాంటమ్ కంప్యూటర్

రూ.1,772 కోట్ల పెట్టుబడి ప్రతిపాదన

ఈనాడు, అమరావతి: ఐటీ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్.. రాష్ట్రంలో రూ.1,772.08 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టేందుకు ప్రతిపాదించింది. ఇందులో భాగంగా అమరావతి క్వాంటమ్ వ్యాలీలో 1,200 క్యూబిట్ సామర్థ్యమున్న (50 లాజికల్ క్యూబిట్స్) భారీ క్వాంటమ్ కంప్యూటర్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధులతో అధికారులు జరిపిన సంప్రదింపులు కొలిక్కి వచ్చాయి. మైక్రోసాఫ్ట్ కోసం క్వాంటమ్ వ్యాలీలో 4 వేల చ.అ. విస్తీర్ణంలో భవనాన్ని నిర్మించాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. అమరావతిలో 133 క్యూబిట్ సామర్థ్యంతో ఐబీఎం సంస్థ క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటుకు ఇప్పటికే ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకుంది.

Microsoft

మరిన్ని సంస్థల ఆసక్తి: క్వాంటమ్ వ్యాలీలో పెట్టుబడులు పెట్టేందుకు మరిన్ని సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. జపాన్‌కు చెందిన ఫుజిసు 64 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు కేంద్ర ప్రభుత్వం.. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఇనీషియేటివ్ కింద అందించే నిధులకు మరో 50 శాతం వెచ్చించి ఫ్యాబ్రికేషన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదించింది. క్వాంటమ్ వ్యాలీలో పరిశోధనలు నిర్వహించే సంస్థలకు దశల వారీగా 90 లక్షల చ.అడుగుల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం నిర్మించనున్న ఐకానిక్ టవర్ వల్ల 40 వేల చదరపు అడుగులు అందుబాటులోకి వస్తాయి. టవర్ నమూనాను ఎల్అండ్‌టీ సంస్థ రూపొందించింది.


లోపలి పేజీల్లో

ఉల్లి రైతులకు త్వరలో ఆర్థిక సాయం

20,913 మందికి రూ.104.57 కోట్లు

వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

గోడ కూల్చేందుకు మరో రూ.32 లక్షలు చెల్లించండి




విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి, ఆమె కంపెనీకి హైకోర్టు ఆదేశం

విజయ డెయిరీ మాజీ ఛైర్మన్.. మండవ జానకిరామయ్య కన్నుమూత

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో... రెండోరోజూ ఏసీబీ సోదాలు

ఇదీ సంగతి!



ఈరోజుల్లో లంచం నగదు రూపంలో ఇస్తానంటున్నాడంటే కచ్చితంగా ఏసీబీ మనిషే అయి ఉంటాడు సార్!

మీ అమ్మాయికి మీరెంత దన్ను?



- అమ్మ, నాన్న అండగా నిలిస్తే వారికి ఆకాశమే హద్దు
- పతకాలనే కాదు... ప్రయత్నాలనూ ప్రోత్సహించాలి
- ఆడపిల్లల లక్ష్యాలకు పరిమితులు పెట్టొద్దు
- 'ఈనాడు'తో టెన్నిస్ దిగ్గజం సానియా మీర్జా

సానియా మీర్జా.. తన ఆటతో, ఆకర్షణతో ఒక తరాన్ని ఊపేసిన టెన్నిస్ తార. ఒక భారత అమ్మాయి గ్రాండ్‌స్లామ్ టోర్నీకి అర్హత సాధించడమే గగనమైన పరిస్థితుల్లో.. ఏకంగా ఆరు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు సాధించి చరిత్ర సృష్టించిందీ హైదరాబాదీ.


మహిళల టెన్నిస్‌లో ఎదగడానికి దేశంలో తనకంటూ రోల్‌మోడల్ ఎవరూ లేకపోయినా, తనకు తానే స్ఫూర్తిగా నిలుస్తూ ముందడుగు వేసిన సానియా.. కొన్ని తరాలకు ప్రేరణనిచ్చేలా ఆటలో అత్యున్నత శిఖరాలను అందుకుంది. ఆటతో పాటు విలక్షణ వ్యక్తిత్వం సానియాను భిన్నంగా నిలబెట్టింది.

'ఈనాడు'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సానియా ఆట అనంతరం జీవితం, తన ముద్దుల తనయుడి విశేషాలు వివరించారు. ఆడపిల్లల తల్లిదండ్రులకు సందేశమిచ్చారు. ఆ విశేషాలేంటో చూసేద్దాం పదండి.

? ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది యువతులకు మీరు రోల్ మోడల్. ఆడపిల్లల తల్లిదండ్రులకు మీరిచ్చే సందేశం ఏమిటి

ముందుగా వన్డే ప్రపంచకప్‌లో ఛాంపియన్‌గా నిలిచిన భారత మహిళల జట్టుకు అభినందనలు. టోర్నీ (మిగతా 8లో)

అధికారంవైపే భాగల్పూర్!



బిహార్‌కు ఆగ్నేయ దిక్కున ఉన్న భాగల్పూర్ ప్రాంతం దాదాపుగా అధికార పక్షానికే అండగా నిలుస్తూ వస్తోంది. గత 3 ఎన్నికల్లో ఈ ప్రాంతంలో అత్యధిక స్థానాలను గెలిచిన కూటమే అధికారం చేపట్టింది. ఈసారి ఈ ప్రాంతంలోని 12 సీట్లలో ఏ కూటమి ఆధిక్యం సాధిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. భాగల్పూర్ డివిజన్‌లో భాగల్పూర్, బంకా జిల్లాలున్నాయి. భాగల్పూర్‌లో 7, బంకాలో 5 నియోజకవర్గాలున్నాయి. అసెంబ్లీ సీట్ల పరంగా బిహార్‌లో ఇది అత్యంత చిన్న డివిజన్.

- ఈ ప్రాంతంలో కీలక నియోజకవర్గాల్లో భాగల్పూర్ ఒకటి. ఇక్కడి నుంచి సినీ నటి నేహ శర్మ తండ్రి అజిత్ కుమార్ శర్మ కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్నారు. గత 3 సార్లు ఇక్కడి నుంచి ఆయనే గెలిచారు.
- సుల్తాన్ గంజ్, కహల్‌గావ్‌లలో మహాగఠ్‌బంధన్‌లోని కాంగ్రెస్, ఆర్జేడీ అభ్యర్థులు పరస్పరం తలపడుతున్నారు. వారు జేడీయూ అభ్యర్థులను ఢీకొంటున్నారు.



అగ్ర, అత్యంత వెనుకబడిన వర్గాల ప్రాబల్యం

భాగల్పూర్ ప్రాంతంలో అగ్ర వర్ణాలు, అత్యంత వెనుకబడిన వర్గాల ప్రాబల్యం అధికంగా ఉంటుంది. అంగ ప్రదేశ్‌లో భాగంగా ఉండే ఈ ప్రాంతం ఒకప్పుటి అంగ మహాజనపదలో భాగంగా ఉండేది. భాగల్పూర్ పట్టణ ప్రాంతాల్లోని, బంకా గ్రామీణ ప్రాంతాల్లోని అత్యంత వెనుకబడిన వర్గాలవారు (ఈబీసీలు) ఎన్నికల్లో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తుంటారు. వీరంతా సాధారణంగా నీతీశ్ వెంటే నడుస్తారు. గతంలో జరిగిన చాలా ఎన్నికల్లో ఆయనకే మద్దతుగా నిలిచారు. ఈసారి యువతలో కొంత మార్పు రావడంతో ఎటువైపు మొగ్గుతారో అనేది ఆసక్తికరంగా మారింది. ఉపాధి అవకాశాలపై వారు ఆగ్రహంగా ఉన్నారు.

- భాగల్పూర్‌లోని ముస్లిం-యాదవ్ సమీకరణంపై మహాగఠ్‌బంధన్ ఆశలు పెట్టుకుంది. ఈ జిల్లాల్లో వీరి సంఖ్య గణనీయంగానే ఉంది.
- ఝార్ఖండ్‌కు సరిహద్దులో ఉన్న బంకా జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఇంకా నక్సల్స్ ప్రభావం ఉంది.
- శాంతి భద్రతల అంశం ఇక్కడి ఎన్నికలను ప్రభావితం చేస్తుంది.
- చిరాగ్ పాస్వాన్‌కు ఈ ప్రాంతంలో బలం ఉన్న కారణంగా ఎన్డీయే లాభపడుతోంది.
- అగ్ర వర్ణాలు, ఈబీసీల ఓట్లతో ఆధిక్యం సాధిస్తామని ఎన్డీయే భావిస్తోంది. ముస్లిం-యాదవ్ సమీకరణంతోపాటు యువత ఓట్లతో మెజారిటీ దిశగా సాగుతామని ఆర్జేడీ అంచనా వేసుకుంటోంది.

గతంలో..

- 2010 ఎన్నికల్లో భాగల్పూర్ డివిజన్‌లోని 12 సీట్లలో ఎన్డీయే 10 సీట్లు గెలుచుకుంది. ఆర్జేడీ, కాంగ్రెస్ చెరోటి గెలుచుకున్నాయి.
- 2015లో ఆర్జేడీ, జేడీయూ కలిసి పోటీ చేయగా.. ఆ కూటమికి 11 సీట్లు దక్కాయి. ఎన్డీయే కేవలం ఒక సీటే గెలుచుకుంది.
- 2020లో మళ్లీ భాజపా, జేడీయూ కలిసి పోటీ చేశాయి. ఆ ఎన్నికల్లో ఎన్డీయే 9 సీట్లు గెలుచుకుంది. మహాగఠ్‌బంధన్ 3 సీట్లలో విజయం సాధించింది.

- నేషనల్ డెస్క్



మంటల్లో దగ్ధమవుతున్న బస్సు ★ కాలిపోయిన అనంతరం...

మన్యం ఘాట్‌రోడ్డులో బస్సు దగ్ధం

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

పాచిపెంట, న్యూస్‌టుడే: పార్వతీపురం మన్యం జిల్లాలోని ఘాట్ రోడ్డులో ఒడిశాకు చెందిన ఆర్టీసీ బస్సు గురువారం ఉదయం దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం నుంచి ఒడిశాలోని జయపురానికి వెళ్తున్న బస్సు పాచిపెంట మండలం కంకణాపల్లి ఘాట్ రోడ్డులో నెమ్మదించింది. డ్రైవర్ పక్కకు ఆపి, పరిశీలించగా ఇంజిన్ నుంచి పొగతోపాటు మంటలు వస్తుండటం గమనించారు. వెంటనే అందులో ఉన్న ఎనిమిది మంది ప్రయాణికులను దింపేశారు. అనంతరం మంటలు పూర్తిగా వ్యాపించి క్షణాల్లోనే బస్సు కాలిపోయింది. ఎస్సై వెంకట సురేశ్ చేరుకుని అగ్నిమాపక శకటాన్ని రప్పించి మంటలు అదుపు చేయించారు. ఎస్పీ మాధవరెడ్డి, జిల్లా రవాణాధికారి ప్రసాద్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని చెప్పారు. ఈ ఘటనపై మంత్రులు సంధ్యారాణి, అచ్చెన్నాయుడు ఎస్పీతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

విజయ డెయిరీ మాజీ ఛైర్మన్.. మండవ జానకిరామయ్య కన్నుమూత




జానకిరామయ్య ★ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మండలి బుద్ధప్రసాద్, నెట్టెం రఘురాం, దాసరి బాలవర్ధనరావు తదితరులు

హనుమాన్‌జంక్షన్, మొవ్వ(కూచిపూడి), న్యూస్‌టుడే: విజయ డెయిరీ మాజీ ఛైర్మన్ మండవ జానకిరామయ్య(93) కన్నుమూశారు. కృష్ణా జిల్లా గన్నవరం శివారులోని రిషి వాటికలో నివసిస్తున్న ఆయన కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. పరిస్థితి విషమించడంతో గురువారం ఉదయం తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కృష్ణా జిల్లా మొవ్వకు చెందిన జానకిరామయ్య 1982లో సర్పంచ్‌గా ప్రస్థానం ప్రారంభించారు. విజయ డెయిరీ ఛైర్మన్‌గా ఎన్నికై 27 ఏళ్లకు పైగా కొనసాగారు. పాడి రైతుల సంక్షేమానికి విశేష కృషి చేశారు. 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక విజయ డెయిరీపై గురి పెట్టిన తర్వాత.. రైతులు, సంస్థ ఎలాంటి ఇబ్బంది రాకుండా జానకిరామయ్య అవిశ్రాంత పోరాటం సాగించారు. విజయ డెయిరీ అంటే జానకిరామయ్య పేరు గుర్తుకొచ్చేలా క్షేత్రస్థాయిలో తనదైన ముద్రవేశారు. వయోభారం, ఆతర్వాత కారణంగా 2019 మేలో పదవికి రాజీనామా చేశారు. ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, వర్ల కుమార్ రాజా, బోడే ప్రసాద్, మండలి బుద్ధప్రసాద్, డీసీసీబీ ఛైర్మన్ నెట్టెం రఘురాం, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు, విజయ డెయిరీ ప్రస్తుత ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి ఈశ్వర్‌బాబు, పాలకమండలి సభ్యులు.. జానకిరామయ్య భౌతిక కాయానికి నివాళులర్పించారు. దావాజీగూడెం శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తిచేశారు. స్వగ్రామం మొవ్వ నుంచి బంధువులు, అభిమానులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

స్వగ్రామానికి అభివృద్ధి బాటలు...

సర్పంచిగా మొవ్వ అభివృద్ధికి జానకిరామయ్య విశేష కృషిచేశారు. గ్రామాన్ని ఉన్నత స్థాయిలో నిలిపారు. మొవ్వను మండల కేంద్రంగా మార్చేందుకు పాటుపడ్డారు. పేద విద్యార్థుల కోసం ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలలను దాతల సాయంతో ఏర్పాటుచేశారు. పంచాయతీ శాశ్వత ఆదాయం కోసం ప్రజా సంఘాలు, దాతల విరాళాలతోపాటు ప్రభుత్వ నిధులను వెచ్చించి, 40 దుకాణాలతో షాపింగ్ కాంప్లెక్సు నిర్మించారు. ఏడాదికి రూ.25 లక్షల ఆదాయం వచ్చేలా చేశారు. కల్యాణ మండపం నిర్మించి, దాన్నుంచి వచ్చిన ఆదాయాన్ని సీసీ రోడ్లకు వినియోగించారు. పాల సేకరణ మొదలు గిట్టుబాటు ధర కల్పించడం వరకూ పలు సంస్కరణలు చేపట్టి రైతుల ఆదరాభిమానాలు చూరగొన్నారు.



జానకిరామయ్య కృషితో ఏర్పాటైన మొవ్వలోని క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల

రైతులకు అందించిన సేవలు చిరస్మరణీయం

పాడి రైతులకు జానకిరామయ్య అందించిన సేవలు చిరస్మరణీయమని సీఎం చంద్రబాబు తెలిపారు. 'విజయ డెయిరీ ఛైర్మన్‌గా సుదీర్ఘ కాలం పనిచేసి, పాడి రైతులకు ఆర్థిక భరోసా కల్పించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా' అని పేర్కొన్నారు.

సీఎం చంద్రబాబుతో భాజపా అధ్యక్షుడు మాధవ్ భేటీ



ముఖ్యమంత్రి చంద్రబాబుకు 'నేషన్ ఫస్ట్' పుస్తకం అందిస్తున్న మాధవ్, చిత్రంలో మధుకర్

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబుతో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, భాజపా రాష్ట్ర సంఘటన కార్యదర్శి మధుకర్ గురువారం సచివాలయంలో భేటీ అయ్యారు. బిర్సా ముండా 150 ఏళ్ల జయంతి కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా జరపనున్న నేపథ్యంలో ఎన్డీయే నేతలను ఆహ్వానించడానికి కార్యాచరణ రూపొందించామని సీఎంకు మాధవ్ వివరించారు. వందేమాతరం గీతం 150 వసంతాల వేడుకలు, వాజ్‌పేయీ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి కార్యక్రమాల గురించి వివరించారు. ఇంటింటికీ స్వదేశీ, ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్, మన్‌కీ బాత్ కార్యక్రమాలను ఎన్డీయే ఆధ్వర్యంలో ముందుకు తీసుకెళ్లేందుకు సహకారం అందించాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్వదేశీ స్టిక్కరు, మన్‌కీ బాత్‌పై ప్రచురించిన పుస్తకాన్ని మాధవ్ బహూకరించారు.

గ్రహం అనుగ్రహం

7-11-2025 శుక్రవారం


శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; శరదృతువు, కార్తిక మాసం, బహుళపక్షం
విదియ: మ. 2-28 తదుపరి తదియ
కృత్తిక: ఉ. 6-59 తదుపరి రోహిణి
తె. 5-21 తదుపరి మృగశిర
వర్జ్యం: రా. 9-53 నుంచి 11-22 వరకు
అమృత ఘడియలు: ఉ. 6-14 వరకు,
తిరిగి రా. 2-21 నుంచి 3-51 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-19 నుంచి 9-05 వరకు
తిరిగి మ. 12-06 నుంచి 12-51 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ.6.04; సూర్యాస్తమయం: సా.5.24

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	37.0	25.0
నరసాపురం	35.0	26.6
నెల్లూరు	34.4	27.6
విజయవాడ	34.0	24.3
అనంతపురం	33.6	23.0
ఒంగోలు	33.2	24.2
తాడేపల్లిగూడెం	33.0	27.0
విశాఖపట్నం	33.0	24.8
కడప	33.0	24.0
గుంటూరు	32.0	26.0
శ్రీకాకుళం	32.0	24.0
తిరుపతి	29.5	24.6

వ్యోమగామి శిక్షణకు కైవల్యరెడ్డి ఎంపిక

- నాలుగేళ్లపాటు ఫ్లోరిడాలో వివిధ అంశాల్లో తర్ఫీదు



కైవల్యరెడ్డి

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, నిడదవోలు: ఫ్లోరిడాలోని టైటాన్స్ స్పేస్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో చేపట్టే వ్యోమగామి శిక్షణకు తూర్పుగోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన కుంచల కైవల్యరెడ్డి అర్హత సాధించారు. ప్రపంచవ్యాప్తంగా 36 దేశాల నుంచి వేల మంది దరఖాస్తు చేయగా వడపోత అనంతరం 150 మందిని శిక్షణకు ఎంపిక చేశారు. ఆ జాబితాలో కైవల్య ఉన్నారు. ఆ సంస్థ సీఈఓ నీల్ ఎస్.లాచ్‌మన్ నుంచి ఈమెయిల్ సమాచారం అందరడంతో ఆమెతోపాటు కుటుంబసభ్యుల ఆనందానికి అవధులు లేవు. చిన్నప్పటి నుంచి చదువుతో పాటు అంతరిక్షం తదతర అంశాలపై ఆసక్తి పెంచుకుని.. రసాయన, భౌతిక, గణిత శాస్త్రాలపై పట్టు సాధించి లక్ష్యం దిశగా పయనిస్తూ 17 ఏళ్లకే అరుదైన అవకాశాన్ని కైవల్య సొంతం చేసుకున్నారు. 2026 నుంచి 29 వరకు శిక్షణ ఉంటుంది.

2029లో అంతరిక్షంలోకి..

టైటాన్స్ స్పేస్ ఇండస్ట్రీస్ 2029లో అంతరిక్షంలోకి వెళ్లాలని లక్ష్యంగా నిర్దేశించుకుని, ఆ దిశగా వ్యోమగామి శిక్షణకు శ్రీకారం చుట్టింది. శిక్షణ విజయవంతంగా పూర్తయితే అంతరిక్షంలో 300 కి.మీ. పరిధిలో భూమిచుట్టూ రెండుసార్లు తిరిగేలా 5 గంటల మిషన్ ఉంటుంది. ఇందులో మూడు గంటలపాటు వ్యోమగాములు జీరోగ్రావిటీలో ఉంటారు. కైవల్యరెడ్డి తండ్రి కుంచాల శ్రీనివాసరెడ్డి నిడదవోలు మండలం సమిశ్రగూడెం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తుండగా, తల్లి విజయలక్ష్మి గృహిణి. జర్మనీలోని ఎల్ఎంయూలో ఆస్ట్రోఫిజిక్స్, ఆస్ట్రానమీ చేయాలనేది తన లక్ష్యమని, ఖగోళ శాస్త్రవేత్తగా సేవలందిస్తానని కైవల్యరెడ్డి చెబుతున్నారు.

చీమలతో బతకడం నా వల్ల కాదు..!

- మిర్మికోఫోబియాతో వివాహిత ఆత్మహత్య



మనీష

జిన్నారం(అమీన్‌పూర్), న్యూస్‌టుడే: చీమలను చూసిన భయంతో ఓ మహిళ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నరేశ్ కథనం ప్రకారం.. మంచిర్యాలకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ద్యావనపల్లి శ్రీకాంత్‌కు, అదే పట్టణానికి చెందిన మనీష(25)తో 2022లో వివాహం జరిగింది. వీరికి మూడేళ్ల కుమార్తె ఉండగా.. కొంతకాలంగా పటాన్‌చెరు మండలం అమీన్‌పూర్ పరిధి నవ్య హోమ్స్‌లో నివాసం ఉంటున్నారు. మనీష చిన్నప్పటి నుంచి మిర్మికోఫోబియా (చీమలంటే భయం)తో బాధపడుతున్నారు. దీనికి సంబంధించి సైకాలజిస్టు దగ్గర గతంలో కౌన్సెలింగ్ తీసుకున్నారు. ఈ నెల 4న శ్రీకాంత్ విధులకు వెళ్లి. . సాయంత్రం వచ్చేసరికి ఇంటి తలుపులు లోపలి నుంచి పెట్టి ఉన్నాయి. ఎంతకూ తీయకపోవడంతో పగలగొట్టి చూడగా మనీష ఉరేసుకొని కనిపించారు. పక్కనే ఓ కాగితంపై.. 'శ్రీ అయామ్ సారీ.. చీమలతో బతకటం నా వల్ల కాదు. పాప జాగ్రత్త. అన్నవరం, తిరుపతి మొక్కులు తీర్చు.. ఎల్లమ్మతల్లికి ఒడిబియ్యం మరిచిపోకు' అని రాసి ఉంది. ఆత్మహత్యకు ముందు ఇంటిని శుభ్రం చేస్తానని చెప్పి, పాపను సమీపంలోని బంధువుల ఇంటి వద్ద ఉంచారు. ఇల్లు శుభ్రం చేసే సమయంలో చీమలను చూసి భయపడి ఉండొచ్చని సీఐ తెలిపారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సైకాలజిస్టుల ప్రకారం.. మిర్మికోఫోబియా ఉన్నవారు చీమలను చూడగానే కంగారు, దడకు గురవడం, అవి కనిపిస్తాయని పొలాలు, పార్కుల వంటి ప్రాంతాలకు వెళ్లకపోవడం, చీమలు కనిపిస్తే ఇంటిని ఒకటికి పదిసార్లు శుభ్రం చేయడం, ఆహారం పాడవుతుందని భయపడడం వంటివి చేస్తారు.

బిడ్డకు జన్మనిచ్చిన గిరిజన వసతిగృహ బాలిక

కడప (అరవిందనగర్), న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ బాలికల వసతిగృహంలో ఉంటున్న ఓ బాలిక బిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయం తెలిసినా వసతిగృహ అధికారులు పట్టించుకోలేదు. కడపలోని ఓ గిరిజన బాలికల వసతిగృహంలో ఉంటూ సమీపంలోని ఓ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో చదువుతున్న 17 ఏళ్ల బాలిక గర్భం దాల్చింది. తొమ్మిది నెలలుగా ఆమె వసతిగృహంలోనే ఉంటున్నా, గర్భందాల్చిన సంగతిని వార్డెన్, వంట మనిషి, నైట్‌వాచ్ ఉమెన్, స్వీపరు ఎవరూ గుర్తించలేదు. మరోవైపు, నెలలు నిండడంతో మూణ్నెల్లుగా బాలిక కళాశాలకు సరిగా వెళ్లడంలేదు. బుధవారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో బాలిక స్వయంగా రిమ్స్‌కు వెళ్లింది. అక్కడ వైద్యులు సాధారణ ప్రసవం చేశారు. గురువారం తెల్లవారుజామున విషయం తెలుసుకున్న గిరిజన సంక్షేమశాఖ శాఖ అధికారులు రిమ్స్‌కు చేరుకున్నారు. ఈ విషయం తెలియగానే బాలిక తల్లిదండ్రులు గురువారం రాత్రి ఆసుపత్రికి వచ్చారు. బాలిక ఐదో నెల నుంచి నెలవారీ పరీక్షలు చేయించుకుంటూ మందులు వాడుతున్నట్లు కొందరు చెబుతున్నారు. కళాశాలలో ఓ సీనియర్ విద్యార్థితో ఆమె చనువుగా ఉండేదని, గర్భం దాల్చడానికి అతడే కారణమై ఉంటాడని సమాచారం. ఘటనను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని ఎస్టీ కార్పొరేషన్ ఇన్‌ఛార్జి ఈడీ, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సరస్వతి 'న్యూస్‌టుడే'కు తెలిపారు. గర్భం దాల్చిన సంగతి వసతిగృహం సిబ్బంది తొక్కిపెట్టారా అన్న విషయంపైనా విచారణ చేస్తామన్నారు. మరోవైపు, ఈ ఘటనపై రిమ్స్ ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేశారు.

క్యాట్ ఉత్తర్వులను రద్దు చేయండి

- ఐపీఎస్ విశాల్ గున్ని విషయంలో హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం వ్యాజ్యం
- విచారణ 11కు వాయిదా

ఈనాడు, అమరావతి: ఐపీఎస్ అధికారి విశాల్ గున్నిని సస్పెండ్ చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసి, విధుల్లోకి తీసుకోవాలని క్యాట్ (కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్) ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం హైకోర్టు విచారణ జరిపింది. ప్రభుత్వ న్యాయవాది జీవీఎల్ మూర్తి స్పందిస్తూ.. ఈ వ్యాజ్యంలో పిటిషనర్ల తరఫున అడ్వొకేట్ జనరల్(ఏజీ) వాదనలు వినిపిస్తారన్నారు. విచారణను మరో తేదీకి వాయిదా వేయాలని కోరారు. ఈ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం విచారణను ఈ నెల 11కు వాయిదా వేసింది. న్యాయమూర్తులు జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ తుహిన్ కుమార్‌తో కూడిన ధర్మాసనం గురువారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

★ ముంబయికి చెందిన సినీ నటి కాదంబరీ జెత్వానీ అక్రమ అరెస్ట్ వ్యవహారంలో ఐపీఎస్ అధికారి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ విశాల్ గున్నిని సస్పెండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2024 సెప్టెంబరులో ఉత్తర్వులిచ్చింది. అనంతరం సస్పెన్షన్‌ను పొడిగిస్తోంది. ఈ సస్పెన్షన్‌పై విశాల్ గున్ని హైదరాబాద్‌లోని క్యాట్‌ను ఆశ్రయించారు. విచారణ జరిపిన క్యాట్.. సస్పెన్షన్ ఉత్తర్వులను కొట్టేస్తూ ఈ ఏడాది ఆగస్టు 21న ఉత్తర్వులిచ్చింది. క్యాట్ ఉత్తర్వులను సవాలు చేస్తూ జీఏడీ ప్రధాన కార్యదర్శి, డీజీపీ హైకోర్టులో పిటిషన్ వేశారు. విశాల్ గున్ని, కేంద్ర హోం శాఖ కార్యదర్శిని ప్రతివాదులుగా పేర్కొన్నారు.



21న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తిరుమల పర్యటన

తిరుమల, న్యూస్‌టుడే: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈనెల 21న తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకోనున్నారు. ముందురోజు తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం తిరుమలకు చేరుకుంటారు. సంప్రదాయం ప్రకారం ముందుగా శ్రీవరాహస్వామిని, తర్వాత శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకోనున్నారు. రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లపై సీవీఎస్‌ఓ మురళీకృష్ణ, ఇతర విభాగాధిపతులతో గురువారం తితిదే అదనపు ఈఓ వెంకయ్యచౌదరి సమీక్ష నిర్వహించారు.

అంగ ప్రదక్షిణ టోకెన్ల జారీ విధానంలో మార్పు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి ఆలయంలో అంగ ప్రదక్షిణ చేసే భక్తులకు టోకెన్ల కేటాయింపు విధానంలో తితిదే మార్పులు చేసింది. ప్రస్తుతం రోజుకు 750 చొప్పున ఆన్‌లైన్ డిప్ విధానంలో జారీ చేస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల అమల్లోకి వచ్చిన ఈ విధానాన్ని రద్దు చేసి ముందువచ్చిన వారికి ముందు పద్ధతిలో టోకెన్లు కేటాయించాలని నిర్ణయించింది. ఇకపై 3 నెలల ముందుగానే ఆన్‌లైన్‌లో విడుదలవుతాయని, మార్పును గమనించి బుక్ చేసుకోవాల్సిందిగా భక్తులకు తితిదే సూచించింది.

ఆప్కో వస్త్ర నిల్వలతో రెడీమేడ్ దుస్తులు: మంత్రి సవిత



వస్త్ర నిల్వలు పరిశీలిస్తున్న మంత్రి సవిత

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: ఆప్కో గోదాముల్లో నిల్వ ఉన్న రూ.15 కోట్ల విలువైన వస్త్రాలతో నూతన డిజైన్లతో రెడీమేడ్ దుస్తులు తయారీ చేయించనున్నట్లు చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరి వద్ద ఉన్న గోదాములోని నిల్వలను గురువారం ఆమె పరిశీలించారు. రూ.13.48 కోట్ల విలువైన వస్త్ర నిల్వలను షోరూమ్‌ల నుంచి తీసుకున్నట్లు ఆప్కో మేనేజర్ మనోజ్‌కుమార్ మంత్రి దృష్టికి తేగా.. వాటిని గ్రేడింగ్ చేసి, డ్యామేజీ లేని వస్త్రాలను తిరిగి విక్రయించాలని ఆదేశించారు. అవసరమైతే రాయితీ ప్రకటించాలని సూచించారు. పేరుకున్న నిల్వలతో చీరలు, పంచెలు, చేతి సంచులు తయారు చేయించి, వినియోగదారులకు అందుబాటులోకి తేవాలని సూచిస్తున్నట్లు తెలిపారు. డిజైనర్లను నియమించి.. దుస్తులు తయారు చేసే బాధ్యత మహిళలకు అప్పగిస్తే వారికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. అధికారంలో ఉండగా రైతులు, బీసీలను పట్టించుకోని వైకాపా అధినేత జగన్.. రాజకీయ లబ్ధి కోసం డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. అప్పుడు బీసీలను తీవ్రంగా వేధించి, జోగి రమేష్ అరెస్టైతే ఇప్పుడు బీసీలు గుర్తొచ్చారా? అని ప్రశ్నించారు.

వైకాపా రేవ్ పార్టీపై విచారణ

కొమ్మారెడ్డి పట్టాభిరామ్




మాట్లాడుతున్న పట్టాభిరామ్. పక్కన పీలా శ్రీనివాసరావు

విశాఖపట్నం(కార్పొరేషన్), న్యూస్‌టుడే: వైకాపా విద్యార్థి విభాగం అధ్యక్షుడు కొండారెడ్డి విశాఖలో డ్రగ్స్‌తో పట్టుబడిన ఘటన కంటే ముందు, ఆ పార్టీ నాయకులు ఓ ప్రాంతంలో రహస్యంగా రేవ్ పార్టీ నిర్వహించినట్లు తెలిసిందని స్వర్ణాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. ఆ రేవ్ పార్టీ వ్యవహారంపై విచారణ సాగుతోందన్నారు. గురువారం విశాఖలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ''డ్రగ్స్ వ్యవహారంపై ఇప్పటి వరకు ఆ పార్టీ నాయకులు స్పందించలేదు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు కొండారెడ్డి ప్రధాన అనుచరుడు ఉన్నా.. ఆయన నోరు మెదపడం లేదు. కూటమి పాలనలో విశాఖను అంతర్జాతీయ కార్యక్రమాలకు వేదికగా చేస్తుంటే, వైకాపా నాయకులు నగరాన్ని డ్రగ్ క్యాపిటల్‌గా మార్చారు. ఈ నెల 14, 15న విశాఖలో జరిగే భాగస్వామ్య సదస్సును జీరో వేస్ట్ ఈవెంట్‌గా నిర్వహిస్తాం. ప్లాస్టిక్ బదులు బయో డీగ్రేడబుల్ వస్తువులు వినియోగిస్తాం. క్లైమేట్ స్మార్ట్ ఈవెంట్‌గా నిర్వహిస్తాం'' అని పట్టాభిరామ్ పేర్కొన్నారు.

గ్రామీణ రహదారుల సమగ్ర సమాచారంతో పోర్టల్

ఈనాడు, అమరావతి: గ్రామీణ రహదారులకు సంబంధించిన సమగ్ర సమాచారంతో ప్రభుత్వం ప్రత్యేకంగా పోర్టల్‌ను తీసుకొస్తోంది. జిల్లా వారీగా రోడ్ల సమాచారం ఇందులో నిక్షిప్తం చేయడంతోపాటు వాటిని జియో ట్యాగింగ్ చేయనుంది. రహదారుల నిర్మాణం, మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాదనల తయారీలో సమాచారం ఉపయోగపడేలా దీనిని రూపొందిస్తోంది.



పిల్లలను మైదానాల్లోకి తీసుకెళ్లాం

మీ పిల్లలను క్రీడల్లో చేర్పించండి. వారందరూ అథ్లెట్లుగా ఎదగకపోవచ్చుగానీ, ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ, స్థిరత్వం, ఇతరులతో కలిసి సమన్వయంతో పనిచేయడం, కఠిన పరిస్థితుల్లోనూ సహనంతో వ్యవహరించడం, శ్రమను గౌరవించడం తప్పక నేర్చుకుంటారు. మనం పిల్లలను ఉద్యోగాలు నుంచి గాడ్జెట్ల వైపు లాక్కెళ్లిపోయాం. తిరిగి వారిని మైదానాల్లోకి తీసుకెళ్దాం.

- గ్రాంట్ బెక్కా, వెల్‌నెస్ మెంటార్

సుబ్బానాయుడు సేవలు ఎనలేనివి

- ఆయన కుటుంబానికి అండగా ఉంటాం: మంత్రి లోకేశ్



మాలెపాటి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న లోకేశ్

ఈనాడు, నెల్లూరు, దగదర్తి, న్యూస్‌టుడే: 'మాలెపాటి సుబ్బానాయుడు తెలుగుదేశం పార్టీ తరఫున చేసిన సేవలు ఎనలేనివి. కార్యకర్తల సంక్షేమం కోసం పోరాడారు. ఆయన్ను కోల్పోవడం వారి కుటుంబానికే కాదు.. తెదేపాకు తీరనిలోటు. ఆ కుటుంబానికి అండగా ఉంటా. రాజకీయంగా పైకి తీసుకొచ్చే బాధ్యతను పార్టీ ప్రధాన కార్యదర్శిగా తీసుకుంటా' అని మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. ఇటీవల మరణించిన రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మన్ సుబ్బానాయుడు, ఆయన అన్న కుమారుడు భానుచందర్‌ల స్వగ్రామమైన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా దగదర్తికి గురువారం మంత్రి లోకేశ్ వచ్చారు. వారి ఇళ్లకు వెళ్లి ఇరువురి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెదేపాకు చెందిన ఇద్దరు నాయకులను కోల్పోవడం తీరని లోటని, దాన్ని భర్తీ చేయలేమని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టాల్లో ఉన్న కుటుంబానికి అండగా నిలవాల్సింది పోయి.. కించపరిచేలా కొందరు పోస్టులు పెడుతున్నారని లోకేశ్ ఆగ్రహించారు. దీనిపై పూర్తి విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారిని ప్రోత్సహించిన వారిని కూడా వదిలే ప్రసక్తి లేదని స్పష్టంచేశారు. 'తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే ప్రాణం. వారికోసం 2014లోనే సంక్షేమ నిధి ఏర్పాటు చేసి, రూ.135 కోట్లు ఖర్చుచేశాం' అని లోకేశ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఫరూక్, ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

వైకాపా వాళ్లు లీడర్లు కాదు.. డ్రగ్ డీలర్లు

ఈనాడు, అమరావతి: వైకాపా వాళ్లు లీడర్లు కాదని, మాదకద్రవ్యాల డీలర్లని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ మండిపడ్డారు. ''డ్రగ్ డీలర్లను సస్పెండ్ చేయని ఆ పార్టీలోకి బంగారు భవిష్యత్తు ఉన్న యువతను పంపుతారా? వైకాపాలో ఉన్నా, ఆ పార్టీ నాయకులతో తిరిగినా మీ బిడ్డల భవిష్యత్తు ఏమవుతుందో ఆలోచించుకోండి. తల్లిదండ్రులారా.. తస్మాత్ జాగ్రత్త'' అని లోకేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

★ ''కావలిలో నా పర్యటనకు వచ్చి తిరిగి వెళుతున్న కార్యకర్తల ఆటోను కారు ఢీకొన్న ప్రమాదంలో పలువురు గాయపడటం చాలా బాధకరం'' అని మంత్రి లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని అధికారుల్ని ఆదేశించినట్టు ఎక్స్‌లో తెలిపారు.

అభిమానికి భరోసా



లింగసముద్రం గ్రామానికి చెందిన ఎం.కొండయ్య తెదేపా అభిమాని. గతంలో జిల్లాలో జరిగిన లోకేశ్ పాదయాత్రలో పాల్గొన్నారు. నాడు ఆయనతో ఫొటో తీయించుకున్నారు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. కుటుంబ సమస్యలూ చుట్టుముట్టాయి. ఈ నేపథ్యంలో లోకేశ్‌ను కలిసేందుకు రాగా భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. అతన్ని చూసిన మంత్రి.. తన వద్దకు పిలిపించుకొని మాట్లాడి భరోసా ఇచ్చారు. ఆయన సమస్యలు వెంటనే పరిష్కరించాలని అధికారులకు లోకేశ్ సూచించారు.

పరకామణి కేసులో వేగం పెంచిన సీఐడీ బృందం



సీసీ కెమెరా నిఘా కేంద్రం నుంచి బయటకు వస్తున్న రవిశంకర్ అయ్యన్నార్ బృందం. చిత్రంలో తితిదే వీజీవో రామ్‌కుమార్, డీఎస్పీ విజయ్‌శేఖర్ తదితరులు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలోని పరకామణి చోరీ కేసు దర్యాప్తులో సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ బృందం వేగం పెంచింది. క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా గురువారం పరకామణి భవనంలోని నగదు లెక్కింపు, సిబ్బంది తనిఖీలు, అక్కడి సీసీ కెమెరాలు పరిశీలించి వివరాలు సేకరించింది. అనంతరం పీఏసీ-4లోని సీసీ కెమెరా నిఘా నియంత్రణ కేంద్రానికి వెళ్లింది. అక్కడ పరకామణి చోరీకి సంబంధించి పుటేజీని మరోసారి పరిశీలించి విశ్లేషించింది. మరోవైపు పెద్దజీయర్ మఠం మేనేజర్‌కు సీఐడీ బృందం ఇప్పటికే లేఖ రాసింది. అందులో రవికుమార్ ఎప్పుడు చేరారు, ఎప్పటి నుంచి అతనికి పరకామణిలో విధులు కేటాయించారు వంటి సమాచారం కోరినట్లు తెలిసింది. పరకామణిలో చేరడానికి ఆయనకు సహకరించిన వారు, తదనంతరం ఆయన్ను వెనకేసుకొచ్చిన వారెవరు, చోరీ ఘటనల్లో పాత్రధారులు వంటి వివరాలపైనా బృందం దృష్టి సారించింది. రవికుమార్ ఆస్తులకు సంబంధించి అనిశా గతంలో సేకరించిన వివరాల సేకరణకు చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా సీఐడీ డీజీ మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతానికి కేసు దర్యాప్తు కొనసాగుతోందని, నిందితులకు సంబంధించి పూర్తిస్థాయి ఆధారాలు లభించాక వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. వీరి వెంట తితిదే వింగ్ వీజీవో రామ్‌కుమార్, తిరుమల డీఎస్పీ విజయ్‌శేఖర్ తదితరులు ఉన్నారు.

వందేమాతరం స్ఫూర్తిని భావితరాలకు అందిద్దాం

ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: పోరాటస్ఫూర్తిని నింపిన వందేమాతర గీతం గురించి భావితరాలకు తెలిపే బాధ్యత మనదే అని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో కశ్మీరు నుంచి కన్యాకుమారి వరకూ రణనినాదంలా వందేమాతరం నిలిచిందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం నాటికి వందేమాతరం 150 ఏళ్లు పూర్తిచేసుకుంటున్నందున ఉదయం 10 గంటలకు ప్రతి ఒక్కరం గీతాన్ని ఆలపిద్దామని పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. 'బంకిం చంద్ర ఛటర్జీ రాసిన వందేమాతరం దేశం మొత్తాన్నీ ఉద్యమస్ఫూర్తితో ముందుకు నడిపించింది. సమరయోధులకు మనోబలాన్ని ఇచ్చింది. ఆంగ్లేయులను భయపెట్టింది. వందేమాతరం ఆలపించినా, విన్నా నరనరానా దేశభక్తి నిండుతుంది. ఒళ్లు పులకిస్తుంది' అని పేర్కొన్నారు.

ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం ఫలితాల వెల్లడి

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: ఈ ఏడాది సెప్టెంబరు/ అక్టోబరులో జరిగిన ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. రెండో సంవత్సరం తరగతులు నవంబరు 10 నుంచి ప్రారంభమవుతాయని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు.

హాజరు నుంచి మినహాయించండి

- సీబీఐ కోర్టులో మెమో దాఖలు చేసిన జగన్



ఈనాడు, హైదరాబాద్: యూరప్ పర్యటనకు వెళ్లి వచ్చాక కోర్టు ఎదుట హాజరుకావాలన్న ఉత్తర్వును ఉపసంహరించుకోవాలని కోరుతూ అక్రమాస్తుల కేసులో ప్రధాన నిందితుడైన ఏపీ మాజీ సీఎం జగన్ గురువారం హైదరాబాద్ సీబీఐ కోర్టులో మెమో దాఖలు చేశారు. అక్టోబరు ఒకటి నుంచి 30 లోగా 15 రోజులపాటు జగన్ యూరప్ పర్యటన నిమిత్తం సీబీఐ కోర్టు అనుమతి ఇస్తూ.. వెళ్లే ముందు పర్యటన వివరాలు, ఫోన్ నంబరు, ఈ-మెయిల్ వివరాలు సమర్పించాలని, వచ్చాక నవంబరు 14లోపు కోర్టు ఎదుట వ్యక్తిగతంగా హాజరుకావాలని షరతులు విధించింది. విదేశీ పర్యటన ముగించుకొని వచ్చిన జగన్ కోర్టు ఎదుట ఇంకా హాజరుకాలేదు. కోర్టు విధించిన గడువు సమీపిస్తున్న నేపథ్యంలో తన వ్యక్తిగత హాజరును మినహాయించాలని అభ్యర్థించారు. ఈ కేసులో తన తరఫున ప్రత్యేక వకల్తా కింద న్యాయవాది హాజరుకావడానికి హైకోర్టు అనుమతి మంజూరు చేసిందని ప్రస్తావించారు. అంతేగాకుండా కోర్టు ముందు తాను హాజరుకావడానికి రాష్ట్ర యంత్రాంగం ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందని, ఇది యంత్రాంగానికి భారమని పేర్కొన్నారు. తప్పనిసరి అని కోర్టు భావిస్తే హాజరు కావడానికి సిద్ధమేనన్నారు. కోర్టు అనుమతిస్తే ప్రత్యామ్నాయంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుకావడానికి ఎలాంటి ఇబ్బందిలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ మెమో కోర్టు పరిశీలనలో ఉంది.

నా హయాంలో 40 లక్షల ఉద్యోగాలు కల్పించా

- విద్యార్థి విభాగం సమావేశంలో వైకాపా అధినేత

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో ప్రభుత్వ రంగంలో 6.13 లక్షలు, ఎంఎస్ఎంఈల్లో 33 లక్షలకుపైగా మొత్తంగా 40.13 లక్షల ఉద్యోగాలు కల్పించామని మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధ్యక్షుడు జగన్ తెలిపారు. వైకాపా హయాంలో తీసుకున్న చర్యల వల్లే ఇప్పుడు విశాఖకు గూగుల్ డేటా సెంటర్ వస్తోందన్నారు. భోగాపురం విమానాశ్రయానికి శంకుస్థాపన చేసి, భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్‌కు రూ.900 కోట్లు వైకాపా హయాంలోనే ఖర్చు చేశామన్నారు. గురువారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో వైకాపా విద్యార్థి విభాగం రాష్ట్ర, జిల్లాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ' 'మామూలుగా విద్యార్థులకు ఓటు హక్కు ఉండదని వారి గురించి ఏ రాజకీయ నాయకుడూ ఆలోచించడు. వారి కోసం ఆలోచించి పనిచేసేవాడు రాజకీయ నాయకుడిగానే కాదు, లీడర్‌గా నిలబడతాడు. అలాంటి అడుగులు వైకాపా హయాంలోనే తొలిసారి పడ్డాయని గర్వంగా చెప్పగలను' ' అని వ్యాఖ్యానించారు.

విద్యార్థులకు ఉద్బోధ: ''కల్మషం లేని రాజకీయాలు ప్రారంభమయ్యేందుకు బీజం పడాల్సింది యువత, విద్యార్థి దశ నుంచే. మీరు జెన్ జీ యుగంలో ఉన్నారు. భావితరాలకు దిక్సూచీలు మీరు.. రాజకీయాల్లో తులసి మొక్కల్లా ఎదగాలి. విద్యార్థులు, యువత గట్టిగా అడుగులు వేస్తే రాష్ట్రాలే కాదు, దేశాల్లోనూ ప్రభుత్వాలు మారిపోతున్నాయి. అంతటి శక్తి యువతకుంది. ఇది సోషల్ మీడియా యుగం. అందులో చురుగ్గా ఉండే మీరే దీన్ని డ్రైవ్ చేసేది. భవిష్యత్తు అంతా మీ చేతుల్లోనే ఉంది. మీరు ప్రభుత్వాలనూ మార్చేయగలరు'' అని విద్యార్థి ప్రతినిధులకు జగన్ సూక్తులు బోధించారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయాలని చూస్తున్న చంద్రబాబును యువతే ప్రశ్నించాలని కోరారు.

మాదకద్రవ్యాల వాడకాన్ని ప్రోత్సహిస్తోంది జగనే

- 'వైకాపా విద్యార్థి' నాయకులతో డ్రగ్స్ దందా
- హోంమంత్రి వంగలపూడి అనిత ధ్వజం



ఈనాడు, అమరావతి: ''రాష్ట్రంలో మాదకద్రవ్యాల్ని వైకాపా అధినేత జగన్ ప్రోత్సహిస్తున్నారు. ఆ పార్టీ విద్యార్థి విభాగం నాయకుల్ని ప్రోత్సహిస్తూ విశ్వవిద్యాలయాల్లో డ్రగ్స్ దందా నడుపుతున్నారు'' అని హోంమంత్రి వంగలపూడి అనిత ధ్వజమెత్తారు. వైకాపా లాంటి పార్టీతో, ఆ పార్టీ నాయకులతో పిల్లల్ని పంపేటప్పుడు తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. వైకాపా విద్యార్థి విభాగం నాయకుడు కొండారెడ్డి.. జగన్, మాజీ మంత్రి అమర్‌నాథ్ తదితరులతో ఉన్న ఫొటోల్ని ప్రదర్శించారు. ' 'ఆంధ్ర విశ్వవిద్యాలయంలో డ్రగ్స్ దందా చేస్తూ కొండారెడ్డి ఈగల్‌కు పట్టుబడ్డాడు. అతడి వల్ల ఇద్దరు బీటెక్ విద్యార్థుల జీవితాలు నాశనమయ్యాయి. అలాంటి వ్యక్తిపై ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదు? అతడికి పార్టీకి సంబంధం లేదని జగన్ కానీ, వైకాపా నాయకులు కానీ ఎందుకు ప్రకటన చేయలేదు'' అని అనిత ప్రశ్నించారు. 'వైకాపా నాయకులు పేద విద్యార్థుల్ని లక్ష్యంగా చేసుకుంటున్నారు. డబ్బు ఆశ చూపించి వారితో డ్రగ్స్ సరఫరా చేయిస్తున్నారు. నైతికత లేని నాయకులతో పనిచేసినప్పుడే కొండారెడ్డి జీవితం నాశనమైంది. అతడు ఎన్ని రోజుల నుంచి ఈ దందా చేస్తున్నాడో విచారణ జరుగుతోంది. స్కూలు పిల్లల బ్యాగుల్లోకీ గంజాయి చేర్చిన ఘనత జగన్‌రెడ్డిది. ఆయన సీఎంగా ఉన్నప్పుడు గంజాయి నియంత్రణ మీద ఒక్క రివ్యూ కూడా చేయలేదు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు దేశంలో గంజాయి ఎక్కడ దొరికినా దాని మూలాలు ఏపీలో ఉండేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక గంజాయి, మాదకద్రవ్యాల్ని సంపూర్ణంగా నాశనం చేస్తున్నాం. ఈగల్ వ్యవస్థతో గంజాయి సాగు సున్నాకు వచ్చింది. 'డ్రగ్స్ వద్దు బ్రో' అనే నినాదాన్ని పాఠశాల స్థాయికి తీసుకువెళుతున్నాం'' అని అనిత వివరించారు.

తిరుపతి జిల్లాలో చెరువుకు గండి



గండిపడిన ప్రాంతం



కళత్తూరు గ్రామానికి పోటెత్తిన వరద



కొట్టుకుపోతున్న ఆవులు, కుక్కలు

- పల్లెలను ముంచెత్తిన వరద

ఈనాడు డిజిటల్, తిరుపతి; న్యూస్‌టుడే, కేవీబీపురం: తిరుపతి జిల్లా కేవీబీపురం మండలంలోని రాయలచెరువుకు గండిపడి, ఆ నీరు 5 గ్రామాలను ముంచెత్తింది. ఈ పరిణామంతో గురువారం జిల్లా ఉలిక్కిపడింది. ఉదయం 7 గంటలకు చెరువు కట్ట బలహీనంగా ఉండటాన్ని రైతులు గమనించారు. వెంటనే చెరువు కిందనున్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తుండగానే గండిపడింది. నీరంతా పాతపాలెం, కళత్తూరు, అరుంధతివాడ గ్రామాలను చుట్టుముట్టింది. గ్రామాల్లో 8 అడుగుల మేర ప్రవాహం వచ్చింది. గ్రామస్థులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని మిద్దెలపైకి పరుగు తీశారు. వరద ఉద్ధృతికి మూగజీవాలు, ఆటోలు, ట్రాక్టర్లు, ఆరుబయట పెట్టుకున్న పరికరాలన్నీ కొట్టుకుపోయాయి. శ్రీకాళహస్తి-పిచ్చాటూరు ప్రధాన మార్గంపైకి వరద చేరడంతో 2 గంటలు రాకపోకలు నిలిచిపోయాయి. కళత్తూరు, ఎంఏరాజుల కండ్రిగ, మహదేవపురం, కాట్రపల్లి పరిధిలోని పొలాలు నీటితో నిండిపోయాయి. మధ్యాహ్నానికల్లా గ్రామాల్లో వరద తగ్గడంతో అధికారులు నష్టం అంచనాపై అధ్యయనం మొదలుపెట్టారు. సుమారు 2 వేల ఎకరాల పంట భూమిలో ఇసుక మేట వేసినట్లు తెలిపారు.

★ రాయల చెరువును 50 ఏళ్ల కిందట రెండు కొండల మధ్య నిర్మించారు. ఈ చెరువు కింద 1,200 ఎకరాల ఆయకట్టు ఉంది. 2014-19లో నీరుచెట్టు పథకంలో కట్టకు తాత్కాలిక పనులు చేపట్టారు. తదనంతరం పట్టించుకోకపోవడంతో కట్ట బలహీనపడినట్లు తెలుస్తోంది.


సురాజ్యానికి స్ఫూర్తిమంత్రం

యుద్ధభూమిలో ఉద్భవించిన 'భగవద్గీత'- పంచాక్షరి. స్వరాజ్య ఉద్యమ నేపథ్యంలో పెల్లుబికిన 'వందేమాతరం'- పంచాక్షరి. వికలమనస్కుడైన వీరుణ్ని తట్టిలేపింది- భగవద్గీత. నిద్రాణస్థితిలోని జాతి చైతన్యాన్ని పట్టి ఊపింది- వందేమాతరం. నిర్లిప్తత, నిస్సహాయతల్లోంచి మనిషిని నిటారుగా నిలబెట్టేందుకే పుట్టాయవి. వందేమాతర గీతమైతే మూలమూలల్లోంచి, మూలుగుల్లోంచి అగ్నిని రగిలించింది. 'వంటిలోని రగతమంత రంకెలేసి ఎగిరేలా, లోపలున్న పేనమంత దుముకు దుముకులాడేలా...' ఉరకలు వేయించింది. ముందుకు నడిపించింది. 'త్రింశత్కోటికంఠ కలకల నినాదకరాళే...' అంటూ గర్జించిన వందేమాతరం- జాతికి జాగృతిగీతమైంది. బానిస బతుకుల నరనరాల్లోని పిరికి రక్తాన్ని ఎరుపెక్కించిన ఆ గీతం- 'కాలు చిందుతొక్కేలా దుమ్మూరం రేగినట్లు ఒక్క సెమట పట్టేలా వీరంగం' చేయించింది. ఉద్యమ స్ఫూర్తికి ఊపిరి పోసింది. గుండె చప్పుళ్ల నాదమై రణన్నినాదమై దేశం నలుదిక్కులా మారు మోగింది. అది పాటకాదు- 'మాకొద్దీ తెల్ల దొరతనము (గరిమెళ్ల)' వంటి ఎన్నో స్వాతంత్ర్యోద్యమ గీతాలకు తెరిచిన బాట. కోట్లాది పీడితుల తిరుగుబాటు బావుటా!

'నేనంత ఒక పిడికెడు మట్టే కావచ్చు. కానీ కలం ఎత్తితే ఒక దేశపు జెండాకున్నంత పొగరుంటుంది' అన్నారు శేషేంద్రశర్మ. ఆ పొగరు ఆత్మగౌరవానికి, అభిజాత్యానికి కొలబద్ద. స్వరాజ్య సమరం సమయంలో చేవచచ్చిన నెత్తుటిలో ఆ రెండింటినీ రంగరించింది- వందేమాతర గీతం. సుబ్బారావు పాణిగ్రాహి చెప్పిన 'దిక్కుమొక్కు లేని జనం- ఒక్కొక్కరు అగ్గిరకం' అయ్యేందుకు తగిన ఇంధనం అయ్యింది. భగత్‌సింగ్ గురించి కవి సోమసుందర్ చెప్పిన 'ఒక తారక మేల్కాంచెను, ఒక వీరుడు కనువిచ్చెను, ఒక మెలకువ ఒక్క వెలుగు'ను ప్రతిఒక్కరి విషయంలో నిజం చేసింది. వందేమాతర గీతానికి చెందిన అనంతమైన కాంతి పరివేషం ఆంగ్లేయుల కళ్లకు మిరుమిట్లు గొల్పింది. సినారె మాటల్లో 'పర్వమానను బావివైపు చెయిసాచినది.' అలా చాచిన చేతికి స్వరాజ్యఫలం అందేలా చేసిందది. ఇదీ... వందేమాతర గీతానికి చెందిన చారిత్రక నేపథ్యం! లాఠీలతో కొడుతున్నా, జైళ్లలోకి నెడుతున్నా అందరి నోటా తూటాలా ఒకే రకం పొలికేక- వందేమాతరం! అని. అలనాటి చేతికి ఆయుధం. మనసుకు ఔషధం.

150 ఏళ్లక్రితం ఇదే రోజున బంకించంద్రుని కలంనుంచి జాలువారిన వందేమాతర గీతానికి ఇప్పుడు అదేస్థాయి కాంతి పరివేషాన్ని ఆశించలేం. మహాత్ముడే వచ్చి అడిగినా- ఒంటిమీద నగలన్నీ వలిచి ఇచ్చేయడాలు, ఆస్తిపాస్తులన్నీ రాసిచ్చేయడాలు ఊహించలేం. బలమైన భావోద్వేగాలు మొలకెత్తిస్తున్నదే... దేశంతో ప్రగాఢ అనుబంధం ఏర్పడుతుంది. 'వందేమాతర గీతం స్వరం మారుతోంది... తరం మారుతోంది కనుక స్వరం మారుతోంది' అని కవుల అంచనా. కారణం- ప్రజల ప్రాధాన్యాల్లో వచ్చిన మార్పు. అప్పట్లో దేశ ప్రయోజనాలకు పెద్ద పీట దక్కింది. ఇప్పుడు వ్యక్తిగత స్వార్థాలు మొలకలు వేస్తున్నాయి. అప్పటి పోరాట లక్ష్యం స్వరాజ్యం ఇప్పటి యుగావసరం- సురాజ్యం! కాబట్టి ఉద్యమ స్వరూపం మారాలి. అమెరికన్ కవి వాల్ట్ విట్మన్‌లా 'ఇవ్వడమంటూ జరిగితే- నన్ను నేను సంపూర్ణంగా అర్పించుకుంటాను' అంటూ స్వార్థాన్ని విడిచి దేశ క్షేమం కోసం, సకల జనుల సంక్షేమం కోసం నిలబడే వారితోనే 'వికసిత భారత్' సాధ్యం అవుతుంది. స్వతంత్ర భారతదేశానికి, వందేమాతర గీతానికి మూర్ధాభిషేకం జరగాలంటే... 'సుజలాం సుఫలాం సస్య శ్యామలాం మాతరం' అన్న కవి ఆశయం నెరవేరాలంటే... సురాజ్య స్థాపన కోసం శపథం తీసుకోవాలి. అదే ఆ దేశ భక్తి గీతానికి మనమిచ్చే పుట్టినరోజు కానుక!

వాడవాడలా వందేమాతరం!



భారతదేశ సుదీర్ఘ, స్ఫూర్తిదాయక చరిత్రలో మహోద్యమాలకు కళలూ పాటలూ అంతరాత్మగా నిలిచిన సందర్భాలెన్నో! అవి జాతి భావోద్వేగాలను వీణలా మీటి, వెన్నుతట్టి సమష్టి కార్యాచరణకు పురిగొల్పాయి. ఛత్రపతి శివాజీ సైన్యం ఉద్వేగంగా ఆలపించిన యుద్ధగీతాలు మొదలు... స్వాతంత్ర్యోద్యమంలో ప్రతిధ్వనించిన దేశభక్తి గీతాలు, ఎమర్జెన్సీ కాలంలో యువగళాలు వినిపించిన ధిక్కార గీతాలు మన ఉమ్మడి చైతన్యాన్ని జాగృతపరిచాయి. వీటన్నింటిలోకీ అత్యంత ప్రత్యేకమైనది వందేమాతరం. ఈ అమర గీతం వెలువడి 150 సంవత్సరాలైనందున, నేటి నుంచి ఏడాదిపాటు దేశమంతటా ఉత్సవాలు నిర్వహించాలని కేంద్రం నిశ్చయించింది.




అమిత్ షా
కేంద్ర హోం, సహకార శాఖామాత్యులు

మిగతా గీతాల్లా వందేమాతరం యుద్ధ రంగంలో, పోరు బాటలో ఉద్భవించింది కాదు. కవీంద్రుడు బంకించంద్ర ఛటర్జీ ప్రశాంత, దృఢ చిత్తంలో ఉద్భవించిన పాట అది. 1875లో కార్తిక శుక్ల నవమి, జగద్ధాత్రి పూజనాడు ఆయన కలం నుంచి జాలువారిన వందేమాతర గీతం... స్వాతంత్ర్య ఉద్యమ శ్లోకంగా నిలిచి నేటికీ జాతీయ రాగంగా భాసిల్లుతోంది. భారతదేశ పురాతన సాంస్కృతిక మూలాలు ఈ గీతరచనకు ప్రేరణనిచ్చాయి. అధర్వణ వేదంలోని "మాతా భూమిః పుత్రోహం పృథివ్యాః...(భూమి నా తల్లి, నేను ఆమె పుత్రుడను)" అనే శ్లోకం, సర్వ మంగళ మాంగళ్యే శివే... అంటూ సాగే దేవీమాత స్తోత్రం వందేమాతరం గీతానికి ప్రేరణలు.

అంధకారంలో... ప్రభాత గీతం

బంకిం బాబు వందేమాతరం ప్రార్థనతో పాటు భవిష్యవాణి కూడా. అది స్వాతంత్ర్య ఉద్యమానికి జవజీవాలు అందించడమే కాదు, సాంస్కృతిక జాతీయవాద ప్రకటనగానూ నిలిచింది. భారతదేశమంటే కేవలం భూభాగం కాదనీ, యుగాలుగా పరిఢవిల్లిన నాగరికత అనీ చాటిచెప్పింది. భారత్ అంటే మ్యాపు మీద కొన్ని రేఖలను కలిపితే వచ్చే ప్రదేశంకాదనీ... ఉమ్మడి సంస్కృతి, విలువలు, శౌర్యత్యాగాలను పంచుకున్న భరతమాత బిడ్డల చిరకాల ఆవాసమనీ ఘోషించింది. భారతదేశమంటే మట్టి కాదనీ... కర్తవ్యం, అంకితభావాలతో పునీతమైన పుణ్యతీర్థమనీ ప్రబోధించింది. మహర్షి అరవిందుడు వర్ణించినట్లు- బంకించంద్రుడు ఆధునిక భారత రుషి. ఆయన పదాలు జాతి ఆత్మను మళ్లీ మేల్కొలిపాయి. ఆయన రాసిన ఆనందమఠం కేవలం నవలే కాదు, గద్యరూపంలోని మహామంత్రం. నిదురిస్తున్న జాతి తన ఆత్మబలాన్ని కనుగొనేలా జాగృతం చేసిందది. "నా రచనలన్నీ గంగానదిలో కొట్టుకుపోయినా పర్వాలేదు. ఈ ఒక్క దివ్యగీతం(వందేమాతరం) మాత్రం అజరామరంగా నిలిచిపోతుంది. దేశ ప్రజల మనసులను గెలుచుకునే మహత్తర గీతమది" అని బంకిం బాబు ఒక లేఖలో పేర్కొన్నారు. ఆయన మాటలు అక్షర సత్యాలయ్యాయి. బ్రిటిష్ అంధకార యుగంలో బంకించంద్రుడు రచించిన వందేమాతరం జాతికి ప్రభాత గీతమైంది. మన సంస్కృతి, నాగరికతల పట్ల గర్వాభిమానాలను రేకెత్తించే గానమైంది. అణువణువున మాతృభూమిపై భక్తి, అనురక్తి ఉట్టిపడే వ్యక్తి మాత్రమే వందేమాతరం వంటి గీతం రాయగలరు. ఆ గీతానికి 1896లో రవీంద్రనాథ్ ఠాగూర్ బాణీ కట్టి, కలకత్తా కాంగ్రెస్ మహాసభల్లో ఆలపించి దానికి అమరత్వం సంతరించిపెట్టారు. వందేమాతరం భాషా ప్రాంతీయ భేదాలకు అతీతంగా కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు జాతిని కదిలించింది. తమిళనాట మహాకవి సుబ్రహ్మణ్య భారతి ఈ గీతాన్ని తమిళంలోకి అనువదించారు. పంజాబ్‌లో విప్లవకారులు బ్రిటిష్ వలస పాలకులపై ధిక్కార ప్రకటనగా వందేమాతరం అంటూ నినదించారు. 1905లో బెంగాల్ విభజనపై నిరసన వెల్లువెత్తినప్పుడు వందేమాతరం అంతటా మార్మోగింది. దాంతో బ్రిటిష్ పాలకులు ఆ పాటను నిషేధించారు. కానీ, 1906 ఏప్రిల్ 14న బారిసాల్‌లో వేలమంది ఉద్యమకారులు ఆ నిషేధాన్ని ధిక్కరించి వందేమాతరం అంటూ ఘోషించారు. లాఠీ దెబ్బలకు రక్తమోడుతున్నా లెక్కచేయకుండా స్త్రీపురుషులు అలా ఘోషిస్తూనే ఉన్నారు. బెంగాల్ నుంచి వందేమాతరం విప్లవ జపమై గదర్ పార్టీ ద్వారా కాలిఫోర్నియా చేరి అక్కడా మార్మోగింది. సింగపూర్ నుంచి నేతాజీ నాయకత్వంలోని ఆజాద్ హింద్ ఫౌజ్ యోధుల ద్వారా భరత భూమికి తిరిగి వచ్చింది. 1946లో తిరుగుబాటు చేసిన రాయల్ ఇండియన్ నేవీలోని భారతీయ నావికులు వందేమాతరం అంటూ నినదిస్తూ బ్రిటిష్ యుద్ధనౌకలపై జాతీయ పతాకను ఆవిష్కరించారు. ఖుదీరాం బోస్ నుంచి అష్ఫకుల్లా ఖాన్ వరకు, చంద్రశేఖర్ ఆజాద్ నుంచి తిరుపూర్ కుమరన్ వరకు విప్లవకారులందరి గళాలు వందేమాతరం అని గర్జించాయి.



వందేమాతరం ఇక ఎంతమాత్రం పాట కాదు, భారతీయాత్మ సమష్టి స్వరం. మొద్దునిద్రలో ఉన్న వారినైనా మేల్కొలిపే మంత్రశక్తి వందేమాతరానికి ఉందని మహాత్మాగాంధీ పేర్కొన్నారు. ఉదారవాదులనూ విప్లవకారులనూ విద్వాంసులనూ సైనికులనూ ఏకతాటిపైకి తెచ్చి ఉద్యమోన్ముఖుల్ని చేసిందీ గీతం. అరవిందుడు చెప్పినట్లు, అది భారతదేశ పునరుజ్జీవన మంత్రమైంది. అక్టోబరు 26 నాటి మన్‌కీ బాత్ ప్రసంగంలో ప్రధాని మోదీ వందేమాతరం ఉజ్జ్వల వారసత్వాన్ని జాతికి గుర్తుచేశారు. ఇప్పుడు ఏడాది ఉత్సవాల్లో భాగంగా వందేమాతరం పూర్తిరూపంలో ప్రతిధ్వనిస్తూ యువత మనసుల్లో సాంస్కృతిక జాతీయవాదాన్ని నింపుతుంది. భిన్నత్వంలో ఏకత్వాన్ని కీర్తిస్తూ కేంద్రం ఇటీవల 'భారత్ పర్వ్' నిర్వహించింది. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించింది. సర్దార్ సాధించిన భారతదేశ ఏకీకరణలో వందేమాతరం స్ఫూర్తి మూర్తీభవించింది.

తరతరాలకూ ఉత్తేజం

వందేమాతరం కేవలం గత వైభవ స్మరణ కాదు, ఉజ్జ్వల భవిష్యత్తును ఆవాహించే మంత్రజపం కూడా. 2047కల్లా వికసిత్ భారత్‌ను సాధించడానికి స్ఫూర్తి ఉత్సాహాలనిచ్చే గీతమది. ఘనమైన భారతదేశ సంస్కృతీ నాగరికతలపై మనకున్న గర్వాభిమానాలకు నిదర్శనమైన ఆ గీతస్ఫూర్తిని ఆచరణలోకి తీసుకురావడం మనందరి బాధ్యత. వందేమాతరం పారతంత్ర భారతదేశానికి తొలి మేల్కొలుపు. మొక్కవోని దీక్షను చాటిన స్వేచ్ఛా గీతమది. భారతదేశపు ఆత్మ నుంచి జనించిన ఈ గీతం అజరామరంగా నిలుస్తుంది. తరతరాలకు ఉత్తేజమిస్తుంది. భారతీయత అనే కోణం నుంచి మన చరిత్ర, సంస్కృతి, విలువలు, సంప్రదాయాలను వీక్షించి... నిరంతరం స్ఫూర్తి పొంది... సదా కార్యాచరణలో నిమగ్నం కావాలని ప్రబోధించే దివ్య గానమే- వందేమాతరం! ★

రాఘవ జీతంలో సగం సిగరెట్లకే తగలేస్తాడు. సిగరెట్ల వ్యసనం మానుకోమని, ఆరోగ్యానికి మంచిది కాదని భర్తకి చెప్పీ చెప్పీ రాధ విసిగిపోయింది. ఒకరోజు అయిదొందల నోటు ఇచ్చి కొడుకును సిగరెట్ ప్యాకెట్ తెమ్మన్నాడు. రాధ అభ్యంతరం చెబితే 'ఏం కాదులే' అని కసురుకున్నాడు. కొడుకు సిగరెట్లు తెచ్చి పాకెట్ మనీ కావాలంటూ యాభై రూపాయలు తీసుకున్నాడు. మర్నాడు రాధ ఏదో రాసుకోవడానికి పెన్ను కోసం కొడుకు స్కూల్ బ్యాగ్ తెరిచింది. అందులో సిగరెట్లు ఉండటంతో భర్తకు చూపించింది. 'నీ బ్యాగ్‌లో సిగరెట్లు ఎందుకున్నాయిరా?' అడిగాడు రాఘవ కోపంగా. 'అవీ.. అవీ.. నా ఫ్రెండ్ పెట్టాడు నాన్నా' అన్నాడు కొడుకు భయంగా. 'నీ బ్యాగ్‌లో వాడెందుకు పెడతాడ్రా?' అంటూ బెల్ట్ తీసుకుని కొడుకును కొట్టడం మొదలెట్టాడు తండ్రి. 'పిల్లాణ్ని కొట్టి చంపేస్తావా?' అంటూ పెద్దగా ఏడుస్తూ కేకలు పెట్టింది రాధ. ఆ గోలకి ఇరుగూపొరుగూ వచ్చారు. 'నువ్వు మనిషివేనా? పిల్లాణ్ని కొడతావా? నువ్వు కాల్చితే ఒప్పు, వాడు కాల్చితే తప్పా? ముందు నువ్వు మారు' అని రాఘవని చివాట్లు పెట్టారు. అతడికి తల తీసేసినట్లయింది. ఇక సిగరెట్లు తాగనని శపథం చేసుకున్నాడు. అతణ్ని మార్చడానికి తల్లీ కొడుకూ ఆడిన నాటకం అదని ఆ తండ్రికి తెలియదు.



చెడగొట్టేది పెద్దలే!

శ్రీహరి గెజిటెడ్ అధికారి. మొదట్లో పార్టీల్లో తాగేవాడు. క్రమంగా అది వ్యసనంగా మారింది. కొడుకు సుధీర్ ఈమధ్యే ఉద్యోగంలో చేరాడు. తండ్రిని చూసి అతనూ తాగడం మొదలెట్టాడు. అమ్మానాన్నలు కొడుక్కి పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. తండ్రీ కొడుకూ ఇద్దరూ తాగుబోతులని తెలిసి వచ్చిన సంబంధాలు వెనక్కిపోతున్నాయి. ఒకరోజు అర్ధరాత్రి శ్రీహరికి ఫోన్ వచ్చింది. 'మీ వాడు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికాడు. పోలీస్ స్టేషన్లో ఉన్నాడు' అని. ఎస్ఐ శ్రీహరి మేనల్లుడే. విషయం తెలిసి ఉదయాన్నే శ్రీహరి స్నేహితులు పరామర్శకి వచ్చారు. అతడికి చాలా అవమానంగా అనిపించింది. తను చేసిన పనే కొడుకూ చేస్తున్నాడు కాబట్టి అతణ్ని ఏమనడానికీ మొహం చెల్లలేదు. దాంతో ఇక జన్మలో తాగకూడదని గట్టిగా నిర్ణయించుకుని భార్యాబిడ్డలకు మాటిచ్చాడు. అతడిలో ఆ మార్పు తేవడానికి భార్య, కొడుకు, మేనల్లుడు కలిసి ఆడిన నాటకం అదని శ్రీహరికి తెలియదు.

ఇలా నాటకాలతో వ్యసనాలు మాన్పించడం మాటలు చెప్పినంత తేలికేమీ కాదు. పెద్దలు ఏం చేస్తే పిల్లలూ అదే చేస్తారని చెప్పడానికే ఈ ఉదాహరణలు. చాలా మంది తండ్రులు చేస్తున్న తప్పులే ఇవి. తాము వ్యసనాల బారిన పడటమే కాక పిల్లలూ ఆ దారి పట్టేందుకు కారణమవుతున్నారు. చేజేతులా తమ బిడ్డల ఆరోగ్యాన్ని, భవిష్యత్తును నాశనం చేస్తున్నారు. నిజంగా పిల్లల మీద ప్రేమ ఉన్న తల్లిదండ్రులెవరూ వ్యసనాల జోలికి పోరని గుర్తుంచుకోవాలి.

– మొలకలపల్లి కోటేశ్వరరావు

పిల్లలకు సైన్సును విదేశీ భాషలో నేర్పడం అసహజమే కాదు, వారికి తీవ్ర అన్యాయం చేసినట్లు కూడా. దానివల్ల వాళ్లు ఫ్యాక్ట్స్‌ని బట్టీ పట్టగలరు కానీ విషయంలోని ఆత్మను అర్థం చేసుకోలేరు. మన శాస్త్ర పరిశోధన అభివృద్ధికి అది పెద్ద అవరోధం.


– సీవీ రామన్




కాలం అమూల్యం

కాలం ఒక ప్రవాహం లాంటిది. దానికి ఆది, అంతం లేవు. 'లెక్కించే వాటిలో కాలాన్ని నేను' అంటాడు గీతాకారుడు. కాబట్టి అది భగవత్ స్వరూపం. అలాంటి కాలాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలి. గడచిన కాలం తిరిగి రాదు. వచ్చే కాలం మనకు అనుకూలంగా ఉంటుందని చెప్పలేం. అందుకే వర్తమానాన్ని సద్వినియోగం చేసుకోవాలి. కాలం అందరికీ సమానమే. కానీ, తనకు మంచి జరిగినప్పుడు కాలం కలిసొచ్చిందని, కష్టం వస్తే చెడుకాలం వెంటాడుతోందని సమయాన్ని నిర్వచిస్తాడు మనిషి.

నిజానికి కాలానికి ఇష్టలు, అయిష్టలు అంటూ ఉండదు. దానికి మనిషి మంచీ చెడులతో సంబంధం లేదు. మనకు కలిగే సుఖదుఃఖాలకు కాలాన్ని నిందించడం అవివేకం, అవగాహనా రాహిత్యం. కాలం తన ధర్మాన్ని తాను పాటిస్తూ ముందుకు సాగుతుంటుంది. ఏనాడూ తన పరిధిని అతిక్రమించదు. సీతాన్వేషణలో నిమగ్నమైన హనుమంతుడు ఏ ఒక్కక్షణాన్నీ వృథా చేయలేదు. మైనాకుని ఆతిథ్యాన్ని కూడా స్వీకరించకుండా సమయం లేనందువల్ల ఆగలేక పోతున్నానని చెప్పి ముందుకెళ్లాడు. అలాగే అరణ్య, అజ్ఞాత వాసాలను పూర్తిచేసిన పాండవులు ఏనాడూ తమ కష్టాలకు కుంగిపోలేదు. ఆ సమయాన్ని వారు తమకు అనుకూలంగా మార్చుకుని ధీరోదాత్తులయ్యారు. సంకల్ప శుద్ధి కలవారు సమయాన్ని వృథా చేయరు. ప్రతి క్షణాన్నీ సర్వేశ్వర స్వరూపంగా భావించి, గౌరవించి లక్ష్యాలను సాధిస్తారు. సమస్యలు ఎదురైనప్పుడు పరిష్కారం దిశగా అడుగేసే ఉత్సాహవంతులే అవకాశాలను అందిపుచ్చుకుని విజయాలు సాధిస్తారు.





కాలానికి విలువివ్వని వాళ్లు ఏదీ సాధించలేరు. దుష్టులు వ్యసనాలతో, కలహాలతో కాలాన్ని వ్యర్థం చేస్తారని భర్తృహరి బోధించాడు. భోగాలకు, సుఖాలకు బానిసలైన వాళ్లు దైవం ప్రసాదించిన అమూల్యమైన కాలాన్ని వృథా చేస్తున్నామనే సత్యాన్ని గ్రహించరు. అందుకే మనిషి కాలానుగుణంగా ప్రవర్తించి విజయపథాన్ని చేరుకోవాలని చెబుతారు పండితులు. కాలగతిలో మనిషికి ఎన్నో గాయాలు తగులుతాయి. కాలమే వాటిని మాన్పుతుంది. మానసిక బాధలను ఉపశమింపజేసే శక్తి కాలానికి మాత్రమే ఉంది. కాలం గాలానికి ప్రతి ప్రాణి తలవంచక తప్పదు. భీముడంతటి బలశాలి కొన్నేళ్లు వంటవాడిగా ఉండాల్సి వచ్చింది. రాకుమారుడైన శ్రీరాముడు కారణాంతరాల వల్ల అడవుల పాలు కావాల్సి వచ్చింది.

ప్రతి మనిషికీ అనేక కోరికలు ఉంటాయి. ఆశయాలుంటాయి. వాటిని ఆచరణలో పెట్టాలి. 'రేపు చేద్దామనుకున్న పని ఈ రోజే చెయ్యి, ఈ రోజు చేద్దామనుకున్న పని ఇప్పుడే చెయ్యి, ఎందుకంటే ఏ క్షణంలో ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు' అంటాడు భక్త కవి కబీర్. కాలం ప్రతి మనిషికీ ఎన్నో పాఠాలు నేర్పుతుంది. ఎన్నో ధర్మాలు బోధిస్తుంది. ఆశ, నిరాశలకు అతీతంగా జీవించమని చెబుతుంది. విధ్యుక్త ధర్మాన్ని ఆచరించేవారికి సహస్ర హస్తాలతో సహకరిస్తుంది. అలాంటి కాలం విలువ గుర్తించి ముందడుగు వేసే ఉత్సాహవంతులు ఎల్లప్పుడూ విజేతలుగానే నిలుస్తారు.

– విశ్వనాథ రమ

పేద దేశాల్లో మరణ మృదంగం

అంటువ్యాధులతో పాటు మధుమేహం, గుండెజబ్బులు, క్యాన్సర్లు వంటి అసాంక్రామిక వ్యాధులు ప్రపంచవ్యాప్తంగా పెద్దసంఖ్యలో ప్రజలను పొట్టన పెట్టుకుంటున్నాయి. రోడ్డు ప్రమాదాలు, అల్లర్లు, ఇతరత్రా దుర్ఘటనల్లో గాయపడీ ఎంతో మంది అసువులు బాస్తున్నారు. మాతా శిశుమరణాలకూ అడ్డుకట్ట పడటంలేదు. వీటన్నింటి మూలంగా 2021లో అల్పాదాయ దేశాల్లో ప్రతి లక్ష మందికి మరణాల రేటు 12.79గా తేలింది. వాటితో పోలిస్తే అధికాదాయ దేశాల్లో చావులు దాదాపు మూడు రెట్లు తక్కువ. 2021లో ఆయా దేశాల్లో ప్రతి లక్ష మందికి సంబంధిత మరణాల రేటు...

	అసాంక్రామిక	సాంక్రామిక,మాతా, శిశు మరణాలు
అల్పాదాయ దేశాలు	633	560
దిగువ మధ్యాదాయ	662	366
ఎగువ మధ్యాదాయ	534	155
అధికాదాయ	378	74

(ఆధారం: ఐహెచ్ఎంఈ, గ్లోబల్ బర్డన్ ఆఫ్ డిసీజెస్ నివేదిక-2024)

రహదారులపై నరమేధం... జాతి భవితకు ప్రమాదం

కేంద్ర రహదారి రవాణా శాఖ నివేదిక-2023 గణాంకాల ప్రకారం సగటున రోజుకు 473 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారు. మృతుల్లో 68 శాతం పాదచారులు, సైక్లిస్టులు, ద్విచక్ర వాహనదారులే! ముఖ్యంగా కొత్తగా నిర్మిస్తున్న జాతీయ రహదారులపై పాదచారి వంతెనలు, అండర్‌పాస్‌లు, సర్వీస్ రోడ్లు తగినంతగా లేకపోవడం ప్రధానలోపం. గ్రామీణ ప్రాంతాల్లో పొలాలకు వెళ్లడానికి హైవేలను దాటాల్సిన క్రమంలో సురక్షిత ప్రత్యామ్నాయాలు లేక, ఏటా వేలమంది అన్నదాతలు, పాదచారులు ప్రాణాలు కోల్పోతున్నారు. దేశవ్యాప్తంగా భారీగా నమోదవుతున్న హిట్ అండ్ రన్ కేసులతో వేలమంది రోడ్లపైనే ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రమాదం జరిగిన గంటలోపు ఆసుపత్రికి తీసుకెళ్తే ప్రాణాల్ని కాపాడే అవకాశం ఉంటుంది. గాయపడ్డవారిని ఆసుపత్రికి తీసుకెళ్లాల్సిన తక్షణ బాధ్యత ప్రమాదకారకులదే. కానీ కొంతమంది దుర్ఘటన తరవాత పారిపోతుండటంతో బాధితులకు తక్షణ సాయం అందడం లేదు. ఇది మరణాల సంఖ్యను పెంచుతోంది. నిందితులు దొరక్కపోవడంతో బాధితులకు న్యాయం జరగడంలోనూ ఆలస్యం అవుతోంది. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలిపి ఉంచడం వల్ల వెనక నుంచి వేగంగా వచ్చేవారు, వాటిని సకాలంలో గుర్తించలేక ఢీకొట్టి ప్రమాదాల బారిన పడుతున్నారు.



రహదారి ప్రమాదాలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. వాటిలో మరణిస్తున్న వారిలో మూడింట రెండొంతుల మంది 18-45 ఏళ్లలోపు వారే ఉంటున్నారు. దేశ భవితకు చోదక శక్తులైన యువత ప్రాణాలు కోల్పోతుండటం జాతికి చేటు చేస్తోంది. రోడ్డు ప్రమాదాలు కుటుంబాల్ని మాత్రమే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థనూ బలహీన పరుస్తున్నాయి.

జాతీయ రహదారులపైనే ఎక్కువ...

రహదారి ప్రమాదాలు బాధిత కుటుంబాలతో పాటు దేశానికీ తీవ్ర ఆర్థిక నష్టాన్ని మిగులుస్తున్నాయి. చికిత్సలకయ్యే భారీ ఖర్చులు మోయలేని భారమవుతున్నాయి. క్షతగాత్రులు ఉపాధి కోల్పోవడంతో జీవనం కష్టమవుతోంది. క్షతగాత్రుల బాగోగులు చూడాల్సిన కుటుంబ సభ్యుల ఉపాధి అవకాశాలపైనా ప్రభావం పడుతుండటంతో నష్టతీవ్రత పెరుగుతోంది. ఇవన్నీ బాధిత కుటుంబాలను అప్పుల్లో కూరుకుపోయేలా చేస్తున్నాయి. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేటప్పుడు హెల్మెట్ వాడటం ద్వారా ప్రాణప్రమాదాన్ని చాలా వరకు నివారించవచ్చని తెలిసినా చాలామంది విస్మరిస్తున్నారు. గత దశాబ్దకాలంలో దేశవ్యాప్తంగా అన్నిరకాల రోడ్డు ప్రమాదాల్లో 15 లక్షలకుపైగా ప్రజలు మరణించగా, తెలంగాణలో ఈ సంఖ్య 71 వేలుగా, ఆంధ్రప్రదేశ్‌లో 77 వేల పైచిలుకని రవాణాశాఖ గణాంకాలు చెబుతున్నాయి. దేశవ్యాప్తంగా రహదారి ప్రమాదాల్లో మే నెలలో ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారు. తరవాత డిసెంబరు, జనవరి నెలల్లో అధికంగా ఉంటున్నాయి. మే నెలలో సెలవుల కారణంగా స్వస్థలాలకు, పర్యాటక ప్రదేశాలు, పుణ్యక్షేత్రాలు, శుభకార్యాల కోసం రాకపోకలు సాగిస్తుండటంతో ప్రమాదాల సంఖ్య అధికంగా నమోదవుతోంది. దూర ప్రయాణాల్లో వాహనం కండిషన్, వాతావరణ పరిస్థితుల మేరకు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం ప్రమాదాల సంఖ్యను పెంచుతోంది. మన దేశంలో మొత్తం రోడ్లలో జాతీయ రహదారుల వాటా 2.1 శాతమే. కానీ, 36.5 శాతం మరణాలు, 31.2 శాతం ప్రమాదాలు వీటిపైనే జరుగుతున్నాయి. ఇందులో నాలుగింట మూడొంతుల ప్రమాదాలకు అతివేగమే కారణమని తేలింది. గ్రామాల పక్కన జాతీయ రహదారులు ఉండటం, రాత్రివేళల్లో సరైన సూచిక బోర్డులు లేకపోవడం, రిఫ్లెక్టర్లు లేక ముందున్న వాహనం సరిగ్గా కనిపించకపోవడం వల్ల దుర్ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయి. మలుపులు అధికంగా ఉండటం, సర్వీసు రోడ్లు లేకపోవడం, అధిక వేగంతో ఓవర్‌టేక్ చేయడం తదితరాలన్నీ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. చాలామంది సరైన అనుభవం, అవగాహన లేకుండానే జాతీయ రహదారులపై వాహనాలు నడిపిస్తుండటం ముప్పును పెంచుతోంది.

బహుముఖ వ్యూహం కావాలి!

మన దేశంలో రోడ్ల డిజైనింగ్ స్పీడ్‌తో పోలిస్తే, కొత్త రకం వాహనాల గరిష్ఠ వేగ సామర్థ్యం అధికంగా ఉండటం సమస్యగా మారుతోంది. రోడ్లలో ఇంజినీరింగ్ లోపాలు, నిబంధనలపై వాహనదారుల నిర్లక్ష్యం వంటి కారణాలూ ప్రాణాంతకంగా పరిణమిస్తున్నాయి. కొత్తగా నిర్మాణమవుతున్న హైవేలలో వాహనాల వేగ నియంత్రణకు, రోడ్లు దాటేవారికి సురక్షిత మార్గాలను ఏర్పాటు చేస్తే ఎంతో మంది ప్రాణాల్ని కాపాడే అవకాశం ఉంది. ప్రమాదాలపై ప్రజలకు అవగాహన పెంచాలి. పాఠ్యాంశాల్లో రహదారి భద్రత అంశాన్ని చేర్చాలి. నిబంధనల ఉల్లంఘనులను కట్టడి చేయడానికి పోలీసు, రవాణాశాఖ యంత్రాంగాన్ని మోహరించాలి. ఇష్టారాజ్యంగా తిరిగే ఇసుక, కంకర, గ్రానైట్ టిప్పర్లను అదుపు చేయాలి. తరచూ ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలి. బాధితులకు సత్వరమే వైద్యం అందాలి. హైవేలపై ట్రామాకేర్ సెంటర్లు పెంచాలి. అంబులెన్స్‌లు సకాలంలో చేరుకునేలా తగిన ఏర్పాట్లు ఉండాలి. ఇలాంటి బహుముఖ వ్యూహాలతోనే రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుంది.

– సుతారపు సోమశేఖర్

ప్రాజెక్ట్ వర్క్ టు.. బిజినెస్!

హాయ్ నేస్తాలూ..! మనం స్కూల్లో ఇచ్చిన ప్రాజెక్ట్ వర్క్ చేయడానికే నానాతంటాలు పడుతుంటాం కదా! మొత్తానికి ఇంట్లో వాళ్ల సాయంతోనో ఎలాగో పూర్తి చేసేసి.. 'హమ్మయ్యా! అయిపోయింది అనుకుంటాం!' అంతేనా? కానీ ఈ నేస్తాలు కాస్త కొత్తగా ఆలోచించారు. అదేంటో తెలుసుకుందాం పదండి!




బెంగళూరుకు చెందిన ముగ్గురు నేస్తాలు పేపర్ బ్యాగులు తయారు చేస్తున్నారు. ఎలాంటి గమ్, గ్లూ వాడకుండా వాటిని తయారుచేస్తూ.. ఒక చిన్న స్టార్టప్‌ని మొదలుపెట్టారు. ఇంతకీ వీళ్లకు ఈ ఆలోచన ఎలా వచ్చిందంటే.. స్కూల్లో పేపర్ బ్యాగులు తయారుచేయమని టీచర్ ఒక ప్రాజెక్ట్‌వర్క్ ఇచ్చారట. దాన్నే వీళ్లు బిజినెస్‌గా మలుచుకున్నారు. దానికి 'ఎకోవాలా' అని పేరు కూడా పెట్టారు తెలుసా! ఆ కంపెనీకి శారద ఫౌండర్, నచికేత్ మేనేజర్, సముద్యత కో-మేనేజర్‌గా ఉన్నారు. వీళ్ల ముగ్గురి వయసు పదకొండేళ్లలోపే. 'అరె.. వీళ్లదీ మన వయసే కదా!' అనుకుంటున్నారా. అవును మరి! ఆలోచనా విధానం, ఏదైనా చేయగలమనే ధైర్యం ఉంటే చాలు. మనం అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడం అసాధ్యం కాదని ఈ నేస్తాలను చూస్తే అర్థమవుతోంది. వీలైనంత ఎక్కువగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి.. పర్యావరణాన్ని రక్షించడమే ఈ నేస్తాల లక్ష్యమట.

'ప్రతి నెల మాకు పది రూపాయలు ఇవ్వండి. మేము ప్రతి ఆదివారం మీకు రెండు పేపర్ బ్యాగులు ఇంటికి తీసుకొచ్చి ఇస్తాం. ఒకవేళ మీకు ఇంకా ఎక్కువ బ్యాగులు అవసరం ఉంటే మా నంబర్‌కు కాల్ చేయండి. మాకు ప్రత్యేకంగా ఆఫీస్ అడ్రస్ లేదు కానీ మీకు కావాల్సిన బ్యాగ్స్ మాత్రం అందిస్తాం' అని చెబుతున్నారీ నేస్తాలు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. దాంతో ఈ నేస్తాలు పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు. ★

పదవలయం

కింద ఇచ్చిన ఆధారాలతో వచ్చే పదాలను రాయండి. అన్నీ 'కు' అక్షరంతోనే ముగుస్తాయి. ఓసారి ప్రయత్నించండి.

1. చలికి వచ్చేది..
2. చిలుక ---
3. దీంతో చక్కెర చేస్తారు
4. భయం లాంటిది..
5. చివరికి
6. అన్నాన్ని ఇలా కూడా అంటారు
7. వర్షానికి వచ్చేది..
8. జీవించడం మరోలా



జవాబు: 1.వణుకు 2.పలుకు 3.చెరుకు 4.బెరుకు 5.తుదకు 6.మెతుకు 7.చినుకు 8.బతుకు

రేపు 'ఈటీవీ' కార్తిక దీపోత్సవం



నేడు ఎంట్రీ పాసుల పంపిణీ

శివకేశవులు ఇద్దరికీ ఎంతో ప్రీతికరమైనది కార్తిక మాసం. దీంతో సమానమైన మాసం, గంగతో సమానమైన తీర్థం లేదని పురాణోక్తి. విశేష పుణ్య సంపదను ప్రసాదించే ఈ మాసంలో దీపారాధనకు ఉన్న ప్రాధాన్యం అసమానమైనది. 'ఈటీవీ ఆంధ్రప్రదేశ్, ఈటీవీ తెలంగాణ, ఈటీవీ లైఫ్' ఛానళ్ల ఆధ్వర్యంలో కార్తిక దీపోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే మహిళలకు పూజ సామగ్రి నిర్వాహకులే సమకూరుస్తారు. **ఎంట్రీ పాసులు ఒక రోజు ముందుగా అంటే శుక్రవారం** ఉదయం 10 గంటల నుంచి విజయవాడ పిన్నమనేని పాలీక్లినిక్‌రోడ్డులోని సిద్దార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానం వద్ద పంపిణీ చేస్తారు. పరిమిత సంఖ్యలోనే పాసులు ఉంటాయి. చిన్నపిల్లలకు అనుమతి లేదు. నేలపై కూర్చోగలిగే వారు మాత్రమే హాజరు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు.

–విజయవాడ సిటీ,న్యూస్‌టుడే

సమయం: ఈ నెల 8న (శనివారం) సాయంత్రం 5.30 గంటలకు

స్థలం: విజయవాడ మొగల్రాజపురం పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానం.

ఈ ఛానళ్లలో ప్రత్యక్ష ప్రసారం 8న సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు.


ఈటీవీ ఆంధ్రప్రదేశ్ | ఈటీవీ తెలంగాణ | ఈటీవీ Life



ప్రమాదం మీద ప్రయాణం

ట్రాక్టర్లపై ప్రమాదకరంగా ప్రయాణిస్తూ ప్రాణాలు పోయిన ఉదంతాలెన్నో నిత్యం చూస్తున్నాం. ఆయా ఘటనల నేపథ్యంలో పోలీసులు అవగాహన కల్పిస్తున్నా మార్పు రావడం లేదు. దుర్గగుడి వంతెన కింద ట్రాక్టర్‌పై 8 మంది ప్రయాణిస్తున్న దృశ్యమిది. –ఈనాడు,అమరావతి

కూడలి క్షేత్రంగా.. దక్షిణ కాశీగా..




నందిగామ మండలం దాములూరు శివారు కూడలి సంగమేశ్వర స్వామి దేవాలయానికి శతాబ్దాల చరిత్ర ఉంది. దీనిని దక్షిణ కాశీగా కూడా పిలుస్తుంటారు. కశ్యప మహాముని తపస్సు చేసి ఇక్కడ సంగమేశ్వరస్వామిని ప్రతిష్ఠించారు. శివాలయం ఎదురుగా వైరా, కట్టలేరు కలుస్తున్నాయి. దీంతో ఈ క్షేత్రాన్ని కూడలిగా పిలుస్తున్నారు. మునులు తపస్సు చేసి ఇక్కడ జీవసమాధి పొందారని చెబుతుంటారు. ఈ దేవాలయాన్ని రాజావాసిరెడ్డి వెంకటాద్రినాయుడు పునః ప్రతిష్ఠ చేసి వందెకరాల మాన్యాన్ని దానంగా ఇచ్చారు. ఏటా మహాశివరాత్రి తిరునాళ్ల వైభవంగా నిర్వహిస్తారు. స్వామి వారిని స్థానికులు జంగమయ్యగా పిలుస్తారు. దేవాలయ ఆవరణలో చెన్నకేశవ స్వామి దేవాలయం ఉంది. మహిమాన్విత నాగేంద్రస్వామి విగ్రహం ఉంది. ఇక్కడ లభించిన శాసనం మద్రాసు మ్యూజియంలో భద్రపర్చారని తెలుస్తోంది. కార్తిక మాసంలో భక్తులు వైరా, కట్టలేరులో పుణ్యస్నానాలు చేసి స్వామివారిని దర్శించుకుంటారు.

– నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

కదిపితే దస్తావేజు..అవినీతి బూజు

ఇబ్రహీంపట్నం ఎస్ఆర్వో కేంద్రంగా ఎనీవేర్ రిజిస్ట్రేషన్లు ✪ సుమారు 1,500 వరకు చేసినట్లు గుర్తించిన ఏసీబీ

ఈనాడు, అమరావతి- న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం కేంద్రంగా ఏడాది కాలంలో పెద్దఎత్తున ఎనీవేర్ రిజిస్ట్రేషన్లు సాగాయి. ఇక్కడి నుంచి భారీగా ఈ తరహా రిజిస్ట్రేషన్లు జరగడం అనుమానాలకు తావిస్తోంది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రెండు రోజుల సోదాల్లో నిబంధనలకు విరుద్ధంగా సాగిన అనేక వ్యవహారాలు వెలుగులోకి వచ్చాయి. ఈ సోదాలు గురువారం రాత్రి వరకు కొనసాగాయి. తనిఖీల్లో అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయి.



ఇబ్రహీంపట్నం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం అనిశా అధికారుల సోదాలు

యర్రగొండపాలెం రిజిస్ట్రేషన్లూ ఇక్కడే..

ఈ రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి ఏడాది వ్యవధిలోనే దాదాపు 1,500 ఎనీవేర్ రిజిస్ట్రేషన్లు జరిగాయి. ప్రకాశం జిల్లాలోని యర్రగొండపాలెంలో కొనుగోలు చేసిన భూములకు ఇక్కడి నుంచి రిజిస్ట్రేషన్లు చేయించడం గమనార్హం. వీటిలో అత్యధికంగా సుమారు 400 వరకు యర్రగొండపాలెంలోని స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లు ఉన్నాయి. ఈ కార్యాలయం నుంచే ఇంత భారీ సంఖ్యలో ఎందుకు జరిగాయన్న దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీటిపై అనిశా అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ప్రతి దస్తావేజును సమగ్రంగా పరిశీలిస్తున్నారు. వీటిని ఎవరు చేశారన్న దానిపై పరిశీలన చేస్తున్నారు.

స్టాంప్ డ్యూటీలో తేడాలు

రిజిస్ట్రేషన్ సందర్భంగా విధించే స్టాంప్ డ్యూటీ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. ఇందులోనూ ఎస్ఆర్వో సిబ్బంది అక్రమాలకు పాల్పడినట్లు తేలింది. నిర్ణీత రుసుము కన్నా తక్కువ వసూలు చేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారు. కొన్ని దస్తావేజుల పరిశీలనలో ఈ విషయం బయటపడింది. వీటిలోనే సుమారు రూ.40వేల వరకు ప్రభుత్వ రాబడికి గండి పడింది. అన్నీ పరిశీలిస్తే మరిన్ని అక్రమాలు బయటకు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. గత 9 నెలలుగా ఇక్కడ సబ్‌రిజిస్ట్రార్ లేకపోవడంతో ఆర్థిక, విధానపరమైన అవకతవకలు ఎక్కువగా జరిగినట్లు గుర్తించారు. డాక్యుమెంట్ రైటర్ల పాత్రపైనా దృష్టి సారించారు. ఒక డాక్యుమెంట్‌ను పరిశీలించగా డబుల్ రిజిస్ట్రేషన్ జరిగినట్లు గుర్తించారు.

యూపీఐ ఖాతాలకు ముడుపులు

కార్యాలయ ఉద్యోగుల ఫోన్లను ఏసీబీ అధికారులు పరిశీలించారు. వారి ఫోన్‌పే, గూగుల్‌పే ఖాతాలకు పలువురి నుంచి లావాదేవీలు జరిగినట్లు పరిశీలించారు. ప్రతి లావాదేవీపై వారిని వివరణ అడిగారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్నవారి నుంచి ముడుపుల రూపంలో తీసుకున్న సొమ్ముగా తేలింది. ఇక్కడ పనిచేస్తున్న అనధికార ఉద్యోగుల్లో ఒక మహిళ ఏకంగా 20 ఏళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్నారు.

మొవ్వ ముద్దుబిడ్డ.. మండవ



మొవ్వలోని మండవ జానకిరామయ్య, సులోచనల క్షేత్రయ్య కల్యాణ మండపం



30 ఏళ్ల పాటు జానకిరామయ్య అధ్యక్షుడిగా కొనసాగిన మొవ్వ పాలకేంద్రం భవనం

మొవ్వ(కూచిపూడి), న్యూస్‌టుడే: విజయ డెయిరీ మాజీ ఛైర్మన్ మండవ జానకిరామయ్య(93) మొవ్వ సర్పంచిగా గ్రామ అభివృద్ధికి అడుగులు వేశారు. మొవ్వలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు, ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం, శ్రీవేణుగోపాలస్వామి ఆలయం జీర్ణోద్ధరణకు కృషి చేశారు. క్షేత్రయ్య ఎడ్యుకేషనల్ సొసైటీ, డెవలప్‌మెంట్ కమిటీ ఛైర్మన్‌గా ఆయన గ్రామ అభివృద్ధికి కారకులయ్యారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు నుంచి ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు వరకూ ప్రతి ముఖ్యమంత్రితో ప్రశంసలు అందుకున్న మండవ జానకిరామయ్య మరణించటంతో మొవ్వ గ్రామం మూగబోయింది. మండల కేంద్రంగా మొవ్వను మలచటంతోపాటు గ్రామంలో 21 ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేసిన ఘనత మండవ జానకిరామయ్యకే దక్కుతుందని మొవ్వ మండల తెదేపా అధ్యక్షులు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు అన్నారు. తెలంగాణ, విశాఖపట్నంలో క్లాస్ 1 కాంట్రాక్టర్‌గా ఉన్న మండవ జానకిరామయ్యను గ్రామస్థులు 1981లో పిలిచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించారన్నారు. ఆ సమయంలో సర్పంచిగా ఏకగ్రీవం కుదరకపోయినా రంగంలో ఉండి అత్యధిక మెజార్టీతో గెలుపొందారని చెప్పారు. కృష్ణా జిల్లా పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఛైర్మన్‌గా 27 సంవత్సరాలు సేవలందించగా తీవ్ర నష్టాలలో ఉన్న సంస్థని లాభాల బాటలో పయనించేలా కృషి చేశారన్నారు. ఐదేళ్లపాటు ఉమ్మడి రాష్ట్ర డెయిరీ ఫెడరేషన్ ఛైర్మగా పని చేసి అత్యుత్తమ సేవలందించి ఆంధ్రా కురియగాన్ పేరొందారన్నారు.

★ మొవ్వ డిగ్రీ, పీజీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, మొవ్వ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు వేర్వేరుగా మండవ జానకిరామయ్య చిత్ర పటం వద్ద నివాళులర్పించారు.




నివాళులర్పిస్తున్న మొవ్వ డిగ్రీ, పీజీ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు

దూరదర్శన్ గుర్తుందా..

పురాతన కొండపల్లి కోట నుంచి మరికొంత దూరం ముందుకు వెళితే ఎత్తుగా ఒక టవర్ కనిపిస్తుంది. ఇదే టీవీ రిలే స్టేషన్ టవర్. సముద్ర మట్టానికి 1200 అడుగుల ఎత్తులో ఉన్న కొండపై మరో 180 అడుగుల ఎత్తున దీనిని నిర్మించారు.

1987లో కొండపల్లి కొండపై దూరదర్శన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నం వద్ద జాతీయ రహదారి నుంచి 8 కిలోమీటర్లు చేరుకొన్న తరువాత ఈ టవర్ వస్తుంది. సమాచార వ్యవస్థను శ్యాటిలైట్ నుంచి అందుకొని ప్రసారం చేయడం దీని ప్రధాన విధి. కాలానుగుణంగా వచ్చిన సాంకేతిక మార్పులతో కేబుల్, డిష్‌లు రావడంతో ప్రాధాన్యం కొరవడింది. విజయవాడ దూరదర్శన్ కార్యాలయం నుంచి కొండపల్లి టవర్‌కు రాకపోకలు సాగించే సిబ్బంది కూడా ప్రస్తుతం టవర్ వద్దకు అరుదుగా వస్తున్నారు. అతి ఎత్తయిన టవర్ కావడంతో గతంలో రెండు ప్రైవేటు ఎఫ్ఎం రేడియో ఛానళ్లు దీని సేవలు ఉపయోగించుకొన్నాయి. ప్రస్తుతం ఒక్క ఎఫ్ఎం ఛానల్ మాత్రమే సేవలను వినియోగించుకొంటోంది. ఈ టవర్ పరిసరాల్లోకి 2010 వరకూ పర్యాటకులను అనుమతించారు. దీని సందర్శనకు అనుమతులు నిలిపివేయడంతో కోటకు వచ్చిన అనేక మంది నిరాశతో వెనుదిరిగి వెళ్తున్నారు.

–ఈనాడు, అమరావతి, కొండపల్లి, న్యూస్‌టుడే



విజయవాడ-హైదరాబాద్

హైవే.. విస్తరణకు డీపీఆర్ సిద్ధం

పది రోజుల్లో పీఏటీఎస్‌టీ సమర్పించే అవకాశం

ఈనాడు, అమరావతి

విజయవాడ-హైదరాబాద్ ఎన్‌హెచ్ 65 ఆరు వరుసల విస్తరణకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) సిద్ధమైంది. దీన్ని మరో పది రోజుల్లో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) అధికారులు ప్రాజెక్టు అప్రైజల్ అండ్ టెక్నికల్ స్క్రూటినీ కమిటీ(పీఏటీఎస్‌సీ) ముందుంచనున్నారు. జిల్లా పరిధిలో మొత్తం 50 కి.మీ మేర రహదారిని నాలుగు వరుసల నుంచి ఆరు వరుసలకు విస్తరిస్తున్న నేపథ్యంలో రెండు బైపాస్‌లు, ఓ వంతెన నిర్మాణం చేపడతారు.

★ **నందిగామ, ఇబ్రహీంపట్నం మండలాల్లో బైపాస్‌లు:** రెండు రాష్ట్రాల్లో కలిపి మొత్తం 231.32 కి.మీ మేర రహదారిని నాలుగు నుంచి ఆరు వరుసలుగా విస్తరిస్తున్న నేపథ్యంలో జిల్లా పరిధిలో మాత్రమే 22 కి.మీ మేర గ్రీన్ ఫీల్డ్ రోడ్డు (కొత్తగా రహదారి నిర్మాణం) చేపడుతున్నారు. నందిగామ మండలం అంబారుపేట-



ఐతవరం మధ్యలో 7.3 కి.మీ మేర ఒక బైపాస్ (అందులో 6.5 కి.మీ గ్రీన్‌ఫీల్డ్) నిర్మిస్తారు. ఇందులో అంతర్భాగంగా అంబారుపేట, ఐతవరం దిగువన కీసర సమీపంలో మునేరు మీద కొత్తగా ఆరు వరుసల వంతెన నిర్మాణం చేపడతారు. ఇబ్రహీంపట్నం మండలం కాచవరం నుంచి మూలపాడు మీదుగా ఇబ్రహీంపట్నం వరకు 16.15 కి.మీ మేర మరో బైపాస్ రోడ్డు (ఇందులో 15.6 కి.మీ గ్రీన్‌ఫీల్డ్) నిర్మాణం చేపడతారు. డీపీఆర్‌లో మొత్తం నాలుగు ఆప్షన్లు తయారు చేశారు. అయితే మొదటి ఆప్షన్ ఎంపిక చేసినట్లు సమాచారం. దీని ప్రకారం రెండు వెహికల్ అండర్ పాస్‌లు, రెండు లైట్ వెహికల్ అండర్ పాస్‌లు, నాలుగు ఎస్‌వీయూపీలు ఏర్పాటు చేయాల్సి ఉంది. దీనికి 55 హెక్టార్ల వరకు భూమి సేకరించాల్సి ఉంటుందని తెలుస్తోంది.

2026 ఏప్రిల్ నాటికి పట్టాలెక్కించేలా.. డీపీఆర్‌ను పీఏటీఎస్‌సీ ఆమోదిస్తుందా..లేదా ఏమైనా సూచనలు చేస్తుందా అన్న అంశంపైనే విస్తరణ పనులు మొదలు కావడం ఆధారపడి ఉంది. ఏమైనా మార్పులు సూచిస్తే ఎలైన్‌మెంట్‌లో ఆయా మార్పులు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం తయారు చేసిన ప్రకారం ఆమోదిస్తే నివేదికను పబ్లిక్ ప్రైవేటు పార్ట్‌నర్‌షిప్ ఎప్రైజల్ కమిటీ(పీపీపీఏసీ)కి సమర్పిస్తారు. తర్వాత ఎన్‌హెచ్ఏఐ టెండర్ల ప్రక్రియకు ఏర్పాట్లు చేస్తుంది. దీనికి 3 నెలల వరకు సమయం పట్టే అవకాశం ఉంది. 2026 ఏప్రిల్ నాటికి విస్తరణ పనులు పట్టాలెక్కించే అవకాశాలున్నాయి.

తగ్గిన కృష్ణా వరద

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నది వరద ప్రవాహం గురువారం తగ్గింది. ఉదయం ఆరు గంటలకు 43,500 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. సాయంత్రానికి క్రమేపీ తగ్గింది. రాత్రి 8 గంటలకు 35 గేట్లను ఒక అడుగు మేర ఉత్తారు. మిగతా 35 గేట్లు మూసివేశారు. సముద్రంలోకి 25,375 క్యూసెక్కులు విడుదల చేశారు. ✦ కృష్ణా డెల్టాలోని పంట కాల్వలకు 6,204 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 2,011, కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వకు 4,012, గుంటూరు ఛానల్‌కు 181 క్యూసెక్కులు ఇస్తున్నారు. బ్యారేజీ వద్ద 12 అడుగుల నీటి మట్టం ఉంది.

తెల్లబంగారం.. నల్లబోయింది..!



ఆరుగాలం శ్రమించి పండించిన పత్తి పంట చేతికొచ్చే సమయంలో కురిసిన వర్షాలకు పూర్తిగా పాడైపోయి రైతులకు వేదన మిగిల్చింది. జి.కొండూరు మండలంలో 6,500 ఎకరాలకు పైగా పత్తి సాగు చేస్తారు. సాగు ప్రారంభం నుంచి పత్తి రైతులకు వాన కష్టాలు తప్పలేదు. గత నెల చివరలో మొంథా తుపాను ప్రభావంతో జిల్లాలో కురిసిన భారీ వర్షాలు పత్తి రైతును నిలువునా ముంచాయి. కాయలు నల్లగా మారడంతో పాటు లోపల సైతం నీరు చేరి పత్తి పాడైపోయింది. జి.కొండూరు మండలానికి చెందిన **రైతు షేక్ బన్నీసాహెబ్** మూడు ఎకరాల్లో సుమారు రూ.లక్ష వెచ్చించి పత్తి సాగు చేయగా వర్షాలకు పంట మొత్తం పోయింది. వర్షాలకు పత్తికాయల్లో దూది రంగు మారిపోయిందని, దీనిని అమ్మినా కూలి ఖర్చులు కూడా రావని పొలంలోనే వదిలేశానని వాపోయారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



–ఈనాడు, అమరావతి

కంటపడితే కమ్మేసి.. వెంటపడి దోచేసి..

తవ్వినకొద్దీ వెలుగుచూస్తున్న జోగి దందాలు

పెడన నియోజకవర్గంలో జోగి రమేష్ హయాంలో జరగని అక్రమం, చేయని అరాచకం అంటూ ఏదీ మిగల్లేదు. మట్టి దందా మొదలు చెరువుల లీజులు, విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు కమీషన్లు..భూ కబ్జాలు, కారుచౌకగా భూములు కొట్టేయడం..ఇలా ప్రతి దాంట్లోనూ జోగి హస్తం ఉందన్న ఆరోపణలు ఉన్నాయి.

– ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

కృత్తివెన్ను, బంటుమిల్లి, పెడన మండలాల పరిధిలో రైతులు చెరువులు తవ్వుకోవాలంటే మైనింగ్ అనుమతులతో పనుండేది కాదని.. జోగి రమేష్ అనుచరుల చేతులు తడిపితే పనైపోయేదన్న విమర్శలున్నాయి. సొంత పార్టీ వారికైతే ఎకరాకు రూ.10వేలు.. ఇతరులైతే రూ.20వేలు వసూలు చేసేవారని, డబ్బులు ఇవ్వకపోతే గనుల శాఖాధికారులు క్షణాల్లో వాలిపోయి పనులు నిలిపేసేవారన్న ఆరోపణలు అప్పట్లో పెద్దఎత్తున వచ్చాయి. బంటుమిల్లి పరిధిలోని రామవరపుమోడి, నారాయణపురం తదితర గ్రామాల్లో రైతుల వద్ద కారుచౌకగా చెరువులు లీజుకు తీసుకొని పదుల అడుగుల్లోతు మట్టి తవ్వేసి అమ్మేసుకున్నారని సమాచారం. ★ ఈ మండలాల్లో ఆక్వా రైతులు



బంటుమిల్లి: రైతుల చెరువుల్లో మట్టి కొల్లగొట్టారిలా...

సొంత పార్టీ వారైతే రూ.10వేలు

విద్యుత్తు నియంత్రికల కోసం దరఖాస్తు చేసుకుని నెలలు గడిచినా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయని విద్యుత్తు అధికారులు.. అదే జోగి నియమించిన వ్యక్తికి నియంత్రిక సామర్థ్యాన్ని బట్టి రూ.10వేల నుంచి రూ.16వేల వరకు ఇస్తే వారం రోజుల్లో ఏర్పాటు చేసేవారని రైతులు వాపోయారు.

పట్టాలు ఇప్పిస్తామని రూ.కోట్లు దోచి

★ కృత్తివెన్ను మండలం చినగొల్లపాలెం, లక్ష్మీపురం, గరిశపూడి, నిడమర్రు, పడతడిక తదితర గ్రామాల పరిధిలోని సుమారు 10వేల ఎకరాల సీఆర్‌జడ్ భూములకు పట్టాలు ఇప్పిస్తామని రూ.5వేల నుంచి రూ.25వేల వరకు వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలా రూ.కోటిన్నరకు పైగా కృత్తివెన్ను మండలంలో రైతుల నుంచి తీసుకున్నారని సమాచారం. ★ జగనన్న కాలనీల్లో మెరక పేరుతో చెరువులు, ప్రభుత్వ భూముల నుంచి మట్టి తవ్వేసి జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న భూముల్లోకి తరలించారు. కాలనీల్లో వేయని మట్టికి ప్రభుత్వం నుంచి బిల్లులు లాగేసి రూ.కోట్లు కొల్లగొట్టారని తెలుస్తోంది. బంటుమిల్లి, పెడన, కృత్తివెన్ను పరిధిలో వ్యాపార సముదాయాలు నిర్మించుకోవాలన్నా జోగి అనుచరుల చేతులు తడిపితేనే పనయ్యేదన్న విమర్శలు ఉన్నాయి.

రూ.10కోట్ల సత్రం స్థలం గుటుక్కు..

బంటుమిల్లిలోని మామిడి సూరయ్య సత్రాన్ని 1938 నుంచి ఆర్యవైశ్యులు నిర్వహించేవారు. ఇందులో వసతి, అన్నదానం జరిగేవి. దీని నిర్వహణకు మద్దేటిపల్లిలో 3.40ఎకరాలు, ఆముదాలపల్లిలో 33 సెంట్లు.. మొత్తం 3.73 ఎకరాల వ్యవసాయ భూమి నుంచి వచ్చే ఆదాయాన్ని వినియోగించేవారు. ఈ సత్రం భూములు అమ్మడం, తాకట్టు పెట్టడం, దానం చేయడం.. బహుమతిగా ఇచ్చేందుకు వీల్లేదని దస్త్రాల్లో స్పష్టంగా ఉన్నా జోగి రమేష్ కనుసన్నల్లో ఆయన అనుచరులు వీటిని కాజేశారని గ్రామస్థులు గతేడాది కలెక్టర్‌ను ఆశ్రయించారు. ఈ భూమి విలువ రెండేళ్ల కిందటే రూ.10కోట్లు ఉండేది. విక్రయం చెల్లదని దస్త్రాల్లో స్పష్టంగా ఉన్నా బంటుమిల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని గ్రామస్థులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారులు తప్పుడు పత్రాలు సృష్టించడంతో వైకాపా నేతలు సత్రం స్థలాన్ని కాజేసి దుకాణాల నిర్వహణకు ఇచ్చారని వాపోయారు.

నిధుల కొరత.. పనుల పడక

★ నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణాలు ★ ఇంకా రూ.83.71 కోట్లు అవసరం

నందిగామ గ్రామీణం, కంచికచర్ల, న్యూస్‌టుడే

ఎన్టీఆర్ జిల్లాలో వివిధ పాఠశాలల్లో సమగ్ర శిక్షా పథకంలో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు నిధులు లేక నిలిచాయి. గత వైకాపా ప్రభుత్వం నాడు-నేడు రెండో దశలో వీటిని మంజూరు చేసింది. తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మనబడి-మన భవిష్యత్తు పేరుతో నిర్మాణ సామగ్రి ఇచ్చినా పనుల్లో పురోగతిలేక చతికిలపడ్డాయి. విద్యార్థుల సంఖ్య సరిపడా తరగతి గదులులేక అవస్థలు పడుతున్నారు. 90 శాతం పూర్తయిన పనులకు మిగిలిన నిధులు మంజూరు చేస్తే విద్యార్థులకు తరగతి గదులు అందుబాటులోకి వస్తాయి.



☛ నందిగామ జడ్పీ ఉన్నత పాఠశాలలో 860 మంది విద్యార్థులు చదువుతున్నారు. అక్కడ రూ.1.25 కోట్లు కేటాయించగా ఏడు అదనపు గదులు నిర్మించారు. వీటిలో కొన్ని గదులకు తలుపులు, కిటికీలు లేవు. విద్యుత్తు సౌకర్యం, ఫ్యాన్ల ఏర్పాటు పనులు చేయించలేదు.

రూ.235 కోట్లు మంజూరు

జిల్లాలో మనబడి-మన భవిష్యత్తు రెండో విడతగా రూ.235 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో 587 తరగతి గదులను నిర్మించాలి. ఇప్పటి వరకు రూ.152 కోట్లు ఖర్చు పెట్టి 412 పనులు పూర్తి చేశారు. ఇంకా 175 పాఠశాలల్లో అదనపు తరగతి గదులు నిర్మాణం పూర్తి చేయాలి. వీటికోసం సమగ్ర శిక్షా ద్వారా రూ.83.71 కోట్లు మంజూరు చేస్తే అసంపూర్తిగా ఉన్న తరగతి గదుల నిర్మాణాలు పూర్తవుతాయని ఉపాధ్యాయులు ఆశిస్తున్నారు. ప్రస్తుతం సగం వరకు నిర్మించిన గదులు నిరుపయోగంగా ఉన్నాయి. తలుపులు, కిటికీలు, విద్యుత్తు ఏర్పాటు పనులు నిలిచాయి. పూర్తయిన గదులకు సున్నం, రంగులు, ప్రహరీలు, గ్రీన్‌చాక్ బోర్డులు, ఇంగ్లిష్ ల్యాబ్‌ల ఏర్పాటు వంటి పనులు చేయించాలి.

★ మాగల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పది తరగతుల వరకు 336 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ రూ.1.20 కోట్లు కేటాయించగా ఎనిమిది గదులు అసంపూర్తిగా నిర్మించారు. స్లాబు నిర్మించి గోడలు వదిలేశారు. తలుపులు, కిటికీలు వచ్చినా ఏర్పాటు చేయలేదు. కొన్ని పాఠశాలల్లో సమగ్ర శిక్షా నిధులు మిగిలాయి. వీటిని ఇటువంటి పాఠశాలలకు సర్దుబాటు చేస్తే గదులు అందుబాటులోకి వస్తాయని ప్రధానోపాధ్యాయులు ఆశిస్తున్నారు.

★ చందర్లపాడు మండలంలో 54 గదుల నిర్మాణానికి రూ.6.48 కోట్లు, వీరులపాడు మండలంలో 32 గదులకు రూ.3.84 కోట్లు మంజూరు చేశారు. ఈ రెండు మండలాల్లో 21 తరగతి గదులు నిర్మాణం పూర్తి చేయాలి.

ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతాం

- ఎం.రజనీకుమారి, సమగ్ర శిక్షా ఏపీసీ

అదనపు గదులకు నిధుల కొరత ఉంది. అసంపూర్తిగా ఉన్న తరగతి గదులకు నిధులు ఇవ్వాలని ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు ప్రతిపాదనలు పంపిస్తే వీటిని సమగ్ర శిక్షా ఉన్నతాధికారులకు పంపుతాం. కొన్ని పాఠశాలల్లో మిగులు నిధులు ఉంటే వీటిని అవసరమైన బడులకు బదిలీ చేయిస్తాం.

కోయంబత్తూరులో ఓఏబీ సీసాల తయారీ

విడతల వారీగా 3 లక్షలు సరఫరా

వీటికి పెద్దమొత్తం వెచ్చించిన జనార్దనరావు

ఈనాడు, అమరావతి



సంక్లిష్టంగా కొన్ని మద్యం కంపెనీల సీసాలను జనార్దనరావు తమిళనాడులో తయారు చేయించాడు. సిట్ దర్యాప్తులో పలు అంశాలు వెలుగుచూస్తున్నాయి. ఓల్డ్ అడ్మిరల్ బ్రాందీ (ఓఏబీ) సీసాల తయారీకి తొలుత.. గన్నవరం మండలం సూరంపల్లిలోని పారిశ్రామికవాడలో పెట్ బాటిల్స్ కర్మాగారాన్ని నడుపుతున్న శ్రీనివాసరెడ్డి (ఏ11)ని అద్దేపల్లి సోదరులు సంప్రదించారు. తన కంపెనీలో ఆ మోడల్ సీసాలు తయారు చేయడం కుదరదని చెప్పడంతో ప్రణాళికకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. బెంగళూరుకు చెందిన బాలాజీ (ఏ3)ని సంప్రదించిన మీదట సెంథిల్ (ఏ22)ను పరిచయం చేశాడు. కోయంబత్తూరుకు చెందిన ఇతనికి సీసాల తయారీ పరిశ్రమ ఉంది. అసలుకు ఏమాత్రం తీసిపోని విధంగా తయారు చేసి అందిస్తానని హామీ ఇవ్వడంతో సెంథిల్‌కు ఆర్డర్ ఇచ్చారు. వీటి తయారీ కోసమే ఎక్కువ మొత్తం ఇచ్చినట్లు గుర్తించారు.

మరొకరి జీఎస్టీ నంబరుతో రవాణా

కోయంబత్తూరులో తయారు చేసిన సీసాలను ఇబ్రహీంపట్నం, ములకలచెరువుకు పంపించేవారు. వాటి పార్శిళ్లను జగన్మోహన్‌రావు ఇచ్చిన మరొకరి జీఎస్టీ నంబరుతో సెంథిల్ సరఫరా చేసేవాడు. విడతల వారీగా దాదాపు 3లక్షల సీసాల వరకు ఓల్డ్ అడ్మిరల్ బ్రాందీ కోసం ఆర్డర్ ద్వారా తెప్పించారు. ఇప్పటి వరకు అరెస్టు అయిన నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ఫోన్లలోని వాట్సప్ చాట్ల ద్వారా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. వీరి లావాదేవీలు, యూపీఐ చెల్లింపులను పోలీసులు విశ్లేషిస్తున్నారు. ఈ వివరాల ఆధారంగా నకిలీ మద్యం వ్యవహారంలో ఇంకా పలువురు నిందితులను గుర్తించే పనిలో ఉన్నారు.

మనోజ్‌కుమార్ అరెస్టుకు రంగం సిద్ధం!

విజయవాడ నగరానికి చెందిన ఎం.మనోజ్‌కుమార్ (ఏ20) అరెస్టుకు రంగం సిద్ధమైంది. ఇటీవల విచారణకు పిలవగా అస్వస్థతగా ఉందని మనోజ్‌కుమార్ తప్పించుకున్నాడు. ఆస్పత్రి నుంచి డిశ్ఛార్జి కావడంతో నోటీసులు ఇచ్చి పిలిచి.. విచారణ అనంతరం అరెస్టు చేసే అవకాశం ఉందని తెలిసింది. నగరంలోని బృందావన్‌కాలనీకి చెందిన నిందితుడికి వన్‌టౌన్‌లో సీసాలు, మూతల వ్యాపారం ఉంది. ఇతనికి ఆర్డర్ ఇచ్చి చాలా సీసాలు, మూతలను జనార్దనరావు (ఏ1) కొనుగోలు చేశాడు. పులిపాటివారి వీధిలోని మనోజ్ దుకాణంలోనే ఏ1 ఇచ్చిన లేబుల్స్‌ను సీసాలకు కూలీలతో అంటించినట్లు తేలింది. ఈ ఏడాది జూన్‌లో నర్సాపురం ఎక్సైజ్ స్టేషన్‌లో నమోదైన కేసులో మనోజ్‌కుమార్ ఏ3గా ఉన్నాడు. నకిలీ మద్యం విక్రయిస్తూ పట్టుబడిన వారికి మూతలను సరఫరా చేశాడు. జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ స్టేషన్‌లో ఈ ఏడాది ఆగస్టులో నమోదైన కేసులోనూ మనోజ్‌కుమార్. ఏ3గా ఉన్నాడు. రెండు కేసుల్లోనూ మూతలను సరఫరా చేశాడు.

ట్రాఫిక్ డీసీపీ బాధ్యతల స్వీకరణ

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్ డీసీపీగా షిరీన్ బేగం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్త బదిలీల్లో భాగంగా తాడేపల్లి ఏపీఎస్పీ కార్యాలయంలో స్పెషల్ కమిషనర్‌గా పని చేస్తున్న షిరీన్ బేగం ఎన్టీఆర్ జిల్లా ట్రాఫిక్ డీసీపీగా నియమించారు. గురువారం పోలీస్ కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబును మర్యాదపూర్వకంగా కలిశారు.



సీపీ రాజశేఖరబాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న షిరీన్‌బేగం

కిడ్నీ వ్యాధి బాధితులకు మెరుగైన వైద్య సేవలు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని మూత్రపిండాల వ్యాధి బాధితుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో నిరంతర పర్యవేక్షణ చేస్తున్నట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన మినీ డయాలసిస్ కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. అప్పటికే కేంద్రంలో ఉన్న బాధితులతో ఆయన మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కృష్ణారావుపాలెంలో ఓవర్ హెడ్ ట్యాంక్ ఎక్కి జలజీవన్ మిషన్ పథకం పైపుల ద్వారా సరఫరా చేస్తున్న నీటిని పరిశీలించారు. ట్యాంకులోకి బురద నీరు వస్తుందని స్థానికుల ఫిర్యాదు మేరకు నీటి పరీక్షలు చేయించాలన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వచ్చే ఏడాది జనవరి నుంచి కృష్ణా జలాలను తండాలకు సరఫరా చేస్తామన్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న మందులు వ్యాధి నివారణకు ఉపయుక్తంగా ఉంటాయని, వ్యాధి తీవ్రత ఉంటే కేంద్రాలకు చేరుకుని డయాలసిస్ చేయించుకోవాలని బాధితులకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. వ్యాధి స్క్రీనింగ్ సర్వే చేసేందుకు శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిపుణులను అందుబాటులో ఉంచుతామన్నారు. తిరువూరు ఆర్డీవో మాధురి, ఆరోగ్య, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.



ఓవర్ హెడ్ ట్యాంక్ ఎక్కి పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ఓటరు జాబితాలో సవరణలకు సిద్ధంకండి

పాయకాపురం, న్యూస్‌టుడే : ఓటర్ల జాబితా ఎస్ఐఆర్‌పై పూర్తిస్థాయిలో అధికారులకు అవగాహన అవసరమని, ప్రత్యేక సమగ్ర సవరణలకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. గురువారం రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ వివేక్ యాదవ్ వెలగపూడి సచివాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ తన ఛాంబర్‌లో జిల్లా అధికారులతో మాట్లాడారు. కిందిస్థాయి సిబ్బంది పాత్ర కీలకమని సీఈవో సూచించారని, అందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ముఖ్య దశలపై పూర్తిస్థాయి అవగాహన పెంచుకోవాలని కోరారు. వివిధ పార్టీల అభ్యంతరాలు, ఎపిక్ కార్డుల జారీ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ పి.సలీమ్, డిప్యూటీ తహసీల్దార్ ఎ.గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేలైన విద్యుత్తు సరఫరాకు కృషి



సమావేశమైన అధికారులు పుల్లారెడ్డి మురళీకృష్ణయాదవ్, మూర్తి, వెంకటేశ్వర్లు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : మొంథా తుపానుతో పాడైపోయిన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను పూర్తి స్థాయిలో మార్చి, కొత్తవాటిని ఏర్పాటు చేయాలని ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఉదయం విద్యుత్తు సర్కిల్ కార్యాలయంలో ఏపీ సీపీడీసీఎల్ పరిధిలోని అన్ని జిల్లాల ఎస్ఈలు, ఈఈలతో ఆయన సమావేశమయ్యారు. మొంథా నష్టాలపై సమీక్షించారు. తుపానును సమర్థంగా ఎదుర్కొన్న సిబ్బందిని అభినందించారు. ప్రజలకు కోతలు లేని విద్యుత్తు సరఫరా అందించాలని సూచించారు. ప్రధానమంత్రి సూర్యఘర్ ఉపయోగాలపై విశేషంగా ప్రచారం చేయాలని పేర్కొన్నారు. సొంత ఇల్లు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని వినియోగించుకునేలా చూడాలని కోరారు. విద్యుత్తు బిల్లులను నూరు శాతం వసూలే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని సూచించారు. లోఓల్టేజీ సమస్య లేకుండా చూడాలన్నారు. సమీక్షా సమావేశంలో డైరెక్టర్ (టెక్నికల్) మురళీకృష్ణ యాదవ్, డైరెక్టర్ (ప్రాజెక్టు) టి.వి.ఎస్.ఎన్.మూర్తి, డైరెక్టర్ (ఫైనాన్స్) వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జానకిరామయ్య జీవితం ఆదర్శనీయం

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: సుదీర్ఘ కాలం కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్‌గా పనిచేసిన మండవ జానకిరామయ్య జీవితం ఆదర్శనీయమని విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. గురువారం గన్నవరం మండలం అల్లాపురం శివారు రుషివాటికలో మండవ జానకిరామయ్య పార్థివదేహానికి డెయిరీ సభ్యులతో కలిసి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ జానకి రామయ్య మృతి రాష్ట్రానికి తీరని లోటని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కృష్ణా జిల్లా మొవ్వలో ఓ రైతు కుటుంబంలో జన్మించిన జానకిరామయ్య. . రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. తెలుగు ప్రజలకు గర్వకారణంగా నిలిచారన్నారు. కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ఆయన సంస్థను ప్రగతి పథంలో నడిపించారని, పాడి రైతుల ఆర్థికాభివృద్ధి కోసం చేసిన సేవలు శ్లాఘనీయమన్నారు.

☛ జానకిరామయ్య సేవలు మరువలేనివని కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురాం అన్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి జానకిరామయ్య పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన పాలనాకాలం డెయిరీకి స్వర్ణయుగంగా నిలిచిందన్నారు. పాడి రైతుల సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయాలు, అమలు చేసిన సంస్కరణలు, రూపొందించిన వ్యూహాలు డెయిరీని రాష్ట్ర వ్యాప్తంగా ప్రముఖ స్థానానికి చేర్చాయన్నారు. కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు, విజయా డెయిరీ ప్రతినిధులు పాల్గొన్నారు.



మండవ పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న చలసాని ఆంజనేయులు

జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : జనగణనతో పాటు కులగణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్రావు కోరారు. ఎంబీ విజ్ఞాన కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 9వ తేదీన విజయవాడ ఎంబీ విజ్ఞాన కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కులగణన ఆధారంగా బీసీల జనాభా శాతం మేరకు రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు చేయాలని కోరారు. ఎన్నికల వాగ్దానాలైన చట్ట సభల్లో 33 శాతం, స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలంటే ముందుగా కులగణన చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. సమన్యాయం కోసం వర్గీకరణ(ఏ, బీ, సీ, డీ) చేపట్టి పార్లమెంటులో రాజ్యాంగ సవరణ చేపట్టి.. బీసీ రిజర్వేషన్లను షెడ్యూల్-9లో చేర్చాల్సిందిగా కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల గడువు 2026, మార్చితో ముగుస్తున్నందున కులగణన ప్రక్రియను వేగవంతం చేసి, రిజర్వేషన్లు అమలు చేయాలని పేర్కొన్నారు. ఓబీసీల కోసం కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుమ్మర క్రాంతి కుమార్ మాట్లాడుతూ.. ఓబీసీ సబ్‌ప్లాన్ రూపొందించి బడ్జెట్ కేటాయింపులు చేపట్టాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసి, పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎంవీవీఎస్ఎన్ మూర్తి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సోము మహేశ్వరరావు, మేకా వెంకటేశ్వరరావు, చందు, ఉమామహేశ్వరరావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, సూరిబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శంకర్రావు. పక్కన మూర్తి, మహేశ్వరరావు తదితరులు

అరుణ కస్టడీ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయండి

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఎస్సై, అంగన్‌వాడీ పోస్టులు ఇప్పిస్తానంటూ వృద్ధుడిని మోసం చేసిన కేసులో నిందితురాలు నిడిగుంట అరుణ కస్టడీ కోరుతూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్ గురువారం విజయవాడలోని కోర్టులో విచారణకు వచ్చింది. పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని డిఫెన్స్ న్యాయవాదిని న్యాయస్థానం ఆదేశించింది. ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసిన నిడిగుంట అరుణపై గత నెల 13న సూర్యారావుపేట పోలీసులు కేసు నమోదు చేసిన విషయం విదితమే. నిందితురాలైన అరుణ.. నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉండగా, విజయవాడ పోలీసులు పీటీ వారెంట్ వేసి ఆమెను విజయవాడ న్యాయస్థానంలో హాజరుపరిచారు. అనంతరం నెల్లూరు కేంద్రగారానికి తరలించారు. ఈ కేసులో మరింత సమాచారం నిమిత్తం 4 రోజులు తమ కస్టడీకి ఇవ్వాలంటూ సూర్యారావుపేట పోలీసులు 1వ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో ఈ నెల 4వ తేదీన పిటిషన్ దాఖలు చేశారు. గురువారం న్యాయస్థానంలో విచారణకు వచ్చింది. ఈ నెల పదో తేదీలోపు కౌంటర్ దాఖలు చేయాలంటూ డిఫెన్స్ న్యాయవాదిని న్యాయమూర్తి ఆదేశించారు.

నకిలీ మద్యం కేసులో..

జోగి సోదరుల కస్టడీ, బెయిల్ పిటిషన్లపై విచారణ వాయిదా

ఈనాడు, అమరావతి: నకిలీ మద్యం కేసులో వైకాపా నేత జోగి రమేష్, ఆయన సోదరుడు రాము, ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దన్‌రావు, అతని సోదరుడు జగన్మోహన్‌రావుల కస్టడీ కోసం సిట్ దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ 11వ తేదీకి వాయిదా పడింది. జోగి సోదరులను 10 రోజులు, అద్దేపల్లి సోదరులను 5 రోజుల కస్టడీకి ఇవ్వాలని ఇటీవల సిట్ పిటిషన్లు దాఖలు చేసింది. మరోపక్క, ఈ నలుగురు వేసిన బెయిల్ పిటిషన్లు గురువారం ఎక్సైజ్ కోర్టులో విచారణకు వచ్చాయి. కౌంటర్ దాఖలు చేసేందుకు ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ సమయం కోరడంతో ఈ నెల 11కు న్యాయస్థానం విచారణను వాయిదా వేసింది. మిగిలిన నిందితులు బాదల్ దాస్, ప్రదీప్ దాస్, శ్రీనివాస్‌రెడ్డి, కల్యాణ్, రవి, శ్రీనివాసరావు, రమేష్ బాబు, అల్లాభక్ష్, సతీష్‌కుమార్‌లు వేసిన బెయిల్ పిటిషన్లపై విచారణను కూడా 11వ తేదీకి కోర్టు వాయిదా వేసింది.

నిందితులకు రిమాండ్ పొడిగింపు.. విజయవాడ, నెల్లూరు కారాగారాల్లో ఉన్న నిందితులకు గురువారంతో రిమాండ్ ముగియనుండడంతో వారిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎక్సైజ్ కోర్టు న్యాయాధికారి ఎదుట హాజరుపర్చారు. జనార్దన్‌రావు, జగన్మోహన్‌రావు సహా 11 మంది నిందితులకు ఈ నెల 13 వరకు కోర్టు రిమాండ్‌ను పొడిగించింది.

ఆర్డీవో పేరుతో సామాజిక మాధ్యమంలో నకిలీ ఖాతా

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు ఆర్డీవో కె.మాధురి పేరుతో సామాజిక మాధ్యమంలో నకిలీ ఖాతా కలకలం సృష్టించింది. గురువారం ఈ నకిలీ ఖాతాను ఆర్డీవో గుర్తించి అప్రమత్తమయ్యారు. ఆ ఖాతా నుంచి చరవాణి నంబరు 8553236906 ద్వారా 'ఏదో అత్యవసర పరిస్థితి కారణంగా డబ్బు పంపాలి' అనే సందేశాలు పంపుతున్నట్లు గమనించారు. ఇదంతా మోసపూరితమైందని ఆర్డీవో గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ ఖాతా, ఫోన్ నంబరుతో తనకు ఎటువంటి సంబంధం లేదని, ప్రజలు ఇలాంటి మోసపూరిత సందేశాలు నమ్మవద్దని, డబ్బు పంపించవద్దని ఆమె కోరారు. దీనిపై మైలవరం ఏసీపీ, విజయవాడ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రజలు కూడా ఇలాంటి మోసగించే సందేశాలు వస్తే వెంటనే టోల్‌ఫ్రీ నంబరు 1930కి ఫిర్యాదు చేయాలని సూచించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

నెస్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -106 రిటైల్ ధర 133 చికెన్ విత్ స్కిన్ - 193, చికెన్ స్కిన్‌లెస్ - 219. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 125, 134, 145 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 585 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.96/-.

పూజగదిలో దీపం అంటుకుని ప్రమాదం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: పూజగదిలో వెలిగించిన దీపం అంటుకుని అగ్నిప్రమాదం సంభవించిన ఘటన ఎన్టీటీపీఎస్ ఏ.కాలనీ జేఈ క్వార్టర్స్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే.. స్థానిక క్వార్టర్స్‌లో ఉండే గృహిణి దివ్య బుధవారం కార్తికపౌర్ణమి సందర్భంగా ఉదయం పూజ గదిలో దీపం వెలిగించి..తన ఇద్దరు పిల్లలను మరో గదిలో వదిలి సమీపంలోని ఆలయానికి వెళ్లారు. ఆ సమయంలో ఆ దీపం అక్కడే ఉన్న ద్వారం కర్టెన్‌కు అంటుకుని మంటలు వ్యాపించి గదిలో ఉన్న ఇతర వస్తువులు దగ్ధమయ్యాయి. ఈ క్రమంలో పొగ రావడంతో ఆ పిల్లలు ఉక్కిరిబిక్కిరై కేకలు వేశారు. గమనించిన స్థానికులు ఎన్టీటీపీఎస్ ఫైర్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అదే సమయంలో దగ్గరలో ఉన్న ఎస్‌పీఎఫ్ సిబ్బంది ఇద్దరు క్వార్టర్స్ తలుపులు పగలగొట్టి చిన్నారులను బయటకు తీసుకొచ్చారు. సమాచారం అందుకొన్న ఫైర్ అధికారి శాస్త్రి సిబ్బందితో అక్కడికి చేరుకొని మంటలు ఆర్పారు. ఇద్దరు పిల్లలను ఆసుపత్రికి తరలించగా వారికి ఎటువంటి హాని జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు

విజయవాడ(రైల్వేస్టేషన్): రద్దీ దృష్ట్యా విజయవాడ మీదుగా ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

☛ రైలు నంబరు 08551/08552, 08555/08556 అరకు-యలహంక ప్రత్యేక రైలు: ఈ నెల 13, 14, 17, 18, 23, 24 25 తేదీల్లో నడుస్తుంది. అరకు, బొర్రా గుహలు, కొత్తవలస, దువ్వాడ, అనకాపల్లి, తుని, సామర్లకోట, రాజమహేంద్రవరం, విజయవాడ, గూడూరు, నరసరావుపేట, మర్కాపురం, నంద్యాల, గుత్తి, ధర్మవరం, శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం, యలహంక స్టేషన్లలో ఆగుతుంది.

☛ 08553/08554 శ్రీకాకుళం రోడ్-బెంగళూరు ప్రత్యేక రైలు: ఈ నెల 21, 24 తేదీల్లో నడుస్తుంది. చీపురుపల్లి, విజయనగరం, కొత్తవలస, విశాఖపట్నం, దువ్వాడ, అనకాపల్లి, తుని, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, మార్కాపురం, నంద్యాల, గుత్తి, ధర్మవరం, శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం, బెంగళూరు స్టేషన్లలో ఆగుతుంది.

☛ 08463/08464 భువనేశ్వర్-బెంగళూరు ప్రత్యేక రైలు : ఈ నెల 16, 20 తేదీల్లో నడుస్తుంది. భువనేశ్వర్, ఖుర్దారోడ్, ఛత్రాపూర్, బరంపురం, ఇచ్ఛాపురం, సోంపేట, పలాస, నౌపడ, శ్రీకాకుళం రోడ్, చీపురుపల్లి, విజయనగరం, కొత్తవలస, దువ్వాడ, అనకాపల్లి, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, మార్కాపురం, నంద్యాల, గుత్తి, ధర్మవరం, శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం, బెంగళూరు స్టేషన్లలో ఆగుతుంది.

☛ అదనపు హాల్ట్ సౌకర్యం : 08335/08336, 08445/08446 సంబాల్‌పూర్-బెంగళూరు ప్రత్యేక రైల్‌కు అనకాపల్లి, గుంటూరు, నరసరావుపేట, మర్కాపురం స్టేషన్లలో అదనపు హాల్ట్ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

అంతర్ జిల్లాల టీటీ పోటీలకు జిల్లా జట్లు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: విశాఖపట్నంలో ఈ నెల 17వ తేదీ నుంచి మూడు రోజులు జరిగే రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో తలపడే ఎన్టీఆర్ జిల్లా అండర్-15 బాలబాలికల, సీనియర్(స్త్రీ, పురుషుల) జట్లను గురువారం జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం సంయుక్త కార్యదర్శి బి.శ్రీనివాస్ వెల్లడించారు. స్థానిక ఐజీఎంసీ స్టేడియంలోని జిల్లా సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన జిల్లా జట్ల ఎంపిక పోటీల్లో పలువురు క్రీడాకారులు ఉత్సాహంగా తలపడ్డారు. వీరిలో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేశామన్నారు. 0అండర్-15 బాలుర విభాగంలో జె.వైభవ్, ఎన్.వేదాన్ష్, జి.యశ్వంత్, ఎస్.కపిల్, బాలికల విభాగంలో ఎస్.మనస్వి, ఎ.ఎం.చార్వి, శ్రీకరలాస్య, అనన్య ఆనంద్, సీనియర్ పురుషుల విభాగంలో పి.చేతన్ సాయి, జి.తరుణ్‌తేజ్, డి.భువన్, ఎస్కే ఫిరోజ్, ఎ.గోవింద్, స్టాండ్ బైస్‌గా ఎస్కే ముజామిల్ అహ్మద్, బి.జయరామ్, మహిళల విభాగంలో హెత్విక కొల్లి, ఎన్.మోక్ష తన్మయి, కె.వసుధ, పి.భ్రుతి, కె.ప్రణతిలు జట్లలో స్థానం సాధించారు.



ఎంపికైన క్రీడాకారులతో శిక్షకులు

తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తానని మోసం

భవానీపురం, న్యూస్‌టుడే: తక్కువ ధరకు బంగారాన్ని ఇప్పిస్తానని ఒక వ్యక్తిని మోసం చేసిన ఇద్దరిపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. నల్గొండ జిల్లా చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన కిలారి బ్రహ్మయ్య కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటూ హోటల్ నిర్వహిస్తుంటారు. ఆయనకు అదే జిల్లాకు చెందిన వంశీ అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. తనకు తెలిసిన వారి వద్ద 100 గ్రాముల బంగారం రూ.8 లక్షలకు ఇప్పిస్తానని చెప్పాడు. నిజమేనని నమ్మిన బ్రహ్మయ్య తీసుకుంటానని చెప్పడంతో.. వంశీ విజయవాడకు వెళ్లి ప్రసాద్ అనే వ్యక్తికి ఫోన్ చేస్తే.. అతడు బంగారం ఇస్తాడని చెప్పాడు. దీంతో ఈనెల 5న రాత్రి బ్రహ్మయ్య విజయవాడలోని గొల్లపూడి నల్లకుంట సెంటర్ వద్దకు వచ్చి ప్రసాద్‌కు ఫోన్ చేశాడు. ప్రసాద్ శాంపిల్‌గా బంగారపు ముక్కను చూపించి బ్రహ్మయ్య వద్ద ఉన్న రూ.8 లక్షలను తీసుకున్నాడు. మిగిలిన బంగారాన్ని తీసుకొస్తానని.. ఇక్కడే వేచి ఉండాలని చెప్పాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో ప్రసాద్‌కు బ్రహ్మయ్య ఫోన్ చేయగా తనను పోలీసులు పట్టుకున్నారని అక్కడ నుంచి వెళ్లిపోవాలని సూచించాడు. దీంతో తిరిగి వంశీకి ఫోన్ చేయగా వారం రోజుల్లో డబ్బులు ఇప్పిస్తానని నమ్మబలికాడు. మోసపోయానని గ్రహించిన బ్రహ్మయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? ఆత్కూరు గ్రామంలోని శ్మశానవాటికలో పంచాయతీ బోరు మరమ్మతులకు గురై కర్మకాండలకు అవస్థలు పడుతున్నాం. - జి.రాంబాబు, గ్రామస్థుడు ✔ సమస్య మా దృష్టికి వచ్చింది. సిబ్బందితో బోరుకు మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా పునరుద్ధరిస్తాం. - శ్యామ్, పంచాయతీ కార్యదర్శి

? రంగాపురం గ్రామంలోని తారురోడ్డు పక్కన ఉన్న డ్రెయినేజీలో పెరిగిన గడ్డి, పూడికతో ఇబ్బందులు పడుతున్నాం. - ఎస్‌కె.కరీముల్లా, స్థానికుడు ✔ చర్యలు తీసుకుంటాం. - ఎస్.రామారావు, ఇన్‌ఛార్జి కార్యదర్శి

స్పందనకు వందనం



◆ జి.కొండూరు గ్రామ శివారు గొల్లగూడెంలో కాలువల్లో పూడిక పేరుకుపోయి దుర్వాసన, దోమలతో అవస్థలు పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్యను ఈ నెల 6వ తేదీన 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన ప్రచురించగా పంచాయతీ కార్యదర్శి బసవలింగేశ్వరరావు స్పందించారు. సిబ్బందితో కాలువల్లో పూడిక తీయించి దోమల నివారణకు బ్లీచింగ్ చల్లించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

◆ స్థానిక పంచాయతీలోని 9 వార్డులోని డ్రెయినేజీలో తీసిన పూడిక మట్టి తొలగించకపోవడంతో ఇబ్బందిగా ఉందని స్థానికులు మేమున్నాం...మీకు తోడుగాకు తెలిపిన సమస్యపై పంచాయతీ కార్యదర్శి రామారావు స్పందించారు. గురువారం సిబ్బందిని పంపి పూడిక మట్టిని తీయించారు.

- న్యూస్‌టుడే, జి.కొండూరు, రెడ్డిగూడెం



◆ గుంటుపల్లిలోని డ్రెయినేజీలో మురుగు పారుదల లేక దుర్వాసనతో పాటు దోమల బెడద ఎక్కువైందని స్థానికులు తెలిపిన సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన ఈ నెల 5వ తేదీన ప్రచురించగా గ్రామ కార్యదర్శి మురళీ ప్రసాద్ స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులతో మురుగు కాలువల్లో పూడికలు తీయించి బ్లీచింగ్ చల్లించారు. - న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం

◆ పట్టణంలోని 9వ వార్డులోని డ్రెయినేజీలో మట్టి, బురద పేరుకుని మురుగు పారుదలకు ఆటంకంగా ఉందని స్థానికుడు రాజేష్ చేసిన ఫిర్యాదుపై మున్సిపల్ శానిటరీ అధికారి సంతోష్ స్పందించారు. సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

◆ పట్టణంలోని 19వ వార్డులో ఉన్న ఖాళీ స్థలాల్లో మురుగు నీరు నిలిచి దోమలు వ్యాప్తి చెంది కంటి కునుకులేకుండా చేస్తున్నాయని స్థానికుడు రామకోటేశ్వరరావు చేసిన ఫిర్యాదుపై పారిశుద్ధ్య అధికారులు స్పందించారు. సిబ్బందిని పంపి దోమల నివారణ మందు చల్లించారు. - న్యూస్‌టుడే, తిరువూరు టౌన్

జూదశిబిరంపై దాడి

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని పోరాటనగర్ అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న జూద శిబిరంపై గురువారం సాయంత్రం పోలీసులు దాడి చేశారు. ఈ క్రమంలో పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనాలను వదిలేసి పరుగులు పెట్టారు. అందులో 9 మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ. 1,15,600 నగదు, 49 బైకులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.సుధాకర్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన వ్యక్తులు, అటవీ ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని జూదం ఆడుతున్నట్లు సమాచారంతో దాడి చేసినట్లు వివరించారు.

ఎమ్మెల్యే ప్రజాదర్బార్ నేడు

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు కార్యాలయ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. ఉదయం 10 గంటల నుంచి శాసనసభ్యుడు వసంత కృష్ణప్రసాద్ అందుబాటులో ఉంటారని ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరిస్తారని వివరించారు. ఆధార్‌కార్డు జిరాక్స్‌తో పాటు అర్జీని అందజేయాలని సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

జి.కొండూరు, న్యూస్‌టుడే: చెవుటూరు మేజర్ ఎన్నెస్పీ కాలువ డీసీ ఛైర్మన్ ఉమ్మడి వెంకటస్వామి తల్లి రమణమ్మ(85) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ స్థానిక నాయకులతో కలిసి గురువారం వారి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు

నిర్వహణ లోపాలు లేకుండా చూడాలి

మైలవరం, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో నిర్వహణ లోపాలు లేకుండా చూడాలని పది పరీక్షల జిల్లా కోఆర్డినేటర్ ఎస్ రాంబాబు పేర్కొన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి పరీక్ష కేంద్రాలుగా కేటాయించిన పాఠశాలల పరిశీలనలో భాగంగా గురువారం పలు హైస్కూళ్లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పరీక్షల సమయంలో ప్రత్యేక చర్యలు తీసుకుని, విద్యార్థులకు ఆటంకం కలగకుండా చూడాలన్నారు. ఎంఈవో ఎల్.బాబు పాల్గొన్నారు.

జానకిరామయ్య కృషి ఎనలేనిది

గొల్లపూడి, న్యూస్‌టుడే: విజయ డెయిరీకి సుదీర్ఘకాలం పాటు ఛైర్మన్‌గా పని చేసిన మండవ జానకిరామయ్య కృషి ఎనలేనిదని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం జానకిరామయ్య చిత్రపటానికి గొల్లపూడిలోని కార్యాలయంలో నివాళులర్పించి మాట్లాడారు. కృష్ణాజిల్లా రైతుల్లో ధైర్యాన్ని, వారికి స్ఫూర్తినిచ్చిన నాయకుడని కొనియాడారు.

నివాళులర్పిస్తున్న దేవినేని ఉమా



కష్టాన్ని జోడిస్తాం.. దేశానికి ఆడేస్తాం

కొండపల్లి, న్యూస్‌టుడే

క్రికెట్‌పై బాలికల్లో పెరుగుతున్న ఇష్టం

ఆత్మ విశ్వాసం సొంతం అన్నట్లుగా నేటి తరం అమ్మాయిలు సత్తా చాటుతున్నారు. సర్వశక్తులూ జోడించి ఉమెన్స్ క్రికెట్ వరల్డ్‌కప్-2025 సాధించారు మన దేశ మహిళా క్రికెటర్లు. క్రికెట్ అంటే అబ్బాయిలే ఆడాలి.. అనే ఆలోచన నుంచి బయటకు తీసుకువచ్చి ప్రపంచ వ్యాప్తంగా తుపాను సృష్టించారు. వారే మాకు ఆదర్శం అంటూ ఎప్పటికైనా ఉన్న ఊరు, తల్లిదండ్రులకు పేరు తెస్తామంటున్నారు ఈ బాలికలు. నిత్యం సాధన చేస్తూ ఎప్పటికైనా దేశానికి ప్రాతినిధ్యం వహిస్తామంటూ వారి సాధనను తెలుసుకుందాం.

నాకు ఇష్టమని నాన్న నేర్పిస్తున్నారు - ముస్కాన్



మాది కొండపల్లి..ఆరో తరగతి చదువుతున్నా. మా నాన్న చిత్ర కళాకారుడు. నాకు క్రికెట్ అంటే ఇష్టమని తెలుసుకుని నాన్నే నేర్పిస్తున్నారు. నాకు బ్యాటింగ్ అంటే ఎంతో ఇష్టం. మంచి క్రికెటర్‌గా చూడాలన్న నాన్న ఆశను ఎప్పటికైనా నెరవేరుస్తా. ప్రతిరోజు మూడు కిలో మీటర్లు వచ్చి నాన్న గ్రౌండ్‌లో దిగబెట్టి.. సాధన అయిపోయాక మళ్లీ తీసుకెళ్తారు.

చదువుతో పాటు ఆటలు - దీక్షిత



మేము ఇబ్రహీంపట్నంలో ఉంటున్నాం. స్థానిక పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నా. నాన్న వ్యాపారి. చదువుతో పాటు ఆటల్లో ఉండాలని నాన్న చెప్పారు. నాకు బౌలింగ్ చేయడం అంటే చాలా ఇష్టం. అందుకే ఎక్కువ దానిపై దృష్టిపెట్టాను. క్రికెట్ ఆడటమంటే ఎప్పుడో వీలు ఉన్నప్పుడు కాకుండా ప్రతిరోజు శ్రద్ధ పెట్టి నేర్చుకోవాలని నాన్న చెప్పేవారు. అందుకే రోజులో కొంత సమయం కేటాయించి..చదువుతో పాటు క్రికెట్ నేర్చుకునే వీలు కల్పించారు నాన్న. రోజూ మైదానానికి తీసుకొచ్చి తీసుకెళతారు.

అమ్మానాన్నలను ఒప్పించా.. - షాలిని, ఎనిమిదో తరగతి



మాది ఇబ్రహీంపట్నం..నేను 8 వ తరగతి చదువుతున్నా. చిన్న వయస్సులో క్రికెట్ ఏంటని బంధువులు..నీకెందుకు ఈ క్రికెట్ అని స్నేహితులు అంటుంటే నాకు ఆటపై ఇంకా కసి పెరిగింది. అందుకే కష్టమైనా ఇష్టపడి అమ్మానాన్నలను ఒప్పించి క్రికెట్ నేర్చుకుంటున్నా.

ఎంతైనా శ్రమిస్తా - ఎండీ ముస్కాన్, కొండపల్లి



భారత మహిళా టీంలోకి వెళ్లాలని నా కోరిక. అందుకే ఎంబీఏ స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ చేస్తున్నాను. క్రీడలపై ఉన్న ఆసక్తిని గమనించి నాన్న కుష్బర్ క్రికెట్ అకాడమీలో చేర్పించారు. ఇప్పటికే అనేక టీంలలో పాల్గొని విజయం సాధించాను. అందుకు ఎంతైనా శ్రమిస్తాను. సత్తా చాటిన మహిళా క్రికెట్ టీంను చూసి సంబరపడిపోయా. భవిష్యత్తులో నేను ఆడుతున్న సందర్భంలో నా అమ్మానాన్న కళ్లలో ఆ ఆనందాన్ని చూడాలి.

వివరాలు నమోదు చేయించుకోండి

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీకి కేటాయించిన జిన్నింగ్ మిల్లుల్లో పత్తి విక్రయించాలనుకుంటున్న రైతులు గ్రామాల్లోని రైతు సేవాకేంద్రాల్లో సీఎం యాప్‌లో వివరాలు నమోదు చేయించుకోవాలని ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. ఏఎంసీ పరిధిలో గల మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం మండలాల పరిధిలో పత్తి పండించే రైతులు త్వరపడాలన్నారు.

సస్యరక్షణపై అవగాహన

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: రంగాపురం పంచాయతీ పరిధిలోని రెడ్డికుంట గ్రామంలో వ్యవసాయశాఖ అధికారులు గురువారం పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఏవో డి.శ్రీనివాసరావు వరిలో సస్యరక్షణ చర్యలు గురించి రైతులకు అవగాహన కల్పించారు.

భక్తులకు అన్నదానం

కొండపల్లి: కార్తిక పౌర్ణమి సందర్భంగా కొండపల్లి సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని తెదేపా నాయకులు జంపాల సీతారామయ్య ప్రారంభించారు.

వైద్య శిబిరాలను ప్రతినెలా కొనసాగిస్తే మేలు



సౌకర్యాల గురించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్

కొండపల్లి, న్యూస్‌టుడే: కాలుష్య ప్రభావిత ప్రాంతాల్లో నివసించే వారి ఆరోగ్య పరిస్థితులపై శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ సూచించారు. ఎన్టీటీపీఎస్ ఆధ్వర్యంలో కొండపల్లిలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్టీటీపీఎస్ ఇటువంటి వైద్య శిబిరాలను ప్రతినెలా కొనసాగించాలని కోరారు. పురపాలికతో పాటు మండల గ్రామాల్లో శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజల సమస్యలపై దృష్టి సారిస్తేనే ప్రజల మనుగడ ఉంటుందని గ్రహించాలని చెప్పారు. మెడ్‌స్టార్, పైన్, హెచ్‌సీజీ క్యాన్సర్, స్రవంతి, అమరావతి, వశిష్ఠ ఆసుపత్రుల వైద్యులతో ఆయన మాట్లాడి.. మీరు కూడా ముందుకు వచ్చి వైద్య శిబిరాలను నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకుడు సీతారామయ్య, ప్రజాప్రతినిధులు, ఎన్టీటీపీఎస్ ఇంజినీర్లు, పురపాలిక ప్రజలు పాల్గొన్నారు.

నిషేధిత జాబితా భూముల పరిశీలన

విస్సన్నపేట, న్యూస్‌టుడే: మండలంలోని కొండపర్వలో నిషేధిత జాబితాలో ఉన్న భూములను ఆర్డీవో మాధురి, ఏడీ సర్వేయర్ మోహన్‌రావు, విజయవాడ, డీఐఎస్ సారంగపాణి, ఫారెస్ట్ సెక్షన్ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. పట్టా భూముల్లో 77 ఎకరాలు అటవీ భూములు కలిసి ఉండడంతో వాటి సబ్‌డివిజన్ నిర్వహించడానికి కలెక్టర్ సూచన మేరకు జాయింట్ సర్వేను పరిశీలన కోసం అధికారులు సందర్శనకు వచ్చినట్లు తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాధురి మాట్లాడుతూ.. త్వరలో నిషేధిత జాబితా 22 (ఏ)ని తొలగించి హక్కుదారులకు పట్టాలిచ్చేందుకు ప్రతిపాదిస్తున్నట్లు భూమిని విడగొట్టేందుకు జాయింట్ సర్వే చేపడతామన్నారు. ఆర్ఐ సుజాత, రెవెన్యూ, అటవీ, సర్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో చర్చిస్తున్న ఆర్డీవో మాధురి

నేల ఆరోగ్యంపై అవగాహన ఉండాలి



నరసాపురం గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న విజయకుమారి

విస్సన్నపేట, న్యూస్‌టుడే: పాఠశాల స్థాయి భూసార పరిరక్షణ పథకంలో భాగంగా భూసార పరీక్ష కేంద్రం గొల్లపూడి బృందం గురువారం మండలంలోని విస్సన్నపేట జిల్లా పరిషత్ హైస్కూల్, నరసాపురం బీసీ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వ్యవసాయ అధికారిణి విజయకుమారి మాట్లాడారు. పాఠశాల విద్యార్థులు నేల ఆరోగ్యం, సూక్ష్మ పోషకాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. భూసార పరీక్ష కేంద్ర వ్యవసాయ అధికారి సువర్ణ కుమారి, ప్రియాంక, సురేష్, మండల వ్యవసాయ అధికారి షేక్ టిప్పు సుల్తాన్, ప్రధానోపాధ్యాయులు ఆర్ శోభారాణి, ఎం.డి శ్యామలా దేవి, తదితరులు పాల్గొన్నారు.

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, ఏపీఎస్ ఆగ్రో సంస్థ సహకారంతో భూసార పరీక్షపై రెండ్రోజుల కార్యశాలను గురువారం ప్రారంభించారు. మానవులకు రక్తపరీక్షల తరహాలోనే భూముల సారం తెలుసుకుని పంటలు పండించేందుకు భూసార పరీక్షలు తప్పనిసరని ప్రిన్సిపల్ ఇల్లా రవి పేర్కొన్నారు. పరీక్షల విధానాన్ని సంస్థ జీఎం అశోక్ విద్యార్థులకు వివరించారు. రసాయనశాస్త్ర విభాగాధిపతి ఫణికుమార్, కామర్స్ హెచ్‌ఓడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మైలవరం : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కనిపిస్తున్నా...కనిపెట్టరంతే...



కొందరు అక్రమార్కులు ధనార్జనే ధ్యేయంగా అడ్డదారుల్లో పచ్చని చెట్ల ఉసురు తీస్తున్నారు. నరికిన చెట్ల కలపను పట్టపగలే బహిరంగంగా లారీల కొద్దీ తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు పోతున్నారు. విస్సన్నపేట, నరసాపురం, చాట్రాయి మండలం చిన్నంపేట, ప్రైవేట్, ప్రభుత్వ పోరంబోకు భూముల్లో, రహదారుల వెంట ఏళ్లుగా ఉన్న భారీ చెట్లను నేలకూల్చి ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ఇలాంటి పనులపై అధికారులు చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, విస్సన్నపేట

పుల్లలే ప్రమాద హెచ్చరిక



మండలంలోని గాదెవారిగూడెం - ఊటుకూరు గ్రామాల మధ్య నల్ల వాగు వద్ద ఆర్‌అండ్‌బీ రహదారిపై ఏర్పడిన పెద్ద గుంత ప్రమాదకరంగా మారింది. అధికారులు ఆ గుంతకు మరమ్మతులు చేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గుంతను గుర్తించేందుకు ప్రయాణికులే పిచ్చిచెట్ల పుల్లలను అడ్డుగా పెట్టారు. ఆ గుంత రాత్రి వేళల్లో కనిపించక అందులో పడిపోతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ ఏఈ అచ్చారావును సంప్రదించగా వెంటనే గుంతకు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తామన్నారు. - న్యూస్‌టుడే, గంపలగూడెం

జాతీయ రహదారి..చూడకుంటే పడతారు జారి



పినపాక శివారు విద్యానగరం సమీపంలో జాతీయ రహదారి-30పై గుంతలు ఏర్పడి అధ్వానంగా తయారైంది. హెచ్‌పీసీఎల్ కంపెనీ ఎదురుగా భారీ ట్యాంకర్లు లోపలకు వెళ్లి లోడు చేసుకొని బయటకు వచ్చే క్రమంలో గుంత ఏర్పడింది. ఇది కాస్తా ఇటీవల తుపాన్ కారణంగా మరింత పెద్దదైంది. దీంతో రాత్రి సమయాల్లో ప్రమాదాలు సంభవిస్తున్నాయని.. ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని ప్రయాణికులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతలు పూడ్చి మరమ్మతులు చేపట్టకుండా బారికేడ్లను ఏర్పాటు చేసి చేతులు దులిపేసుకున్నారని మండిపడుతున్నారు. - న్యూస్‌టుడే, జి.కొండూరు

పేదల ఆర్థిక పరిస్థితులు మార్చడమే పీ4 లక్ష్యం

కొండపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వం పేదల ఆర్థిక స్థితిగతులను మార్చే ఆలోచన చేస్తోందని ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ అన్నారు. పీ4 కార్యక్రమ స్ఫూర్తితో మైలవరానికి చెందిన ఎం.కిషోర్ సహకారంతో కొండపల్లిలోని పది కుటుంబాలకు రూ. 80వేల నిత్యావసరాలను గురువారం వితరణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదరిక నిర్మూలనతో పాటు సమాజంలో ఆర్థిక సమతుల్యతను సాధించేందుకు ముఖ్యమంత్రి పీ4 కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. దానికి రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది ఉన్నత వర్గాల వారు సహాయ సహకారాలను అందివ్వడానికి ముందుకు వచ్చారన్నారు. జనసేన నాయకులు అక్కల రామ్మోహనరావు, ఛైర్మన్ చిట్టిబాబు, వైస్ ఛైర్మన్ శ్రీను, కౌన్సిలర్లు వాసు, కూటమి నాయకులు పీ4 ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయం నిర్మించి 28 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా భక్తులు వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ రాజా ఆధ్వర్యంలో పట్టణ ప్రధాన వీధుల్లో జ్యోతులతో ర్యాలీ నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు అందజేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మత్స్యకారులందరికీ సాయం అందించాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం పుష్కర నగర్, ఇసుక రేవు ప్రాంతాల మత్స్యకారులకు ప్రభుత్వం సాయం అందించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. వరదలు, తుపాన్ నేపథ్యంలో మత్స్యకారులకు ప్రభుత్వం 50 కేజీల బియ్యం, నిత్యావసరాలను అందించిందన్నారు. అయితే వీరిని పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. అధికారులు దీనిపై దృష్టి సారించి తక్షణమే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అనంతరం సీపీఎం నాయకులు విఠలరావు, రామసీత మత్స్యకారులతో కలిసి రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

మద్యం విక్రేతల అరెస్టు

చిట్టినగర్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని కొత్తపేట పోలీసులు గురువారం అరెస్టు చేశారు. విజయవాడ శివారు ప్రాంతం కొత్తూరు తాడేపల్లి చర్చి సెంటర్‌లో మద్యం విక్రయిస్తున్నట్లు ఎస్సై హరిప్రసాద్‌కు సమాచారం అందింది. సిబ్బందితో ఆ ప్రాంతంలో తనిఖీ చేయగా కంపా లక్ష్మయ్య (70), గొడవర్తి స్వామి(50) వద్ద 180 క్వాటర్ సీసాలు 114, బీరు సీసాలు 11 పట్టుబడ్డాయి.

కళాశాల అధ్యాపకులపై దాడి

భవానీపురం: కళాశాల అధ్యాపకులను విద్యార్థి బంధువులు కొట్టిన సంఘటన గొల్లపూడిలో చోటుచేసుకుంది. కనపర్తి ప్రవీణ్ గుంటుపల్లిలో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. అతను గొల్లపూడిలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపల్‌గా పని చేస్తున్నారు. మూలపాడుకు చెందిన శాంతాల భానుశేఖర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కొన్ని రోజులుగా అతడు కళాశాలకు సరిగా రాకపోవడంతో ఎందుకు రావడం లేదని, కింద కూర్చోవాలంటూ ఈనెల 2న కళాశాల అధ్యాపకులు పేర్కొన్నారు. ఆ విషయాన్ని విద్యార్థి ఇంట్లో చెప్పగా 3న ఉదయం విద్యార్థి తల్లి లక్ష్మి, బంధువులు అనిల్, సుదర్శన్, రామారావు తదితరులు కళాశాలకు వచ్చి గొడవ పడి.. కళాశాల ఇద్దరు అధ్యాపకులపై దాడి చేశారు. ఈ ఘటనలో ప్రవీణ్‌కు తలకు బలమైన గాయమైంది. ఈ మేరకు ప్రవీణ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా గురువారం కేసు నమోదు చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న సతీష్‌కుమార్, అధికారులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మద్దులపర్వ, రెడ్డిగూడెం పీఏసీఎస్ వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా పౌరసరఫరాలశాఖ మేనేజర్ సతీష్ కుమార్ గురువారం పరిశీలించారు. రైతులంతా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి లబ్ధిపొందాలని రైతులకు సూచించారు. అన్ని ఆర్ఎస్‌కేలకు గోనెసంచులు, తేమ పరిశీలన యంత్రాలు పంపినట్లు చెప్పారు. తహసీల్దార్ జె.సుశీలాదేవి, ఆర్ఐ పుల్లయ్య, వీఆర్వోలు, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

చందాలతో శ్మశానవాటిక అభివృద్ధి



భూమి పూజ చేస్తున్న గ్రామస్థులు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని ఎదురుచూడకుండా జూపూడి గ్రామస్థులంతా కలిసి గ్రామ శ్మశానవాటిక అభివృద్ధికి నడుం బిగించారు. గ్రామానికి చెందిన దాదాపు రెండు ఎకరాల విస్తీర్ణంలోని హిందూ శ్మశానవాటిక ముళ్లపొదలు, చెట్లు దట్టంగా పెరగడంతో అంత్యక్రియలు చేయడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందనలేదు. దీంతో తామే చందాలు వేసుకుని శ్రమదానాలతో పరిష్కరించుకోవాలని నిర్ణయించుకుని గురువారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం మండల పరిషత్తు మాజీ అధ్యక్షుడు మూలపాడుకి చెందిన నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు రూ. 1.25 లక్షలు విరాళం ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. రాజశేఖర్, కాకిబాబు, నరసింహస్వామి, రాజేశ్వరరావు, గంగరాజు, శివయ్య, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అడుగు ఆగుతోంది.. అవస్థ వీడకుంది

జి.కొండూరు, న్యూస్‌టుడే

అధ్వానంగా డొంక రోడ్లు

గతేడాది వరద ముంపునకు బుడమేరు పరివాహక ప్రాంతాల్లోని రోడ్లన్నీ కోతకు గురై దుస్థితికి చేరాయి. హెచ్ ముత్యాలంపాడు గ్రామానికి సమీపాన కోతకు గురైన నాలుగు డొంక రోడ్లను అధికారులు ఎవరూ పట్టించుకోలేదు. దీంతో నిత్యం వ్యవసాయ పనులు చేసుకునేందుకు పొలాల్లోకి వెళ్లాలంటే రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా మరమ్మతులు చేయిస్తారని కూటమి ప్రభుత్వంపై కర్షకులు ఆశగా ఎదురుచూస్తున్నారు. హెచ్ ముత్యాలంపాడు, వెల్లటూరు, ఆత్కూరు గ్రామాల్లో దాదాపు 200 మంది రైతులు సుమారు 700 ఎకరాల్లో తమ పంటలను సాగు చేసుకుంటుంటారు.

ఈ మార్గాల్లో వెళ్లాలంటే.. అదే విధంగా మరో వైపు కురుడు డొంక ఒకటిన్నర కిలోమీటర్ వరకు భారీ గుంతలు ఏర్పడి ఏడాది కావస్తున్నా మరమ్మతులకు నోచుకోకపోవడంతో అన్నదాతలకు ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో ట్రాక్టర్‌పై పంట ఉత్పత్తులను ఇంటికి చేర్చుకునే రోడ్డు సైతం ద్విచక్ర వాహనం వెళ్లలేని పరిస్థితికి చేరుకుందని వాపోతున్నారు. బీ మరో డొంక రోడ్డు అక్కల చెరువు ఆయకట్టు రైతులు పొలాలకు వెళ్లేందుకు దాదాపు కిలో మీటర్ మేర కోతకు గురై అధ్వానంగా మారింది. బీ ఆత్కూరు నుంచి విజయవాడ పటమట వాసులకు కేటాయించిన జగనన్న కాలనీకి వెళ్లే మరో డొంక రోడ్డు దాదాపు కిలోమీటరున్నర సైతం గుంతలు ఏర్పడి చిన్నపాటి వర్షానికే బురదకయ్యగా మారుతోందని లబ్ధిదారులు వాపోతున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



హెచ్ ముత్యాలంపాడు సమీపంలో మేకల డొంక

★ హెచ్ ముత్యాలంపాడు గ్రామానికి గత ప్రభుత్వం జగనన్న కాలనీ ఇళ్లు మంజూరు చేసి రహదారి అభివృద్ధిపై నిర్లక్ష్యం చేశారు. దీంతో సమీపంలోని మేకల డొంక మీదుగా లబ్ధిదారులు రాకపోకలు కొనసాగించారు. ఇది కాస్తా గతేడాది వరద ఉద్ధృతికి గండ్లు పడి డొంక మాత్రమే మిగిలి రోడ్డంతా కోతకు గురైంది.

నిధులు మంజూరుకు కృషి చేస్తాం: సమస్య పై పంచాయతీరాజ్ సహాయక ఇంజినీర్‌ను వివరణ కోరగా రైతుల విజ్ఞప్తి మేరకు స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి డొంక రోడ్ల అభివృద్ధి విషయం తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు. నిధులు మంజూరు కాగానే డొంక రోడ్ల అభివృద్ధి చేపడతామన్నారు.

మీ అమ్మాయికి మీరెంత దన్ను?

(మొదటి పేజీ తరువాయి)

ఆసాంతం అద్భుతంగా ఆడిన హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం దేశంలోని అమ్మాయిలంతా గర్వపడేలా, స్ఫూర్తి పొందేలా చేసింది. ఇక ప్రత్యేకంగా అమ్మాయిల తల్లిదండ్రులకే కాకుండా పిల్లల్ని పెంచే అందరు అమ్మానాన్నలతో నా అభిప్రాయాన్ని పంచుకోవాలని అనుకుంటున్నా. తల్లిదండ్రులుగా మీ పిల్లలకు కలలు కనే స్వేచ్ఛను ఇవ్వడం అత్యంత కీలకం. వారు పెద్ద లక్ష్యాలను పెట్టుకునేలా మార్గనిర్దేశం చేయండి. తమ అభిరుచిని అన్వేషించేలా.. పరిమితులు, భయం లేకుండా సొంత మార్గాన్ని కనుక్కునేలా ప్రోత్సహించండి. ఈ క్రమంలో పొరపాట్లు చేసినా ఫర్వాలేదు. తప్పులు పునరావృతం కాకుండా చూడండి. అమ్మాయిలు స్వతంత్రంగా ఉండాలని మనం చెబుతున్నాం. అదే సమయంలో మహిళలకు వెన్నుదన్నుగా ఉండాలని, అమ్మాయిలను సమానంగా చూడాలని అబ్బాయిలకు నేర్పించాలి. అది మన ఇంటి నుంచే మొదలవ్వాలి. చిన్నప్పట్నుంచే సమానత్వ భావన పెంపొందించాలి. అమ్మాయిలకు సానుభూతి కాదు.. స్వేచ్ఛ, సమానత్వం కావాలి.



ఆడపిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో క్రీడలు ఎలాంటి పాత్ర పోషిస్తాయి?

నా వరకు టెన్నిస్‌తో చాలా ఆత్మవిశ్వాసం లభించింది. నా మీద నాకు నమ్మకం కలిగేలా చేసింది. చిన్న వయసులోనే నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం అందించింది. ఒడుదొడుకులు, ఎదురుదెబ్బల నుంచి నేర్చుకోడానికి చాలా శక్తినిచ్చింది. క్రీడలతో వచ్చే ఆత్మవిశ్వాసం సహజంగానే ఒక అమ్మాయి జీవితంలో ప్రతి భాగంలోనూ ప్రతిఫలిస్తుంది. వారి నిర్ణయాల్లో ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది.

? అమ్మాయిలకు సమాన అవకాశాలు కల్పించడానికి సమాజంలో ఇంకా ఎలాంటి మార్పులు రావాలని అనుకుంటున్నారు? ముఖ్యంగా క్రీడల్లో?

అవకాశాలు.. మౌలిక వసతులు.. శిక్షణ.. ప్రచారంతో సహా అన్నింట్లోనూ సమానత్వం అవసరం. ఆలోచనా విధానం, దృక్పథంలోనూ మార్పు రావాలి. పతకాలు గెలిచినప్పుడే కాకుండా అమ్మాయిల ప్రయత్నాల్ని కూడా అభినందించేలా ఉండాలి. క్రీడాకారిణి ప్రయాణంలో ప్రతి దశకు మద్దతుగా నిలిచే, ప్రోత్సహించే వ్యవస్థను సృష్టించాలి. సమానత్వం కేవలం అవకాశం గురించి కాదు. నమ్మకం, ఆత్మవిశ్వాసానికి సంబంధించింది. అబ్బాయిల మాదిరిగానే నమ్మకం, మద్దతు, గౌరవం లభిస్తున్నాయని అమ్మాయిలు తెలుసుకున్నప్పుడు లేదా గుర్తించినప్పుడు వారి సామర్థ్యం అపరిమితంగా మారుతుంది. అలాంటి రోజు వచ్చినప్పుడు వాళ్లను ఎవరూ ఆపలేరు.

? మీ కుమారుడికి ఎలాంటి విలువలు నేర్పించాలని అనుకుంటున్నారు?

క్రీడలు నాకు క్రమశిక్షణ, సహనం, కష్టపడే తత్వాన్ని నేర్పించాయి. నా కుమారుడికి కూడా అవే గుణాలు అందించాలని ఆశిస్తున్నా. జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండాలని.. మూలాల్ని మరిచిపోవద్దని చెబుతా. ఫలితం కంటే ప్రయత్నం ఎంత ముఖ్యమో నేర్చుకున్నా. జీవితంలో అత్యుత్తమంగా ఉండేలా నా కుమారుడిని తీర్చిదిద్దుతా.

? సెలబ్రిటీగా.. ఒక తల్లిగా రెండు పాత్రల్ని ఎలా సమన్వయం చేసుకుంటున్నారు?

ఒక తల్లిగా అదంత సులువు కాదు. ఏదో ఒక సమయంలో అపరాధ భావన మనల్ని వెంటాడుతుంది. అయితే మనం చేస్తున్న పని వారి భవిష్యత్తుకు తోడ్పడుతుందని గుర్తుంచుకోవడం చాలా ముఖ్యం. కొన్ని రోజులు ప్రపంచవ్యాప్తంగా ప్రయాణిస్తుంటా.. పని చేస్తుంటా లేదా ఒప్పందాల ప్రకారం కార్యక్రమాల్లో పాల్గొంటాను. మరి కొన్ని రోజులు తల్లి పాత్రలో పూర్తిగా మునిగిపోతా. నేను ఎక్కడున్నా.. ఏ పాత్రలో ఉన్నా నూటికి నూరు శాతం ఉండటం కీలకం. ఒకేసారి అన్నీ చేయడం కాకుండా.. ఆ క్షణంలో అత్యంత ముఖ్యమైనది చేయడం ప్రధానమని గ్రహించా.

? చాలామంది క్రీడాకారిణులు రిటైర్మెంట్ తర్వాత తమ లక్ష్యాన్ని నిర్దేశించుకోవడంలో కష్టపడుతుంటారు. ఆ విషయంలో మీరెలా విజయవంతమయ్యారు?

నా లక్ష్యం ఎల్లప్పుడూ ట్రోఫీలు, టైటిళ్ల కంటే మించి ఉండేది. నా జీవితంలో టెన్నిస్ చాలా పెద్ద భాగం. కానీ జీవితం మొత్తానికి అదే గుర్తింపు కాదు. రిటైర్మెంట్ తర్వాత నా ఉత్సాహాన్ని కొత్త మార్గాల్లోకి మళ్లించా. యువ క్రీడాకారులకు మార్గనిర్దేశం చేయడం.. క్రీడల్లో మహిళల్ని ప్రోత్సహించడం.. ప్రతిభావంతుల్ని తయారు చేసే అకాడమీలను ఏర్పాటు చేయడంపై దృష్టిసారించా. వ్యక్తిగత, వృత్తిగత జీవితాల మధ్య సమతూకం పాటించడం ఎంతో ముఖ్యం.

- ఈనాడు, హైదరాబాద్

విశాఖలో ఏపీ గ్లోబల్ ఎంఎస్ఎంఈ సదస్సు

(మొదటి పేజీ తరువాయి)

సదస్సులో పాల్గొంటారు. ఆటోమొబైల్ విడిభాగాలు, ఫుడ్ అండ్ బెవరేజెస్, ఎలక్ట్రానిక్స్, శానిటరీవేర్, వ్యవసాయ యంత్రాలు, ఐటీ సర్వీసులు, ఔషధాలు, మెడికల్ డివైజెస్, టెక్స్‌టైల్ వంటి రంగాల్లో వ్యాపార అవకాశాలను పరిశీలిస్తారు. కొనుగోలుదారుల సెషన్లు, బీ2బీ సమావేశాలు, నెట్‌వర్కింగ్ కార్యక్రమాలు ఉంటాయి. రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలు తయారు చేసే ఉత్పత్తుల గురించి వారికి వివరించి.. ఎగుమతులకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తాం. కేంద్ర ప్రభుత్వ ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ఉన్న ఎంఎస్ఎంఈలు కార్యక్రమంలో పాల్గొనవచ్చు. ఆన్‌లైన్‌లో https://indiasmeforum.org/itd/rbsm-vizag-2025 రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. గ్లోబల్ సప్లై చైన్‌లో భాగమయ్యేందుకు రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలకు అవకాశం ఏర్పడుతుంది. సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన విధానాలు, డిజిటల్ పాలనతో చిన్న వ్యాపారులు అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతున్నారు' అని పేర్కొన్నారు.

500 ఆస్తులకు ఒకటే ఫోన్ నంబరు!

(మొదటి పేజీ తరువాయి)

✦ ఈ విషయంలో కొందరు పంచాయతీ కార్యదర్శులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారు. అసెస్‌మెంట్ నంబర్ల వారీగా యజమానుల మొబైల్ నంబర్లు తీసుకుని మ్యాపింగ్ చేయడానికి బదులు.. ఒకటి, రెండు నంబర్లు తీసుకుని వాటినే వందల సంఖ్యలోని ఆస్తులకు మ్యాపింగ్ చేసేశారు.

బయటపడిందిలా..

✦ పోర్టల్ నుంచి బ్యాకప్ తీయించినప్పుడు కార్యదర్శుల నిర్వాకం బయటపడింది. 3 వేల పంచాయతీల్లో ఒక నంబరును అత్యధిక సంఖ్యలో ఆస్తులకు మ్యాపింగ్ చేసినట్లు ప్రాథమికంగా గుర్తించారు. అనేక పంచాయతీల్లో ఇలానే జరిగినట్లు తెలుస్తోంది. సంబంధిత యజమానుల నంబర్లను సేకరించడం కష్టమని భావించారా? ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు.

✦ తప్పిదాలను గుర్తించిన పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ.. జిల్లాకు ఐదుగురు కార్యదర్శులతోపాటు జిల్లా, డివిజనల్ పంచాయతీ అధికారులు, డివిజనల్ అభివృద్ధి అధికారులతో రెండు రోజుల క్రితం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిలో జిల్లాకు ఒకరు చొప్పున 26 మందిని ప్రాథమికంగా సస్పెండ్ చేశారు. పర్యవేక్షణ లోపంపైనా డీపీవో, డీఎల్‌పీవో, డీఎల్‌డీవోలపైనా కృష్ణతేజ మండిపడ్డారు.

ఇప్పటికీ అక్రమ వసూళ్లు

✦ పంచాయతీల్లో ఆస్తి పన్ను వసూళ్లు ఆన్‌లైన్‌లోనే చేయాలన్న ఆదేశాలను పలుచోట్ల కార్యదర్శులు పట్టించుకోవడం లేదు. ప్రజల నుంచి ఆఫ్‌లైన్‌లో పన్ను మొత్తాలను తీసుకుని.. రసీదులను తర్వాత ఇస్తామంటూ వసూలైన సొమ్మును జేబుల్లో వేసుకుంటున్నారు. స్వర్ణ పంచాయతీ పోర్టల్‌పై ప్రజల్లో చాలామందికి అవగాహన లేదు. వారు కార్యదర్శులకే పన్ను మొత్తాలను ఇస్తున్నారు. అవినీతికి అలవాటుపడిన కార్యదర్శులు ఇదే మేలన్నట్లు వ్యవహరిస్తున్నారు. చర్యలు తీసుకోవాల్సిన జిల్లా, డివిజనల్ పంచాయతీ అధికారులు.. కార్యదర్శుల అవినీతికి సహకరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నెలవారీ మామూళ్లు తీసుకుంటూ బాధ్యతల్ని విస్మరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

100% సేవలు ఆన్‌లైన్‌లో

(మొదటి పేజీ తరువాయి)

వెళ్లకుండా కార్యాలయాల్లో కూర్చునే విధానం సరి కాదు' అని చెప్పారు. 'డేటా అనేది సంపద. సరిగా ఉపయోగించుకుంటే అద్భుతాలు చేయొచ్చు. వసతిగృహాల్లో తాగునీరు బాగాలేక డయేరియా వచ్చింది. మంత్రులు, అధికారులు ఎందుకు రియల్ టైమ్‌లో పర్యవేక్షించలేదు?' అని ప్రశ్నించారు.

కాన్సెప్ట్ అర్థం చేసుకోండి..

'డేటాలేక్, డేటా లెన్స్ అందుబాటులో ఉన్నాయి. దీనికి జీఏడీ నుంచి నోటిఫికేషన్లు ఇవ్వాలి. కొన్ని శాఖలు ఇంకా డేటాలేక్‌కు ప్రోగ్రాంలను అనుసంధానించుకోవాలి. శాఖల వారీగా మంత్రులు, కార్యదర్శులు, శాఖాధిపతులు ఈ కాన్సెప్ట్ అర్థం చేసుకోవాలి. తామేం చేయగలమో ఆలోచించాలి. 13 ఉమ్మడి జిల్లాల్లో ఆర్టీజీ కార్యాలయాల నిర్మాణాలు డిసెంబరు 15 నాటికి పూర్తవుతాయి. వీటిద్వారా 26 జిల్లాలకు సేవలు అందుతాయి. ఏఐని ఉపయోగించుకుని, ప్రతి శాఖ యూజ్ కేసులు తయారుచేయాలి' అని చంద్రబాబు నిర్దేశించారు.

ఒక్కరు తప్పు చేసినా.. ప్రభుత్వానికే చెడ్డపేరు

'ఒకరు తప్పు చేసినా ప్రభుత్వానికే చెడ్డపేరు వస్తోంది. ఎక్సైజ్ శాఖలో గత ఐదేళ్లలో ఎన్నో అవకతవకలు జరిగాయి. కూటమి అధికారంలోకి వచ్చాక పారదర్శకత తెచ్చాం. అయినా నెపం మోపేందుకు కొందరు కుట్రలు చేస్తున్నారు. పారదర్శకంగా చేయడమే కాదు. అలా చేస్తున్నామని ప్రజలకు చెప్పి వారిలో నమ్మకం పెంపొందించాలి. ఏవైనా లోపాలుంటే సరిదిద్దుకుందాం' అని చంద్రబాబు సూచించారు.



డేటా ఆధారిత పాలనపై సదస్సుకు హాజరైన వివిధ శాఖల ఉన్నతాధికారులు

అంతా డేటా ఆధారితమే

'ఆర్టీజీఎస్ ద్వారా ఎప్పటికప్పుడు డేటా విశ్లేషిస్తున్నాం. ఆర్టీజీఎస్ అనేది సమాచారం సేకరించి, శాఖలకు అందిస్తుంది. డేటాసెంటర్లు, ఎనలిటిక్స్ వస్తున్నాయి. కార్పొరేట్ కార్యాలయాల ప్రాధాన్యం తగ్గుతోంది. డేటా సెంటర్ల ద్వారా ఎనలిటిక్స్ తీసి చివరి స్థాయికి పంపిస్తున్నారు. ట్రెండ్స్ మారుతున్నాయి. కొన్ని ప్రభుత్వాలు తమకున్న ప్రత్యేక పరిస్థితుల్లో విజన్‌తో పనిచేసి మంచి ఫలితాలు సాధిస్తున్నాయి' అని చంద్రబాబు వివరించారు.

మీకోసం అర్జీల పరిష్కారంపై శ్రద్ధ లేదు

'కొన్ని శాఖలు మీకోసం అర్జీల పరిష్కారంపై శ్రద్ధ చూపట్లేదు. అన్నింటినీ నాణ్యంగా పరిష్కరించాలి. ఎన్టీఆర్ జిల్లాలో మండలాల వారీగా సెప్టెంబరు, అక్టోబరులో పరిశీలిస్తే.. 4,174 దరఖాస్తుల్లో సరిగా పరిష్కరించినవి 1,450 మాత్రమే. సరిగా పరిష్కరించనివి 1,099 ఉన్నాయి. ఇంకా పరిష్కరించాల్సినవి 1,600 పైగా ఉన్నాయి' అని చంద్రబాబు పేర్కొన్నారు. 'రెవెన్యూలో ఎప్పటినుంచో వస్తున్న సమస్యలున్నాయి. 22ఎ తదితర సమస్యలు పరిష్కరించాలి. రిజిస్ట్రేషన్ శాఖలో సంతృప్తి శాతం 62 నుంచి 70కి చేరింది. అయినా అవినీతి ఇంకా ఉంది. మున్సిపల్, విద్యుత్తు శాఖల సేవలు మరింత పెరగాలి. అన్నీ ఉచితంగా ఇస్తున్నా సంతృప్తి శాతం కొంతే పెరిగింది. ఇంకా పెరగాలి' అని సూచించారు.

బృందంగా పనిచేద్దాం

వేర్వేరు శాఖలు, హోదాల్లో ఉన్నా చివరి స్థాయిలోని వ్యక్తికీ సంతృప్తికర సేవలందించాలి. సాంకేతికత అందిపుచ్చుకుని మొంథా తుపాను సహాయ కార్యక్రమాలు చేపట్టాం. ముందే ట్రాక్ చేసి సచివాలయాల వరకూ అందరి సేవలూ సమర్థంగా ఉపయోగించుకున్నాం. మనం ఒంటరి కాదు.. అంతా ఒక బృందమే' అని చంద్రబాబు పేర్కొన్నారు. 'వ్యవస్థలో లోపాలు, మారిన పరిస్థితులతో కొందరు రాజీపడి పనిచేస్తున్నారు. అందుకే అనుకున్న ఫలితాలు రావట్లేదు. వైకాపా ప్రభుత్వ విధ్వంసం నుంచి ఇప్పుడిప్పుడే బయట పడుతున్నాం. అలాగని అన్నీ ఒకేసారి పరిష్కరించలేం. మంత్రులు, కార్యదర్శులు, శాఖాధిపతులు, కలెక్టర్లు, ఎస్పీలు సహా గ్రామస్థాయి వరకు అందరం అనుసంధానమై.. సమిష్టిగా పనిచేసి మెరుగైన ఫలితాలు సాధిద్దాం' అని నిర్దేశించారు.

ప్రమాదాలు జరిగినప్పుడే స్పందిస్తే ఎలా?

'ఏదైనా ఘటన జరిగినప్పుడు స్పందిస్తున్నాం. తర్వాత వదిలేస్తున్నాం' అని చంద్రబాబు అసంతృప్తి వెలిబుచ్చారు. 'ఒక ఘటన జరిగాక దానిపై మేధోమథనం చేయాలి. సమగ్ర నిర్వహణ విధానాలు రూపొందించి అమలుచేయాలి. ఎవరు చనిపోయినా పర్వాలేదని వదిలిపెడితే అదే పెద్ద నేరం. మరో రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చేసిన బస్సు హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తోంది. కర్నూలులో దగ్ధమైంది. కొన్ని రాష్ట్రాల్లో తక్కువ రుసుముకే రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. వాటిపై ఆయా రాష్ట్రాల పర్యవేక్షణ లేదు. ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత అధికారులపై ఉంది' అని చంద్రబాబు సూచించారు. 'శ్రీకాకుళం జిల్లాలో దైవ దర్శనానికి వెళ్లినప్పుడు తొక్కిసలాట జరిగింది. క్రౌడ్ మేనేజ్‌మెంట్ బాధ్యత ఎవరిది? అక్కడి సీఐ, ఎస్సైలకు తెలియకుండా అదెలా జరిగింది? విశాఖలో బాణసంచా పేలుడు జరిగింది. మళ్లీ అమలాపురంలో అలాగే జరిగింది. సంఘటన జరగకుండా నియంత్రిస్తున్నామా? జరిగాక ప్రక్షాళన చేస్తున్నామా? లేదా? టెక్నాలజీ ఉపయోగించుకుంటే మనం మరచినా.. అది సహాయం చేస్తుంది' అని పేర్కొన్నారు.

ఆళ్లగడ్డలో కిడ్నాప్ కలకలం

బకాయి చెల్లించక పోవడంతో చికెన్ వ్యాపారి అపహరణ

ఈనాడు, కర్నూలు: ఆళ్లగడ్డలో ఓ చికెన్ వ్యాపారిని కిడ్నాప్ చేయడం సంచలనం సృష్టించింది. వారం కిందట జరిగిన కిడ్నాప్ ఉదంతంపై పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేయడంతో గురువారం వెలుగులోకి వచ్చింది. శిరివెళ్ల మండలం యర్రగుంట్లకు చెందిన ముజాహిద్ గతంలో గ్రామంలో చికెన్ వ్యాపారం చేశారు. హర్షవర్ధన్‌రెడ్డి నుంచి కోళ్లను కొన్నారు. నష్టాలు రావడంతో నాలుగు నెలల కిందట ముజాహిద్ దుకాణాన్ని మూసేశారు. హర్షవర్ధన్‌రెడ్డికి రూ.1.16 లక్షల బకాయి చెల్లించాల్సి ఉంది. డబ్బు ఇవ్వకపోవడంతో మాట్లాడుకుందామంటూ ముజాహిద్‌ను హర్షవర్ధన్‌రెడ్డి ఆళ్లగడ్డ తీసుకెళ్లాడు. అక్కడ అతడిని బంధించి డబ్బు చెల్లిస్తేనే వదిలేస్తానన్నాడు. నిందితులు రెండు రోజులపాటు బాధితుడిని తమ చెరలో ఉంచారు. భయపడిన ముజాహిద్ తన అన్న ఖాజాకు విషయం చెప్పి రూ.40 వేలు చెల్లించే ఏర్పాటుచేశారు. తనను వదిలిస్తే మిగతా డబ్బు ఇస్తానని చెప్పారు. నిందితులు ముజాహిద్‌ను వదిలిపెట్టి ఖాజాను రెండు రోజుల పాటు బందీగా ఉంచుకున్నారు. ఈ ఉదంతంపై శిరివెళ్ల పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేయగా బుధవారం రాత్రి కేసు నమోదైంది. ముజాహిద్ ఫిర్యాదు ఆధారంగా హర్షవర్ధన్‌రెడ్డి, భరత్, హరి, శ్రీను, మనోజ్‌లను పోలీసులు నిందితులుగా చూపారు. వారంతా ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అనుచరులని ప్రచారం సాగుతోంది. ప్రధాన నిందితుడు హర్షవర్ధన్‌రెడ్డి ఎవరి ఆదేశాల మేరకు కిడ్నాప్ చేశాడనేది చర్చనీయాంశమైంది.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రెండోరోజూ ఏసీబీ సోదాలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రెండోరోజూ ఏసీబీ సోదాలు కొనసాగాయి. జగదాంబసెంటర్, పెదగంట్యాడ, మధురవాడ (విశాఖపట్నం జిల్లా), భోగాపురం (విజయనగరం), ఇబ్రహీంపట్నం (ఎన్టీఆర్), నరసరావుపేట (పల్నాడు), ఒంగోలు (ప్రకాశం), స్టోన్‌హౌస్‌పేట (నెల్లూరు), రేణిగుంట (తిరుపతి), రాజంపేట (అన్నమయ్య), చిలమత్తూరు (శ్రీసత్యసాయి), ఆళ్లగడ్డ (నంద్యాల) సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో బుధవారం మధ్యాహ్నం మొదలైన ఏసీబీ బృందాల తనిఖీలు గురువారం రాత్రి వరకూ కొనసాగాయి. ఎనీవేర్ రిజిస్ట్రేషన్లలో పలు ఉల్లంఘనలు, రిజిస్ట్రేషన్లు చేసిన డాక్యుమెంట్లను సంబంధిత వ్యక్తులకు ఇవ్వకుండా తమ వద్దే అట్టిపెట్టుకుని వేధిస్తున్న తీరు, నిషేధిత భూముల రిజిస్ట్రేషన్లు సహా పలు అవకతవకలు, అక్రమాలకు సంబంధించిన కీలక ఆధారాలు సోదాల్లో లభ్యమయ్యాయి. సోదాలు పూర్తయ్యాక పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు.

ఉల్లి రైతులకు త్వరలో ఆర్థిక సాయం: మంత్రి అచ్చెన్నాయుడు

ఈనాడు, అమరావతి: ఉల్లి రైతులకు త్వరలో ఆర్థికసాయం అందిస్తామని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులు నష్టపోకూడదనే ఆలోచనతోనే సీఎం చంద్రబాబు హెక్టారుకు రూ.50 వేల చొప్పున ప్రకటించారని ఓ ప్రకటనలో వివరించారు. కర్నూలు, వైఎస్సార్ కడప జిల్లాల్లో మొత్తం 20,913 మంది రైతులకు రూ.104.57 కోట్ల లబ్ధి కలగనుందని పేర్కొన్నారు. క్వింటాలు ఉల్లి రూ.1,200 చొప్పున మార్కెటింగ్ శాఖ, మార్క్‌ఫెడ్ ద్వారా రూ.18 కోట్ల విలువైన సరకు కొనుగోలు చేశామని, ఇప్పటికి రూ.10 కోట్లు చెల్లించామని వివరించారు. మిగిలిన రూ.8 కోట్లు త్వరలో అందిస్తామన్నారు.

వందేమాతరానికి నేటితో 150 ఏళ్లు

(మొదటి పేజీ తరువాయి)

శుక్రవారం ఉదయం 9.50 గంటలకు బహిరంగ ప్రదేశాల్లో వందేమాతరం గేయాలాపన ఉంటుంది. అన్ని వర్గాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. వందేమాతరం గేయాన్ని నవంబరు 7, 1875న బంకించంద్ర ఛటర్జీ రచించారు. ఈ గేయం.. ఛటర్జీ రాసిన 'ఆనంద్ మఠ్' నవలలో భాగంగా 'బంగ్లాదర్శన్' పత్రికలో ప్రచురితమైంది. "వందేమాతరం 150 అద్భుతమైన సంవత్సరాల వేడుకలను ఘనంగా జరుపుతాం. తరతరాలకు స్ఫూర్తినిచ్చిన గేయమిది. దేశంలో అచంచలమైన దేశభక్తిని రగిలించింది" అని 'ఎక్స్' వేదికగా మోదీ పేర్కొన్నారు.

నేడు కాకినాడలో సంబరాలు

ఈనాడు, అమరావతి: స్వరాజ్యం, స్వదేశీ, సమైక్యత నినాదంతో కాకినాడలోని గాంధీనగర్‌లో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు 'వందేమాతరం 150 ఏళ్ల సంబరాలు' నిర్వహిస్తున్నట్లు భాజపా ఏపీ శాఖ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. వందేమాతరం గీతం 150 ఏళ్లు పూర్తిచేసుకుంటున్న సందర్భంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి అతిథులుగా భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాధామోహన్‌దాస్ అగర్వాల్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు హాజరవుతారని తెలిపింది.

బిహార్‌లో రికార్డుస్థాయి పోలింగ్

(మొదటి పేజీ తరువాయి)

స్వల్ప తోపులాటలు మినహా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని చెప్పారు. గతసారి ఎన్నికల్లో 57.29% పోలింగే నమోదైంది. 2000లో నమోదైన 62.57% పోలింగే ఇంతవరకు రికార్డుగా ఉండేది. తాజా ఎన్నికల్లో ముజఫర్‌పుర్‌లో 70.96%, సమస్తీపుర్‌లో 70.63%, మాధేపురలో 67.21% వైశాలీలో 67.37% పోలింగ్ నమోదైంది. పట్నాలో మాత్రం 57.93% దాటలేదు. ఓట్లు వేసిన ప్రముఖుల్లో ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్; మాజీ ముఖ్యమంత్రులు లాలూప్రసాద్ యాదవ్, రబ్రీదేవి; వారి తనయులు తేజస్వీయాదవ్, తేజ్‌ప్రతాప్ యాదవ్; ఉప ముఖ్యమంత్రులు సామ్రాట్ చౌధరీ, విజయ్‌కుమార్ సిన్హా, పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఉన్నారు. బురఖాలు ధరించినవారి గుర్తింపును సరిచూడటానికి మహిళా వాలంటీర్లను వినియోగించారు. బక్సర్, ఫతుహా, సూర్యగడలలో కొన్ని బూత్‌ల పరిధిలో ఎన్నికలను ఓటర్లు బహిష్కరించారు. మలిదశలో 122 స్థానాలకు ఈ నెల 11న పోలింగ్ జరగాక ఓట్ల లెక్కింపును 14న చేపడతారు.

ఉప ముఖ్యమంత్రి కాన్వాయ్‌పై దాడి

లఖీసరాయ్ నియోజకవర్గంలో తన కాన్వాయ్‌లో ఒక కారుపై ఆర్జేడీ మద్దతుదారులు చెప్పులు, ఆవుపేడ, రాళ్లతో దాడి చేశారని బిహార్ ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హా ఆరోపించారు. ఆ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ఆటవిక రాజ్యం తప్పదనడానికి ఈ ఘటనే నిదర్శనమన్నారు. ఓ పోలింగ్ బూత్‌ను స్వాధీనం చేసుకునేందుకు ఆర్జేడీ చేసిన ప్రయత్నంపై ఫిర్యాదు చేసినప్పటికీ స్థానిక యంత్రాంగం ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఘటనపై వెంటనే చర్యలు తీసుకోవాలని డీజీపీని ఆదేశించినట్లు ఈసీ అధికారులు వెల్లడించారు. ఎన్నికల దృష్ట్యా భారత్-నేపాల్ సరిహద్దు వెంబడి భద్రతను ఇరుదేశాలూ కట్టుదిట్టం చేశాయి.



ఓటు వేసిన సిరా గుర్తు చూపుతున్న బిహార్ సీఎం నీతీశ్ కుమార్

ఇది ప్రజాస్వామ్య విజయం

'బిహార్ ఎన్నికల్లో మునుపెన్నడూ లేనంత రికార్డు స్థాయి పోలింగ్ జరగడం ప్రజాస్వామ్య విజయం. ఎన్నికల యంత్రాంగం పారదర్శకంగా, అంకితభావంతో పనిచేసింది. దేశానికి బిహార్ ఒక దారి చూపింది. ప్రజాస్వామ్యం నెగ్గుతుంది. ఎన్నికల సంఘానికి ఇదొక అపూర్వ ప్రస్థానం.

– జ్ఞానేశ్ కుమార్, ప్రధాన ఎన్నికల కమిషనర్



పట్నాలో ఓటు వేసిన అనంతరం సిరా గుర్తు చూపుతున్న తేజస్వీ యాదవ్, ఆయన సతీమణి రాజశ్రీ యాదవ్, బిహార్ మాజీ సీఎంలు రబ్రీ దేవి, లాలూప్రసాద్ యాదవ్



లఖీసరాయ్‌లో తన వాహనశ్రేణిపై దాడి జరిగిందని పోలీసులకు చెబుతున్న బిహార్ డిప్యూటీ సీఎం విజయ్‌కుమార్ సిన్హా

చెన్నై-విజయవాడ 'వందేభారత్' నరసాపురం వరకు పొడిగింపు

- గుడివాడ, భీమవరంలోనూ హాల్ట్‌లు
- రైల్వే బోర్డు ఆదేశాలు.. త్వరలో సర్వీసు

ఈనాడు, అమరావతి: చెన్నై సెంట్రల్-విజయవాడ మధ్య నడుస్తున్న వందేభారత్ (నంబరు 20677/20678) నరసాపురం వరకు పొడిగిస్తూ రైల్వే బోర్డు గురువారం ఆదేశాలు జారీచేసింది. త్వరలో ఈ సర్వీసు మొదలుకానుంది. ప్రస్తుతం చెన్నై సెంట్రల్‌లో ఉదయం 5.30 గంటలకు బయలుదేరే 'వందేభారత్' రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, తెనాలి స్టేషన్ల మీదుగా విజయవాడకు 12.10కి చేరుతోంది.

✦ పొడిగించిన సర్వీసు 11.45 గంటలకు విజయవాడకు చేరుకొని, అక్కడి నుంచి 11.50కి బయల్దేరి.. మధ్యాహ్నం 12.25కు గుడివాడ, 1.30కి భీమవరం, 2.10కి నరసాపురం చేరుకుంటుంది.

✦ తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 2.50 గంటలకు నరసాపురంలో బయలుదేరి 3.20కి భీమవరం, 4.10కి గుడివాడ, 4.50కి విజయవాడకు చేరుతుంది. ఇక్కడి నుంచి 4.55 గంటలకు బయలుదేరి, సాయంత్రం 5.20కి తెనాలి, 6.30కి ఒంగోలు, రాత్రి 7.40కి నెల్లూరు, 8.50కి గూడూరు, 9.50కు రేణిగుంట మీదుగా రాత్రి 11.45 గంటలకు చెన్నై సెంట్రల్ స్టేషన్‌కు చేరుతుంది.

✦ పొడిగించిన మేరకు అడ్వాన్స్ రిజర్వేషన్ సదుపాయం కల్పించి, నరసాపురంలో ఓ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి, అక్కడి నుంచి ప్రారంభిస్తామని.. ఆ తేదీని కొద్దిరోజుల్లో ప్రకటిస్తామని రైల్వే అధికారులు తెలిపారు.

రఘురామ లేఖ.. శ్రీనివాసవర్మ కృషి

'వందేభారత్'ను భీమవరం మీదుగా నరసాపురం వరకు పొడిగించాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు గతంలో నరసాపురం ఎంపీగా ఉన్నప్పుడు కేంద్ర రైల్వే మంత్రికి వినతి అందజేశారు. ప్రస్తుత నరసాపురం ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపించారు.

కనుల ముందుకు కలల సౌధం

(మొదటి పేజీ తరువాయి)

హడావుడి చేశారు. అక్కడ కనీస వసతులు లేకపోవడంతో లబ్ధిదారులు అక్కడికి వెళ్లి నివాసం ఉండలేదు. ఇప్పుడు సిమెంటు రహదారులు, తాగునీరు సౌకర్యం, మురుగునీటి పారుదల తదితర అన్ని వసతులు కల్పించి లబ్ధిదారులకు అందించనున్నారు.

ఎక్కడికక్కడ లబ్ధిదారులకు అందజేత

ఒక గృహ సముదాయంలో ఇళ్ల నిర్మాణం పూర్తయి, అన్ని మౌలిక వసతుల కల్పన జరిగిన మేరకు ఆయా గృహాలను లబ్ధిదారులకు అప్పగించేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇళ్లలో, ఆయా కాలనీల్లో అన్ని వసతులూ సమకూరాయా? లేదా అనేది అధికారులు ప్రత్యేకంగా పరిశీలిస్తున్నారు. అక్కడి నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన తర్వాత టిడ్కో అధికారులు పూర్తయిన ఇళ్లను అక్కడి మునిసిపల్ కమిషనర్లకు అప్పగించనున్నారు. వారు స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులను సంప్రదించి వారి ఆధ్వర్యంలో టిడ్కో గృహ ప్రవేశాలు చేపట్టనున్నారు. ఇప్పటికే చిత్తూరులోని మురకంబట్టు గృహ సముదాయంలో పూర్తయిన 672 ఇళ్లను మునిసిపల్ కమిషనర్లకు టిడ్కో అధికారులు అప్పగించారు.

హడ్కో నుంచి రూ.5 వేల కోట్ల రుణం


టిడ్కో ఇళ్ల పూర్తికి హడ్కో నుంచి రూ.5 వేల కోట్ల రుణాన్ని సమీకరించేందుకు అధికారులు ఇప్పటికే చర్యలు చేపట్టారు. ఆ సంస్థ కూడా రుణాన్ని అందించేందుకు ముందుకొచ్చింది. వారం రోజుల్లో రూ.2 వేల కోట్లు రుణం అందనుంది. తదుపరి ఇళ్ల పూర్తికి అనుగుణంగా మిగతా మొత్తాన్ని హడ్కో ఇవ్వనుంది.

నవంబర్‌లో లబ్ధిదారులకు అప్పగించనున్న టిడ్కో గృహాలు...

ప్రాంతం	ఇళ్ల సంఖ్య
భీమవరం	1,440
విజయవాడ(జక్కంపూడి)	1,104
పాలకొల్లు	800
చిత్తూరు	672
కర్నూలు(జగన్నాథగట్టు)	488
శ్రీకాళహస్తి	480
కడప	320
ఆదోని	304
నంద్యాల(ఎస్ఆర్‌బీసీ)	272
నెల్లూరు	240
సూళ్లూరుపేట	144
నాయుడుపేట	144
వెంకటగిరి	96
జీవీఎంసీ	48

హరియాణాలో 'ఓటు చోరీ'పై ఏపీలో 17.5 లక్షల సంతకాల సేకరణ: షర్మిల

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్ర మోదీ ఓట్ల దొంగ అంటూ ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆరోపించారు. 'ఓటు చోరీ..' ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో 17.5 లక్షల సంతకాలు సేకరించినట్లు తెలిపారు. గురువారం ఆమె విజయవాడలో విలేకర్లతో మాట్లాడుతూ హరియాణాలో ఓటరు జాబితాలో అక్రమాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బయటపెట్టిన వాస్తవాలు.. ఎన్నికల సంఘం చేస్తున్న దగాపై పేల్చిన బాంబుగా అభివర్ణించారు. హరియాణాలో కాంగ్రెస్‌కు, భాజపాకు 1.18 లక్షల ఓట్లే తేడా అని.. కానీ, అక్కడ దొంగ ఓట్లు 25 లక్షలుగా తేలాయన్నారు. ఎగ్జిట్‌పోల్స్ అన్నీ కాంగ్రెస్ గెలుస్తుందని చెబితే.. ఫలితాలు భాజపాకు అనుకూలంగా రావడం విడ్డూరంగా ఉందన్నారు. భాజపా చేతిలో ఈసీ కీలుబొమ్మగా మారిపోయిందని షర్మిల విమర్శించారు. దేశంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని.. దాన్ని కాపాడేందుకు రాహుల్ నడుం బిగించారని పేర్కొన్నారు. సంతకాల సేకరణతో 'ఓటు చోరీ.. గద్దె చోడ్' నినాదాన్ని గ్రామగ్రామాన తీసుకెళ్తామన్నారు. అన్ని రాష్ట్రాలతో కలిసి ఈ సంతకాలను దిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ప్రదర్శించి, రాష్ట్రపతికి పంపిస్తామన్నారు. అనంతరం సంతకాల పత్రాలున్న మినీ వ్యానును షర్మిల జెండా ఊపి ప్రారంభించారు.



సేకరించిన సంతకాలు చూపుతూ మాట్లాడుతున్న షర్మిల. పక్కన నాయకులు మస్తాన్‌వలీ, జె.డి.శీలం

వసుంధర

vasundhara@eenadu.in

ఆటను సరదాగా నేర్చుకుంది... ఆపై దాన్ని ఇష్టంగా మార్చుకుని కఠోర సాధన చేసింది. ఆర్చరీ క్రీడాకారిణిగా తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంది. అది మొదలు ఆమె ఎక్కుపెట్టిన విల్లుతో పతకాలను కొల్లగొడుతూనే ఉంది. తాజాగా ఆసియా కప్‌లో పాల్గొనేందుకు అర్హత సాధించిన కొండపావులూరి యుక్తశ్రీ గురించి ఇదంతా...

ఆమె గురి ఒలింపిక్స్

యుక్తశ్రీది కృష్ణాజిల్లా బాపులపాడు మండలం మడిచర్ల. చిన్నప్పటి నుంచీ ఆటలంటే ఇష్టమున్న ఆమె... 2018లో వేసవి సెలవుల్లో ఆర్చరీ నేర్చుకోవాలనుకుంది. దాంతో ఆమెను తల్లిదండ్రులు విజయవాడలోని ఓల్గా ఆర్చరీ అకాడమీలో చేర్పించారు. కోచుల పర్యవేక్షణలో ఈ క్రీడపై ఇష్టాన్ని పెంచుకుంది. దాన్నే కెరియర్‌గా మలుచుకుని ఒలింపిక్స్‌లో పతకాన్ని సాధించాలని లక్ష్యాన్ని ఏర్పరచుకుంది. కుమార్తె ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు సూర్యలక్ష్మి, సాయి వెంకటరావు ఆమెకు ప్రోత్సాహాన్నందిస్తూ విజయవాడకే మకాం మార్చేశారు. యుక్త... ఓ పక్క చదువుకుంటూనే విలు విద్యలో నైపుణ్యాలను ఒంటబట్టించుకోవడం ఆరంభించింది.

పతకాలెన్నో...

14 ఏళ్ల వయసులోనే సబ్ జూనియర్ విభాగంలో జాతీయ ఛాంపియన్‌గా నిలిచింది. దాదాపు 20 సంవత్సరాల విరామం తర్వాత ఈ ఘనత సాధించిన తెలుగమ్మాయి యుక్తనే కావడం విశేషం. దీంతో ఈమెలోని ప్రతిభను గుర్తించిన జంషెడ్‌పూర్‌లోని 'టాటా' ఆర్చరీ అకాడమీ శిక్షణకు ఆహ్వానించింది. ఆ తర్వాత అనేక టోర్నీల్లో సత్తా చాటిన యుక్త వచ్చే నెల సౌదీ అరేబియాలో జరగనున్న ఆసియా కప్ (స్టేజ్-3)లో పాల్గొనేందుకు సిద్ధమైంది. హరియాణాలోని సోనిపట్‌లో ఈ నెల 3 నుంచి 6 వరకు నిర్వహించిన ఎంపిక పోటీల్లో మొదటి స్థానంలో నిలిచింది. అలా తొలిసారిగా అంతర్జాతీయ వేదికపై బరిలోకి దిగే అవకాశం దక్కించుకుంది. అంతేకాదు, గత పదేళ్లలో రికర్వ్ విభాగంలో అమ్మాయిల తరఫున ఈ వేదికపై మనదేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారిణి కూడా ఈమే.

- మేడేపూడి వెంకటేశ్వరరావు, హనుమాన్ జంక్షన్


యుక్తశ్రీ



"తల్లి కాబోతున్న, మాతృత్వ సెలవులు తీసుకున్న వాళ్లను పనిలో కొనసాగేందుకు సంస్థలు చేయగలిగినంత సాయం చేయాలి. వారంలో కొన్ని రోజులు ఇంటి నుంచే పనిచేసేలా, పిల్లల్ని ఆఫీసుకు తీసుకొచ్చేలా అవకాశం ఇవ్వాలి. మేం వీటిని పాటిస్తున్నాం. కొద్ది నెలలు వాళ్లకి అవకాశం ఇస్తే, జీవిత కాలం వృత్తిలో కొనసాగుతారు. లేదంటే పెద్దమొత్తంలో మేధో సంపత్తిని వృథా చేసిన వాళ్లమవుతాం.

- రాధికా అగర్వాల్, వ్యవస్థాపకురాలు, షాప్‌క్లూస్, క్రైండ్ లైఫ్

జట్టు ముందర... వెనక మందిర

అమ్మాయిల వరల్డ్ కప్ ఫైనల్... ఎంతోమంది ఉత్కంఠతో చూశారు. మన వాళ్ల విజయాన్ని ఆస్వాదించారు. ఆ ఆనంద తాలూకు ఛాయలు ఇప్పటికీ కనిపిస్తూనే ఉన్నాయి. ఈ మరపురాని విజయం... ఎన్నో ఏళ్ల కష్టం. అంత త్వరగా ఎవరు మాత్రం మర్చిపోగలరు! ఇక్కడ కష్టం ఆడేవాళ్లదేనా? వాళ్లని కన్నవాళ్లు, ప్రోత్సహించినవాళ్లు, వెనకుండి నడిపిన వాళ్లది కూడా! అలాంటి జాబితాలోకే మందిరా బేడీ కూడా వస్తారు. మన అమ్మాయిల్ని నమ్మి, నడిపిన వాళ్లలో ఆమెదీ ప్రధాన పాత్రే మరి!


మందిరా బేడీ



'మీరు సాధించగలరు. మీపై నాకు నమ్మకముంది...' నిరాశలో ఉన్నవారికి ఈ మాటలు వెన్నుతట్టేవారు ఉన్నా చాలు... తిరిగి వాళ్ల ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతారు. ఇప్పుడంటే విమెన్ ప్రీమియర్ లీగ్, స్పాన్సర్‌షిప్‌లు ఉన్నాయి కానీ... ఒకప్పుడు క్రికెట్ అంటే అబ్బాయిల ఆటే. అమ్మాయిల టీమ్‌లో సభ్యులను గుర్తించడమూ కష్టమే అన్నట్టు ఉండేది పరిస్థితి. అయినా ఆట మీద ప్రేమ, నిరూపించుకోవాలన్న జోరుతో కొనసాగింది భారత అమ్మాయిల క్రికెట్ టీమ్. వాళ్లలో ఆ జోరుని గుర్తించారు మందిరా బేడీ. 2000వ సంవత్సరం నాటికి విదేశీ పోటీల్లో పాల్గొనాలంటే మన అమ్మాయిలకు పెద్ద కష్టమే. విమాన టికెట్లు, హోటల్ గదులకు చెల్లించడానికి వాళ్ల వద్ద డబ్బులుండేవి కావు. చందాలు వేసుకునేవారు, ఎన్‌ఆర్ఐల ఇళ్లలో ఆశ్రయం పొందేవారు. వాళ్ల పరిస్థితి గుర్తించి సాయానికి ముందుకొచ్చారు మందిర. ఓ యాడ్‌కి పనిచేయాల్సి వచ్చినా మొత్తాన్ని మన అమ్మాయిల బృందం ఇంగ్లండ్ టూర్‌కి వెళ్లడానికి ఇచ్చేశారు.

ఐసీసీ క్రికెట్ వరల్డ్‌కప్‌కి హోస్ట్‌గా చేసిన తొలి మహిళగా మందిర అందరికీ పరిచయమే. కానీ ఆమె ప్రయాణమేమీ సులువుగా సాగలేదు. పురుషాధిక్య రంగమైన క్రికెట్‌లోకి అడుగు పెట్టడమే సవాలు. దీనికితోడు 'క్రికెట్ గురించి తెలియదు', 'ఈమేం చేయగలదు' అన్న మాటలు, చిన్నచూపు. అన్నింటినీ దాటి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగారామె. కామెంటేటర్‌గా తనదైన ముద్ర వేశారు. నటిగానూ పేరు తెచ్చుకున్నారు. ఆ కష్టం విలువ తెలుసు కాబట్టే, అమ్మాయిల క్రికెట్ బృందాన్ని ప్రోత్సహించారు. వాళ్లకి సమాన ప్రాధాన్యం ఇవ్వాలంటూ పలు వేదికలపైన మాట్లాడారు. కేవలం నాలుగు మాటలు, ఓసారి డబ్బు సాయానికే పరిమితం కాలేదు మందిర. కన్సల్టెంట్‌గా వాళ్ల స్పాన్సర్ చేసేలా బ్రాండ్‌లను ఒప్పించారు. విమెన్స్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూసీఏఐ)కి నిధులు సమకూర్చేలా చేశారు. ఇదంతా ఆమె ఎలాంటి ఆర్భాటం, ప్రచారం లేకుండానే చేసుకుంటూ వెళ్లారు. ఈ తోడ్పాటు నాటి అమ్మాయిల బృందానికి కావాల్సిన భరోసా, భవిష్యత్తుపై ఆశ కల్పించాయన్నది మాత్రం వాస్తవం.

ఎంతోమంది స్టార్స్‌లో దేశంలో అమ్మాయిల క్రికెట్‌పైనా నమ్మకం పెరగడానికి కారణమయ్యారు. ఆ నమ్మకానికి గుర్తే నేడు మన అమ్మాయిలు సాధించిన విజయం. ఆ గెలుపును నేడు దేశమంతా సంబరాలు చేసుకుంటోంది. కొందరు మాత్రం నాడు వెన్నుతట్టిన వారినీ గుర్తు చేసుకుంటున్నారు. ప్రపంచం దృష్టి పడని సమయంలో మన బృందాన్ని నమ్మిన మందిరా బేడీని పొగుడుతున్నారు. 'ప్రతి ఒక్కరి విజయం వెనకా తెరమాటున ఉంటూ... కన్నీళ్లను పంచుకుంటూ ప్రోత్సహించే ఓ వ్యక్తి ఉంటారు. అలాంటి 'అన్‌సంగ్ హీరో' మందిర' అంటూ ఆమె ప్రయత్నాన్ని సోషల్‌మీడియాలో గుర్తు చేసుకుంటున్నారు. నిజమే... ఆమె నేరుగా దేశం తరఫున ఆడలేదు. కానీ దేశం గర్వించదగ్గ పని చేసింది... కాదనగలరా ఎవరైనా?!

వీటికి మాత్రం... వేడినీళ్లే!



వస్త్ర రకాలు, కాలాన్ని బట్టి కొన్నింటిని వేడి, చల్లటి నీళ్లలో ఉతుకుతుంటాం కదా! కానీ కొన్నింటిని మాత్రం కాలంతో సంబంధం లేకుండా వేడినీళ్ల తోనే ఉతకాలని తెలుసా?

- తువాళ్లు... స్నానం చేసేటప్పుడేనా? చెమట పట్టినా, అప్పుడే సబ్బుతో కడిగిన చేతులను తుడవాలన్నా ఇది కావాల్సిందే. ఈక్రమంలో చర్మంలోని మృతకణాలు, క్రిములు, లోషన్ల తాలూకూ అవశేషాలు, ఆరేసినప్పుడు పడే దుమ్మూ ధూళీ... ఇలా దానిమీదకు చేరేవి బోలెడే. దీంతో ఒక్కోసారి గట్టిగా మారతాయి కూడా. అందుకే వీటిని వేడినీళ్లతోనే ఉతకాలి. అప్పుడే ఇవన్నీ తొలగి, తాజాగా మారతాయి.
- దుప్పట్లు... తువాలు కాస్త నయం. పడుకున్నప్పుడు చెమట, క్రిములు, శరీర నూనెలు..ఇలా ఎన్ని దిండు గలేబులు, దుప్పట్ల మీదకు చేరతాయో! ఆ జిడ్డు సూక్ష్మజీవులకు ఆవాసంగానూ మారుతుంది. సరిగ్గా ఉతక్కపోతే అలర్జీలకూ దారి తీయొచ్చు. వీటిని తొలగించాలంటే వేడినీళ్లే మార్గం. ఎప్పుడూ కాకపోయినా ప్రతి రెండు మూడు సార్లకు ఓసారైనా వేడినీళ్లతో ఉతకాల్సిందే! అప్పుడే సూక్ష్మజీవులు నశిస్తాయి, అలర్జీలూ దరిచేరవు.
- క్లీనింగ్ టవళ్లు... గిన్నెల మీద నీటి మరకలు ఉండొద్దన్నా... పొయ్యి మీద నుంచి పాత్రలు దించాలన్నా అంతెందుకు, పొయ్యి గట్టు తుడవాలన్నా మనం ఎక్కువగా వాడేది వస్త్రాలనే! ఎప్పటికప్పుడు ఆరేస్తున్నాం, సబ్బుతో ఉతుకుతున్నాం శుభ్రమయ్యాయి అంటే భ్రమే. తేమ, వంట తాలూకా జిడ్డు వగైరా సూక్ష్మజీవులను ఆకర్షిస్తుంటాయి. వీలైనంతవరకూ వేడినీళ్లలో కాస్త డిటర్జెంట్ కలిపి, నాననివ్వండి. తరవాత సబ్బుతో శుభ్రం చేస్తేనే ధైర్యంగా వాడుకోగలం.
- లోదుస్తులు... చర్మానికి అతి దగ్గరగా అంటిపెట్టుకునేవి ఇవే. ఆరోగ్యంగా ఉండాలంటే వీటి పరిశుభ్రతని అశ్రద్ధ చేయకూడదు. కాబట్టి, వీటి శుభ్రతకీ వేడినీళ్లే వాడాలి. అయితే ఉతికేముందు అవి అందుకు అనుకూలమేనా అన్నది గమనించుకోండి. అలాగే మరిగే నీళ్లే అక్కర్లేదు. గోరువెచ్చని నీటితో ఉతికినా మేలే. కాబట్టి, గమనించుకోండి మరి.

మీకు తెలుసా



భారత మాజీ కెప్టెన్ డయానా ఎడుల్జీ యుక్తవయసులో కాలనీలో క్రికెట్ ఆడుతున్నప్పుడు ముందు దంతాలు నాలుగు విరిగిపోయాయి. అయినా ఆమె క్రికెట్ ఆడటం మానలేదు.

బంగారం - వెండి



06న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,26,380	1,12,150	1,52,190
విజయవాడ	1,20,120	1,11,750	1,51,500
ప్రొద్దుటూరు	1,20,400	1,10,770	1,51,300
రాజమహేంద్రవరం	1,21,910	1,11,750	1,64,000
విశాఖపట్నం	1,21,460	1,11,750	1,50,000
తమిళనాడు	-----	1,11,320	1,65,000

రెండూ ఉండాలి!



చాలామంది తల్లిదండ్రులు తమ చిన్ననాటి అనుభవాలను పిల్లలకు పాఠాలుగా చెబుతుంటారు. ప్రస్తుతం వాళ్లు పెరుగుతున్న ప్రపంచం అందుకు పూర్తిగా భిన్నం. సంప్రదాయాలు వేర్లను ఇస్తే, ఆధునికత కొమ్మల్ని ఇస్తుంది. అందుకే, పిల్లల పెంపకం సంప్రదాయం, ఆధునికతల మేళవింపుగా ఉండాలంటున్నారు నిపుణులు.

పురాణ ఇతిహాసాలే కాదు, మరెన్నో రకాల కథలు, సంప్రదాయాలూ వారసత్వంగా వస్తున్నాయి. వాటిలో వ్యక్తిత్వ నిర్మాణానికి పునాది వేసే అంశాలెన్నో. కాబట్టి వాటిని పిల్లలకు చెబుతుండాలి. సంప్రదాయ ఆటలూ, పండగలతోనూ పిల్లలు నిరాడంబరత, త్యాగం, ఆత్మస్థైర్యం, ధైర్యం, మానవత్వం, పరోపకారం వంటి ఎన్నో గుణాలను అలవరచుకుంటారు.

- పిల్లల పెంపకంలో నేటి తల్లిదండ్రులు ఎదుర్కొనే సవాళ్లు భిన్నం. స్క్రీన్‌టైమ్‌ని తగ్గించడం, చదువుల ఒత్తిడి, కెరియర్ ఎంపిక... ఇలాంటివెన్నో. వీటి గురించి చెప్పాలంటే తల్లిదండ్రులు ముందు వీటిపై లోతైన అవగాహనతో ఉండాలి. పిల్లలతో ఎక్కువ సమయం గడుపుతూ చదువులూ, ఆటలూ, హాబీలూ, సృజనాత్మకత... ఇలా అన్నింటా మీ సహకారం వాళ్లకు అందేలా చూడాలి. యోగా సెషన్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీతం క్లాసులు... తదితరాల్లో తల్లిదండ్రులూ, పెద్దవాళ్లూ పిల్లలతో కలిసి పాల్గొనాలి.
- చాలా స్కూళ్లు ఇప్పుడు పిల్లలతోపాటు తల్లిదండ్రులూ, పెద్దలూ పాల్గొనే కార్యక్రమాల్ని తెస్తున్నాయి. ఆహార ఉత్సవాలు, ఇతర కార్యక్రమాల్లో పెద్దలకూ చోటుంటే తప్పక హాజరవ్వాలి.

అనుకుంది... చేసి చూపించింది!

అసాధ్యాల్ని సుసాధ్యం చేసే శక్తి శ్రమకు ఉంటుంది. కానీ దానికి ఏళ్ల సహనం కావాలి. మానసికంగా, శారీరకంగా మనల్ని మనం సిద్ధం చేసుకోవాలి. ఈ దశలన్నీ దాటొచ్చి రికార్డు సృష్టించిందో 24ఏళ్ల అమ్మాయి. ఆమే పూర్ణిమ. ఈమె సాధించిన విజయం ఏంటంటే...



'నీకు ఇష్టమైన ప్రాంతమేది' అని తండ్రి అడిగిన ప్రశ్నకి... 'అదిగో దూరంగా కొండ మీద భూమి ఆకాశం కలిసినట్లు కనిపిస్తుందే ఆ చోటంటే నాకు చాలా ఇష్టం. ఏదో ఒక రోజు అక్కడికి వెళ్తా' అని సమాధానం ఇచ్చిందట చిన్నారి పూర్ణిమ. ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ జిల్లాలో రైతాల్ గ్రామం ఈమెది. చుట్టూ ఎత్తైన కొండలు. పచ్చదనానికీ, ప్రకృతి సౌందర్యానికీ నెలవు ఈ ప్రాంతం. శీతకాలంలో పర్యటకులతో కిటకిటలాడుతుంది. పూర్ణిమది వ్యవసాయ కుటుంబం. నలుగురు అక్కచెల్లెల్లో చిన్నది ఈమె. చిన్నప్పట్నుంచీ ధైర్యసాహసాలకు పెట్టింది పేరు. కొండలూ గుట్టలూ ఏవైనా అలవోకగా ఎక్కేసేది. అక్కడుండే సమస్యలూ తెలుసు. అందుకే అన్నింటికీ ముందుగానే సిద్ధంగా ఉండే తత్వం పూర్ణిమది. అయితే ఇవన్నీ ఓ వ్యాపకం మాత్రమే. తను కోరుకున్న చోటుకు వెళ్లడానికి నైపుణ్యాలు సంపాదించుకునే ప్రయత్నాలే. తను అనుకున్న రోజు రానే వచ్చింది. కానీ 'అందరిలా నేనూ ట్రెక్కింగ్ చేసుకుంటూ వెళితే నా ప్రత్యేకత ఏముంది. అందరికంటే భిన్నంగా చేయాలి' అనుకుంది. అందుకు ఏం చేయాలా అని ఆలోచిస్తున్న క్రమంలో సైక్లింగ్ ఈమె కంటపడింది. ఏటవాలుగా ఉన్న ఆ పర్వతం మీద సైక్లింగ్ చేసి రికార్డు సృష్టించాలనుకుంది. అందుకు శారీరకంగా, మానసికంగా తనని తాను మలుచుకుంది. ఇంట్లో చెబితే 'ఆ పర్వతం మీద సైక్లింగ్ చేస్తావా? నీకేమన్నా పిచ్చా! పడితే ఇంకేమైనా ఉందా' అంటూ తిట్టారట. కానీ ఆమె వింటేనా, పట్టుదల వీడలేదు. 'రిస్క్ అనిపిస్తే వెనక్కి వచ్చేస్తా' అని హామీ ఇచ్చి బయలుదేరిందట. అనుకున్నట్లుగానే తన కలల ప్రదేశాన్ని చేరుకుంది. సముద్రమట్టానికి 11వేల అడుగులు ఎత్తులో ఉన్న దయారా బుగ్యాల్ మీద సైక్లింగ్ చేసి రికార్డు సృష్టించింది. ఇలా చేసిన మొదటి వ్యక్తి పూర్ణిమానే. అది తెలిసి, పర్యటకుల్ని ఆకర్షించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఇంకేం చేస్తే బాగుంటుందా అన్న దిశగా ఆలోచించడం మొదలుపెట్టిందట స్థానిక ప్రభుత్వం. అన్నట్టు ఈమె పారాగ్లైడింగ్ పైలట్, పర్వతారోహకురాలు కూడా. తాజాగా 6387 మీటర్ల ఎత్తులో ఉన్న 'బ్లాక్ పీక్' శిఖరాన్ని అధిరోహించింది. పారాగ్లైడింగ్‌లోనూ స్థానికంగా చాలా రికార్డులు ఉన్నాయి. 'అమ్మాయిలు తలచుకుంటే సాధించలేనిదంటూ ఏమీ ఉండదు. ఓ లక్ష్యాన్ని పెట్టుకుని దాన్ని సాధించడానికి కావలసిన నైపుణ్యాల్ని సంపాదించుకోవాలంతే' అని చెబుతోంది పూర్ణిమ.

హాస్టల్‌లో చేర్చాకే సమస్య!

మా పాపకి 17 ఏళ్లు. మొదట్నుంచీ నెలసరి మామూలుగానే వచ్చేది. హాస్టల్‌లో చేర్చినప్పట్నుంచీ ఇబ్బందులు మొదలయ్యాయి. క్రమంగా రావాలంటే తన విషయంలో ఏ జాగ్రత్తలు తీసుకోవాలి? – ఓ సోదరి

డియర్ వసుంధర


డా. చీపురుపల్లి వసుంధర
గైనకాలజిస్ట్

తొలిరోజుల్లో బాగానే ఉండి... హాస్టల్‌లో చేర్చాకే నెలసరి సమస్యలు వచ్చాయంటే జీవనశైలిలో తేడా వచ్చిందని అర్థం. శరీరంలో హార్మోనుల విడుదల మన రోజువారీ అలవాట్ల మీదే ఆధారపడి ఉంటుంది. ఎన్నింటికి లేచాం? శరీరానికి ఎంత శ్రమ ఇస్తున్నాం? ఎండ తగులుతోందా? ఏ రకమైన ఆహారం తింటున్నాం? నిద్ర వేళలు... ఇలాంటివన్నీ ప్రభావం చూపేవే. జీవగడియారం సక్రమంగా పనిచేస్తే... నెలసరి కూడా వేళకి వస్తూ ఉంటుంది. నెలసరి క్రమం తప్పింది అంటే... మన రోజువారీ కార్యక్రమాల్లోనూ తేడా వచ్చిందని అర్థం. అమ్మాయి హాస్టల్‌కి వెళ్లింది కాబట్టి... ఇంటి దగ్గర దొరికే ఆరోగ్యకరమైన ఆహారం ఉండకపోవచ్చు. ఒత్తిడి, అర్ధరాత్రి వరకూ చదవడం వంటివాటి వల్ల తిండి, నిద్ర వేళల్లోనూ మార్పు వచ్చుండొచ్చు. ఆడుకోవడానికీ సమయం ఉండదు. ఇవన్నీ హార్మోన్ల విడుదలపై ప్రతికూల ప్రభావం చూపేవే. అలాగని వాళ్లని భవిష్యత్తు నిర్మించుకోకుండా ఆపలేం. కాబట్టి, అమ్మాయిని ఆహారం, నిద్రకి వేళలు పాటించమనండి. ఒత్తిడి, గ్యాడ్జెట్లకు దూరంగా ఉండమనండి. ఆహారం నచ్చకపోతే పండ్లు, ఆరోగ్యకరమైన చిరుతిళ్లు తన వద్ద ఉండేలా చూడండి. నడక, పరుగు వంటివాటికీ సమయం కేటాయించమనండి. చాలావరకూ సమస్య తీరుతుంది. కొన్నిసార్లు ఇతర అంశాలూ కారణమవొచ్చు. సాధారణంగా 17 ఏళ్ల వయసులో కొందరిలో హార్మోనుల్లో హెచ్చుతగ్గులు విపరీతంగా వస్తుంటాయి. అవాంఛితరోమాలు, పీసీఓడీ, వంశపారంపర్యంగా హార్మోనుల పరంగా సమస్యలు వంటివీ ఉండొచ్చు. కాబట్టి, ముందు నిపుణుల సాయంతో కారణమేంటో తెలుసుకోండి. దానికి తగ్గట్టుగా జాగ్రత్తలు తీసుకుంటే సమస్య అదుపులోకి వస్తుంది.

హైనెక్ ఉండగా... నగలెందుకిక!



సోషల్‌మీడియా, వార్తలు... ఆఖరికి మీమ్స్‌లోనూ ఒకటే చర్చ... బంగారం గురించే. దాని ధరేమో రోజురోజుకీ కొండెక్కి కూర్చుంటోంది. దానిపై మనసు పడేదీ, నగల్ని కోరి చేయించుకునే అమ్మాయిలకు ఇది కష్టమే. ఎన్ని ఉన్నా మరొకటి కావాలనే కోరుకుంటారు. వేడుకలేవైనా వస్తే దుస్తులతోపాటు ఏం నగలు కొనాలన్న చర్చ తప్పనిసరి. ఇలా బంగారం ధర పెరుగుతూపోతే ఇక ఎలా కొంటాం? పోనీలే ఉన్నది చాలు. వాటినే పెట్టుకుందామంటే పదే పదే పెట్టాలంటే మనకీ బోరే. అందుకే అమ్మాయిలు ఒక మార్గం కనిపెట్టేశారు... అదే హై నెక్ బ్లవుజులు. ఇవి ఇప్పటివా? ఎప్పట్నుంచో ఉన్నవేగా అంటారా! నిజమే. ఒకప్పుడు ఫ్యాషన్ ప్రపంచాన్ని ఏలినవే. తాజాగా అమ్మాయిల మనసును మళ్లీ దోచేస్తున్నాయి. అయితే స్టైలిష్ లుక్‌తోపాటు రాజసాన్నీ తెచ్చిపెడతాయన్న కారణాన్ని కాదు వాళ్లు చెబుతోంది. చక్కగా మెడను కప్పేస్తాయన్న సమాధానమిస్తున్నారు. అలాగని సాదా చీరలకే ఇలా చేస్తున్నారని అనుకునేరు. పార్టీవేర్ నుంచి పట్టు వరకు అన్నింటికీ ఇదే ఫ్యాషన్ జోడిస్తున్నారు. మరీ సాదాగా ఉంటుందేమో అనిపిస్తే అద్దాలు, రాళ్లు, సీక్విన్లు, త్రెడ్ వర్క్, లేసులతో మెడ, చేతులను తీర్చిదిద్దేస్తున్నారిలా. అచ్చం స్టేట్‌మెంట్ పీస్‌ల్లా అనిపించట్లేదూ? పైగా అందానికి అందం, స్టైలిష్ లుక్ అదనం. కాబట్టే... హైనెక్ ఉండగా నగలతో పనేముందిక అంటూ తాము డిజైన్ చేయించుకున్న బ్లవుజులతో సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. వైరల్ చేస్తున్నారు కూడా. వీటిని చూడగానే అరె... భలేగుందే ఆలోచన అని మీకూ అనిపిస్తోందా? ఇంకేం... ఏ చీర కట్టుకోవాలి? దానికి ఏ నగలు బాగుంటాయన్న కంగారుని పక్కన పెట్టి హైనెక్ బ్లవుజులతో చక్కగా సిద్ధమైపోవచ్చు. కాబట్టి మీరూ మీకు నచ్చిన చీరకి హైనెక్ బ్లవుజులని జోడించేయండి. దీనిలోనూ బోలెడు రకాలు. ఏది అనువైనదో పరిశీలించుకుని ఎంచుకుంటే సరిపోతుంది... ప్రయత్నించేయండి మరి!

ఫ్యాషన్ ఫ్యాషన్





ప్రాణాన్ని నిలబెట్టిన పతకం..!

కష్టపడి సాధించుకున్న దేన్నైనా... ముక్కూ ముఖం తెలియని వాళ్లకి ఇవ్వగలమా. అదీ మన చిరకాలస్వప్నం అయితే అస్సలు ఇవ్వలేం కదా! కానీ మరియా మాగ్డలీనా ఆండ్రెజిక్ దాన్ని ఇచ్చేసింది. ఈమె ఎవరు? ఏం చేసిందో తెలియాలంటే...


వైరల్


మరియా

ఛాంపియన్‌షిప్... ప్రతి క్రీడాకారిణి కల. ఆటలో రాణించడం మొదలుపెట్టిన రోజునుంచే ప్రపంచ వేదికల మీద తమ దేశానికి ప్రాతినిధ్యం వహించాలని కోరుకుంటారు. దానికోసం ఎన్ని కష్టాల్ని అయినా ఓర్చుకుంటారు. ఎన్నో త్యాగాలనూ చేస్తారు. ఎంతో ఒత్తిడినీ అధిగమిస్తారు. మరియా కథ కూడా ఇందుకు అతీతం కాదు. ఈమెది పోలండ్. చిన్నప్పట్నుంచీ ఆటలంటే ఇష్టం. ఆ ఆసక్తితోనే అథ్లెట్ కావాలనుకుంది. జావెలిన్ త్రో మీద పట్టు సాధించి... జావెలిన్ స్టార్‌గా పేరుతెచ్చుకుంది. 2016 రియో ఒలింపిక్స్‌లో పాల్గొని, 2 సెంటీమీటర్ల తేడాతో పతకానికి దూరమైంది. తర్వాత ప్రాక్టీస్‌లో తన భుజానికి గాయమైంది. దాంతో ఏడాది ఆటకు దూరమైంది మరియా. దాన్నుంచి కోలుకుంటోంది అని సంతోషించేలోపే ఎముక క్యాన్సర్ అని తెలిసింది. అయినా నిరాశ దరిచేరనివ్వలేదామె. పరిస్థితుల్ని పట్టుదలతో అధిగమించింది. 2018లో క్యాన్సర్ నుంచి కోలుకుంది. అతి కొద్ది కాలంలోనే టోక్యో ఒలింపిక్స్‌లో స్థానం సంపాదించుకుంది. ఈసారి మరింత కసితో ఆడి, రజతమూ గెలుచుకుంది. ఆమె ఆనందానికి అవధుల్లేవు. ఆ రజతాన్ని తన ఆత్మవిశ్వాసానికి గుర్తుగా భావించారంతా. ఇన్ని ఒడుదొడుకుల తర్వాత సాధించుకున్న పతకం... ఎంతో పదిలంగా దాచుకోవాలి అనుకుంటారు కదా. కానీ మరియా దాన్ని వేలం వేయాలి అనుకుంది. కారణం... పత్రికలో చదివిన ఓ వార్త. '8 నెలల బాలుడు తీవ్ర గుండెజబ్బుతో సహాయం కోసం వేచి చూస్తున్నాడని చదివా. ఆ పిల్లాడికి సహాయం చేయాలని నిర్ణయించుకున్నా. సర్జరీకి రూ.కోటి అవుతుందన్నారు. నా దగ్గర అంత డబ్బు లేదు. అందుకే రజత పతకాన్ని వేలం వేయించా' అంటారు మరియా. దాన్ని జాబ్కా అనే సంస్థ దక్కించుకుంది. కానీ, పతకం హక్కుల్ని మాత్రమే తీసుకుని, దాన్ని ఆమె దగ్గరే ఉండనివ్వమని ఇచ్చేసిందట. ఇది 2021లో జరిగినా... ఇటీవల సామాజిక మాధ్యమాల్లో మళ్లీ వైరలవుతోంది. ఎంతైనా తన విజయాన్ని మరొకరి ప్రాణం రక్షించేందుకు ఉపయోగించిన మరియా కథ స్ఫూర్తిదాయకమే కదూ!

ఛాంపియన్


శీతల్

చరిత్ర సృష్టించిన శీతల్

సాధారణ ఆర్చర్లతో కలిసి ఆసియా కప్‌నకు ఎంపిక

దిల్లీ: రెండు చేతులూ లేకపోయినా ఆర్చరీలో అద్భుత నైపుణ్యం సంపాదించిన పారా క్రీడాకారిణి ప్రపంచ స్థాయికి ఎదిగిన శీతల్ దేవి. పారా ఆర్చరీ కాంపౌండ్ విభాగంలో ప్రపంచ ఛాంపియన్‌గా నిలవడమే కాక అనేక పతకాలు సాధించిన శీతల్.. ఇప్పుడు మరో ఘనతను అందుకుంది. వైకల్యం లేని, సాధారణ ఆర్చర్లతో కలిసి ఆసియా కప్‌లో పోటీ పడేందుకు అర్హత సాధించింది. త్వరలో జెడ్డా వేదికగా జరిగే ఆసియా కప్ స్టేజ్-3లో పోటీ పడే భారత జట్టులో ఆమె చోటు సంపాదించింది. జాతీయ సెలక్షన్ ట్రయల్స్ మహిళల విభాగంలో ఓవరాల్‌గా 3వ స్థానంలో నిలిచిన శీతల్.. ఆసియా కప్‌కు ఎంపికైంది. సాధారణ ఆర్చర్లతో కూడిన భారత జట్టులో ఇలా పారా ప్లేయర్ చోటు సంపాదించడం ఇదే తొలిసారి.


గిల్ 46

లక్ష్యం 168 పరుగులే.. ఆస్ట్రేలియాను సొంతగడ్డపై ఆ స్కోరు ఛేదించకుండా ఆపడం అంత తేలికేం కాదు. అందుకు తగ్గట్లే 8 ఓవర్లకు 62/1తో ఆసీస్ లక్ష్యం దిశగా సాగింది. కానీ అక్కడి నుంచే భారత్ బౌలర్లు కంగారూలను కట్టేశారు. పరుగులు ఆపేసి.. ఒత్తిడి పెంచేసి.. వికెట్ల మీద వికెట్లు తీశారు. 28 పరుగుల తేడాతో 7 వికెట్లు పడగొట్టి నాలుగో టీ20లో భారత్‌కు ఘన విజయాన్ని అందించారు. అక్షర్ ఆల్‌రౌండ్ జోరు చూపిస్తే.. శివమ్ దూబె, వాషింగ్టన్ సుందర్, శుభ్‌మన్ గిల్ గెలుపులో తమ వంతు పాత్ర పోషించారు. ఈ విజయంతో ఐదు టీ20ల సిరీస్‌లో సూర్య సేన 2-1తో ఆధిక్యంలో నిలిచింది.

బంతితో అదరగొట్టిన భారత్


అక్షర్ అర్ష్‌దీప్

కంగారూలను కట్టేశారు

నాలుగో టీ20 కైవసం ● అక్షర్ ఆల్‌రౌండ్ జోరు

గోల్డ్‌కోస్ట్

టీమ్‌ఇండియా సరైన సమయంలో అదరగొట్టింది. ఆస్ట్రేలియాతో నాలుగో టీ20లో 48 పరుగుల తేడాతో గెలిచి సిరీస్ విజయానికి బాటలు వేసుకుంది. గురువారం మొదట భారత్ 8 వికెట్లకు 167 పరుగులు సాధించింది. శుభ్‌మన్ గిల్ (46; 39 బంతుల్లో 4×4, 1×6) టాప్ స్కోరర్. అభిషేక్‌శర్మ (28; 21 బంతుల్లో 3×4, 1×6), అక్షర్ పటేల్ (21 నాటౌట్; 11 బంతుల్లో 1×4, 1×6) మెరిశారు. నాథన్ ఎలిస్ (3/21), ఆడమ్ జంపా (3/45) భారత్‌ను కట్టడి చేశారు. టీమ్‌ఇండియా బౌలర్ల ధాటికి ఛేదనలో ఆస్ట్రేలియా 18.2 ఓవర్లలో 119 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ మిచెల్ మార్ష్ (30; 24 బంతుల్లో 4×4), మాథ్యూ షార్ట్ (25; 19 బంతుల్లో 2×4, 2×6) మాత్రమే రాణించారు. బ్యాట్‌తో విలువైన పరుగులు సాధించిన అక్షర్ బౌలింగ్ (2/20)లోనూ రాణించి ప్రత్యర్థి జోరుకు కళ్లెం వేశాడు. అతడికి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. వాషింగ్టన్ సుందర్ (3/3), శివమ్ దూబె (2/20), బుమ్రా (1/27) సత్తా చాటారు. శనివారం బ్రిస్బేన్‌లో ఆఖరిదైన ఐదో టీ20 జరుగుతుంది.

వికెట్లు టపటపా..: 168 పరుగుల ఛేదనలో ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ మొదలుపెట్టిన తీరుకి.. ముగించిన విధానానికి పొంతనే లేదు. ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన ఆసీస్ ఓపెనర్లు మిచెల్ మార్ష్, మాథ్యూ షార్ట్ స్కోరు పెంచారు. రెండో ఓవర్లో మాథ్యూ షార్ట్ సిక్స్, ఫోర్.. మార్ష్ ఓ ఫోర్ అందుకోవడంతో స్కోరుబోర్డు పరుగులెత్తింది. 4 ఓవర్లకు స్కోరు 35/0. జోరు మీదున్న షార్ట్‌ను అక్షర్ వికెట్ల ముందు దొరకబుచ్చుకుని భారత్‌కు బ్రేక్ ఇచ్చాడు. వికెట్ పడినా ఆసీస్ తగ్గలేదు. ఇంగ్లిస్ (12)ను ఔట్ చేసి అక్షర్ మరోసారి ప్రత్యర్థిని దెబ్బ కొట్టాడు. ఆ వెంటనే ఆసీస్‌కు పెద్ద షాక్ తగిలింది. కుదురుకున్న మార్ష్‌ను దూబె ఔట్ చేశాడు. 11 ఓవర్లకు ఆసీస్ 84/3తో నిలిచింది. అక్కడి నుంచే భారత బౌలర్ల జోరు మొదలైంది. 12వ ఓవర్లో డేవిడ్ (14)ను ఓ షార్ట్ బంతితో దూబె బుట్టలో వేశాడు. ఆ తర్వాత ఆసీస్ ఇన్నింగ్స్ పేకమేడను తలపించింది. గాయం నుంచి కోలుకుని పునరాగమనం చేసిన మ్యాక్స్‌వెల్ (2) విఫలం కాగా.. సుందర్ ఒకే ఓవర్లో (17వ) స్టాయినిస్ (17), బార్ట్‌లెట్ (0) వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. ఆ తర్వాత ఆసీస్ ఇన్నింగ్స్ ఎంతోసేపు సాగలేదు.

సత్తా చాటిన శుభ్‌మన్: అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ పోరాడే స్కోరు చేయగలిగిందంటే అది శుభ్‌మన్ వల్లే. పక్కని పిచ్‌పై ఆసీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్న అతడు ఇన్నింగ్స్‌కు ఇరుసులా నిలిచాడు. మరోవైపు అభిషేక్ కూడా దూకుడుగా ఆడడంతో పవర్ ప్లే ఆఖరికి భారత్ 49/0తో బలమైన స్థితిలో నిలిచింది. ఆడమ్ జంపా రాకతో భారత్ జోరుకు బ్రేక్ పడింది. అతడి బౌలింగ్‌లో సిక్స్ బాదిన అభిషేక్.. మరో షాట్‌కు ప్రయత్నించి పెవిలియన్ చేరాడు. దూబె (22) కూడా ఎక్కువసేపు నిలవలేదు. 14 ఓవర్లకు భారత్ 121/1తో మెరుగైన స్థితిలో నిలిచింది. స్వల్ప వ్యవధిలో శుభ్‌మన్, సూర్య (20) ఔట్ కావడం.. తిలక్ (5), జితేశ్ (3)లను జంపా ఒకే ఓవర్లో పెవిలియన్ చేర్చడం టీమ్‌ఇండియాను దెబ్బ తీసింది. ఆఖరి ఓవర్లో అక్షర్ ఓ సిక్స్, ఫోర్ అందుకోవడంతో స్కోరు 160 దాటింది.

భారత్ ఇన్నింగ్స్: అభిషేక్ శర్మ (సి) డేవిడ్ (బి) జంపా 28; శుభ్‌మన్ (బి) ఎలిస్ 46; శివమ్ దూబె (బి) ఎలిస్ 22; సూర్యకుమార్ (సి) డేవిడ్ (బి) బార్ట్‌లెట్ 20; తిలక్ వర్మ (సి) ఇంగ్లిస్ (బి) జంపా 5; జితేశ్ శర్మ ఎల్బీ (బి) జంపా 3; సుందర్ (సి) కునెమన్ (బి) ఎలిస్ 12; అక్షర్ పటేల్ నాటౌట్ 21; అర్ష్‌దీప్ (సి) ఫిలిప్ (బి) స్టాయినిస్ 0; వరుణ్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 9 **మొత్తం:** (20 ఓవర్లలో 8 వికెట్లకు) **167; వికెట్ల పతనం:** 1-56, 2-88, 3-121, 4-125, 5-131, 6-136, 7-152, 8-164; **బౌలింగ్:** డ్వార్షుయిస్ 4-0-31-0; బార్ట్‌లెట్ 4-0-26-1; నాథన్ ఎలిస్ 4-0-21-3; స్టాయినిస్ 4-0-41-1; ఆడమ్ జంపా 4-0-45-3

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: మార్ష్ (సి) అర్ష్‌దీప్ (బి) దూబె 30; షార్ట్ ఎల్బీ (బి) అక్షర్ 25; ఇంగ్లిస్ (బి) అక్షర్ 12; డేవిడ్ (సి) సూర్యకుమార్ (బి) దూబె 14; ఫిలిప్ (సి) వరుణ్ (బి) అర్ష్‌దీప్ 10; స్టాయినిస్ ఎల్బీ (బి) సుందర్ 17; మ్యాక్స్‌వెల్ (బి) వరుణ్ 2; డ్వార్షుయిస్ (బి) బుమ్రా 5; బార్ట్‌లెట్ (సి) అండ్ (బి) సుందర్ 0; ఎలిస్ నాటౌట్ 2; జంపా (సి) శుభ్‌మన్ (బి) సుందర్ 0; ఎక్స్‌ట్రాలు 2 **మొత్తం:** (18.2 ఓవర్లలో ఆలౌట్) 119; **వికెట్ల పతనం:** 1-37, 2-67, 3-70, 4-91, 5-98, 6-103, 7-116, 8-116, 9-118; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 3-0-22-1; బుమ్రా 4-0-27-1; వరుణ్ 4-0-26-1; అక్షర్ 4-0-20-2; దూబె 2-0-20-2; సుందర్ 1.2-0-3-3


మహిళల వన్డే ప్రపంచకప్ గెలిచిన భారత జట్టును రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అభినందించారు. హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం ముర్మును గురువారం రాష్ట్రపతి భవన్‌లో కలిసింది. ఈ సందర్భంగా జట్టు సభ్యులు.. తమ సంతకాలతో కూడిన జెర్సీని ఆమెకు బహూకరించారు.


మహిళల వన్డే ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో సభ్యురాలైన తెలుగమ్మాయి అరుంధతి రెడ్డి గురువారం రాత్రి హైదరాబాద్ చేరుకుంది. శంషాబాద్ విమానాశ్రయంలో ఆమెకు అభిమానులు ఘనస్వాగతం పలికారు.
– శంషాబాద్, న్యూస్‌టుడే

వందేళ్ల మన హాకీ

హాకీ.. క్రీడల్లో ఈ దేశానికి ఓ గుర్తింపును తెచ్చింది. ఎన్నో మధుర జ్ఞాపకాలనిచ్చింది. క్రీడా సంస్కృతి లేక ఆటల్లో భారత్ అట్టడుగున ఉన్న రోజుల్లో భారాన్నంతా మోస్తూ.. ఒలింపిక్స్‌లో మెరుపులతో ఈ దేశం గర్వపడేలా చేసింది. ఎందరో దిగ్గజాలను అందించింది. కాలక్రమంలో, క్రికెట్ హవాలో ప్రాభవం కోల్పోయింది కానీ.. ఒకప్పుడు హాకీ ఈ దేశపు గుండె చప్పుడు. ఇప్పటికీ ఆ ఆటపై క్రీడాభిమానుల్లో ఎంతో అభిమానం ఉంది. అది అనధికారిక జాతీయ క్రీడ. భారత్. అంతర్జాతీయ హాకీ (1925-2025)లో అడుగుపెట్టి ఈ ఏడాదికి వందేళ్లు పూర్తయింది. శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ప్రభుత్వం, హాకీ ఇండియా సిద్ధమవుతున్న నేపథ్యంలో భారత హాకీ ప్రస్థానాన్ని ఓసారి చూసొద్దాం..!


1936 ఒలింపిక్స్‌లో ధ్యాన్‌చంద్ బృందం

ఈనాడు క్రీడావిభాగం


అది 1925 నవంబరు నెల. భారత హాకీకి తనకంటూ ఓ పాలకవర్గాన్ని ఏర్పాటు చేయడం కోసం కొంత మంది వ్యక్తులు గ్వాలియర్‌లో సమావేశమయ్యారు. అలా మొదలైందే ఐహెచ్ఎఫ్ (ప్రస్తుతం హాకీ ఇండియా). ఐహెచ్ఎఫ్ 1925 నవంబరు 7న అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్).. గుర్తింపు పొందింది. ఆ తర్వాత హాకీలో భారత్ ఎదిగిన తీరు అసాధారణం. మూడేళ్లలోనే ఆమ్‌స్టర్‌డామ్ (1928) క్రీడలు వచ్చాయి. అక్కడ ఒలింపిక్ స్వర్ణం గెలిచిన భారత్.. హాకీ సూపర్‌పవర్ రాకను ఘనంగా చాటింది. ఆ తర్వాత తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. నిజానికి బ్రిటిష్ పాలనలో భారత్‌కు చేరిన హాకీ.. కొద్ది కాలంలోనే ప్రజాదరణ పొందింది. కానీ దానికి ఓ వ్యవస్థ అంటూ లేదు. హాకీ సమాఖ్య ఏర్పాటుతో దేశంలో హాకీకి గొప్ప ఊతం లభించినట్లయింది. భారత్ ఇప్పటివరకు హాకీలో 8 స్వర్ణాలు సహా 13 ఒలింపిక్ పతకాలు గెలుచుకుంది. ఓసారి ప్రపంచకప్‌ను సొంతం చేసుకుంది.

వెనుకబడిందిలా..: తన ఆటతో ప్రపంచాన్ని మంత్రముగ్ధుల్ని చేసిన భారత హాకీ జట్టు క్రమంగా తన ప్రమాణాలను, ప్రాభవాన్ని కోల్పోయింది. 1975లో ఎఫ్ఐహెచ్ ఆస్ట్రో టర్ఫ్‌ను ప్రవేశ పెట్టడం కూడా భారత్ ఆట దెబ్బతినడానికి కారణమైంది. టర్ఫ్‌లపై ఆడడానికి జట్టు త్వరగా అలవాటు పడలేకపోయింది. నిధుల లేమి కారణంగా హాకీ సమాఖ్య చాలా ఆలస్యంగా దేశంలో హాకీ టర్ఫ్‌లు ఏర్పాటు చేసింది. వాటిపై ఆడడంలో భారత్ నైపుణ్యం సాధించేలోపు మిగతా జట్లు చాలా ముందుకెళ్లిపోయాయని మాజీ ఆటగాడు జగ్బీర్ సింగ్ ఓ సందర్భంలో వ్యాఖ్యానించాడు. వేగంగా బలహీనపడ్డ భారత జట్టు 1984 నుంచి 2016 వరకు ఒక్క ఒలింపిక్ పతకం కూడా నెగ్గలేకపోయింది. ఆ కాలంలో ఒక్కసారే గ్రూప్ దశ దాటింది. 2008లో అసలు ఒలింపిక్స్‌కే అర్హత సాధించకపోవడం భారత హాకీ చరిత్రలో ఒక మాయని మచ్చ. మరోవైపు క్రికెట్ దేశంలో క్రికెట్‌పై మోజు పెరగడంతో హాకీ మరింత నిరాదరణకు గురైంది. అయితే గత పదేళ్లలో మన హాకీ పునరుత్థానం మొదలైంది. 2016లో పతకం నెగ్గలేకపోయినా.. క్వార్టర్‌ఫైనల్ చేరడం ఒక సానుకూలాంశం. 40 దశాబ్దాల కరవుకు ముగింపు పలుకుతూ 2020 టోక్యో ఒలింపిక్స్‌లో పతకం (కాంస్యం) గెలిచిన భారత జట్టు.. పూర్వ వైభవం దిశగా తొలి అడుగు వేసింది. తిరిగి పారిస్ (2024) క్రీడల్లోనూ కాంస్యాన్ని గెలిచి ఉజ్వల భవిష్యత్తుపై ఆశలు రేపింది. ఇప్పుడు భారత్ నంబర్ వన్ జట్టు కాకపోయినా.. బలమైన ప్రత్యర్థే. గత కొన్నేళ్లుగా నిలకడగా రాణిస్తోన్న మన జట్టు ఒకప్పటి జోరును అందుకోవాలని ఆశిద్దాం.

స్వర్ణ యుగం

హాకీలో భారత్ ప్రదర్శించిన ఆధిపత్యం మరే క్రీడలోనూ ప్రదర్శించలేదంటే అతిశయోక్తి కాదు. 1926లో తన తొలి అంతర్జాతీయ పర్యటనలో భారత్.. న్యూజిలాండ్‌లో 21 మ్యాచ్‌ల్లో 18 గెలిచింది. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ అరంగేట్రం చేసింది ఇక్కడే. తొలి పర్యటన మొదలు.. భారత జట్టు వెనుదిరిగి చూసుకోలేదు. సంపూర్ణ ఆధిపత్యంతో ఎలాంటి జట్లనైనా చిత్తు చేస్తూ ప్రపంచ హాకీని శాసించింది. 1928 నుంచి 1956 వకు వరుసగా ఆరు ఒలింపిక్ స్వర్ణ పతకాలు సాధించింది. మరే ఈ జట్టు ఇలాంటి ఆధిత్యాన్ని ప్రదర్శించలేకపోయింది. 1964, 1980 ఒలింపిక్స్‌లోనూ విజేతగా నిలిచిన భారత్.. 1975లో ప్రపంచకప్‌ను సొంతం చేసుకుంది. ధ్యాన్‌చంద్, బల్బీర్‌సింగ్ వంటి దిగ్గజ ఆటగాళ్లు ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్నారు.


2024 ఒలింపిక్స్‌లో కాంస్యం నెగ్గిన భారత హాకీ జట్టు


'ఈనాడు'తో హాకీ ట్రిపుల్ ఒలింపియన్ ముకేశ్ కుమార్

భవిష్యత్తు బంగారమే!

ఒకప్పుడు భారత్ అంటే హాకీ.. హాకీ అంటే భారత్. 1928 నుంచి 1980 వరకు ఎనిమిది ఒలింపిక్స్‌లలో విజేతగా నిలిచిన చరిత్ర భారత్‌ది. అక్కడ్నుంచి సుమారు నాలుగు దశాబ్దాల పాటు హాకీలో భారత్ పరిస్థితి తీసికట్టే. దశాబ్దాల ఆధిపత్యానికి తెరపడిన సంధి కాలమది. కష్ట కాలంలో జట్టును ముందుకు నడిపిన ఆటగాళ్లలో ట్రిపుల్ ఒలింపియన్ ముకేశ్‌కుమార్ ఒకడు. వందేళ్ల పండుగ వేళ.. భారత హాకీ చరిత్రపై ముకేశ్ విశ్లేషణ 'ఈనాడు'కు ప్రత్యేకం. వివరాలు అతని మాటల్లోనే..

ఈనాడు – హైదరాబాద్

భారత వందేళ్ల హాకీ చరిత్రకు పునాది వేసింది బ్రిటీష్ వాళ్లే. అప్పటి ఆర్మీలోని ఆంగ్లేయులు హాకీ ఆడేవాళ్లు. అలా సైన్యంలో ఉన్న మనోళ్లకు కూడా హాకీ నేర్పించారు. 1925 నుంచి ఆంగ్లేయులు, మనోళ్లు భారత్ తరపున ఆడుతూ వచ్చారు. కాబట్టి మనదేశంలో సైన్యం నుంచే హాకీ పుట్టింది. హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ కూడా సైన్యం నుంచి వచ్చాడు. అప్పట్లో గ్రాస్ హాకీ ఉండింది. బూట్లు, మరే ఇతర రక్షణ కవచాలు లేకుండా వుడెన్ స్టిక్‌తో సాధారణ హాకీ ఆడేవాళ్లు. బంతిని నేరుగా ఆడాలి. మలుపులు తిరగొద్దు. వెనుక నుంచి బంతిని తీసుకోవాలని ప్రయత్నిస్తే ఫౌల్ అవుతుంది. అక్కడ్నుంచి ప్రతి దశాబ్దానికి ఆట మారుతూ వచ్చింది. ధ్యాన్‌చంద్ కాలంలో సముద్ర మార్గాన ఇతర దేశాలకు వెళ్లేవాళ్లు. ప్రయాణానికి 10 రోజులు పట్టేది. దీంతో పడవలోనే సాధన చేసేవాళ్లు. అప్పట్లో ధ్యాన్‌చంద్‌ను మించిన ఆటగాడు లేడు. ఒక్కో స్థానానికి ఆరేడు మంది పోటీలో ఉండేవాళ్లు. అందుకే 1928, 1932, 1936, 1948, 1952, 1956, 1964, 1980 ఒలింపిక్స్‌లలో భారత్ ఛాంపియన్‌గా నిలిచింది. 1980 మాస్కో ఒలింపిక్స్‌లో చాలా ఐరోపా దేశాలు పాల్గొనకపోవడంతో భాస్కరన్ సారథ్యంలోని భారత జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. అయితే 1976లోనే భారత హాకీ పతనం ప్రారంభమైంది. కారణం.. ఆస్ట్రో టర్ఫ్. వుడెన్ నుంచి కార్బన్, ఫైబర్ స్టిక్స్ వచ్చాయి. ఐరోపా పవర్ గేమ్ మొదలైంది. నిజానికి ఆస్ట్రో టర్ఫ్‌ను ఫుట్‌బాల్ కోసం తయారు చేశారు. సింథటిక్ కోర్టుపై నీళ్లు పోసి సాధన చేసేవాళ్లు. కానీ గాయాలు అవుతుండటంతో ఆస్ట్రో టర్ఫ్‌ను హాకీకి మార్చారు. అందులో ఐరోపా దేశాలు పవర్ గేమ్‌తో ఆధిపత్యం ప్రారంభించాయి. 1985లో దేశంలో అయిదు చోట్ల మాత్రమే ఆస్ట్రో టర్ఫ్‌లు ఉండేవి. 1988లో భారత జూనియర్ జట్టుకు ఎంపికయ్యే వరకు నాకు ఆ టర్ఫ్ అనుభవమే లేదు. 2, 3 శిక్షణ శిబిరాల తర్వాత బంతిపై నియంత్రణ వచ్చింది. అప్పటికే జర్మనీ, నెదర్లాండ్స్, ఆస్ట్రేలియా వంటి దేశాలు కంప్యూటర్ విశ్లేషణతో వ్యూహాలు రచించేవి. ధన్‌రాజ్‌ను, నన్ను కట్టడి చేసేందుకు ప్రణాళికలతో వచ్చేవి. మనం వార్మప్ అయ్యేలోపే గోల్స్ వేసేవాళ్లు.

గత పదేళ్లలో భారత హాకీలో చాలా మార్పొచ్చింది. విదేశీ కోచ్‌లు రావడంతో పురోగతి సాధించింది. ఐరోపా వ్యూహాలు ఆచరణలోకి వచ్చాయి. ప్రణాళికలు, కోర్ ఎక్సర్‌సైజులు, ప్రతిరోజూ వెయిట్ ట్రెయినింగ్, డ్రాగ్ ఫ్లికింగ్ టెక్నిక్, పవర్ గేమ్ తీసుకొచ్చారు. గతంలో ఒక ఆటగాడు 70 నిమిషాలు ఆడేవాడు. విదేశీ కోచ్‌లు వచ్చాక మైదానంలో ఒక ఆటగాడు ఏకధాటిగా 10 నిమిషాలు మాత్రమే ఉండాలి. 5-10 నిమిషాల విశ్రాంతి తర్వాత మళ్లీ మైదానంలో అడుగుపెట్టాలి. మైదానంలోకి వచ్చే ఆటగాడు ఫలానా పొజిషన్‌లో ఆడాలన్న పద్ధతికి శాశ్వతంగా ముగింపు పలికారు. ఎవరు.. ఎక్కడైనా ఆడాలి. బంతి దొరికిందంటే గోల్ పోస్ట్ వైపు దూసుకెళ్లాలి. ఐరోపా తరహా ఆటతీరుకు అలవాటు పడేందుకు భారత పురుషులు, మహిళల జట్లకు ఆరేడేళ్లు పట్టింది. ఫలితమే వరుసగా రెండు ఒలింపిక్స్ (2020 టోక్యో, 2024 పారిస్)లలో భారత పురుషుల జట్టు కాంస్య పతకాలు సాధించింది. పారిస్‌లో మహిళల జట్టుకు త్రుటిలో కాంస్యం చేజారింది. హాకీ ఇండియా అధ్యక్షుడిగా మాజీ ఆటగాడు దిలీప్ టిర్కీ ఉండటం శుభపరిణామం. మనోళ్లకు స్థానిక కోచ్‌లంటే భయం ఉండదు. కాబట్టి మళ్లీ విదేశీ కోచ్‌లను నియమించే అవకాశాల్ని పరిశీలించాలి. దాంతోపాటు జూనియర్ జట్లకు వీలైనన్ని ఎక్కువ టోర్నీల్లో ఆడించాలి. ఇండియా-ఎతో బీసీసీఐ ప్రయోగాలు చేస్తున్నట్లుగా అగ్రశ్రేణి జట్లతో ఇండియా-ఎ తరచుగా ఆడటం వల్ల నాణ్యమైన జూనియర్ క్రికెటర్లు భారత జట్టుకు అందుబాటులోకి వస్తున్నారు. హాకీలోనూ ఇదే సూత్రం అనుసరిస్తే భవిష్యత్తు బంగారమే.

స్మృతికి 3.5 కోట్లు

ముంబయి: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ముంబయి ఇండియన్స్ ఆల్‌రౌండర్ నాట్ సీవర్, బెంగళూరు కెప్టెన్ స్మృతి మంధాన, గుజరాత్ జెయింట్స్ ఆల్‌రౌండర్ ఆష్లీ గార్డ్‌నర్‌లను ఆయా జట్లు గరిష్ఠ ధర (రూ.3.5 కోట్లు)కు అట్టిపెట్టుకున్నాయి. ఈ నెల 27న 2026 డబ్ల్యూపీఎల్ వేలం నేపథ్యంలో అట్టిపెట్టుకున్న ప్లేయర్ల జాబితాను ప్రకటించారు. హర్మన్‌ప్రీత్‌ను ముంబయి రూ.2.5 కోట్లతో కొనసాగించనుంది. రిచాను రూ.2.75 కోట్లతో ఆర్సీబీ నిలబెట్టుకుంది. యూపీ వారియర్స్.. దీప్తి శర్మను వదిలేసి, శ్వేత సెహ్రావత్ (రూ.50 లక్షలు)ను కొనసాగించింది.

మూడో రౌండ్లో విదిత్

పంజిమ్: చెస్ ప్రపంచకప్‌లో విదిత్ గుజరాతి మూడో రౌండ్లోకి ప్రవేశించాడు. అతడు 2.5-1.5తో అర్జెంటీనా యువ కెరటం ఒరో ఫాస్టినో పోరాటానికి చెక్ పెట్టాడు. తొలి రెండు గేమ్‌లు డ్రా కాగా.. టైబ్రేక్‌లో విదిత్ విజయం సాధించాడు. నిహాల్ సరీన్, మురళీ కార్తికేయన్ ఇంటిముఖం పట్టగా.. ఎస్ఎల్.నారాయణన్ మూడో రౌండ్ చేరాడు.

జురెల్ అజేయ శతకం

ఇండియా–ఎ 255


జురెల్

బెంగళూరు: టీమ్‌ఇండియా బ్యాటర్ ధ్రువ్ జురెల్ (132 నాటౌట్; 175 బంతుల్లో 12×4, 4×6) అదరగొట్టాడు. దక్షిణాఫ్రికా-ఎతో జరుగుతున్న రెండో అనధికారిక టెస్టులో అజేయ సెంచరీతో సత్తాచాటాడు. గురువారం ప్రారంభమైన ఈ నాలుగు రోజుల మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఇండియా-ఎ తొలి ఇన్నింగ్స్‌లో 77.1 ఓవర్లలో 255 పరుగులకు ఆలౌటైంది. రాహుల్ (19), అభిమన్యు (0), సుదర్శన్ (17), పడిక్కల్ (5), పంత్ (24) విఫలమవడంతో ఇండియా-ఎ 86 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో చిక్కుకుంది. అయితే జురెల్ క్రీజులో పాతుకుపోయి జట్టుకు గౌరవప్రదమైన స్కోరును అందించాడు. దక్షిణాఫ్రికా-ఎ బౌలర్లలో వాన్‌వూరెన్ (4/52), సుబ్రయెన్ (2/73), మోరెకి (2/52) రాణించారు.

రూ.11.14 కోట్ల విలువైన ధావన్, రైనా ఆస్తులు జప్తు

అక్రమ బెట్టింగ్ కేసు

దిల్లీ: మాజీ క్రికెటర్లు శిఖర్ ధావన్, సురేశ్ రైనాకు సంబంధించిన రూ.11.14 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జప్తు చేసింది. ఓ అక్రమ బెట్టింగ్ సైట్‌తో ముడిపడి ఉన్న మనీ లాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ ఈ చర్య తీసుకుంది. ఈ మేరకు మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద దిల్లీలో రూ.4.5 కోట్లు విలువ చేసే ధావన్ స్థలాన్ని, రూ.6.64 కోట్ల విలువైన రైనా మ్యూచువల్ ఫండ్‌ను జప్తు చేసినట్లు ఈడీ తెలిపింది.

2026 టీ20 ప్రపంచకప్ ఫైనల్ అహ్మదాబాద్‌లో..

దిల్లీ: వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్‌నకు అహ్మదాబాద్, దిల్లీ, చెన్నై, కోల్‌కతా, ముంబయిలను వేదికలుగా బీసీసీఐ ఖరారు చేసింది. ఇంకొన్ని వేదికలను ఎంపిక చేయాల్సి వుంది. ఫైనల్‌కు అహ్మదాబాద్ ఆతిథ్యమివ్వనుంది. మొత్తం 10 వేదికల్లో టోర్నీని నిర్వహిస్తారు. 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్ కూడా అహ్మదాబాద్‌లోనే జరిగింది. 2026 ఫిబ్రవరి-మార్చిలో జరిగే ప్రపంచకప్‌నకు భారత్‌తో పాటు శ్రీలంక ఆతిథ్యమివ్వనుంది. పాకిస్థాన్ తన మ్యాచ్‌లన్నింటినీ శ్రీలంకలోనే ఆడుతుంది. టోర్నీ పూర్తి షెడ్యూలును ఐసీసీ వచ్చే వారం ప్రకటిస్తుందని సమాచారం.

విండీస్ పోరాడినా..

రెండో టీ20లో కివీస్‌దే విజయం

ఆక్లాండ్: వెస్టిండీస్‌తో రెండో టీ20లో 3 పరుగులతో నెగ్గిన న్యూజిలాండ్ 5 మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. చాప్‌మన్ (78) చెలరేగడంతో మొదట కివీస్ 5 వికెట్ల నష్టానికి 207 పరుగులు సాధించింది. ఛేదనలో వెస్టిండీస్ 204 పరుగులు చేసింది. రోమన్ పావెల్ (45), షెఫర్డ్ (34), అథనేజ్ (33), ఫోర్డ్ (29 నాటౌట్) రాణించారు. ఛేదనలో ఓ దశలో విండీస్ 93 పరుగులకే 6 వికెట్లు కోల్పోగా.. షెఫర్డ్, ఫోర్డ్‌లతో కలిసి పావెల్ గొప్పగా పోరాడాడు. కానీ చివరి 3 బంతుల్లో 6 పరుగులే అవసరం కాగా.. పావెల్‌ను ఔట్ చేసిన జేమీసన్, ఆఖరి రెండు బంతుల్లో రెండు పరుగులే ఇచ్చి కివీస్‌ను గెలిపించాడు.

సంకల్పం తోడుంటే..

పూరిల్లే స్టార్టప్





జీవనపోరాటానికి దృఢ సంకల్పం తోడైతే పూరిల్లు కూడా స్టార్టప్ సంస్థగా మారుతుంది. ఝార్ఖండ్‌లోని పలామూ జిల్లా బసరియా గ్రామానికి చెందిన దేవంతిదేవి, శారదాదేవి దీన్ని రుజువు చేశారు. భర్తలు దినసరి కూలీలుగా పనిచేస్తుండగా.. ఈ మహిళలు ఇద్దరూ ఝార్ఖండ్ ప్రభుత్వ ఆధ్వర్యంలోని స్వయం సహాయక సంఘంలో చేరారు. గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం సాయంతో లక్క గాజులు, సౌందర్య సాధనాల తయారీలో నైపుణ్యం సాధించారు. 2024లో రూ.70 వేల రుణం తీసుకొని తమ పూరింటి ఆవరణలో గాజుల తయారీ యూనిట్‌ను ప్రారంభించారు. ఏడాది వ్యవధిలోనే ఝార్ఖండ్ గ్రామీణ సంతల్లో వీరి ఉత్పత్తులకు మహిళల నుంచి మంచి డిమాండు ఏర్పడింది. తొలి ఏడాదే దాదాపు రూ.4 లక్షల ఆదాయం వచ్చింది. ఇప్పుడు స్థానిక మహిళలకు కూడా వీరు ఉపాధి కల్పించి పని నేర్పుతున్నారు.

ప్రపంచ రికార్డుగా

50 అడుగుల సైకత నావ

ఒడిశాకు చెందిన ప్రముఖ సైకత శిల్పి 'పద్మశ్రీ' సుదర్శన్ పట్నాయక్ కటక్‌లో నిర్వహిస్తున్న ప్రఖ్యాత బలి యాత్ర - 2025లో భాగంగా రూపొందించిన 50 అడుగుల సైకత నావతో 'వరల్డ్ రికార్డ్స్ బుక్ ఆఫ్ ఇండియా'లో చోటు సాధించారు. 30 అడుగుల వెడల్పు ఉన్న ఈ నావ తయారీకి 240 టన్నుల ఇసుక, 12,000 జామకాయలు, 500 టెంకాయలు, 1,100 ప్రమిదలు వాడారు. కళ్లు చెదిరే ఈ కళాఖండాన్ని కేవలం ఆరు గంటల్లో సిద్ధం చేయడం విశేషం. ప్రారంభ వేడుకకు కటక్ జిల్లా కలెక్టర్ దత్తాత్రేయ శిందే ముఖ్య అతిథిగా విచ్చేశారు. 'వరల్డ్ రికార్డ్స్' న్యాయ నిర్ణేతలు సుదర్శన్ పట్నాయక్‌కు ధ్రువపత్రాన్ని అందజేశారు. ఈ సంప్రదాయ కళకు ప్రపంచవ్యాప్త గుర్తింపు రావడం ఒడిశాకు గర్వకారణమని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.



రూ.1,800 కోట్ల భూమి.. రూ.300 కోట్లకే స్వాధీనం!

చిక్కుల్లో అజిత్ పవార్ కుమారుడు




పుణె: మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ కుమారుడు పార్థ్ పవార్‌కు చెందిన కంపెనీ.. పుణెలో భూ ఒప్పందంలో అవకతవకలకు పాల్పడిందన్న ఆరోపణలపై సీఎం దేవేంద్ర ఫడణవీస్ స్పందించారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందానికి రెవెన్యూ అదనపు చీఫ్ సెక్రెటరీ వికాస్ ఖర్గే అధ్యక్షత వహించనున్నారు. రూ.1,800 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని పార్థ్ పవార్‌కు చెందిన అమేడియా ఎంటర్‌ప్రైజెస్ రూ.300 కోట్లకే విక్రయించినట్లు విపక్షాలు ఆరోపించాయి. దీంతో ఈ కేసులో భాగమైన తహశీల్దార్, సబ్ రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేసిన రాష్ట్రప్రభుత్వం.. తాజాగా దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. పుణెలోని ముద్వా ప్రాంతంలో ఉన్న 40 ఎకరాల 'మహర్ వతన్' భూమిని, నిరభ్యంతర (ఎన్‌వోసీ) పత్రం లేకుండానే అమేడియా ఎంటర్‌ప్రైజెస్‌కు విక్రయించినట్లు అధికారులు తెలిపారు. అది ప్రభుత్వ భూమి అని, దాన్ని ప్రభుత్వేతర సంస్థలకు అమ్మడానికి వీల్లేదని వివరించారు.

ఏ నేరం కింద అరెస్టు చేసినా...

కారణం తెలపాల్సిందే!

- లిఖితపూర్వకంగా... అదీ నిందితుడికి అర్థమయ్యే భాషలోనే
- సుప్రీంకోర్టు కీలక తీర్పు



దిల్లీ: అరెస్టైన నిందితుల రాజ్యాంగ హక్కులను కాపాడేలా సర్వోన్నత న్యాయస్థానం గురువారం కీలక తీర్పు వెలువరించింది. ఏయే నేరం కింద అరెస్టు చేసిన నిందితులకైనా సరే.. ఎలాంటి మినహాయింపులు లేకుండా అరెస్టుకు గల కారణాలను లిఖితపూర్వకంగా, వారికి అర్థమయ్యే భాషలోనే తెలియజేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్‌ల ధర్మాసనం స్పష్టం చేసింది. అరెస్టు సమయంలో అలా తెలియజేయడం సాధ్యంకాకుంటే.. రిమాండ్ కోసం న్యాయమూర్తి ఎదుట నిందితుడిని హాజరుపర్చడానికి కనీసం రెండు గంటల ముందుగానైనా తెలపాల్సి ఉంటుంది. కారణాన్ని లిఖితపూర్వంగా తెలియజేయనందుకు అరెస్టు చెల్లదని ప్రకటించకుండా ఉండాలంటే సహేతుకమైన సమయంలోనైనా దానిని అందజేయాల్సి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. ఈ మేరకు జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్ 52 పేజీల తీర్పు రాశారు. అరెస్టుకు కారణాలను సాధ్యమైనంత త్వరగా నిందితుడికి తెలియజేయాలని రాజ్యాంగ అధికరణం 22(1) విస్పష్టంగా చెబుతోందన్నారు. 'ఇది ఏదో లాంఛనప్రాయంగా పాటించాల్సిన విధానం కాదు. వ్యక్తిస్వేచ్ఛ రాజ్యాంగం హామీ ఇచ్చిన రక్షణ' అని న్యాయమూర్తి స్పష్టం చేశారు. తనను ఎందుకు అరెస్టు చేశారో నిందితుడికి తెలియకపోతే ఆ అవకాశం ఉండదన్నారు. సకాలంలో కారణాన్ని తెలియజేయకపోతే ఆ అరెస్టును, అతని రిమాండ్‌ను చట్టవిరుద్ధం చర్యగా పేర్కొంటూ నిందితుడిని విడుదల చేయాలని కోర్టు ఆదేశించవచ్చని తెలిపారు. ఈ తీర్పు ప్రతులను అన్ని హైకోర్టుల రిజిస్ట్రార్ జనరళ్లకు, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు పంపించాలని సుప్రీంకోర్టు రిజిస్ట్రీని ధర్మాసనం ఆదేశించింది. ముంబయిలో 2024లో బీఎండబ్ల్యూ కారుకు సంబంధించిన హిట్ అండ్ రన్ కేసులో నిందితుడు మిహిర్ రాజేశ్ షా దాఖలు చేసిన అప్పీలుపై ఈ తీర్పు వెలువడింది.



మిస్ యూనివర్స్ పోటీల్లో వాగ్వాదం

వాకౌట్ చేసిన అందాల భామలు

ఇంటర్నెట్‌డెస్క్: థాయ్‌లాండ్‌లో జరుగుతున్న 74వ మిస్ యూనివర్స్ పోటీల్లో హైడ్రామా చోటుచేసుకుంది. ఆతిథ్య దేశానికి చెందిన ఓ అధికారికి, మెక్సికో సుందరికి మధ్య చోటుచేసుకున్న వాగ్వాదం అందాల భామల వాకౌట్‌కు దారితీసింది. వివాదం మొత్తం ఫేస్‌బుక్‌లో లైవ్‌స్ట్రీమ్ కావడంతో నెట్టింట్లో వైరల్‌గా మారింది. ఇంతకీ ఏం జరిగిందంటే..? మిస్ యూనివర్స్ పోటీల్లో మిస్ మెక్సికో ఫాతిమా బోష్ ఒక షూట్‌కు హాజరుకాలేదు. దీంతో మిస్ యూనివర్స్ థాయ్‌లాండ్ నేషనల్ డైరెక్టర్, ఆర్గనైజేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నవాత్ ఆమె గైర్హాజరుపై ప్రశ్నించారు. 'తెలివి తక్కువ వ్యక్తి' అనే అర్థం వచ్చేలా ఆమెను నిందించారు. ఇది ఇద్దరి మధ్య వాగ్వాదానికి దారితీసింది. దాంతో ఫాతిమాతో పాటు మరి కొన్ని దేశాలకు చెందిన పోటీదారులు వేదిక నుంచి వాకౌట్ చేశారు.

జేఎన్‌యూ ఎన్నికల్లో వామపక్ష విద్యార్థి సంఘాల జయకేతనం

దిల్లీ: దేశ రాజధానిలోని ప్రతిష్ఠాత్మక జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ (జేఎన్‌యూ) విద్యార్థి సంఘ ఎన్నికల్లో వామపక్ష విద్యార్థి సంఘాల కూటమి విజయం సాధించింది. అధ్యక్ష, ఉపాధ్యక్షులతోసహా నాలుగు పదవులను దక్కించుకుంది. ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్‌ఏ), స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌ఎఫ్‌ఐ), డెమోక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్‌ల (డీఎస్‌ఎఫ్) కూటమి గురువారం వెల్లడైన ఫలితాల్లో క్లీన్‌స్వీప్ చేసింది. అదితీ మిశ్ర అధ్యక్షురాలిగా, కిళకూట్ గోపికాబాబు ఉపాధ్యక్షుడిగా, ప్రధానకార్యదర్శిగా సునీల్ యాదవ్, సంయుక్త కార్యదర్శిగా డానిష్ అలీ గెలుపొందారు.

ఆర్జేడీ, కాంగ్రెస్‌లకు రాముడంటే ద్వేషం

- చొరబాటుదారులంటే ప్రేమ
- బిహార్ ఎన్నికల ప్రచారసభల్లో మోదీ



అరరియా సభలో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

భాగల్‌పుర్/అరరియా: దేశంలోకి అక్రమంగా చొరబడినవారిని ఆర్జేడీ, కాంగ్రెస్ రక్షిస్తున్నాయని, వారిని ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకుంటున్నాయని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. బిహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మోదీ గురువారం భాగల్‌పుర్, అరరియా జిల్లాల్లో జరిగిన సభల్లో ప్రసంగించారు. జంగిల్‌రాజ్‌ను రాష్ట్రంలోకి రానివ్వొద్దని మోదీ పిలుపునిచ్చారు. డబుల్ ఇంజిన్ సర్కారు రాష్ట్రానికి అవసరమని చెప్పారు. చొరబాటుదారులపై కూటమి నేతలు ప్రేమ చూపిస్తున్నారని ఆరోపించారు. రాముడంటే విపక్ష నేతలకు ద్వేషమని, అందుకే అయోధ్యను వారు దర్శించడం లేదని అన్నారు. అయోధ్యలో వాల్మీకి, శబరి ఆలయాలకు ఇండియా కూటమి నేతలు వెళ్లడం లేదని, దీన్ని బట్టి వారికి దళితులు, బలహీన వర్గాలపై కూడా ప్రేమ లేదని స్పష్టమవుతోందని పేర్కొన్నారు.

కూలిన విమానాలపై పూటకో మాట

- ఐదని, ఏడని, ఇప్పుడు ఎనిమిదని..
- భారత్, పాక్ ఘర్షణపై ట్రంప్ వ్యాఖ్యల గందరగోళం



మయామీ: భారత్, పాకిస్థాన్ ఘర్షణపై నిలకడలేని వ్యాఖ్యలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కొనసాగిస్తూనే ఉన్నారు. ఈ ఘర్షణ సమయంలో తొలుత 5 విమానాలు కూలాయన్న ఆయన ఇటీవల ఏడు కూలినట్లు చెప్పారు. మళ్లీ ఇప్పుడు.. 8 విమానాలు కూలాయన్నారు. అయితే అవి ఎవరికి చెందినవనే విషయాన్ని మాత్రం ఆయన ఏనాడూ వెల్లడించలేదు. ఫ్లోరిడాలోని మయామీలో బుధవారం అమెరికా బిజినెస్ ఫోరం సమావేశంలో ట్రంప్ మాట్లాడారు. 'నేను రెండు దేశాలతో వాణిజ్య బంధం కుదుర్చుకునే ప్రక్రియ మధ్యలో ఉండగా.. అవి యుద్ధానికి వెళ్తున్నాయని విన్నా. ఈ ఘర్షణలో 7 విమానాలు నేలకూలాయి. మరొకటి తీవ్రంగా దెబ్బతింది. మొత్తంగా 8 విమానాలు ధ్వంసమయ్యాయి. యుద్ధం కొనసాగిస్తే వాణిజ్య ఒప్పందాన్ని ఆపేస్తానని హెచ్చరించా. దీంతో శాంతికి అంగీకరించాయి. 8 నెలల్లో 8 యుద్ధాలను ఆపా' అని ఆయన పేర్కొన్నారు.

మళ్లీ రెచ్చిపోయిన సోమాలీ సముద్రపు దొంగలు

దుబాయ్: సోమాలియా తీరంలో మెషీన్‌గన్‌లు, రాకెట్ చోదిత గ్రనేడ్‌లు చేతపట్టిన సముద్రపు దొంగలు భారత్ నుంచి దక్షిణాఫ్రికాకు వెళ్తున్న ఒక నౌకను స్వాధీనం చేసుకున్నారు. వీరిని సోమాలీ సముద్రపు దొంగలుగా భావిస్తున్నారు. సముద్రపు దొంగలు ఈ ప్రాంతంలో తిరిగి పుంజుకున్నారనడానికి ఈ ఘటన ఉదాహరణ అని అధికారులు పేర్కొన్నారు. సముద్రపు దొంగల నిర్వాకాన్ని భద్రతా సంస్థ అంబ్రే ధ్రువీకరించింది. మాల్టా దేశానికి చెందిన జెండా కలిగి ఉన్న ఈ నౌక భారత్‌లోని సిక్కా నుంచి దక్షిణాఫ్రికాలోని డర్బన్‌కు వెళ్తోంది. గత కొన్ని రోజులుగా ఈ ప్రాంతంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సముద్రపు దొంగలు ఇటీవల ఇరాన్‌కు చెందిన చేపల పడవను స్వాధీనం చేసుకున్నారు! తాజాగా సముద్రపు దొంగల చేజిక్కిన నౌకలో 24 మంది సిబ్బంది ఉన్నారని సముద్ర నౌకల భద్రతా సంస్థ డయాప్లస్ గ్రూపు పేర్కొంది.



అలాంటి బంధాలు నిలబడవు

ఈ ప్రపంచంలో ఏ బంధమూ పరిపూర్ణం కాదు. భాగస్వాములిద్దరిలోనూ ఏవో కొన్ని లోపాలుంటాయి. వాటిని పరస్పరం అంగీకరించడంతో పాటు ఆ లోపాలను అధిగమించడానికి కలిసికట్టుగా ప్రయత్నించేవారే తమ బంధాన్ని పటిష్ఠంగా మార్చుకుంటారు. ఆ చొరవ కనిపించని బంధాలు ఎక్కువ కాలం నిలబడవు.

– మార్క్ మాన్సన్, రచయిత

నా పాత ఫొటో అలా వాడారా?

- ఇదేం పిచ్చి పని?: బ్రెజిల్ మోడల్ లారిసా



దిల్లీ: హరియాణా ఓటర్ల జాబితాలో ఉన్నట్లు చెబుతున్న ఫొటో పాతదని, బహుశా అది తనకు 18-20 ఏళ్లు ఉన్నప్పుడు తీసుకున్నట్లు కనిపిస్తోందని బ్రెజిల్ మోడల్ లారిసా నేరీ చెప్పారు. హరియాణా ఓటర్ల జాబితాలో రాయ్ శాసనసభ నియోజకవర్గంలో ఆమె ఫొటోను 10 బూత్‌లలో 22 సార్లు ఉపయోగించి దొంగ ఓట్లు సృష్టించారని లోక్‌సభ విపక్షనేత రాహుల్‌గాంధీ బుధవారం ఆరోపించిన విషయం తెలిసిందే. ఫొటోను కూడా ఆయన ప్రదర్శించడంతో ఆమె వివరాల కోసం నెటిజన్లు అన్వేషిస్తున్నారు. దీనిపై ఆమె ఒక వీడియో సందేశం ద్వారా స్పందించారు. "స్టాక్ ఇమేజ్ ప్లాట్‌ఫామ్ నుంచి నా ఫొటోను కొనుగోలు చేసి ఉంటారనుకుంటా. నన్ను భారతీయురాలిగా పేర్కొంటూ స్కాంలో భాగం చేశారు. ఇదేం పిచ్చి పని? భారత రాజకీయాలతో నాకు ఎలాంటి సంబంధం లేదు. నేను బ్రెజిల్‌కు చెందిన డిజిటల్ ఇన్‌ఫ్లుయెన్సర్‌ను. తాజా పరిణామంతో నాకు చాలామంది ఫోన్లు చేస్తున్నారు. ఇంటర్వ్యూలు కావాలంటున్నారు. వారికి సమాధానం చెప్పలేకపోతున్నా.." అని లారిసా వివరణ ఇచ్చారు. ఈ వీడియోను కాంగ్రెస్ సామాజిక మాధ్యమాల విభాగాధిపతి సుప్రియా శ్రీనేత్ షేర్ చేశారు.

జవాన్ల కులమతాలు అడిగిన రాహుల్ సిగ్గుపడాలి: అమిత్ షా



మోతిహారీ, మధుబనీ: దేశ సైన్యంలో జవాన్ల కులమతాలు తెలుసుకోవాలని లోక్‌సభ విపక్షనేత రాహుల్‌గాంధీ ప్రయత్నించారని, దానికి ఆయన సిగ్గుపడాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్నారు. గురువారం బిహార్‌లోని మధుబనీ, పశ్చిమ చంపారణ్, మోతిహారీ జిల్లాల్లో ఎన్నికల ప్రచార సభల్లో ఆయన ప్రసంగించారు. వెనుకబడినవారు, గిరిజనులు, మైనారిటీలకు సైనిక దళాల్లో, న్యాయవ్యవస్థలో, అధికార యంత్రాంగంలో, ప్రైవేటు సంస్థల్లో తక్కువ ప్రాతినిధ్యమే ఉంటోందని, జనాభాలో 10% ఉన్నవారు వీటిని నియంత్రిస్తుంటారని రాహుల్ మంగళవారం వ్యాఖ్యానించారు. దానిని మంత్రి తోసిపుచ్చుతూ- సైనికుల కులమతాల ప్రాతిపదికన ఎలాంటి వివక్ష చూపబోమని స్పష్టంచేశారు. అక్రమ వలసదారులు మన ఉద్యోగాలను లాక్కోవడంతోపాటు దేశానికి భద్రతపరమైన సవాళ్లు విసురుతారని, బిహార్‌ను చొరబాటుదారుల రహితంగా మార్చడం కోసం శాసనసభ ఎన్నికలు జరుగుతున్నాయని చెప్పారు. మోదీ సర్కారు బిహార్ వాసుల కోసం మఖానా బోర్డు ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ.. లాలూ అండ్ కో గానీ అధికారంలోకి వస్తే చొరబాటుదారుల్ని ప్రోత్సహించే బోర్డు ఏర్పాటవుతుందని వ్యంగ్యంగా అన్నారు. "బిహార్‌లో ఆటవిక రాజ్యం రాకుండా మోదీ, నీతీశ్‌కుమార్ మాత్రమే ఆపగలరు. మహాగఠ్‌బంధన్ నెగ్గితే చంపారణ్ కాస్తా మినీ చంబల్ అవుతుంది. ఇందిరాగాంధీ అవినీతిని, ఎమర్జెన్సీని వ్యతిరేకించిన రాష్ట్రం బిహార్. ఇలాంటి రాష్ట్రాన్ని ఆర్జేడీ సాయంతో పాలించాలని కాంగ్రెస్ అనుకుంటోంది. రాబోయే రెండేళ్లలో సీతామఢీలో భారీగా నిర్మించబోయే సీతమ్మ ఆలయాన్ని రాహుల్, లాలూ ఆపలేరు" అని స్పష్టంచేశారు.

అవాస్తవం.. ఆ మీడియా నివేదికలను ఖండించిన మమత

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఓ బూత్‌స్థాయి అధికారి (బీఎల్‌వో) నుంచి ఎస్ఐఆర్ ఫారాలను అందుకోవడానికి స్వయంగా మమతా ఇంటి బయటకు వచ్చారంటూ పలు మీడియా సంస్థలు నివేదించాయి. దీనిపై గురువారం మమతా స్పందించారు. ఈ వార్తలన్నీ పూర్తి అవాస్తవాలని, తప్పుదారి పట్టించేలా ఉన్నాయని, ఉద్దేశపూర్వక చర్యలు అంటూ కొట్టిపారేశారు. "ఎన్నికల విధుల్లో భాగంగా ఓ బీఎల్‌వో బుధవారం మా కాలానికి వచ్చాడు. నా నివాసంలోని కార్యాలయానికి వచ్చి ఎంత మంది ఓటర్లు ఉన్నారని తెలుసుకుని ఫారాలను అందజేసి వెళ్లారు. దీన్ని వక్రీకరిస్తూ.. .నేనే స్వయంగా నివాసం నుంచి బయటకు వచ్చి సర్ ఫారాలను అందుకున్నట్లు ఓ వర్గానికి చెందిన మీడియా ప్రచురించింది. ఇది పూర్తిగా అవాస్తవం" అని ఫేస్‌బుక్ వేదికగా మమతా తెలిపారు.

ఉష్ణోగ్రతలో రికార్డు సృష్టించనున్న 2025

దిల్లీ: ఇప్పటి వరకూ నమోదైన ప్రపంచ వాతావరణ చరిత్రలో 2025 సంవత్సరం రెండో లేదా మూడో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన సంవత్సరంగా రికార్డు సృష్టించబోతోందని ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంవో) గురువారం వెల్లడించింది. 2015 నుంచి 2025 వరకూ సాగిన 11 సంవత్సరాలను గడచిన 176 సంవత్సరాల్లో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన దశాబ్దిగా గుర్తించనున్నారు. ఈ సంవత్సరం జనవరి నుంచి ఆగస్టు వరకూ ఉపరితల సమీప ఉష్ణోగ్రత పారిశ్రామిక యుగారంభానికి పూర్వం నమోదైన ఉష్ణోగ్రత కన్నా 1.42 డిగ్రీల సెల్సియస్ ఎక్కువని గుర్తించారు. పారిస్ ఒప్పందం ప్రపంచ భూతాప వృద్ధిని 2 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువ స్థాయిలో ఉంచాలని, భూతాప వృద్ధిని 1.5 డిగ్రీలకే పరిమితం చేయాలని పేర్కొంది. 2024 సంవత్సరం ఇప్పటి వరకూ నమోదైన అత్యధిక వేడి కలిగిన సంవత్సరంగా రికార్డుకెక్కిందని డబ్ల్యూఎంవో పేర్కొంది. 'ఎల్ నినో' ప్రభావం కారణంగా 2023, 2024 సంవత్సరాల్లో పెరిగిన భౌగోళిక ఉష్ణోగ్రతలు 2025లో 'లా నినా' ప్రభావం కారణంగా తగ్గుముఖం పట్టాయని పేర్కొంది.

జస్టిస్ బాలకృష్ణన్ కమిషన్ పదవీకాలం మరో 6 నెలలు పొడిగింపు



ఈనాడు, దిల్లీ: మతం మారిన దళితులకు ఎస్సీ హోదా కల్పించే అంశంపై అధ్యయనం చేయడానికి సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె.జి.బాలకృష్ణన్ నేతృత్వంలో ఏర్పాటైన కమిషన్ పదవీ కాలాన్ని కేంద్రం ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. ఈమేరకు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారశాఖ గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. తొలుత నిర్ణయించిన గడువు ప్రకారం ఈ కమిషన్ 2024 అక్టోబరు 10నాటికే కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలి. నిర్దేశిత పని పూర్తికాలేదన్న ఉద్దేశంతో గడువును 2025 అక్టోబరు 10వ తేదీ వరకూ ప్రభుత్వం పొడిగించింది. నివేదికకు తుది రూపునివ్వడానికి మరికొంత సమయం కావాలన్న కమిషన్ విజ్ఞప్తితో పదవీకాలాన్ని వచ్చే ఏడాది ఏప్రిల్ 10 వరకు కేంద్రం తాజాగా పొడిగించింది.

బిహార్‌లో ఓట్లచోరీని అడ్డుకోండి

- ఎన్నికల సభల్లో రాహుల్, ప్రియాంక పిలుపు



పూర్ణియా బహిరంగ సభలో ప్రసంగిస్తున్న రాహుల్‌గాంధీ

పూర్ణియా: అధికార బలాన్ని ఉపయోగించి బిహార్‌లో ఓట్లచోరీకి పాల్పడేందుకు భాజపా ప్రయత్నిస్తుందని, దానిని యువత అడ్డుకోవాలని కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ పిలుపునిచ్చారు. ఇది యువత బాధ్యత అని చెప్పారు. గురువారం బిహార్ ఎన్నికల ప్రచార సభల్లో వారు పాల్గొన్నారు. ప్రతిచోటా ఓట్లచోరీ ద్వారానే భాజపా విజయాలు సాధిస్తోందని పూర్ణియాలో రాహుల్ ఆరోపించారు. "భాజపా, ఎన్నికల సంఘం (ఈసీ) కలిసి హరియాణా ఎన్నికల్లో ఓట్లు చోరీచేశాయని ప్రపంచానికి చూపించాం. అచ్చం అలాగే బిహార్‌లోనూ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. గత ఎన్నికల్లో కూడా ఇక్కడ ఓట్లను దొంగిలించారు. మీరందరూ పోలింగ్ బూత్‌లో అత్యంత అప్రమత్తంగా ఉండాలి" అని రాహుల్ కోరారు. "బిహార్‌లోని జంగిల్‌రాజ్ గురించి నీతీశ్ మాట్లాడుతున్నారు. నిజానికి ప్రధాని మోదీ, షా దిల్లీతోపాటు దేశవ్యాప్తంగా అలాంటి పరిస్థితిని తెచ్చారు. ఈడీ, సీబీఐ, ఐటీ దాడులతోపాటు నిరుద్యోగాన్ని పెంచి, విద్వేషాలు రెచ్చగొట్టి, దేశంలో జంగిల్‌రాజ్‌ను సృష్టించారు. ప్రజల మధ్య విద్వేషాన్ని రెచ్చగొడుతున్నారు" అని ఆరోపించారు.

అరరియాలో రాహుల్ పర్యటిస్తున్నప్పుడు అర్ష్ నవాజ్ అనే యువ వ్లాగర్ ఆయనతో కరచాలనం చేసి మాట్లాడారు. పెళ్లి ఎప్పుడని నవాజ్ ప్రశ్నించగా, తన పని పూర్తయ్యాక చేసుకుంటానని రాహుల్ నవ్వుతూ బదులిచ్చారు.

పదవీ విరమణ తర్వాత మీకు సాఫీగా ఉండదు

సీతామఢీ, పశ్చిమ చంపారణ్ జిల్లాల్లో నిర్వహించిన ఎన్నికల ర్యాలీల్లో ప్రియాంక ప్రసంగించారు. ప్రజాస్వామ్య హక్కులను, రాజ్యాంగాన్ని బలహీనపరిచేందుకు ఈసీ సైతం ప్రభుత్వంతో కుమ్మక్కైందని ఆరోపించారు. 'రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని ఈసీ ఉన్నతాధికారులు అపహాస్యం చేస్తున్నారు. పదవీ విరమణ తర్వాత తమ జీవితం సాఫీగా ఉంటుందని వారు భావిస్తున్నారేమో.. అది జరగదు' అని స్పష్టంచేశారు. బిహార్‌లో ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగితే ఎన్డీయే ప్రభుత్వం కుప్పకూలి.. పేదలు, మహిళలు, యువత కోసం పనిచేసే సర్కారు కొలువుదీరుతుందని చెప్పారు. తన తండ్రి రాజీవ్ గాంధీ ప్రధాని స్థానంలో ఉన్నా ఆయన్ను ప్రజలు నేరుగా ప్రశ్నించేటంత స్వేచ్ఛ ఉండేదని అన్నారు. అమేఠీలో ఒక మహిళ ఇలాగే కుళాయిపై హామీ గురించి నిలదీసి ప్రశ్నించిన సందర్భం గుర్తుందని, ఇప్పుడు అలాంటి వాతావరణమే లేదని చెప్పారు.

తిరగేయకపోతే రోటీ మాడిపోతుంది: లాలు

పట్నా: బిహార్‌లో ప్రభుత్వాన్ని మార్చాలని ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్ పిలుపునిచ్చారు. 'పెనంపై రోటీని అటూఇటూ తిరగేస్తూ ఉండాలి. ఒకేపక్క కాలిస్తే మాడిపోతుంది. 20 ఏళ్లు చాలా దీర్ఘకాలం. ఇప్పుడు బిహార్‌ను సరికొత్తగా మార్చాలంటే తేజస్వి సర్కారు రావాల్సిన అవసరం ఉంది' అని చెప్పారు. తన భార్య రబ్రీదేవి, తనయుడు తేజస్వీ యాదవ్‌లతో కలిసి గురువారం ఓటు వేసిన అనంతరం ఆ ఫొటోతో ఆయన 'ఎక్స్'లో ఈ మేరకు వ్యాఖ్యానించారు.

8న ఓట్లచోరీ వ్యతిరేక కార్యక్రమాలు

కాంగ్రెస్ రాష్ట్ర కార్యాలయాల్లో నిర్వహణకు ఏర్పాట్లు

దిల్లీ: భాజపాకు వ్యతిరేకంగా చేపట్టిన 'ఓట్ చోర్, గద్దీ ఛోడ్' ఉద్యమ ప్రచార మొదటి విడతను ముగించేందుకు.. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాల్లోని పార్టీ ప్రధాన కార్యాలయాల్లో శనివారం (నవంబరు 8)కాంగ్రెస్ వివిధ కార్యక్రమాలు నిర్వహించనుంది. ఈ విషయాన్ని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ ఎక్స్ వేదికగా ప్రకటించారు. ఈ కార్యక్రమాలకు పార్టీ సీనియర్ నాయకులు హాజరవుతారని తెలిపారు. ఓటు చోరీకి వ్యతిరేకంగా ఐదు కోట్ల మంది ప్రజల నుంచి సంతకాలను సేకరించామని, ఈ జాబితాను త్వరలోనే రాష్ట్రపతికి అందిస్తామని పేర్కొన్నారు.

కామెరూన్ అధ్యక్షుడిగా ప్రమాణం చేసిన 92 ఏళ్ల పాల్ బియా

యౌండే: ఆఫ్రికాలోని కామెరూన్ దేశం అధ్యక్షుడిగా గత నెలలో గెలుపొందిన 92 ఏళ్ల పాల్ బియా.. గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా దేశ ఐక్యత, స్థిరత్వం, శ్రేయస్సు కోసం పనిచేస్తానని ఆయన పార్లమెంట్ సాక్షిగా ప్రమాణం చేశారు. ఏడేళ్లపాటు ఆయన అధికారంలో ఉండనున్నారు.

భారత ట్రావెల్ ఇన్‌ఫ్లుయెన్సర్.. అమెరికాలో మృతి



అనునయ్ సూద్

ఇంటర్నెట్ డెస్క్: భారత్‌కు చెందిన ప్రముఖ ట్రావెల్ ఇన్‌ఫ్లుయెన్సర్, ఫొటోగ్రాఫర్ అనునయ్ సూద్ (32) మృతి చెందారు. ఈ విషయాన్ని ఆయన కుటుంబసభ్యులు సామాజిక మాధ్యమంలో గురువారం వెల్లడించారు. దీంతో ఆయన అభిమానులు, ఫాలోవర్లు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అనునయ్ మృతికి గల కారణాలు తెలియరాలేదు. చివరిసారిగా ఆయన లాస్ వేగాస్ నుంచి సోషల్ మీడియా పోస్ట్ చేశారు. దీంతో అమెరికాలోనే మృతి చెందినట్లు సమాచారం. నొయిడాకు చెందిన అనునయ్ సూద్ దుబాయ్ కేంద్రంగా ట్రావెల్ ఫొటోగ్రాఫర్‌గా పేరొందారు. ఇప్పటివరకు 46 దేశాల్లో పర్యటించినట్లు తన ఇన్‌స్టా బయోలో పేర్కొన్నారు. ఆయకు ఇన్‌స్టాలో 14 లక్షల మంది, యూట్యూబ్‌లో 3.80 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. 2022, 2023, 2024లో వరుసగా మూడుసార్లు ఫోర్బ్స్ ఇండియా టాప్ 100 డిజిటల్ స్టార్స్ జాబితాలో చోటు దక్కించుకున్నారు.

తండ్రి అరెస్టు.. ఏడాది పాపతో కారు తరలింపు

- అమెరికాలో ఇమిగ్రేషన్ ఏజెంట్ల దుశ్చర్య

లాస్‌ఏంజెలెస్: కారులో ఏడాది వయసున్న చిన్నారి ఉన్నా పట్టించుకోకుండా ఆమె తండ్రిని అరెస్టు చేసి, కారుతో సహా తరలించిన ఘటన అమెరికాలో జరిగింది. లాస్‌ఏంజెలెస్‌లోని ఓ వ్యాపార సముదాయంలో మంగళవారం సాయుధులైన ఫెడరల్ ఇమిగ్రేషన్ ఏజెంట్లు సోదాలు నిర్వహించారు. పార్కింగు ప్రాంతంలో ఉన్న ఓ అమెరికా పౌరుణ్ని అరెస్టు చేసి, అతడి కారును గుర్తుతెలియని చోటుకు తరలించారు. ఆ సమయంలో కారు వెనుక సీట్లో పౌరుడి కుమార్తె కూడా ఉంది. ఇమిగ్రేషన్ ఏజెంట్లు అరెస్టు సమయంలో చిన్నపిల్లలకు సంబంధించిన విధివిధానాలను సరిగ్గా పాటించలేదని, ఇది చాలా ప్రమాదకరమని నిందితుడి తరఫు న్యాయవాదులు తెలిపారు. ఘటన జరిగిన ఒకరోజు తర్వాత ఆ వ్యక్తి బంధువులను ఫెడరల్ కార్యాలయానికి పిలిపించి చిన్నారిని అప్పగించారు. రెస్టారెంటు రంగంలో పనిచేస్తున్న పాప తండ్రి ఆచూకీ గురించి అధికారులు ఇప్పటివరకు వెల్లడించలేదు. సోదాలు జరుపుతున్న సమయంలో తమ సిబ్బందికి సుత్తి చూపించి.. రాళ్లు విసురుతూ అతడు నిబంధనలు అతిక్రమించాడని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.



కంట్రోల్ రూం నుంచి వెబ్‌కాస్టింగ్‌ను పర్యవేక్షిస్తున్న సీఈసీ జ్ఞానేశ్ కుమార్. చిత్రంలో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్‌సింగ్ సంధు, వివేక్ జోషి

వెబ్‌కాస్టింగ్‌లో పర్యవేక్షించిన ఈసీ

దిల్లీ: బిహార్‌లో గురువారం జరిగిన శాసనసభ ఎన్నికల ప్రక్రియను కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌కాస్టింగ్ ద్వారా ప్రత్యక్షంగా పర్యవేక్షించింది. 45,000కి పైగా ఉన్న పోలింగ్ బూత్‌లలో ఏం జరుగుతోందో తెలుసుకునేందుకు సీఈసీ జ్ఞానేశ్‌కుమార్, ఎన్నికల కమిషనర్లు ఎస్.ఎస్.సంధు, వివేక్ జోషి.. నిర్వాచన్ సదన్‌లోని కంట్రోల్ రూంలోనే కూర్చొన్నారు. తొలిసారిగా ఈ ఎన్నికల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీటీవీలు ఏర్పాటుచేశారు.

■ భారతదేశ ఎన్నికల వ్యవస్థను అర్థం చేసుకోవడంపై దక్షిణాఫ్రికా చట్టసభ సభ్యులు ఆసక్తి చూపిస్తున్నారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌తో దక్షిణాఫ్రికా ఎన్నికల కమిషన్ ఛైర్‌పర్సన్ మొసోథొ మొయిప్యా గురువారం ఫోన్లో మాట్లాడి, ఎన్నికలను చూడటానికి తాము భారత్‌కు రావాలనుకుంటున్నామని చెప్పారు.

ఆ రూ.6.. పరిహారం కాదు

మహారాష్ట్ర వ్యవసాయశాఖ స్పష్టీకరణ

ఛత్రపతి శంభాజీనగర్: మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో ఇటీవల ఓ రైతుకు పంటనష్టం కింద ప్రభుత్వం నుంచి రూ.6 పరిహారం అందిందన్న రైతు ఆరోపణలపై ఆ రాష్ట్ర వ్యవసాయ శాఖ స్పందించింది. అది ప్రభుత్వం నుంచి అందిన పరిహారం కాదని వివరించింది. అది రైతు ఖాతాలోని సొమ్ముకు వడ్డీ అని గుర్తించినట్లు పేర్కొంది.

జర్మనీలో కార్లు, ఇళ్లపై రక్తపు స్వస్తిక్ చిహ్నాలు

హనావ్: జర్మనీలో రక్తపు స్వస్తిక్ గుర్తులు ప్రత్యక్షం కావడం కలకలం రేపింది. హనావ్ నగరంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు పార్కింగులో ఉన్న కార్లు, పోస్టు బాక్సులు, ఇళ్లపై మనిషి రక్తంతో ఈ చిహ్నాన్ని వేయడం ఆందోళన రేకెత్తిస్తోంది. జర్మనీలో స్వస్తిక్ సహా ఇతర నాజీ చిహ్నాలను ప్రదర్శించడం నిషేధం. బుధవారం రాత్రి ఈ సమాచారం అందుకున్న పోలీసులు దీనిపై దర్యాప్తు చేపట్టారు. "దాదాపు 50 కార్లతో సహా ఇళ్లు, పోస్టు బాక్సులపై రక్తంతో స్వస్తిక్ చిహ్నాన్ని వేసినట్లు గుర్తించాం. అది రక్తమే అని ధ్రువీకరణ కూడా జరిగింది. దీనిపై పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం" అని పోలీసులు తెలిపారు.

సాంకేతికత సాయంతో కోర్టు కేసుల్లో కౌంటర్లు అద్భుతం

- అన్ని శాఖలూ దీనిపై దృష్టి సారించాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశం

ఈనాడు, అమరావతి: కోర్టు కేసుల్లో కౌంటర్లు వేయడానికి సాంకేతికత వినియోగిస్తే మంచి ఫలితాలు వస్తున్నాయని జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ వివరించారు. 'ఆర్టీజీఎస్‌లో ఏజెంట్ స్పేస్ ఉపయోగించి వేర్వేరు ప్రాంప్ట్‌లు తయారుచేశాం. భూసేకరణ కేసుల్లో సుప్రీంకోర్టు, హైకోర్టు కేసులు అప్‌లోడ్ చేయించాం. పిటిషనర్ అఫిడవిట్, మన ప్రాంప్ట్ రెండూ అప్‌లోడ్ చేయిస్తే.. ఆ కౌంటర్లు అద్భుతంగా వచ్చాయి. జలవనరుల శాఖలోనూ ఇలాగే చేస్తున్నాం. గతంలో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ అవగాహన లేకుండా వేయడంతో ప్రభుత్వ ప్రయోజనాలు దెబ్బతినేవి' అని చెప్పారు. 'ఇది మంచి ఆలోచన. అన్ని శాఖలూ దీనిపై దృష్టిపెట్టాలి. ప్రతి శాఖలోనూ న్యాయ వివాదాలు ఉన్నాయి. ఆర్బిట్రేషన్ ద్వారా వీలైతే సెటిల్ చేద్దాం. జీవోల జారీ నుంచి కోర్టు కేసుల్లో కౌంటర్ల వరకూ సాంకేతికతను ఉపయోగిద్దాం. లాయర్ మీ తరఫున కోర్టులో వాదిస్తారు. ఆయనే అన్నీ చూసుకుంటారనుకుంటే కేసు వీగిపోతుంది' అని చంద్రబాబు చెప్పారు.


డేటా ఆధారిత పాలనపై నిర్వహించిన సదస్సులో సీఎం చంద్రబాబు, మంత్రులు, ఉన్నతాధికారులు

రియల్ టైమ్‌లో నేరగాళ్ల ట్రాకింగ్

'ఒక దొంగ కొత్త వాహనం కొన్నా, పెట్టుబడులు పెట్టినట్లు సమాచారం వచ్చినా.. అతన్ని ట్రాక్ చేస్తే చాలా దొంగతనాల విషయం తెలుస్తుంది' అని ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ వివరించారు. 'జనం ఎక్కువగా ఉంటే అక్కడ మొబైల్‌ఫోన్లు పెద్దఎత్తున ఉంటాయి. టవర్లకు అనుసంధానమవుతాయి. వాటిద్వారా గుర్తించి చర్యలు తీసుకోవచ్చు' అని చెప్పారు. ఈ అంశాల్ని పరిశీలించాలని ఆర్టీజీఎస్ అధికారులకు సీఎం సూచించారు. నేరగాళ్లను రియల్ టైమ్‌లో ట్రాకింగ్ చేయాలని చెప్పారు. పోలీసు అధికారుల్లో సాంకేతికతపై అవగాహన కలిగిన నలుగురైదుగురితో ఒక కమిటీ వేసి సూచనలు చేయాలన్నారు. 'తప్పించుకుని తిరిగే క్రిమినల్స్ 4వేల మంది వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నారు. ఆర్టీజీఎస్ ద్వారా వారెక్కడున్నారో తెలుసుకోవడం సాధ్యపడుతుంది' అని ఫోరెన్సిక్ సైన్స్ ప్రయోగశాల డైరెక్టర్ పాల్‌రాజు చెప్పారు. ప్రజలకు సైబర్ ఎలర్ట్స్, మాదకద్రవ్యాల వినియోగంపై ఆర్టీజీఎస్ ద్వారా అవగాహన కల్పించాలని ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ సూచించారు. సైబర్ క్రైమ్‌పైనా నిపుణులతో కమిటీ ఏర్పాటుచేస్తామని చంద్రబాబు పేర్కొన్నారు.

పాల ఉత్పత్తిలో వృద్ధి ఏది?

పాల ఉత్పత్తిలో వృద్ధి తగ్గడంపై చంద్రబాబు అసంతృప్తి వెలిబుచ్చారు. పశువుల సంఖ్య కూడా 108.19 లక్షల నుంచి 93.62 లక్షలకు తగ్గిపోయిందని చెప్పారు. వైకాపా హయాంలో పశుసంవర్ధక రంగానికి ప్రభుత్వ మద్దతు లభించలేదని.. రైతులు పాడి పశువుల్ని అమ్మేశారని ఆ శాఖ డైరెక్టర్ దామోదర్ నాయుడు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పశు వసతిగృహాలతో పాటు మెరుగైన చర్యలు చేపట్టారని వివరించారు. మొదటి త్రైమాసికంలో అంతగా వృద్ధి ఉండదని చెప్పగా.. గతేడాది మొదటి త్రైమాసికంతో పోల్చి చెప్పామని చంద్రబాబు పేర్కొన్నారు. 'ఎవరైనా సరే సీరియస్‌గా పనిచేయాలి. బాధ్యత తీసుకోవాలి. ఆదాయం తగ్గిపోతే ఎలా?' అని ప్రశ్నించారు.

● ప్రైవేటు ఆసుపత్రుల్లో సిజేరియన్ శస్త్రచికిత్సలు పెరగడంపై చంద్రబాబు అధికారుల్ని ప్రశ్నించారు. దీని నివారణకు మూడు విధానాలు అమలు చేస్తున్నామని ఆ శాఖ డైరెక్టర్ వీరపాండియన్ వివరించారు.

● ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీస్కూల్ విద్యార్థుల సంఖ్య తగ్గడంపైనా చంద్రబాబు ప్రశ్నించారు. ఎంతమంది ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్నారు? ఎంతమంది బడి మానేస్తున్నారో పరిశీలించాలని ఆర్టీజీఎస్ కార్యదర్శికి సూచించారు.

పారిశ్రామిక కాలుష్యంపై తప్పుడు ప్రచారం

ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నియోజకవర్గంలో కొందరు కావాలనే సముద్రతీరంలో పారిశ్రామిక కాలుష్యంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని పీసీబీ ఛైర్మన్ కృష్ణయ్య సూచించారు. జిల్లా కలెక్టర్లు బాధ్యత తీసుకుంటే యువకులు, మత్స్యకార నేతలకు అవగాహన కల్పిస్తామన్నారు.

రెవెన్యూ ఎప్పటికి గాడిన పడుతుంది?

రెవెన్యూ వ్యవస్థ ఎప్పటికి గాడిన పడుతుందని సీఎం ప్రశ్నించారు. సేవల్ని సమీక్షించి, అవసరం లేనివాటిని తొలగించాలని నిర్దేశించారు. రూ.100కే భాగస్వామ్య ఆస్తుల రిజిస్ట్రేషన్ దస్త్రం ఆర్థికశాఖ పరిశీలనలో ఉందని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి వివరించారు. ప్రజా ఫిర్యాదుల విభాగం దరఖాస్తుల స్వీకరణలో మార్పులు చేశామని చెప్పారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల చట్ట సవరణ దస్త్రాన్ని వచ్చే మంత్రివర్గ సమావేశంలో ఉంచుతామని చెప్పారు.

9 రోజులకూ దస్త్రాలు పరిష్కరించకపోతే ఎలా?

దస్త్రాల పరిష్కారంలో కొందరు ఉన్నతాధికారుల తీరుపై సీఎం అసహనం వెలిబుచ్చారు. '9 రోజులకు పైగా దస్త్రాలు పరిష్కరించలేదంటే విధి నిర్వహణలో అంకితభావం లేదనే అర్థం. కనీస బాధ్యతతో పనిచేయాలి' అని నిర్దేశించారు. డేటా ఆధారిత పాలనపై సదస్సులో వీటి వివరాలను ఆయన చదివి వినిపించారు. కొందరు మంత్రుల తీరు కూడా బాగాలేదని అసంతృప్తి వెలిబుచ్చారు. వచ్చే సమావేశంలో వారి పేర్లు కూడా చదువుతానన్నారు.

సచివాలయాల పేరు త్వరలో మార్పు!

- విజన్ యూనిట్లుగా వాడుకోవాలన్న సీఎం
- ప్రజలందరికీ ఆమోదయోగ్యమైన పేరు పెడతామన్న మంత్రి

ఈనాడు-అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల పేరు త్వరలో మారనుంది. వీటిని విజన్ యూనిట్లుగా వినియోగించుకోవాలని డేటా ఆధారిత పాలనపై సచివాలయంలో గురువారం నిర్వహించిన సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. విజన్ యూనిట్లలో సచివాలయాల్లో సమర్థులైన ఉద్యోగులను ఉపయోగించుకుంటామని ఆయన వెల్లడించారు.

■ స్వర్ణాంధ్రప్రదేశ్‌ను సాకారం చేసేందుకు ప్రణాళికల రూపకల్పన, అమలులో సచివాలయాలు క్రియాశీలకంగా వ్యవహరించేలా ప్రభుత్వం ఆలోచనలు చేస్తోంది. సచివాలయాల పేరు మార్చాలన్న ప్రతిపాదన సీఎంవో పరిశీలనలో ఇప్పటికే ఉంది. సంబంధితశాఖ దాదాపు పది పేర్లు సూచించినట్లు తెలుస్తోంది. వాటిలో ఒకటి త్వరలో ఖరారు చేసే అవకాశాలున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక సచివాలయాల్లో పలు సంస్కరణలు తీసుకొచ్చారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో మూడంచెల వ్యవస్థను తీసుకురానున్నారు. ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తున్నారు. వారి అభ్యర్థనపై యూనిఫాం (ఏకరూప దుస్తులు) తొలగించారు. ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తులపై పేరు కూడా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది.

వ్యవస్థలో సమగ్ర మార్పులు

– మంత్రి స్వామి

ప్రజలందరికీ ఆమోదయోగ్యమైన పేరును గ్రామ, వార్డు సచివాలయాలకు పెడతామని ఆ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. సచివాలయాల వ్యవస్థలో సీఎం చంద్రబాబు సమగ్ర మార్పులు తీసుకొస్తున్నారని ఆయన గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 'సచివాలయాల క్రెడిట్ కూటమి ప్రభుత్వం చోరీ చేసిందని వైకాపా విమర్శిస్తోంది. క్రెడిట్ చోరీలో జగన్‌ను మించిన వారెవరైనా ఉన్నారా?' అని జగన్‌పై మంత్రి బాల వీరాంజనేయస్వామి మండిపడ్డారు.

నేటి నుంచి వీవీఐటీయూ బాలోత్సవ్


సిద్ధమవుతున్న వేదిక..

నంబూరు(పెదకాకాని), న్యూస్‌టుడే: ప్రపంచ తెలుగు బాలల పండగైన 'వీవీఐటీయూ బాలోత్సవ్ 2025' సాంస్కృతిక ఉత్సవాలు గుంటూరు జిల్లా పెదకాకాని మండలం నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నోలాజికల్ యూనివర్సిటీలో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు జరగనున్న వేడుకల్లో పాల్గొనేందుకు దేశవ్యాప్తంగా 650 పాఠశాలల నుంచి 13 వేల మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారు. 20 అంశాలు, 61 విభాగాల్లో పోటీలు నిర్వహించేందుకు 32 వేదికలు ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా ప్రదర్శనలు ఉంటాయని బాలోత్సవ్ అధ్యక్షుడు, వీవీఐటీయూ ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రో ఛాన్స్‌లర్ వాసిరెడ్డి మహదేవ్ తెలిపారు. 'ఈ వేడుకల్లో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థులు తరలివస్తారు. గుంటూరు, విజయవాడ నగరాల్లోని బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్లలో సేవా కేంద్రాలు ఏర్పాటు చేశాం. అక్కడి నుంచి కళాశాల బస్సుల్లో విద్యార్థులను బాలోత్సవ్ ప్రాంగణానికి తీసుకొస్తాం. కళాశాలలోనే వసతి, భోజనం ఏర్పాటు చేశాం. సేవా కార్యక్రమాలకు 600 మంది ఎన్ఎస్ఎస్, భద్రత కోసం 180 మంది ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొంటారు' అని పేర్కొన్నారు.

ఎన్జీ రంగా జయంత్యుత్సవాలకు నేడు సీఎం హాజరు

గుంటూరు(జిల్లా పరిషత్తు), న్యూస్‌టుడే: రైతు బాంధవుడు, స్వాతంత్ర్య సమరయోధుడు ఆచార్య ఎన్జీ రంగా 125వ జయంత్యుత్సవాలకు ముఖ్య అతిథిగా సీఎం చంద్రబాబు హాజరుకానున్నారని ఆచార్య ఎన్జీ రంగా ట్రస్ట్ సభ్యులు రామినేని కిశోర్‌బాబు, టి.యుగంధర్, బి.నాగేశ్వర్ మిత్రా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు సమీపంలోని లాంఫాం ఆడిటోరియంలో శుక్రవారం ఎన్జీ రంగా జయంత్యుత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రితో పాటు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి కె.అచ్చెన్నాయుడు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు హాజరవుతారని చెప్పారు.

రూ.5కే ఆకలి తీర్చడం అద్భుతం

అన్న క్యాంటీన్‌లో భోజనం చేసిన ఎన్నారై

- రుచి, నాణ్యత బాగున్నాయని కితాబు
- సహకారం అందిస్తామని హామీ

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: పేదల ఆకలి తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ వ్యవస్థ దిగ్విజయంగా నడుస్తోందని, ఇంతమంచి కార్యక్రమానికి తమ వంతు సహకారం అందించే దిశగా ఆలోచిస్తున్నామని ఎన్నారై వెంకట్ ఇక్కుర్తి చెప్పారు. గుంటూరు అమరావతి రోడ్డులోని అన్న క్యాంటీన్‌ను గురువారం సందర్శించిన ఆయన నిర్వహణ తీరును పరిశీలించారు. భోజనం చేసి ఆహారం రుచి, నాణ్యత బాగున్నాయని కితాబు ఇచ్చారు. అక్కడ తింటున్న వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. 'మాది గుంటూరులోని బ్రాడీపేట. 30 ఏళ్లుగా అమెరికాలో ఉంటున్నా. అక్కడి పౌరసత్వం వచ్చింది. రాష్ట్రంలోని అన్న క్యాంటీన్ల గురించి అమెరికాలో మా స్నేహితుల మధ్య చర్చ జరిగింది. ఈసారికి ఇండియాకు వచ్చినందున క్యాంటీన్‌ను పరిశీలించా' అని వెంకట్ ఇక్కుర్తి పేర్కొన్నారు.


అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న ఎన్నారై వెంకట్ ఇక్కుర్తి

దేశవ్యాప్తంగా శ్రీ చైతన్య రక్తదాన కార్యక్రమాలు

ఈనాడు, అమరావతి: శ్రీ చైతన్య విద్యాసంస్థల ఛైర్‌పర్సన్ ఝాన్సీ లక్ష్మీబాయి 78వ జన్మదిన వేడుకలను దేశవ్యాప్తంగా నిర్వహించారు. వివిధ రాష్ట్రాల్లోని విద్యాసంస్థల క్యాంపస్‌లలో జరిగిన కార్యక్రమాల్లో 3,127 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. హైదరాబాద్‌లోని మియాపూర్‌లో రక్తదాన శిబిరాన్ని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఝాన్సీ లక్ష్మీబాయి మాట్లాడుతూ ఏటా తన పుట్టినరోజు సందర్భంగా ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదాన శిబిరాల్లో పాల్గొనడం వారి మానవత్వానికి నిదర్శనమని కొనియాడారు. సంస్థ వెస్ట్‌జోన్ ఏజీఎం జి.రవికుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి ఏజీఎంలు, డీన్‌లు, ప్రిన్సిపాళ్లు, బోధన, బోధనేతర సిబ్బంది హాజరయ్యారు. విజయవాడలో శిబిరాన్ని శ్రీచైతన్య డైరెక్టర్ టి.నాగేంద్రకుమార్ ప్రారంభించి, రక్తదానం చేశారు.


విజయవాడలోని శ్రీచైతన్య క్యాంపస్‌లో రక్తదానం చేస్తున్న టి.నాగేంద్ర కుమార్

నకిలీ హాల్‌మార్క్‌తో కొనుగోలుదారులకు బురిడీ

గుంటూరు(పట్నంబజారు), న్యూస్‌టుడే: హాల్‌మార్క్ లైసెన్సు లేకుండా బంగారం విక్రయిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో గుంటూరు పట్నంబజారులోని కరీముల్లా జ్యువెలర్స్ దుకాణంలో గురువారం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) జాయింట్ డైరెక్టర్లు టి.అర్జున్, కె.కౌశిక్‌లు సోదాలు నిర్వహించారు. హాల్‌మార్క్ లైసెన్సు లేకుండా ఆభరణాలు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. నకిలీ హాల్‌మార్క్ ముద్రలు వేసి వినియోగదారులను మోసగిస్తున్నట్లు తనిఖీల్లో వెల్లడైంది. ఇక్కడ నకిలీ హాల్‌మార్క్ మిషన్‌తోపాటు 1.286 కిలోల స్వర్ణ ఆభరణాలను అధికారులు సీజ్ చేశారు. బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ టి.అర్జున్ మాట్లాడుతూ వ్యాపారులు విధిగా హాల్‌మార్క్ లైసెన్సు పొందాలన్నారు. ఈ విధానం ద్వారా ఆభరణాలపై ముద్రలో హెచ్‌యూఐడీ సంఖ్యతోపాటు దుకాణం వివరాలు ఉంటాయని తెలిపారు. కొందరు వ్యాపారులు లైసెన్సు లేకుండా 18 క్యారెట్ల బంగారంతో తయారు చేసిన ఆభరణాలను 22 క్యారెట్లుగా వినియోగదారులను నమ్మిస్తూ, హాల్‌మార్క్ నకిలీ ముద్రలు వేస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయన్నారు.

మా వాంగ్మూలాలను రికార్డుల నుంచి తొలగించండి

హైకోర్టులో పెనకా రోహిత్‌రెడ్డి, శరత్ చంద్రారెడ్డి పిటిషన్లు

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసు దర్యాప్తులో భాగంగా సీఐడీ నమోదుచేసిన తమ వాంగ్మూలాలను రికార్డుల నుంచి తొలగించేలా ఆదేశాలివ్వాలంటూ పెనకా రోహిత్‌రెడ్డి, ఆయన సోదరుడు పెనకా శరత్‌చంద్రారెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యాలపై గురువారం హైకోర్టు విచారణ జరిపింది. వ్యాజ్యాలకు విచారణార్హత లేదని సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు, సిట్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా హైకోర్టుకు నివేదించారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు.. తదుపరి విచారణలో పూర్తి వివరాలు సమర్పించాలని సీఐడీకి, విచారణార్హతపై వాదనలు చెప్పాలని పిటిషన్ల తరఫు న్యాయవాదికి సూచించింది. ఈ నెల 27కు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి గురువారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.

● సీఆర్‌పీసీ సెక్షన్ 161 కింద సాక్షులుగా ఈ ఏడాది అక్టోబర్ 13న సీఐడీ తమనుంచి నమోదు చేసిన వాంగ్మూలాలను రికార్డుల నుంచి తొలగించేలా ఆదేశించాలని కోరుతూ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి అల్లుడు పెనకా రోహిత్‌రెడ్డి, శరత్ చంద్రారెడ్డి హైకోర్టులో వ్యాజ్యాలు వేశారు. తాము చెప్పని విషయాలను చెప్పినట్లు సీఐడీ నమోదు చేసిందన్నారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది మయాంక్ జైన్ వాదనలు వినిపిస్తూ.. వ్యాజ్యాలకు విచారణ అర్హత ఉందన్నారు. దీనిపై తదుపరి విచారణలో వాదనలు వినిపిస్తానని తెలిపారు.

గోడ కూల్చేందుకు మరో రూ.32 లక్షలు చెల్లించండి

- విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి, ఆమె కంపెనీకి హైకోర్టు ఆదేశం
- రెస్టోబార్ల విషయంలో తగిన ఉత్తర్వులు జారీచేయండి
- జీవీఎంసీకి ఆదేశం

ఈనాడు, అమరావతి: విశాఖ జిల్లా భీమిలి బీచ్‌కు సమీపంలో సీఆర్‌జడ్ నిబంధనలను ఉల్లంఘించి నిర్మించిన కాంక్రీట్ గోడలో.. ఇప్పటికే కొంతభాగాన్ని కూల్చేయగా, మిగిలింది కూడా కూల్చేందుకు రూ.31.97 లక్షలు రెండు వారాల్లో జీవీఎంసీకి జమచేయాలని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డిని, అవ్యాన్ రియల్టర్స్ కంపెనీని హైకోర్టు ఆదేశించింది. కాంక్రీట్ గోడ నిర్మించి పర్యావరణానికి నష్టం చేసినందుకు రూ.17.46 కోట్లు చెల్లించాలని కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వశాఖ (ఎంఓఈఎఫ్) నేతృత్వంలోని కమిటీ ఇచ్చిన నివేదికపై అభ్యంతరాలు తెలిపేందుకు రెండు వారాల సమయం ఇచ్చింది. ఎంఓఈఎఫ్ తుది నిర్ణయంపై అభ్యంతరం ఉంటే తగిన వేదికలో సవాలు చేసుకునేందుకు నేహారెడ్డికి, ఆమె కంపెనీకి అవకాశం ఇచ్చింది. మరోవైపు షోకాజ్ నోటీసులకు సమాధానంగా రెస్టోబార్ల యజమానులు ఇచ్చిన వివరణను పరిగణనలోకి తీసుకొని రెండు వారాల్లో తగిన ఉత్తర్వులు జారీచేయాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ ఆర్.రఘునందన్‌రావుతో కూడిన ధర్మాసనం గురువారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

ఇప్పటికే రూ.48.21 లక్షల జమ

ఈ వ్యాజ్యాలపై ఇటీవల విచారణ జరిపిన ధర్మాసనం ఇప్పటివరకు గోడ కూల్చివేతకు అయిన రూ.48.21 లక్షలు జీవీఎంసీకి జమచేయాలని ఆదేశించింది. ఆ మొత్తం జమచేసినట్లు విచారణలో నేహారెడ్డి కంపెనీ కోర్టుకు తెలిపింది.

✦ గురువారం జరిగిన విచారణలో నేహారెడ్డి, ఆమె కంపెనీ తరఫున సీనియర్ న్యాయవాది ఎ.సత్యప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. మిగిలిన గోడ కూల్చడానికి మరో రూ.31.97 లక్షలు చెల్లించాలని జీవీఎంసీ ఇటీవల సమాచారం ఇచ్చిందన్నారు. పర్యావరణానికి నష్టం చేసినందుకు 17.46 కోట్లు చెల్లించాలని ఎంఓఈఎఫ్ ఇచ్చిన నివేదికపై అభ్యంతరాలు తెలిపేందుకు మరికొంత సమయం కావాలన్నారు.

✦ ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ప్రణతి వాదనలు వినిపిస్తూ.. గోడ కూల్చినందుకు ఇప్పటివరకు అయిన రూ.48.21 లక్షలు చెల్లించారని, మిగిలిన గోడ కూల్చడానికి రూ.31.97 లక్షలు ఖర్చవుతుందన్నారు. అ నేపథ్యంలో ఆ సొమ్ము చెల్లించాలని నోటీసు ఇచ్చామన్నారు.

పెళ్లి కాకుండానే పిల్లలు.. విక్రయం!

- ఇప్పటికే ఇద్దరిని అమ్మినట్లు సమాచారం
- మూడో శిశువుకు జన్మనివ్వడంతో వెలుగులోకి..

నందికొట్కూరు, న్యూస్‌టుడే: పెళ్లి కాకుండానే ఓ మహిళ బిడ్డకు జన్మనివ్వడం, ఆమెకు అప్పటికే రెండు ప్రసవాలు చేసినట్లు ప్రభుత్వాసుపత్రి సిబ్బంది చెప్పడంతో అంతా కంగుతిన్నారు. బిడ్డలను కని, విక్రయించడమే వారి వ్యాపారమని స్థానికులు అంటున్నారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో గురువారం జరిగిన ఈ ఘటన కలకలం రేపుతోంది. నందికొట్కూరు మండలం కొణిదేల గ్రామానికి చెందిన ఓ కుటుంబం పట్టణంలోని హాజీనగర్ కాలనీలో ఉంటుంది. ఈ దంపతులకు ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. చిన్న కుమార్తెకు వివాహం కాలేదు. ఆమె గురువారం ఇంట్లో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. శిశువు ఆరోగ్యం బాగాలేకపోవడంతో.. బాలింత సోదరి నందికొట్కూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చింది. వైద్యులు శిశువును హీట్ థెరపీ యూనిట్‌లో ఉంచారు. అనంతరం బాలింత సోదరి అక్కడి నుంచి వెళ్లిపోయింది. దీంతో వైద్యులు, సిబ్బంది పోలీసులకు, ఐసీడీఎస్ సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు శిశువును నంద్యాలలోని కేర్ సెంటర్‌కు తరలించారు. అనంతరం శిశువు తల్లి కుటుంబసభ్యులతో కలిసి ఆసుపత్రికి వచ్చింది. ఆ మహిళను గుర్తించిన వైద్యులు, సిబ్బంది.. గతంలో ఆమెకు రెండు ప్రసవాలు చేసినట్లు తెలిపారు. ఆసుపత్రి సిబ్బంది పోలీసులకు, ఐసీడీఎస్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో శిశువు తల్లి, కుటుంబసభ్యులు అక్కడి నుంచి జారుకున్నారు.

ఇదే ఆ కుటుంబం వ్యాపారమా?

గతంలో ఆ మహిళ ఇద్దరు బిడ్డలకు జన్మనివ్వగా కుటుంబసభ్యులు విక్రయించారని, తాజాగా మూడో బిడ్డకు జన్మనిచ్చిందని స్థానికులు తెలిపారు. దీంతో పిల్లలను కని, విక్రయించడమే ఆ కుటుంబసభ్యుల వ్యాపారంగా ఉన్నట్లు తెలుస్తోంది. గత రెండు ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేయించారని, ఆరోగ్యశ్రీ వర్తింపజేయాలని మహిళ తల్లిదండ్రులు తమతో వాగ్వాదానికి దిగినట్లు ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. వివాహం అయితేనే వర్తిస్తుందని చెప్పడంతో అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు వెల్లడించారు.

EENADU Vol: 52, Issue: 87 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఈనాడు బిజినెస్

టోక్యోలో ప్రధాన కార్యాలయ భవంతిని విక్రయించిన నిస్సాన్

టోక్యో: ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న జపాన్ వాహన తయారీ సంస్థ నిస్సాన్, టోక్యో సౌత్‌వెస్ట్ యొకోహామాలో ఉన్న ప్రధాన కార్యాలయ భవంతిని విక్రయించినట్లు గురువారం వెల్లడించింది. సంస్థ పునరుద్ధరణ ప్రయత్నాల్లో భాగంగానే భవనాన్ని 97 బిలియన్ యెన్‌ల (630 మి.డాలర్లు-సుమారు రూ.5,600 కోట్ల)కు విక్రయించినట్లు తెలిపింది. అయితే అదే భవంతిని లీజుకు తీసుకుని, ప్రధాన కార్యాలయాన్ని అక్కడే కొనసాగించనున్నట్లు పేర్కొంది. టోక్యోకు చెందిన స్థిరాస్తి నిర్వహణ సంస్థ ఎంజేఐ గోడో కైశా ప్రకారం, ఈ భవంతి విక్రయం ద్వారా నిస్సాన్‌కు 73.9 బి.యెన్‌ల (480 మి.డాలర్లు-సుమారు రూ.4,250 కోట్లు) లాభం వచ్చింది.

రిలయన్స్ జియో విలువ రూ.15 లక్షల కోట్లు!

● మర్చంట్ బ్యాంకర్ల అంచనా ● రికార్డులు తిరగరాసే ఐపీఓ కావొచ్చు



జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ విలువ 170 బిలియన్ డాలర్లు (సుమారు రూ.15 లక్షల కోట్లు) ఉండొచ్చని మర్చంట్ బ్యాంకర్లు అంచనా వేస్తున్నారు. దీని ప్రకారం రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన జియో.. కొంత వాటాను పబ్లిక్ ఇష్యూ ద్వారా విక్రయించాలనుకున్నా, ఆ ఐపీఓ అన్ని రికార్డులు తిరగ రాసే అవకాశం కనిపిస్తోంది. మార్కెట్ విలువ పరంగా దేశంలోని టాప్-3 కంపెనీల సరసన ఇది చోటు సంపాదించుకునే వీలుంది. 2026 తొలి అర్ధ భాగంలో జియో స్టాక్ మార్కెట్లలో నమోదు కావొచ్చని తెలుస్తోంది. పోటీ సంస్థ భారతీ ఎయిర్‌టెల్ మార్కెట్ విలువ 143 బి.డాలర్లు (సుమారు రూ.12.7 లక్షల కోట్లు)గా ఉంది. జియో ఐపీఓకు సంబంధించిన చర్చలు ప్రస్తుతం మర్చంట్ బ్యాంకర్లతో జరుగుతున్నాయి. ఈ పబ్లిక్ ఇష్యూలో కంపెనీ 6 బి.డాలర్లు (సుమారు రూ.53,000 కోట్లు) సమీకరించే అవకాశం ఉందని సమాచారం. సవరించిన నిబంధనల ప్రకారం, కంపెనీలు మార్కెట్‌లో నమోదైన తర్వాత రూ.5 లక్షల కోట్ల మార్కెట్ విలువను అధిగమిస్తాయనుకుంటే, రూ.15,000 కోట్ల విలువైన షేర్లను ఆఫర్ చేయాల్సి ఉంటుంది. అలాగే 2.5% ఈక్విటీని మాత్రమే తగ్గించుకోవాల్సి ఉంటుంది. మర్చంట్ బ్యాంకర్ల విలువ ప్రతిపాదన ప్రకారం, జియో 4.3 బి.డాలర్లు (సుమారు రూ.38,000 కోట్లు) సమీకరించే అవకాశం లభిస్తుంది.

హీరో మైక్రో కారు ఎన్‌ఈఎక్స్ 3



మిలాన్: హీరో మోటోకార్ప్ ఇటలీలోని మిలాన్‌లో జరుగుతున్న ఈఐసీఎంఏ 2025లో ఎన్‌ఈఎక్స్ 3 మోడల్‌ను ఆవిష్కరించింది. ఇది మైక్రో విద్యుత్ నాలుగు చక్రాల వాహనం కావడం గమనార్హం. తన వర్ధమాన బిజినెస్ యూనిట్ విడాలో కొత్త 'నోవస్' శ్రేణిలో దీన్ని తీసుకొచ్చింది. దీంతో పాటు ఎన్‌ఈఎక్స్ 1 (పోర్టబుల్, వేరబుల్ మైక్రో మొబిలిటీ పరికరం), ఎన్‌ఈఎక్స్ 2 (విద్యుత్ ట్రైక్)లను కూడా ప్రదర్శనకు ఉంచింది. 'విడా నోవస్ మైక్రో మొబిలిటీ సొల్యూషన్స్ ప్రస్తుతం ఐరోపాలోనే దృష్టి సారిస్తోంది. ఈ కాన్సెప్ట్‌లను భారత్‌కు కూడా తీసుకెళతామ'ని కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ పవన్ ముంజాల్ ధీమా వ్యక్తం చేశారు.

కోడి గుడ్లు

7న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	580
వరంగల్	582
విజయవాడ	585
తూ/ప గోదావరి	595
విశాఖపట్నం	580
చిత్తూరు	613

100 బిలియన్ డాలర్ల క్లబ్బులోకి ఎస్‌బీఐ



మార్కెట్ విలువపరంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) 100 బిలియన్ డాలర్ల (రూ.8.8 లక్షల కోట్ల) క్లబ్బులోకి చేరింది. ఈ ఘనత సాధించిన ఆరో భారతీయ కంపెనీగా, ప్రభుత్వ రంగం నుంచి తొలి సంస్థగా నిలిచింది. గురువారం బీఎస్‌ఈలో ఎస్‌బీఐ షేరు 1.47% పెరిగి జీవనకాల గరిష్ఠమైన రూ.971.15ను చేరింది. తద్వారా బ్యాంక్ మార్కెట్ విలువ రూ.8.96 లక్షల కోట్లకు (100 బి.డాలర్లకు పైగా) చేరింది. చివరకు ఎస్‌బీఐ షేరు రూ.960.75 వద్ద ముగిసి, మార్కెట్ విలువ రూ.8,86,831 కోట్లకు తగ్గినప్పటికీ.. 100 బి.డాలర్ల స్థాయినైతే నిలబెట్టుకుంది. ఇప్పటికే 100 బిలియన్ డాలర్లకు మించి మార్కెట్ విలువ కలిగి ఉన్న సంస్థల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఐసీఐసీఐ బ్యాంక్ ఉన్నాయి.

ఎస్‌బీఐ ఫండ్స్ ఐపీఓ 2026లో!

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తన అనుబంధ సంస్థ ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ఎస్‌బీఐఎఫ్‌ఎంఎల్)ను వచ్చే ఏడాది పబ్లిక్ ఇష్యూకు తీసుకురావాలని యోచిస్తోంది. ఐపీఓ ద్వారా ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్‌లో 6.3% వాటా (3.20 కోట్ల షేర్లు) విక్రయించేందుకు ఆమోదం తెలిపినట్లు ఎక్స్ఛేంజీలకు ఎస్‌బీఐ సమాచారం ఇచ్చింది. ఎస్‌బీఐఎఫ్‌ఎంఎల్‌లో మరో ప్రమోటరు అయిన ఆముంది ఇండియా హోల్డింగ్ కూడా 3.7% వాటా (1.88 కోట్ల షేర్లు) ఈ ఐపీఓలో విక్రయించనుంది. దీంతో మొత్తంగా ఐపీఓ ద్వారా 10% వాటాకు సమానమైన 5.08 కోట్ల షేర్లను విక్రయిస్తారు. ప్రస్తుతం ఎస్‌బీఐఎఫ్‌ఎంఎల్‌లో ఎస్‌బీఐకి 61.91%, ఆముంది ఇండియా హోల్డింగ్‌కు 36.36% చొప్పున వాటాలున్నాయి.

ఎల్‌ఐసీ లాభం రూ.10,053 కోట్లు

దిల్లీ: ప్రభుత్వ రంగ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్‌ఐసీ), సెప్టెంబరు త్రైమాసికంలో రూ.10,053 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.7,621 కోట్లతో పోలిస్తే ఇది 32% అధికం. కమీషన్ చెల్లింపులు తగ్గడం కలిసొచ్చిందని కంపెనీ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.2,29,620 కోట్ల నుంచి రూ.2,39,614 కోట్లకు వృద్ధి చెందింది. నికర ప్రీమియం ఆదాయం రూ.1,19,901 కోట్ల నుంచి రూ.1,26,479 కోట్లకు చేరింది. రెన్యూవల్ ప్రీమియం రూ.61,910 కోట్ల నుంచి రూ.64,996 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలు రూ.2,22,366 కోట్ల నుంచి రూ.2,30,160 కోట్లకు చేరాయి.

✦ మొదటి ఏడాది ప్రీమియం వసూళ్లు రూ.11,201 కోట్ల నుంచి రూ.10,836 కోట్లకు తగ్గాయి. సెప్టెంబరు 22 నుంచి బీమా ప్రీమియంపై జీఎస్‌టీ తొలగించినా, ఈ వసూళ్లు తగ్గడం గమనార్హం.

✦ జీఎస్‌టీ సంస్కరణలు బీమా పరిశ్రమపై సానుకూల ప్రభావం చూపుతాయని ఎల్‌ఐసీ సీఈఓ, ఎండీ ఆర్.దొరైస్వామి ఆశాభావం వ్యక్తం చేశారు. జీఎస్‌టీ ప్రయోజనాలను వినియోగదారులకు పూర్తిగా బదలాయించామని స్పష్టం చేశారు. సెప్టెంబరు చివరకు కంపెనీ మార్కెట్ వాటా 61.07% నుంచి 59.41 శాతానికి తగ్గింది. లాభదాయకత, మార్జిన్ వృద్ధిపై దృష్టి పెడుతున్నామని దొరైస్వామి వెల్లడించారు.

ఎన్‌సీసీ లాభం రూ.155 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: మౌలిక సదుపాయాల సంస్థ ఎన్‌సీసీ, ఏకీకృత ఖాతాల ప్రకారం సెప్టెంబరు త్రైమాసికంలో రూ.4,585.06 కోట్ల ఆదాయం, రూ.154.70 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2024-25 ఇదేకాలంలో ఆదాయం రూ.5,224.36 కోట్లు, రూ.162.96 కోట్ల నికర లాభం ఉండటం గమనార్హం. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి 6 నెలలకు రూ.9792.99 కోట్ల ఆదాయం, రూ.346.84 కోట్ల నికరలాభం ఆర్జించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదేకాలంలో ఆదాయం రూ.10,782.69 కోట్లు, నికరలాభం రూ.372.88 కోట్లు ఉన్నాయి. కంపెనీకి ప్రస్తుత రెండో త్రైమాసికంలో రూ.6,223 కోట్ల ఆర్డర్లు లభించాయి.

రాణించిన అమరరాజా ఎనర్జీ

ఈనాడు, హైదరాబాద్: అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ, సెప్టెంబరు త్రైమాసికానికి మెరుగైన ఫలితాలు ప్రకటించింది. ఆదాయం రూ.3,388.18 కోట్లు, పన్నుకు ముందు లాభం (పీబీటీ) రూ.405.55 కోట్లు నమోదయ్యాయి. ఈపీఎస్ రూ.16.52 ఉంది. 2024-25 ఇదేకాలంలో ఆదాయం రూ.3,135.83 కోట్లు, పీబీటీ రూ.323.97 కోట్లు, ఈపీఎస్ రూ.13.15 ఉన్నాయి. దీంతో పోల్చితే నికరలాభం ఆకర్షణీయంగా పెరిగింది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి 6 నెలలకు ఈ సంస్థ రూ.6,738.10 కోట్ల ఆదాయం, రూ.666.56 కోట్ల నికరలాభం నమోదు చేసింది. ఈపీఎస్ రూ.27.12 ఉంది. ఆటోమోటివ్ లెడ్ యాసిడ్ బిజినెస్ ఆకర్షణీయంగా ఉన్నట్లు సీఎండీ జయదేవ్ గల్లా వివరించారు. సమీప భవిష్యత్తులోనూ మెరుగైన ఫలితాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

అపోలో హాస్పిటల్స్ లాభం రూ.477 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: అపోలో హాస్పిటల్స్ ఏకీకృత ఖాతాల ప్రకారం సెప్టెంబరు త్రైమాసికానికి రూ.6,304 కోట్ల ఆదాయం, రూ.477 కోట్ల నికరలాభం ఆర్జించింది. 2024-25 ఇదేకాలంతో పోల్చినప్పుడు ఆదాయం 13%, నికరలాభం 26% పెరిగాయి. హెల్త్‌కేర్ సర్వీసెస్ ఆదాయం 7%, ఏహెచ్‌ఎల్‌ఎల్ (అపోలో హెల్త్‌అండ్ లైఫ్‌స్టైల్) ఆదాయం 17%, అపోలో హెల్త్‌కో ఆదాయం 17% పెరిగాయి. లాభాలు హెల్త్‌కేర్ సర్వీసెస్ నుంచి అధికంగా నమోదయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి 6 నెలలకు అపోలో హాస్పిటల్స్ ఏకీకృత ఆదాయం రూ.12,146 కోట్లు, నికరలాభం రూ.910 కోట్లు ఉన్నాయి. 2024-25 ఇదేకాలంతో పోల్చితే ఆదాయం 14%, నికరలాభం 33% అధికంగా నమోదయ్యాయి. కృత్రిమమేధ (ఏఐ) సహా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, వైద్య సేవలను బహుముఖంగా విస్తరిస్తామని అపోలో హాస్పిటల్స్ ఛైర్మన్ ప్రతాప్ సి.రెడ్డి వివరించారు.

మిక్ ఎలక్ట్రానిక్స్ రూ.250 కోట్ల సమీకరణ

హైదరాబాద్: రైల్వే సిగ్నలింగ్ వ్యవస్థలు, ఎల్‌ఈడీ డిస్‌ప్లేలను ఉత్పత్తి చేసే మిక్ ఎలక్ట్రానిక్స్, అర్హత కలిగిన సంస్థాగత మదుపర్ల (క్యూఐపీ) నుంచి, ఇతర పద్ధతుల్లో రూ.250 కోట్లు సమీకరించనుంది. ఒకటి లేదా పలు విడతల్లో ఈ మొత్తాన్ని సమీకరించేందుకు బోర్డు అనుమతి ఇచ్చిందని మిక్ ఎలక్ట్రానిక్స్ వెల్లడించింది. ఈ ప్రతిపాదనకు కంపెనీ వాటాదార్లు, ఇతర చట్టబద్ధమైన/నియంత్రణపరమైన అనుమతులు లభించాల్సి ఉంటుంది. ఫారిన్ కరెన్సీ కన్వర్టబుల్ బాండ్ల ద్వారా 15 మిలియన్ డాలర్ల (రూ.132 కోట్లు) వరకు సమీకరించేందుకూ బోర్డు ఆమోదం తెలిపింది. డిసెంబరు 1న కంపెనీ అసాధారణ వాటాదార్ల సమావేశం (ఈజీఎం) నిర్వహించడానికి అనుమతి ఇచ్చింది.

దాతృత్వంలో నం.1 శివ్ నాడార్

● 2025లో రూ.2,708 కోట్ల దానం ● ఎడెల్‌గివ్ హురున్ జాబితా

● 191 మంది సంపన్నుల వితరణ మొత్తం రూ.10,380 కోట్లు



హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు శివ్ నాడార్ తన దానగుణాన్ని మరోసారి నిరూపించుకున్నారు. 2025లో దాతృత్వ కార్యక్రమాలకు అత్యధిక మొత్తం అందించిన వారి జాబితాలో శివ్ నాడార్ కుటుంబం అగ్రస్థానంలో నిలిచింది. 2024తో పోలిస్తే 26 శాతం అధికంగా ఆయన కుటుంబం 2025లో రూ.2,708 కోట్లు దానం చేసినట్లు ఎడెల్‌గివ్ హురున్ ఇండియా ఫిలాంత్రఫి జాబితా-2025 వెల్లడించింది. అంటే ఆయన రోజుకు రూ.7.4 కోట్లు సమాజానికి తిరిగి ఇచ్చారు. గత అయిదేళ్లలో మన దేశంలో అత్యంత దానశీలిగా శివ్ నాడార్ నిలవడం ఇది నాలుగోసారి. తర్వాతి స్థానాల్లో ముకేశ్ అంబానీ, బజాజ్ కుటుంబం, కుమార్ మంగళం బిర్లా కుటుంబం, గౌతమ్ అదానీ కుటుంబం ఉన్నాయి.

✦ ఈ జాబితాలో ఉన్న దేశీయ సంపన్నులు 191 మంది కలిసి 2025లో మొత్తంగా రూ.10,380 కోట్ల విరాళాలు ఇచ్చారు. ఇందులో 12 మంది కొత్తవారు. గత మూడేళ్లలో దాతృత్వ మొత్తం 85% అధికమైంది. విద్య, ఆరోగ్య సంరక్షణ, మౌలిక సదుపాయాల కల్పనకు వీరు ఎక్కువగా విరాళాలు అందించారు.

✦ అగ్రగామి 10 మంది ఈ ఏడాది మొత్తంగా రూ.5,834 కోట్లు విరాళం ఇచ్చారు. 2024తో పోలిస్తే ఇది 26% అధికం. మొత్తం విరాళాల్లో ఇది 56 శాతానికి సమానం.

✦ దానశీలుర జాబితాలో ముంబయి నుంచి 28%, దిల్లీ నుంచి 17%, బెంగళూరు నుంచి 8% మంది ఉన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద ఎక్కువ మంది వితరణ చేస్తున్నట్లు ఎడెల్‌గివ్ హురున్ పేర్కొంది. సీఎస్ఆర్ కేటాయింపులు అత్యధికంగా మహారాష్ట్ర, గుజరాత్‌కు వెళ్తున్నాయి.

ఎడెల్‌గివ్ హురున్ జాబితా-2025లో తొలి 10 మంది

స్థానం	కుటుంబం	విరాళం (రూ.కోట్లు)	ఏ రంగానికి
1	శివ్ నాడార్, కుటుంబం	2708	విద్య
2	ముకేశ్ అంబానీ కుటుంబం	626	విద్య
3	బజాజ్ కుటుంబం	446	విద్య
4	కుమార్ మంగళం బిర్లా,కుటుంబం	440	ఆరోగ్య సంరక్షణ
5	గౌతమ్ అదానీ కుటుంబం	386	విద్య
6	నందన్ నీలేకనీ	365	సదుపాయాల కల్పన
7	హిందుజా కుటుంబం	298	ఆరోగ్య సంరక్షణ
8	రోహిణీ నీలేకనీ	204	సదుపాయాల కల్పన
9	సుధీర్, సమీర్ మెహతా	189	సామాజిక అభివృద్ధి
10	సైరస్, అదర్ పునావాలా	173	విద్య

ఐపీఓ విలువలపై సెబీ జోక్యం చేసుకోదు

సంస్థ ఛైర్మన్ తుహిన్ కాంత పాండే



ముంబయి: కొన్ని కంపెనీల తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) అధిక విలువలపై ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో.. ఈ అంశంలో మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ జోక్యం చేసుకోదని సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత పాండే స్పష్టం చేశారు. ఐపీఓ విలువలను సెబీ నిర్ణయించదని, పూర్తిగా పెట్టుబడిదారుల కోణమని వెల్లడించారు. లెన్స్‌కార్ట్ రూ.7200 కోట్ల ఐపీఓ ధరలపై ఆందోళనలు వచ్చిన కొన్ని రోజుల్లోనే పాండే ఈ వ్యాఖ్యలు చేశారు. అవకాశాలకు అనుగుణంగా ధరలను నిర్ణయించే స్వేచ్ఛ మార్కెట్‌కు ఉండాలన్నారు. గతంలో కూడా నైకా, పేటీఎం వంటి కొత్త తరం, డిజిటల్ కంపెనీల ఐపీఓల సమయంలో.. షేర్ల విలువలపై పలువురు వాటాదార్లు ఆందోళనలు లేవనెత్తారు. ఎక్సలెన్స్ ఎనేబులర్స్ నిర్వహించిన కార్యక్రమంలో పాండే మాట్లాడుతూ.. పర్యావరణం, సామాజిక, పరిపాలన (ఈఎస్‌జీ) లక్ష్యాలపై కంపెనీలు మరింత నిజాయతీగా ఉండాలని కోరారు.

5 నెలల కనిష్ఠానికి దేశీయ సేవల రంగ వృద్ధి



దిల్లీ: దేశీయ సేవల రంగ వృద్ధి, అక్టోబరులో 5 నెలల కనిష్ఠమైన 58.90 పాయింట్లుగా నమోదైంది. పోటీపరమైన ఒత్తిళ్లు, దేశంలోని పలు ప్రాంతాల్లో అధిక వర్షాల వల్ల సేవల రంగ వృద్ధి నెమ్మదించినట్లు ఓ నెలవారీ సర్వే తెలిపింది. హెచ్‌ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ సూచీ అక్టోబరులో 58.90 పాయింట్లకు తగ్గింది. ఈ ఏడాది మే తర్వాత ఇదే కనిష్ఠ స్థాయి. సెప్టెంబరులో ఇది 60.9 పాయింట్లుగా ఉంది. పీఎంఐ పరిభాషలో 50 పాయింట్లకు ఎగువన ఉంటే ఆ రంగంలో వృద్ధి ఉన్నట్లు, దిగువన ఉంటే క్షీణతగా భావిస్తారు. అక్టోబరులో 50 పాయింట్ల ఎగువనే ఉన్నందున.. సేవల రంగం వృద్ధి బాటలోనే వెళ్తున్నా, సెప్టెంబరు కంటే వృద్ధి నెమ్మదించింది. దీర్ఘకాలిక సగటు అయిన 54.3 పాయింట్ల కంటే పైన ఉండటం ఊరటనిచ్చే విషయమే. అంతర్జాతీయంగా గిరాకీకి సానుకూల పరిస్థితులు ఏర్పడుతుండటం, జీఎస్‌టీ విధానంలో తాజా సంస్కరణల వల్ల రాబోయే 12 నెలల్లో సేవల రంగ కార్యకలాపాలు పుంజుకోవచ్చని కంపెనీలు భావిస్తున్నట్లు నివేదిక తెలిపింది.

ఆర్‌బీఎల్ బ్యాంక్‌లో వాటా అమ్మేసిన ఎం అండ్ ఎం

ఆర్‌బీఎల్ బ్యాంక్‌లో తనకున్న 3.53% వాటాను రూ.678 కోట్లకు విక్రయించినట్లు మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్ఎం) తెలిపింది. 2023 జులై 26న ట్రెజరీ ఇన్వెస్ట్‌మెంట్ కింద రూ.417 కోట్లకు ఈ వాటాను మహీంద్రా కొనుగోలు చేసింది. తాజా విక్రయం ద్వారా 62.5% ప్రతిఫలాన్ని పొందినట్లు వివరించింది.

భారత్‌కు ప్రపంచ స్థాయి బ్యాంకులు అవసరం

● దీనిపై ఆర్‌బీఐ, బ్యాంకులతో చర్చిస్తున్నాం

● ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



ముంబయి: దేశానికి భారీ, ప్రపంచ స్థాయి బ్యాంకులు అవసరమని, ఈ విషయంపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ), బ్యాంకులతో చర్చలు జరుపుతున్నామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. గురువారం ముంబయిలో జరిగిన '12వ ఎస్‌బీఐ బ్యాంకింగ్ అండ్ ఎకనామిక్స్ కాంక్లేవ్ 2025'లో ఆమె మాట్లాడుతూ 'పరిశ్రమలకు రుణాలను మరింత విస్తృతం చేయాలి. జీఎస్‌టీ రేట్ల కోత రూపంలో వచ్చిన గిరాకీ, ఒక ప్రయోజనకర పెట్టుబడుల చక్రానికి ఊతమిస్తుందన్న ధీమా మాకుంది. ఉత్పత్తి పెంపునకు రుణ లభ్యత కీలకంగా మారింది. వ్యవస్థీకృత, పారదర్శక రుణ ప్రక్రియ అత్యంత అవసరం. ఇందుకోసం ప్రపంచ స్థాయి బ్యాంకుల అవసరం కచ్చితంగా ఉంది. దీనిపై ఆర్‌బీఐతోనూ, బ్యాంకులతోనూ చర్చలు జరుపుతూనే ఉన్నాం. దీనిపై ఒక నిర్ణయానికి వచ్చే ముందు చాలా పనులు చేయాల్సి ఉంది. పెద్ద బ్యాంకులను ఎలా ఏర్పాటు చేయాలనుకుంటుందో ఆర్‌బీఐ నుంచీ స్పందన కోరతామ'ని అన్నారు. 'ప్రస్తుతం ఉన్న బ్యాంకులతో పెద్ద బ్యాంకులను సృష్టించలేం. విలీనం కూడా ఒక మార్గమే. అయితే ఎక్కువ బ్యాంకులు కార్యకలాపాలు నిర్వహించాలి. వృద్ధి చెందేలానూ ఉండాలి. అటువంటి వాతావరణాన్ని భారత్‌లో ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆ పనులు కొంత జరుగుతున్నాయ'ని ఆమె వెల్లడించారు.

✦ 2030 కల్లా అగ్రగామి 10 అంతర్జాతీయ బ్యాంకుల్లో ఎస్‌బీఐ చేరుతుందని ఇదే కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి పేర్కొన్నారు.

ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ చేయకుండా రిటెయిల్ మదుపర్లను అడ్డుకోం

ముంబయి: ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ)లో ట్రేడింగ్ చేయకుండా రిటెయిల్ మదుపర్లను అడ్డుకోబోమని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. అయితే అటువంటి వాటిలో పెట్టుబడులు పెట్టడం వల్ల కలిగే నష్టభయాల గురించి వారికి అవగాహన కల్పిస్తామని తెలిపారు. నిఫ్టీ, సెన్సెక్స్‌లో వారం వారీ డెరివేటివ్స్ కాంట్రాక్టులను నిలిపివేసే ప్రణాళికేదీ లేదని సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత పాండే పేర్కొన్న కొద్ది రోజులకే, ఆర్థిక మంత్రి ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

యూనియన్ల నిరసన: ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)లను ప్రైవేటీకరించినా.. ఆర్థిక సంఘటితానికి, జాతీయ ప్రయోజనాలకు ఇబ్బందేమీ కలగదని మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలను బ్యాంకు యూనియన్లు విమర్శించాయి. మూలధన మద్దతు ఇచ్చి పీఎస్‌బీలను బలోపేతం చేయడం ద్వారా, ఆర్థిక సంఘటిత లక్ష్యానికి అవి చేదోడుగా నిలిచేలాచేయాలని డిమాండ్ చేశారు.

అనిల్ అంబానీకి ఈడీ తాజా సమన్లు

14న విచారణకు రావాలని ఆదేశం

దిల్లీ: రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఈనెల 14న ప్రశ్నించబోతున్నారు. బ్యాంకును మోసం చేసిన మనీ లాండరింగ్ కేసులో అనిల్‌కు ఈ విషయమై ఈడీ సమన్లు జారీ చేసింది. ఆగస్టులో కూడా ఇదే కేసులో అనిల్‌ను సుమారు 10 గంటల పాటు ఈడీ ప్రశ్నించింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నుంచి రూ.2,929 కోట్ల రుణం తీసుకున్న రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఆర్‌కామ్), మనీ లాండరింగ్‌కు పాల్పడిందనేది ఆరోపణ. ఆగస్టు 21న కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్ ఆధారంగా ఈడీ విచారణ కొనసాగుతోంది. ఈ కేసులో సీబీఐ ఇప్పటికే ముంబయిలోని అంబానీ ఇంటితో పాటు పలు చోట్ల సోదాలు నిర్వహించింది.

ప్రయాణ టికెట్ల బుకింగ్‌కు ఏఐ ఆధారిత 'పేటీఎం చెక్‌ఇన్' యాప్

దిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత టిక్కెట్ బుకింగ్ యాప్ 'పేటీయం చెక్‌ఇన్'ను పేటీఎం విడుదల చేసింది. ఇందులో ప్రయాణికులు విమానం, రైలు, బస్సు, మెట్రో టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చని తెలిపింది. పర్యటన ప్రణాళికలకు, ప్రయాణ గమ్యస్థానాల ఎంపికలకు, బుకింగ్ నిర్వహణకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. లాయల్టీ పాయింట్లను బంగారంగా మార్చుకునే వీలు కల్పిస్తున్నట్లు సంస్థ వివరించింది. పేటీఎంపై ప్రతి రూ.100 చెల్లింపునకు ఒక పాయింట్ వస్తుంది. వీటి విలువ రూ.15 అయ్యాక, తదుపరి డిజిటల్ గోల్డ్ మార్చుకోవచ్చు.

ఎంఎస్‌సీఐ ఇండియా సూచీలో మార్పులు

వన్97 కమ్యూనికేషన్స్, సీమెన్స్ ఎనర్జీ, ఫోర్టిస్ హెల్త్‌కేర్, జీఈ వెర్నోవా టీఅండ్‌డీ ఇండియా షేర్లను ఈనెల 24 నుంచి ఎంఎస్‌సీఐ ఇండియా సూచీలో చేర్చనున్నట్లు ఎంఎస్‌సీఐ తెలిపింది. కంటెయినర్ కార్పొరేషన్, టాటా ఎలెక్సీ షేర్లను ఈ సూచీ నుంచి తొలగించనుంది.

జులై - సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2025-26	2024-25	2025-26	2024-25
ఎన్‌హెచ్‌పీసీ	1219.28	1060.34	3629.98	3402.09
లుపిన్	1485.00	859.00	6831.00	5497.00
ఫ్రా ఫిన్ క్యాపిటల్	13.37	2.46	13.39	10.59
జీనస్ పవర్ ఇన్‌ఫ్రా	142.97	83.08	1159.84	547.45
యూపీఎల్	612.00	585.00	12019.00	11090.00
జేకే లక్ష్మి సిమెంట్	80.63	(30.80)	1531.77	1234.29
సాత్విక్ గ్రీన్ ఎనర్జీ	83.20	61.00	768.00	475.30
జాగరణ్ ప్రకాశన్	56.90	41.64	467.36	446.50
అజ్మీరా రియాల్టీ	30.37	35.35	221.01	204.08
ఏబీబీ ఇండియా	409.00	440.00	3311.00	2912.00
మ్యాన్‌కైండ్ ఫార్మా	520.00	661.00	3697.00	-----
హెచ్‌సీసీ	47.78	63.93	983.25	1423.41
క్రాంప్టన్ గ్రీవ్స్	75.42	128.07	1915.57	1896.15
జీఎస్‌కే ఫార్మా	255.00	249.00	974.00	1000.00
గోద్రేజ్ అగ్రోవెట్	84.34	95.79	2563.73	2442.68
పీ అండ్ జీ హైజీన్	209.86	211.90	1150.17	1132.73
మిండా కార్ప్	85.00	74.00	1535.00	1290.00
గోద్రేజ్ ప్రాపర్టీస్	402.99	333.79	1950.05	1346.54
జైడస్ లైఫ్‌సైన్సెస్	1259.00	911.00	6123.00	5237.00
సీఎస్‌బీ బ్యాంక్	160.00	138.00	1458.00	1064.00
ఆర్సెలర్ మిత్తల్ ★	377.00	287.00	15657.00	15196.00
జేఎం ఫైనాన్షియల్	270	232	1,044	1,211
ఆక్జో నోబెల్	1,82.8	97.9	834.9	982.3

★ మిలియన్ డాలర్లలో..

విదేశీ మదుపర్ల అమ్మకాలతో నష్టాలు


రూ.3.97 లక్షల కోట్ల సంపద ఆవిరి

ఎఫ్ఐఐ విక్రయాలు.. రూ.3263.21 కోట్లు

డీఐఐ కొనుగోళ్లు.. రూ.5283.91 కోట్లు

సెన్సెక్స్ ▼ 148 **83311**

నిఫ్టీ ▼ 88 **25510**



విదేశీ సంస్థాగత మదుపర్ల (ఎఫ్ఐఐ) అమ్మకాలు కొనసాగడంతో, సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఐసీఐసీఐ బ్యాంక్ షేరుకు అమ్మకాల ఒత్తిడి (1.21% నష్టం) ఎదురవ్వడమూ కారణమైంది. ఆసియా మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందినా, ఆ ప్రభావం కనిపించలేదు. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 7 పైసలు పెరిగి రూ.88.63 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 0.57% పెరిగి 63.88 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.465.83 లక్షల కోట్ల (5.26 లక్షల కోట్ల డాలర్ల)కు తగ్గింది.

తీవ్ర ఒడుదొడుకులు..: బీఎస్ఈ సెన్సెక్స్ (క్రితం ముగింపు 83,459.15) స్వల్ప లాభాలతో 83,516.69 పాయింట్ల వద్ద ఆరంభమైంది. ఆ తర్వాత తీవ్ర ఒడుదొడుకుల మధ్య కదలాడింది. ఒక దశలో 83,237.65 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని చేరింది. చివరకు 148.14 పాయింట్ల నష్టంతో 83,311.01 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 87.95 పాయింట్లు కోల్పోయి 25,509.70 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 25,491.55 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని; 25,679.15 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని నమోదుచేసింది.

అత్యధికం నష్టాల్లోనే..: సెన్సెక్స్ 30 షేర్లలో 11 మినహా మిగతావి నష్టాల్లో ముగిశాయి. పవర్‌గ్రిడ్ 3.15%, ఎటర్నల్ 2.44%, భెల్ 1.58%, బజాజ్ ఫైనాన్స్ 1.45%, ఎన్‌టీపీసీ 1.21%, టాటా స్టీల్ 1.12%, ఎల్‌అండ్‌టీ 1.03%, టైటన్ 0.94% చొప్పున తగ్గాయి. ఏషియన్ పెయింట్స్ 4.76%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.62%, మహీంద్రా అండ్ మహీంద్రా 1.02%, అల్ట్రాటెక్ సిమెంట్ 0.77%, టీసీఎస్ 0.71% లాభపడ్డాయి.

✦ స్టాక్ ఎక్స్ఛేంజీలో నమోదైన రోజే **ఓర్క్లా ఇండియా** షేరు డీలాపడింది. ఇష్యూ ధర రూ.730తో పోలిస్తే బీఎస్ఈలో ట్రేడింగ్ 2.94% అధికంగా రూ.751.50 వద్ద ప్రారంభమైంది. రోజు మొత్తం మీద రూ.755-రూ.693.35 మధ్య షేరు కదలాడినా, చివరకు 2.27% నష్టంతో 713.40 వద్ద ముగిసింది. .

✦ బైక్ అగ్రిగేటర్ ర్యాపిడోలో తనకున్న వాటాలను టీవీఎస్ మోటార్ రూ.287.93 కోట్లకు విక్రయిస్తున్నట్లు గురువారం వెల్లడించింది. యాక్సెల్ ఇండియా 8 (మారిషస్)కు రూ.143.96 కోట్లకు, ఎంఐహెచ్ ఇన్వెస్ట్‌మెంట్స్ వన్ బీవీకి రూ.143.97 కోట్లకు వాటాలను విక్రయిస్తున్నట్లు పేర్కొంది.

✦ భారతీ ఎయిర్‌టెల్‌లో 0.8% వాటాను రూ.10,300 కోట్లకు బ్లాక్‌డీల్ ద్వారా సింగపూర్ టెలికమ్యూనికేషన్స్ (సింగ్‌టెల్) విక్రయించింది. ఒక్కో షేరును రూ.2,030 చొప్పున అమ్మింది.

✦ ఇన్ఫోసిస్ తన రూ.18,000 కోట్ల షేర్ల బైబ్యాక్ కోసం ఈ నెల 14ను రికార్డు తేదీగా నిర్ణయించింది.

ఐపీఓ సమాచారమ్

✦ స్టాక్ బ్రోకింగ్ సంస్థ గ్రో మాతృసంస్థ అయిన **బిలియన్‌బ్రెయిన్స్ గ్యారేజ్ వెంచర్స్** ఐపీఓ రెండో రోజుకు 1.64 రెట్ల స్పందన లభించింది.

✦ **ఫిజిక్స్‌వాలా** తొలి పబ్లిక్ ఆఫర్‌కు ఇష్యూ ధరగా రూ.103-109ను నిర్ణయించారు. రూ.3,480 కోట్ల ఐపీఓ ఈనెల 11న ప్రారంభమై 13న ముగియనుంది.

✦ ఈనెల 11-13 తేదీల్లో జరిగే **ఎమ్వీ ఫొటోవోల్టాయిక్ పవర్** ఐపీఓకు ధరల శ్రేణి రూ.206- 217.

✦ అమెరికాకు చెందిన టెన్నెకో గ్రూపులో భాగమైన **టెన్నెకో క్లీన్ ఎయిర్ ఇండియా లిమిటెడ్** రూ.3,600 కోట్ల సమీకరణ లక్ష్యంతో పబ్లిక్ ఇష్యూకు రానుంది. పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా ఈ ఇష్యూ జరుగుతుంది.

సిరి

siri@eenadu.net

డబ్బు కావాలా? బంగారం ఉందిగా!

మనదేశంలో ప్రతి ఇంట్లో బంగారు ఆభరణాలు ఉంటాయి. ఎవరి తాహతుకు తగ్గట్లు వారు, మిగులు నిధులు ఉన్నపుడల్లా పసిడి కొనడం సంప్రదాయంగా వస్తోంది. పండగలు, శుభకార్యాల సమయంలో ఈ ధోరణి మరింత ఎక్కువగా ఉంటోంది ఇందువల్లే మనదేశంలో ప్రజల వద్ద ఉన్న మొత్తం బంగారం గత జూన్ ఆఖరుకు 34,600 టన్నులకు చేరి ఉంటుందని అమెరికాకు చెందిన ఆర్థిక సేవల కంపెనీ మోర్గాన్‌స్టాన్లీ అంచనా వేసింది. దీని విలువ 3.8 లక్షల కోట్ల డాలర్లు (రూ.335 లక్షల కోట్లకు పైగా) అని వివరించింది. ఇందులో అత్యధిక భాగం నిరుపయోగంగా ఉంటోంది. బంగారం విలువ అనూహ్యంగా పెరుగుతున్న నేపథ్యంలో, ఇంట్లో ఉన్న బంగారాన్ని అమ్మకుండానే.. నగదు అవసరాలు తీర్చుకునేందుకు, వ్యాపారం, ఉత్పాదకతకు వినియోగించాలనే నిపుణులు చెబుతున్నారు. భార్య, కుమార్తె, కోడళ్ల కోసం బంగారు ఆభరణాలను కొంటే, ఎట్టిపరిస్థితుల్లోనూ వాటిని అమ్మే ధోరణి మన దేశీయుల్లో లేదు. క్రమంగా మధ్యతరగతి వర్గీయుల్లోనూ మార్పు వస్తోంది.



రోజువారీ ధరించే ఆభరణాలకు మించి ఉన్నవారు, బ్యాంకు లాకర్లలో వాటిని భద్రపరచుకుంటారు. ఇందుకు ఏటా రూ.వేలల్లోనే అద్దె చెల్లించాల్సి వస్తోంది. మళ్లీ ఏదైనా అవసరానికి పెద్దమొత్తం నిధులు కావాలంటే, వ్యక్తిగత రుణాలు తీసుకోవడం, క్రెడిట్‌కార్డుల ద్వారా చెల్లింపులు చేస్తున్నారు. పసిడి ధర అమాంతం పెరిగి, 10 గ్రాములు రూ.లక్ష మించాక.. వృథాగా లాకర్లలో ఉన్న ఆభరణాలు తనఖా పెట్టుకుని రుణాలు తీసుకునే ధోరణి పెరిగింది. పూచీకత్తు లేకుండా రుణాలిచ్చేందుకు బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీ) వెనకడుగు వేస్తున్న నేపథ్యంలో, ఇంట్లోని పసిడి ఆభరణాలు తీసుకెళ్లి రుణాలు తెచ్చుకునే వారి సంఖ్య అధికమవుతోంది. మేలిమి బంగారం గ్రాము ధర రూ.12,000 మించడంతో తనఖాపై రూ.8,934 వరకు బ్యాంకులే మంజూరు చేస్తున్నాయి. ఇచ్చేవారున్నారు కదా అని నగదు తెచ్చుకుని, వాడుకుంటున్న వారు తిరిగి చెల్లించడంలో అశ్రద్ధ వహించారో.. వేలానికి కూడా సంస్థలు సిద్ధమవుతున్నాయి. వ్యవసాయ అవసరాలకు తీసుకున్న పసిడి రుణాన్ని తీర్చిన వెంటనే రెన్యూవల్ చేయొద్దని రిజర్వ్ బ్యాంక్ ఆదేశాలిచ్చింది.

పూచీకత్తు ఉన్నందున రుణం మంజూరు సులభం

మొండి బకాయిలు, నిరర్థక ఆస్తులు తగ్గించుకోవడంపై దృష్టి సారించిన బ్యాంకులు కొత్త రుణాల మంజూరులో ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. వ్యాధుల విజృంభణతో దాదాపు ప్రతి కుటుంబానికీ ఆసుపత్రి ఖర్చులు తప్పడం లేదు. తీవ్ర జ్వరం వచ్చినవారు ఆసుపత్రిలో చేరితే రూ.లక్ష వరకు బిల్లులు అవుతున్నాయి. బీమా సదుపాయం లేని చిరుద్యోగులు, సామాన్యులు అప్పులు చేయక తప్పడం లేదు. చిన్న, మధ్యస్థాయి వ్యాపారులూ అత్యవసర నిధుల కోసం, ఇంట్లోని మహిళల గొలుసులు, గాజుల వంటివి తనఖా పెట్టుకుని రుణం తీసుకుంటున్నారు. ఆభరణాల నాణ్యతను పరీక్షించి, గంటల వ్యవధిలోనే రుణ మొత్తాన్ని సంస్థలు అందిస్తున్నాయి. గతంలో అనధికారిక వడ్డీ వ్యాపారుల దగ్గర ఆభరణాలు తనఖా పెట్టి, రుణం పొందేవారు. వడ్డీ బాగా ఎక్కువగా ఉండేది. ఇప్పుడు బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల దగ్గర వడ్డీకి, చెల్లింపులకు కచ్చిత గణాంకాలతో పారదర్శకత ఏర్పడింది.

తనఖాకు బిస్కెట్లు పనికిరావు

మేలిమి (24 క్యారెట్ల) బంగారాన్ని బిస్కెట్ల రూపంలో తనఖా ఉంచుకోరు. ఆభరణాల రూపంలో/బ్యాంకులు విక్రయించే నాణేల రూపంలో మాత్రమే పెట్టుకుంటారు. మేలిమి బంగారం ఉన్నా, చేతి కడియం మాదిరి చేయిస్తే తాకట్టు పెట్టొచ్చు. రాళ్లు, ఇతర లోహాలు జతచేసిన ఆభరణాలను అంగీకరించరు. ఒకవేళ తీసుకున్నా, బంగారం విలువను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు.

ప్రస్తుతం మేలిమి (999 స్వచ్ఛత) బంగారం ధర 10 గ్రాములు రూ.1,24,000 లకు చేరడంతో, ఆభరణాలకు వినియోగించే 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు సుమారు రూ.1,13,600 అవుతుంది. అందుకే బ్యాంకులూ 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారు ఆభరణాల తనఖాపై రూ.89,340 ఇస్తున్నాయి. 22 క్యారెట్లకు అయితే రూ.81,900 వరకు రుణాలు మంజూరు చేస్తున్నాయి. పూచీకత్తు లేని/క్రెడిట్‌కార్డుల కంటే బంగారం తనఖాపై ఇచ్చే రుణాల వడ్డీరేట్లు తక్కువగానే ఉంటాయి. ఇవి 10-18% వరకు ఉంటాయి.

సాధారణంగా విలువలో 75 శాతమే

పసిడి ధరల్లో హెచ్చుతగ్గులు సాధారణం. కాబట్టి, 30 రోజుల సగటు ధరలను పరిగణనలోకి తీసుకుని, ఆ విలువలో గరిష్ఠంగా 85-75% మొత్తాన్ని రుణంగా మంజూరు చేస్తుంటారు. రూ.5 లక్షల లోపు రుణం కావాలనుకుంటే, బంగారం విలువలో 85% వరకు, అంతకుమించిన రుణం అయితే బంగారం విలువలో 75% వరకు ఇవ్వొచ్చన్నది ఆర్‌బీఐ నిబంధన. రుణ నిబంధనలకు అనుగుణంగా నెలవారీ వాయిదాల్లో వడ్డీ, 3/6 నెలలకు ఒకేసారి వడ్డీ-అసలు కలిపి చెల్లించినప్పుడు మన ఆభరణాలు తిరిగి ఇచ్చేస్తారు. సాధారణంగా మన ఆభరణాలు 22 క్యారెట్ల బంగారంతో తయారై ఉంటాయి. అందువల్ల వీటిపై అయితే 10 గ్రాములకు రూ.85,000 వరకు రావాలి.

రుణాన్ని తీర్చేందుకు

- నెలవారీ వాయిదాల్లో రుణంపై వడ్డీ, కాలావధి తీరాక అసలు చెల్లించేలా ఏర్పాటు ఉంది.
- వడ్డీని నెలవారీ కాకుండా, తమకు నిధులందే సమయానికి అనుకూలంగా 3-6 నెలలకు ఒకసారి (బుల్లెట్ పేమెంట్).. చివరిలో అసలు చెల్లించేలా.
- మనం తాకట్టుపెట్టిన బంగారంపై అధిక రుణం మంజూరైనా, అవసరమైన మేర మాత్రమే వాడుకుంటే.. దానికి మాత్రమే వడ్డీ చెల్లించే ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయాన్ని కూడా బ్యాంకులు కల్పిస్తున్నాయి.

ఎక్కువ రుణానికి తక్కువ వడ్డీ

బ్యాంకుల్లో పసిడి తనఖా రుణాలు పొందేందుకు వ్యక్తిగత - చిరునామా ధ్రువీకరణ, ఫోటోలు అవసరం అవుతాయి. ప్రాసెసింగ్ ఛార్జీ, బంగారం స్వచ్ఛత నిర్ధారణ ఛార్జీలను కూడా రుణ గ్రహీత చెల్లించాల్సి ఉంటుంది. బ్యాంకుతో చేసుకున్న రుణ ఒప్పందంపై ప్రభుత్వానికి ఫీజుగా స్టాంప్ డ్యూటీ చెల్లించాల్సి ఉంటుంది. ఇవన్నీ కలిపి రుణ మొత్తంలో 1-2% వరకు అవుతుంది. అంటే రూ.లక్షకు రూ.1,000-2000 అన్నమాట. పూచీకత్తుగా ఆభరణాలు ఉంటాయి కనుక, తనఖా పెట్టేవారి రుణచరిత్రను బ్యాంకులు కూడా పెద్దగా పట్టించుకోవడం లేదు. చెల్లింపు ఎలా చేయగలరనే అంశాన్ని మాత్రం అడుగుతున్నారు. చిన్న మొత్తమైతే దీన్నీ పట్టించుకోవడం లేదు.

ఎస్‌బీఐలో చూస్తే

దేశంలోని అతిపెద్ద ప్రభుత్వరంగ బ్యాంక్ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో గరిష్ఠంగా రూ.50 లక్షల వరకు పసిడి రుణం ఇస్తారు. 3 నెలల బుల్లెట్ పేమెంట్‌కు 8.75%, 3 నెలల బుల్లెట్ పేమెంట్‌కు 8.95%, 12 బుల్లెట్ పేమెంట్‌కు 9.05% వడ్డీ వసూలు చేస్తోంది. నెలవారీ వడ్డీ అయితే 10% అవుతుంది. రుణమొత్తాన్ని బట్టి వడ్డీ రేటు మారుతుంది కూడా.

ప్రైవేటు రంగంలోని ఐసీఐసీఐ బ్యాంక్ రూ.2 కోట్ల వరకు పసిడి రుణాలిస్తోంది. ఈ బ్యాంక్ తన వెబ్‌సైట్‌లోనే ఎంత బరువైన బంగారం, స్వచ్ఛత, కాలావధికి అనుగుణంగా ఎంతమొత్తం రుణం పొందొచ్చో చూపించే కాలిక్యులేటర్‌ను కూడా అందుబాటులో ఉంచింది. కనిష్ఠంగా 6 నెలలు, గరిష్ఠంగా 12 నెలల కాలానికి ఈ రుణాలిస్తోంది. 24 క్యారెట్ల బంగారంపై గరిష్ఠంగా రూ.8934, 22 క్యారెట్లపై గ్రాముకు గరిష్ఠంగా రూ.8190 రుణం పొందొచ్చు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 42 నెలల కాలానికి పసిడి రుణాలు ఆఫర్ చేస్తోంది. వ్యవసాయ పాస్‌బుక్ పైన అయితే ఏడాది కాలానికీ ఇస్తుంది. బంగారం విలువలో 75% ఇస్తున్నామని, గరిష్ఠంగా గ్రాముకు రూ.8300 వరకు ఇస్తున్నట్లు ఒక అధికారి తెలిపారు. రూ.2 లక్షల లోపు రుణానికి 17.5% వడ్డీ అయితే, రూ.20 లక్షల రుణానికి 10% వడ్డీని మాత్రమే ఈ బ్యాంక్ వసూలు చేస్తోంది. 6 నెలల్లోపు రుణం తీర్చేయాలనుకుంటే ప్రీక్లోజింగ్ ఛార్జీల కింద 1.18% దాకా చెల్లించక తప్పదు.

– కాకుమాను అమర్ కుమార్

ఇంటి రుణం తీర్చేద్దాం



గృహరుణం.. ఒక దీర్ఘకాలిక బాధ్యత. కానీ, దీన్ని జీవితాంతం భారంగా భావించాల్సిన అవసరం లేదు. కుదిరినప్పుడు కొంత మొత్తం చెల్లించినా, మొత్తం వడ్డీలో గణనీయమైన భారం తగ్గుతుంది.

ఇంటి రుణం తీసుకొని ఎన్నాళ్లవుతోంది? ఇప్పటి వరకూ ఎంత మొత్తం తిరిగి చెల్లించారో చూసుకున్నారా? వాయిదాలు చూస్తే, రూ.లక్షల్లో ఉన్నా, రుణం మొత్తం రూ.వేలల్లోనే తగ్గినట్లు కనిపిస్తుంది. అందుకే, ముందస్తు చెల్లింపు వ్యూహంతో ముందుకు వెళ్తేనే ఆర్థికంగా కలిసొస్తుంది.

నిర్ణీత నెలవారీ వాయిదా కంటే ఎక్కువ మొత్తాన్ని చెల్లించడమే ఈ ముందస్తు చెల్లింపు. ఇది ఒకేసారి పెద్ద మొత్తం లేదా అప్పుడప్పుడు చిన్న అదనపు చెల్లింపులు కావొచ్చు.

ఉదాహరణకు.. రూ.30 లక్షల రుణానికి ఒకేసారి రూ.5లక్షలు, లేదా ఏడాదికోసారి ఒక ఈఎంఐని అదనంగా చెల్లించడంలాంటివి.

ముందస్తు చెల్లింపు అనేది పూర్తిగా మీ ఇష్టమే. కానీ, మీ ఆర్థిక ప్రయాణంలో ఇది పెద్ద మార్పును తెస్తుందనేది మాత్రం నిజం. ముఖ్యంగా రుణం తీసుకున్న కొత్తలోనే సాధ్యమైనంత తీరిస్తే, వడ్డీలో గణనీయంగా తేడా వస్తుంది.

ఇక్కడ ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. మీరు ముందస్తు చెల్లింపు చేసిన ప్రతీసారీ అసలు రుణ మొత్తం తగ్గుతుంది. వడ్డీ మిగిలిన బాకీపైనే లెక్కిస్తారు. కాబట్టి, మీరు త్వరగా అసలును చెల్లిస్తే, వడ్డీ ఆదా అవుతుంది.

అసలును చెల్లించినప్పుడు రెండు రకాల ఎంపికలు ఉంటాయి.

- ఈఎంఐ అలాగే ఉంటుంది. దీనివల్ల రుణం త్వరగా ముగుస్తుంది.
- ఈఎంఐ మొత్తాన్ని తగ్గించుకోవచ్చు. దీనివల్ల ఈఎంఐ భారం తగ్గుతుంది. కానీ, వ్యవధి అలాగే ఉంటుంది. నెలవారీ ఖర్చులు తగ్గించుకోవాలని అనుకున్నప్పుడు ఈ వ్యూహాన్ని పాటించొచ్చు. వీలైనంత వరకూ ఈఎంఐని అలాగే కొనసాగిస్తూ, వ్యవధిని తగ్గించుకోవడమే మంచిది.

ఒక ఉదాహరణ చూద్దాం..

రూ.30లక్షల ఇంటి రుణాన్ని 20 ఏళ్ల వ్యవధికి తీసుకున్నారనుకుందాం. వడ్డీ 8 శాతం అనుకుంటే మీ ఈఎంఐ సుమారు రూ.26,000 వరకూ ఉంటుంది. ఇప్పుడు మీకు ఏటా రూ.1,50,000 బోనస్ వస్తుందని అనుకుందాం. దీన్ని రుణం తీర్చేందుకు వాడుకుంటున్నారని భావిద్దాం.

- రుణం తీసుకున్న రెండో సంవత్సరంలో ఈ మొత్తం చెల్లిస్తే వడ్డీ రూ.3లక్షల వరకూ ఆదా అవుతుంది. రుణాన్ని 2-3 ఏళ్ల ముందుగానే ముగించేయొచ్చు. ఇలా ఏటా చేస్తూ వెళ్తే.. రుణం వేగంగా తీరేందుకు అవకాశం ఉంటుంది.

ఛార్జీలుండవు

ఆర్‌బీఐ నిబంధనల మేరకు చలన వడ్డీ రేటుకు తీసుకున్న రుణాలకు ఎలాంటి ముందస్తు చెల్లింపుల రుసుములూ ఉండవు. అంటే, మీరు ఎప్పుడైనా, ఎంత మొత్తమైనా అదనపు ఫీజు లేకుండా ముందుగానే చెల్లించేందుకు వీలుంది. స్థిర వడ్డీ రేటుకు ఇంటి రుణాన్ని తీసుకుంటే, రుణ సంస్థలు కొద్దిగా రుసుము వసూలు చేసే అవకాశం ఉంది. మీ బ్యాంకు లేదా ఆర్థిక సంస్థను సంప్రదించి, పూర్తి వివరాలు తెలుసుకోండి.

ఎప్పుడు చేయాలి?

రుణాన్ని ముందుగా తీర్చడం మంచిదే. ఏయే సందర్భాల్లో ఇలా ముందస్తు చెల్లింపు చేయొచ్చంటే..

- బోనస్ లేదా అనుకోకుండా కొంత మొత్తం ఆదాయం వచ్చినప్పుడు.
- ఏదైనా స్థిరాస్తి అమ్మినప్పుడు లేదా పెట్టుబడి పథకం నుంచి సొమ్ము వెనక్కి తీసుకున్నప్పుడు.
- మీ ఆదాయం పెరిగి, త్వరగా రుణ విముక్తులు కావాలని అనుకున్న సందర్భాల్లో ముందుగానే రుణాన్ని తీర్చే ప్రయత్నం చేయొచ్చు.

మదుపు చేయొచ్చుగా?

చాలామంది రుణగ్రహీతలు ముందుగా రుణం తీర్చే బదులుగా, పెట్టుబడి పెడితే మంచి లాభాలు వస్తాయి కదా అనే ఆలోచనతో ఉంటారు. రుణానికి 8 శాతం పైగా వడ్డీ చెల్లిస్తున్నప్పుడు, అంతకు మించి రాబడి వచ్చే పథకాల్లో పెట్టుబడి పెట్టినప్పుడు మాత్రమే ఇది సాధ్యం అవుతుంది. ఇది అన్ని సందర్భాల్లోనూ సాధ్యం కాకపోవచ్చు. ఇంటి రుణం తీసుకొని మూడేళ్లకు మించకపోతే, పెట్టుబడికి బదులు, రుణం తీర్చడమే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

వినియోగంపై విశ్వాసం ఉంటే

వినియోగ వస్తువులు అందించే కంపెనీలపై పెట్టుబడి పెట్టి లాభాలు ఆర్జించే లక్ష్యంతో ఎల్‌ఐసీ మ్యూచువల్ ఫండ్ కొత్తగా **ఎల్‌ఐసీ ఎంఎఫ్ కన్సంప్షన్ ఫండ్** అనే పథకాన్ని తీసుకొచ్చింది. ఈక్విటీ థీమాటిక్ తరగతికి చెందిన ఈ పథకం ఎన్ఎఫ్ఓ చివరి తేదీ ఈ నెల 14. కనీస పెట్టుబడి రూ.5,000. నిఫ్టీ ఇండియా కన్సంప్షన్ టీఆర్ఐ సూచీ దీని పనితీరుకు కొలమానంగా ఉంటుంది. యువ జనాభా అధికంగా ఉండటం, మధ్యతరగతి కుటుంబాల సంఖ్య పెరగడం, తలసరి ఆదాయంలో వృద్ధి.. వంటి వివిధ సానుకూలతల వల్ల దేశంలో వినియోగం వేగంగా పెరుగుతోంది. వినియోగ వస్తువులు అందించే కంపెనీలు దీర్ఘకాలంలో అధిక అమ్మకాలు, లాభాలు నమోదు చేసే అవకాశం కనిపిస్తోంది. ఈ తరహా కంపెనీలపై పెట్టుబడి తక్కువ రిస్కుతో స్థిరమైన వృద్ధి సాధ్యమవుతుందని అంచనా ఉంది. ఈ 'థీమ్' మీద విశ్వాసం ఉన్న మదుపరులు ఈ పథకాన్ని పరిశీలించవచ్చు.

పాలసీని స్వాధీనం చేస్తున్నారా?



జీవిత బీమా పాలసీ తీసుకున్న తర్వాత, ఏదో ఒక సందర్భంలో దానికి చెల్లిస్తున్న ప్రీమియం భారంగా అనిపించవచ్చు. ఇలాంటప్పుడు పాలసీని రద్దు చేసుకునేందుకు చాలామంది ప్రయత్నిస్తుంటారు. ఇది మంచి ఆలోచనేనా?

బీమా అంటే కేవలం ప్రీమియం ఒక్కటే కాదు. కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించే ఒక ఆధారం. ఇలాంటి పాలసీని రద్దు చేస్తే, రక్షణ చక్రం దూరమయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి.. ముందుగా కొన్ని విషయాలు పరిశీలించాలి..

- ఎండోమెంట్, టర్మ్ పాలసీలను రద్దు చేసే ముందు మీకు తగినంత మొత్తానికి టర్మ్ పాలసీ ఉందా చూసుకోండి. అది అమల్లో ఉండాలి. లేకపోతే, మీ కుటుంబానికి ఆర్థిక రక్షణ దూరం అవుతుంది.
- యూనిట్ ఆధారిత పాలసీల్లో కనీసం 5 ఏళ్లు కొనసాగితేనే స్వాధీన విలువ వస్తుంది.
- పాలసీని స్వాధీనం చేస్తే రుసుములు ఉంటాయి. ఇవి ఎంత మేరకు ఉన్నాయి? కొత్త పెట్టుబడులు ఈ రుసుములన్నింటినీ మించి రాబడిని స్తాయా? తెలుసుకోండి.
- మీకు డబ్బు అవసరం ఉంటే, స్వాధీనం చేసే బదులు పాలసీని హామీగా చూపించి, రుణం తీసుకునే వీలుంటుంది. యూనిట్ ఆధారిత పాలసీల నుంచి పాక్షికంగా వెనక్కి తీసుకునే అవకాశమూ ఉంది. వీటిని పరిశీలించండి.

పాలసీని స్వాధీనం చేసే విషయంలో తొందరపాటు పనికిరాదు. ఒకటికి రెండుసార్లు ఆలోచించి, నిర్ణయం తీసుకోవడం మంచిది. మంచి పాలసీని స్వాధీనం చేస్తే దీర్ఘకాలంలో నష్టం రావచ్చు.

'ఆర్బిట్రేజ్' లాభాలు ఆర్జించేలా

ఓల్డ్ బ్రిడ్జి ఆర్బిట్రేజ్ ఫండ్ అనే కొత్త పథకాన్ని ఓల్డ్ బ్రిడ్జి మ్యూచువల్ ఫండ్ తీసుకొచ్చింది. ప్రధానంగా 'ఆర్బిట్రేజ్' అవకాశాలను అందిపుచ్చుకోవటం ఈ పథకం ప్రధాన వ్యూహం. ఎన్ఎఫ్ఓ ఈ నెల 10 వరకూ అందుబాటులో ఉంటుంది. కనీస పెట్టుబడి రూ.5,000. స్టాక్ మార్కెట్లో నగదు విభాగం, డెరివేటివ్స్ విభాగాల్లో షేర్ల ధరల్లో ఉన్న వ్యత్యాసాలను గుర్తించి క్రయవిక్రయాల ద్వారా సొమ్ము చేసుకోవటాన్ని ఆర్బిట్రేజ్ అవకాశంగా పరిగణిస్తారు. నిఫ్టీ 50 ఆర్బిట్రేజ్ టీఆర్ఐ ఈ పథకం పని తీరుకు కొలమానంగా ఉంటుంది. కెన్నెత్ జోసెఫ్ ఆండ్రాడే ఈ పథకానికి ఫండ్ మేనేజర్‌గా వ్యవహరిస్తారు.

కొత్త పథకం

గ్రామీణ ప్రాంతాల్లోని అవకాశాల కోసం...

కోటక్ మ్యూచువల్ ఫండ్ **కోటక్ రూరల్ ఆపర్చునిటీస్ ఫండ్** అనే పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం ఎన్ఎఫ్ఓ ఈ నెల 20 వరకూ అందుబాటులో ఉంటుంది. ఎన్ఎఫ్ఓలో కనీసం రూ. 1,000 పెట్టుబడి పెట్టాలి. నిఫ్టీ రూరల్ ఇండెక్స్ టీఆర్ఐ సూచీ ఈ పథకం పనితీరుకు కొలమానంగా ఉంటుంది. గ్రామీణ భారతదేశం అంటే కేవలం వ్యవసాయం మాత్రమే కాదు, ఎంతో మంది వ్యవసాయేతర కార్యకలాపాల్లో నిమగ్నమై సంపద సృష్టిస్తున్నారు. డిజిటల్ కనెక్టివిటీ, ఇ-కామర్స్ దీనికి వీలు కల్పిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి నగరాలకు సేవలు అందించటం బాగా పెరుగుతోంది. అందువల్ల ఈ విభాగం సమీప భవిష్యత్తులో ఎంతో ఆసక్తికరంగా ఉంటుందనే అంచనాలు ఉన్నాయి.


స్మాల్‌క్యాప్‌లో పెట్టుబడి

హీలియోస్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా స్మాల్‌క్యాప్ ఫండ్‌ను రూపొందించింది. **హీలియోస్ స్మాల్‌క్యాప్ ఫండ్** ఎన్ఎఫ్ఓ ముగింపు తేదీ ఈనెల 20. కనీస పెట్టుబడి రూ.5,000. స్మాల్‌క్యాప్ తరగతికి చెందిన కంపెనీలపై పెట్టుబడి పెట్టి లాభాలు ఆర్జించటం ఈ పథకం ప్రధాన లక్ష్యం. స్మాల్‌క్యాప్ తరగతికి చెందిన షేర్లపై గత కొంతకాలంగా ఎంతో అధిక ఒత్తిడి ఉంది. అందువల్ల ఈ తరగతికి చెందిన షేర్ల ధరలు దీర్ఘకాలంగా స్థిరీకరణలో కనిపిస్తున్నాయి. ఇక్కడి నుంచి సమీప భవిష్యత్తులో వృద్ధి బాట పట్టే అవకాశం ఉందనే అంచనాలు వస్తున్నాయి. అందువల్ల స్మాల్‌క్యాప్ తరగతికి చెందిన పథకాలను మదుపరులు పరిశీలించవచ్చనే సిఫార్సులు ఉన్నాయి.

మ్యూచువల్ ఫండ్లు పెట్టుబడి ఎన్ని పథకాల్లో?

మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు పెట్టేటప్పుడు మదుపరుల ఆలోచనలు భిన్నంగా ఉంటాయి. కొంతమంది ఒకటి రెండు ఫండ్లకే పరిమితం అవుతారు. కొందరు వీలైనన్ని ఎక్కువ ఫండ్లలో మదుపు చేస్తే, నష్టభయం పరిమితం అవుతుందని భావిస్తారు. ఎక్కువ ఫండ్లలో మదుపు చేస్తే.. ఒకే తరహా షేర్లను ఎంచుకున్నట్లే, దీనివల్ల రాబడి తగ్గే ప్రమాదమూ ఉందని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. మీ పోర్ట్‌ఫోలియోలో ఎన్ని మ్యూచువల్ ఫండ్ పథకాలు ఉంటే బాగుంటుందో తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

- ప్రతి ఫండ్ పథకమూ దాదాపు 40-70 షేర్లతో పోర్ట్‌ఫోలియో నిర్మిస్తుంది. అంటే, మీరు పథకాలను ఎంచుకున్న ప్రతిసారీ ఒకే తరహా షేర్లలో మదుపు చేస్తున్నట్లు లెక్క. కాబట్టి, మరిన్ని ఫండ్లను జోడించడం అంటే, రిస్కును తగ్గించుకోవడం కన్నా, ఒకే షేరులో తిరిగి మదుపు చేస్తున్నట్లు అవుతుంది.



- మీ పోర్ట్‌ఫోలియోలో మ్యూచువల్ ఫండ్ పథకాల సంఖ్య ఎంత ఉండాలి? పెట్టుబడుల్లో తగిన వైవిధ్యం ఉండేలా చూసుకుంటూ.. గరిష్ఠంగా 8-9 పథకాలు ఉంటే చాలు. ఇంతకుమించితే, వైవిధ్యం తగ్గిపోతుంది.
- మీ పోర్ట్‌ఫోలియోలో ఎక్కువ ఫండ్లు ఉంటే వైవిధ్యం మరీ పెరిగిపోతుంది. దీనివల్ల పెద్దగా లాభాలు రాకపోవచ్చు.
- రూ.25లక్షల లోపు పోర్ట్‌ఫోలియో ఉన్నప్పుడు 4-5 ఫండ్లకే పరిమితం కావాలి. అంతకు మించితే.. రూ.5 లక్షలకు ఒక ఫండ్‌ను జత చేసుకుంటూ వెళ్లాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.
- రూ. కోటి పోర్ట్‌ఫోలియో ఉంటే గరిష్ఠంగా 10 ఫండ్లు సరిపోతాయని అనుకోవచ్చు.
- ఒకే తరహా షేర్లలో, విభాగంలో మదుపు చేసే ఫండ్లను ఎంచుకున్నప్పుడు వీటి మధ్య కనీసం 40 శాతానికి మించి వైవిధ్యం ఉండేలా చూసుకోవాలి.
- ఫండ్ల ఎంపికలో ఆర్థిక లక్ష్యాలు, వ్యవధి కీలకం.
- 0-3 ఏళ్లలోపు పెట్టుబడి అవసరాలుంటే, లిక్విడ్, డెట్ ఫండ్లను పరిశీలించాలి.
- 3-5 ఏళ్ల వ్యవధికి హైబ్రిడ్ లేదా బ్యాలెన్స్‌డ్ ఫండ్లను ఎంచుకోవాలి.
- దీర్ఘకాలిక అవసరాల కోసం లార్జ్ క్యాప్, మల్టీ క్యాప్, ఫ్లెక్సీ క్యాప్, మిడ్ క్యాప్ పథకాలను చూడాలి.
- చిన్న వయసు నుంచి మదుపు ప్రారంభించినప్పుడు, దీర్ఘకాలం పెట్టుబడి పెట్టేందుకు వీలవుతుంది. 25 ఏళ్ల నుంచీ కనీసం నాలుగు ఫండ్లలో మదుపు ప్రారంభించాలి. ఆదాయం పెరుగుతున్న కొద్దీ, పెట్టుబడినీ, దానికి అనుగుణంగా ఫండ్ల సంఖ్యనూ పెంచుతూ వెళ్లాలి.

ఆర్థికారోగ్యం పట్టించుకోండి



ఏడాదికి ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటాం. మరి, మీ ఆర్థికారోగ్యం ఎలా ఉందో ఎప్పుడైనా చూసుకున్నారా? ఖర్చులు పెరుగుతున్నాయి. లక్ష్యాలు మారుతున్నాయి. పెట్టుబడుల తీరూ మారిపోతోంది. ఇవన్నీ ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవడమూ ముఖ్యమే. అప్పుడే, భవిష్యత్తు ఆర్థికారోగ్యం బాగుంటుంది.

ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు రోజూ ఎంతో ప్రయత్నిస్తుంటాం. నడక, వ్యాయామంతోపాటు, భోజనం విషయంలోనూ ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటాం. ఇది ఎంతో అవసరం కూడా. అదే సమయంలో ఆర్థికంగా మనం బాగుండాలి అంటే, కొన్ని విషయాల్లో క్రమశిక్షణగా ఉండాల్సిందే. అవేమిటంటే..

ఆదాయం-ఖర్చులు

మీరు ఎంత సంపాదిస్తున్నారు? ఎంత ఖర్చు చేస్తున్నారు? అని తెలుసుకోవడమే ఆర్థికారోగ్యానికి మొదటి అడుగు. 'మీ ఖర్చులు, మీ ఆదాయం కంటే తక్కువగా ఉండాలి' అప్పుడే పొదుపు చేసేందుకు వీలవుతుంది. జీవితంలో ఒక దశలో ఖర్చులు అధికంగా ఉంటాయి. ఆ దశకు చేరుకోకముందే వీలైనంత వరకూ పొదుపు చేయాలి. అప్పుడు ఖర్చులకు ఇబ్బంది ఉండదు. ఆదాయంతోపాటు ఖర్చులు పెరగడం సహజం. వాటికి సిద్ధంగా ఉండాలంటే, ముందు నుంచే పొదుపు అనే అలవాటు మీకు రావాలి.

అత్యవసర నిధి

ఉద్యోగం కోల్పోవడం, ఆరోగ్య సమస్యలు, ఆకస్మిక ఖర్చులు.. ఇవన్నీ ఎప్పుడైనా రావచ్చు. అందుకే, కనీసం ఆరు నెలల ఖర్చులకు సరిపోయే విధంగా అత్యవసర నిధి ఉండటం ఎప్పుడూ తప్పనిసరి. ఈ మొత్తాన్ని తొందరగా నగదుగా మార్చుకునే పథకాల్లో ఉండాలి. అంటే, ఫిక్స్‌డ్ డిపాజిట్, లిక్విడ్ ఫండ్లవంటి వాటిల్లో ఈ నిధి ఉండాలి. అప్పుడే ఎలాంటి విపత్కర పరిస్థితి ఎదురైనా ఒక భరోసా ఉంటుంది.

అప్పులు మితిమీరితే

అవసరాలు మన నియంత్రణలోనే ఉండాలి. దాటితే, అప్పులు చేయాల్సి వస్తుంది. రుణం తీసుకోవడం అంటే, ఏదో ఒక ఆర్థిక బాధ్యత అనుకుంటారు చాలామంది. ఇది ఆరోగ్యంపైనా ఒక రకమైన తెలియని ఒత్తిడిని చూపిస్తూ ఉంటుంది. నెలవారీ వాయిదాలు పెరుగుతున్న కొద్దీ ఆర్థిక ప్రశాంతత తగ్గుతుంది. మొత్తం అప్పుల వాయిదాలు మీ నెల జీతంలో 30-40 శాతాన్ని మించకూడదు. అత్యధిక ఈఎంఐలు మీ ఆర్థిక సౌలభ్యాన్ని దెబ్బతీస్తాయి. ఏటా మీ అప్పుల స్థాయిని ఒకసారి సమీక్షించుకోండి. రుణాలు పెరుగుతుంటే మీ ఆర్థికారోగ్యం దెబ్బతిన్నట్లే.

పెట్టుబడులు సరైన మార్గంలో

మీరు పెట్టుబడి పెట్టిన పథకాలు ఎలా పనిచేస్తున్నాయో చూసుకోండి. ఈక్విటీలు, డెట్, బంగారం, స్థిరాదాయం అందించే పథకాల్లో వైవిధ్యంగా పెట్టుబడులు ఉండాలి. మీ భవిష్యత్తు లక్ష్యాలకు అవి ఎంత మేరకు సరిపోతున్నాయో తనిఖీ చేయండి. పెట్టుబడులను అటూ, ఇటూ మారుస్తూ ఉంటే అందులో రాబడి తగ్గిపోతుంది. అప్పుడు లక్ష్య సాధనకు దూరం కావాల్సి వస్తుంది. చక్రవడ్డీ లాభం పొందాలంటే, పెట్టుబడులు దీర్ఘకాలం కొనసాగాలనే సూత్రాన్ని మర్చిపోవద్దు.

బీమా.. క్రెడిట్ స్కోరు

జీవితంలో కొన్ని మార్పులు మొత్తం కుటుంబంపైనే ప్రభావం చూపిస్తాయి. ఇలాంటి వాటికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాల్సిందే. మీ బీమా పాలసీలను ఒకసారి సమీక్షించుకోండి. మీ వార్షికాదాయానికి కనీసం 12 రెట్లకు తగ్గకుండా జీవిత బీమా పాలసీ ఉండాలి. రూ.10 లక్షల ఆరోగ్య బీమా, రూ.50లక్షల సూపర్ టాపప్ పాలసీ ఇప్పుడున్న పరిస్థితుల్లో తప్పనిసరి. దీంతోపాటు ఏటా మీ క్రెడిట్ స్కోరును తనిఖీ చేసుకోవడం మర్చిపోవద్దు. దీనివల్ల మీ ఆర్థిక క్రమశిక్షణ ఎలా ఉందో తెలుసుకునేందుకు వీలవుతుంది.

ఈనాడు సినిమా



దుల్కర్, భాగ్యశ్రీ, రానా

దుల్కర్‌కి మాత్రమే సరిపోయే కథ 'కాంత' - రానా

"ఊహించడానికి నేను మట్టిని కాదు. పర్వతాన్ని" అంటున్నారు దుల్కర్ సల్మాన్. ఇప్పుడాయన హీరోగా నటిస్తూ.. రానా దగ్గుబాటితో కలిసి స్వయంగా నిర్మించిన చిత్రం 'కాంత'. సెల్వమణి సెల్వరాజ్ తెరకెక్కించారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. సముద్రఖని, రానా తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈనెల 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం కథానాయకుడు ప్రభాస్ ఈ చిత్ర ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హీరో దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ.. "ఇది నాకెంతో ప్రత్యేకమైన చిత్రం. సముద్రఖని ఇందులో గుర్తుండిపోయే నటనను కనబరిచారు. ఆయనతో కలిసి పని చేయడం గొప్ప అనుభవం. కుమారి పాత్రలో భాగ్యశ్రీ ఆకట్టుకుంటుంది. ఈ సినిమా సరికొత్త అనుభూతిని అందిస్తుంది" అన్నారు. "ఇలాంటి సినిమాలు చాలా అరుదుగా వస్తాయి. దీన్ని కుటుంబ సమేతంగా థియేటర్లో చూడండి. దీంట్లో నటించడం నాకెంతో గర్వంగా ఉంది" అన్నారు నటుడు సముద్రఖని. రానా దగ్గుబాటి మాట్లాడుతూ.. "నేను చెన్నై నుంచి హైదరాబాద్‌కు వచ్చినప్పుడు ఇక్కడ ఏ స్టూడియోస్ లేవు. అందరూ విజయ స్టూడియో, వాహిని స్టూడియో, ఏవీఎం స్టూడియోలలో జరిగేవి మాట్లాడుకునే వాళ్లు. అలాంటి ఓ నేపథ్యంలోనే సెల్వ ఈ కథ చెప్పనున్నాడు. ఈ పీరియాడిక్ సినిమాకి దుల్కర్ సల్మాన్ మాత్రమే సరిపోతాడు. ఈనెల 14న ఈ చిత్రం చూశాక అందరూ తనని నట చక్రవర్తి అని పిలుస్తారు" అన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యశ్రీ బోర్సే, సెల్వమణి సెల్వరాజ్, ప్రశాంత్ పొట్లూరి తదితరులు పాల్గొన్నారు.

చిన్న సైజ్ వీరప్పన్ వచ్చేస్తున్నాడు



పృథ్వీరాజ్ సుకుమారన్

హీరోగా, ప్రతినాయకుడిగా శక్తిమంతమైన పాత్రలతో ప్రయాణిస్తున్నారు పృథ్వీరాజ్ సుకుమారన్. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'విలాయత్ బుద్ధ'. జయన్ నంబియార్ దర్శకత్వం వహించారు. ప్రియంవద కృష్ణన్ కథానాయిక. "నువ్వేమైనా పుష్ప అనుకుంటున్నావా..? అయ్యో తను ఇంటర్నేషనల్ అయితే మనం లోకల్, 'అతనో చిన్న సైజ్ వీరప్పన్' లాంటి వాడు" అంటూ ఇటీవలే విడుదలైన టీజర్ సినీప్రియుల దృష్టిని ఆకర్షించింది. తాజాగా ఈ చిత్రాన్ని ఈ నెల 21న విడుదల చేస్తున్నట్టు తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా మరో కొత్త పోస్టర్‌ను పంచుకుంది చిత్రబృందం. ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో డబుల్ మోహన్ పాత్రలో సరికొత్త అవతారంలో కనిపించనున్నారు పృథ్వీరాజ్. ప్రస్తుతం ఆయన అగ్రహీరో మహేశ్ బాబుతో కలిసి 'ఎస్ఎస్ఎంబీ 29'తో బిజీగా ఉన్నారు.

మళ్లీ రంగంలోకి ఎన్టీఆర్



విరామమే తప్ప విశ్రమించడం లేదంటోంది ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ చిత్ర బృందం. త్వరలోనే ఈ సినిమా కొత్త షెడ్యూల్ మొదలు కానుంది. అందుకోసం చిత్రబృందం ఇప్పటికే రంగంలోకి దిగింది. దర్శకుడు ప్రశాంత్ నీల్ పర్యవేక్షణలో ఎన్టీఆర్ సినిమా కోసం ప్రత్యేకంగా సన్నద్ధమవుతున్నారు. లుక్ సంబంధించిన కసరత్తులతో తయారుకొన్న ఫోటోని గురువారం సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది నిర్మాణ సంస్థ. ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై రూపొందుతున్న సంగతి తెలిసిందే. 'డ్రాగన్' అనే పేరు ప్రచారంలో ఉంది. ఇప్పటికే ఒక షెడ్యూల్ చిత్రీకరణ పూర్తయింది. ఎన్టీఆర్ ఇటీవల ఓ ప్రకటనలో నటిస్తుండగా గాయపడటంతో ఈ సినిమాకి విరామం వచ్చింది. త్వరలోనే తిరిగి చిత్రీకరణ ప్రారంభం కానుందంటూ నిర్మాణ సంస్థ స్పష్టతనిచ్చింది. వచ్చే వారం నుంచే ఈ సినిమా చిత్రీకరణ మళ్లీ ఊపందుకునే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.

వేసవి బరిలో 'ఫంకీ'



విష్వక్ సేన్, కయాదు లోహర్

'ఫంకీ' చిత్రంతో వేసవి బరిలో నవ్వులు పంచేందుకు సిద్ధమవుతున్నారు విష్వక్ సేన్. ఆయన హీరోగా నటిస్తున్న ఈ సినిమాని కేవీ అనుదీప్ తెరకెక్కిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. కయాదు లోహర్ కథానాయిక. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ఏప్రిల్ 3న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్టు గురువారం ప్రకటించారు. "ఆద్యంతం కడుపుబ్బా నవ్వించే వినోదాత్మక కథాంశంతో ఈ చిత్రం రూపొందుతోంది. విష్వక్ ఇందులో సినీ దర్శకుడి పాత్ర పోషిస్తున్నారు. ఆయన లుక్, యాటిట్యూడ్, కామెడీ టైమింగ్ అందర్నీ అలరిస్తాయి. కయాదుతో తన కెమిస్ట్రీ యువతను ఆకట్టుకునేలా ఉంటుంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఛాయాగ్రహణం: సురేశ్ సారంగం.

"ప్రేమ ప్రపంచం చుట్టూనే నా స్వరప్రయాణం సాగుతూ వచ్చింది. ఇప్పటిదాకా చేసిన ప్రేమకథలతో పోలిస్తే 'ది గర్ల్‌ఫ్రెండ్' ఎంతో ప్రత్యేకం. మరింత గాఢమైన భావోద్వేగాలున్న కథ ఇది. ఇద్దరి మధ్య బంధం గురించి బలంగా మాట్లాడే ఈ చిత్రాన్ని చూస్తూ నేనూ కన్నీళ్లు పెట్టుకున్నా" అన్నారు సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్. తెలుగులో ఈమధ్య ప్రేమకథలనగానే గుర్తొచ్చే సంగీత దర్శకుడు హేషమ్. తనదైన శైలిలో మంచి మెలోడీ బాణీల్ని సమకూరుస్తూ... ఆయా సినిమాలకి ప్రత్యేకమైన ఆకర్షణని తీసుకొస్తున్నారు. ఇటీవల హేషమ్ స్వరాలు సమకూర్చిన చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్'. రష్మిక, దీక్షిత్ శెట్టి జంటగా నటించగా... రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించారు. గీతా ఆర్ట్స్ పతాకంపై అల్లు అరవింద్ సమర్పణలో... విద్య కొప్పినీడి, ధీరజ్ మొగిలినేని నిర్మించారు. ఈ చిత్రం నేడు విడుదలవుతోన్న సందర్భంగా హేషమ్ గురువారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

సింగారాల సీతాకోక



శ్రీలీల, శివకార్తికేయన్

'గిల్లేసి పాడితే జోలా.. నవ్వింది నీ మేఘమాల' అంటూ తన ప్రియుడితో ఆడిపాడుతోంది శ్రీలీల. ఇదంతా ఆమె నటిస్తున్న 'పరాశక్తి' సినిమా కోసమే. ఆమె, శివకార్తికేయన్ ప్రధాన పాత్రల్లో సుధా కొంగర తెరకెక్కిస్తున్న చిత్రమిది. వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరి 14న విడుదల కానుందీ చిత్రం. ఈ నేపథ్యంలోనే 'సింగారాల సీతాకోక..' అనే మొదటి గీతాన్ని ఇన్‌స్టా వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. 'నీ ఆజ్ఞే పాటిస్తా.. చిత్తం అలివేణి..' అంటూ సాగుతున్న ఈ గీతంలో శివకార్తికేయన్, శ్రీలీల కెమిస్ట్రీ ఆకట్టుకుంటుంది. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతమందించారు. అథర్వ, రవి మోహన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని డాన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తోంది.

తొలిసారి గాయకుడిగా..



నవీన్ పొలిశెట్టి

'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ', 'జాతిరత్నాలు', 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' లాంటి విజయవంతమైన చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల్ని మెప్పించిన హీరో నవీన్ పొలిశెట్టి. ఆయనలో మంచి నటుడితో పాటు రచయిత ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు తనలోని గాయకుణ్ని అందరికీ పరిచయం చేసేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఆయన మారి దర్శకత్వంలో 'అనగనగా ఒక రాజు' అనే సినిమా చేస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయిక. ముగింపు దశలో ఉన్న ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 14న విడుదల కానుంది. ఈ సినిమా కోసమే నవీన్ తొలిసారి ఓ పాట పాడినట్లు సమాచారం. ఇప్పటికే పాట రికార్డింగ్ పూర్తయిందని.. దీన్ని వచ్చే నెలలో విడుదల చేయనున్నారని తెలిసింది. ఆద్యంతం వినోదాత్మకంగా సాగే ఈ కుటుంబ కథా చిత్రానికి మిక్కీ జె మేయర్ సంగీతమందిస్తున్నారు. జె.యువరాజ్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

రెహమాన్ ముందు పాడటం మర్చిపోలేను!



హేషమ్

"ప్రతిసారీ ప్రేమకథలకు స్వరాలు సమకూర్చాల్సి రావడం ఏ సంగీత దర్శకుడికైనా ఓ పెద్ద సవాల్. అవే సందర్భాలు, అవే భావోద్వేగాలు ఉంటాయి, అలాగని ఒకే రకమైన పాటల్ని ఇవ్వలేం కదా? దర్శకుల సహకారంతో ఈ ప్రేమ ప్రయాణాన్నీ ఎంతగానో ఆస్వాదిస్తూ వస్తున్నా. తెలుగులో నేను అందుకున్న మొట్టమొదటి అవకాశం... 'ది గర్ల్‌ఫ్రెండ్'. కానీ దీని కంటే ముందే 'ఖుషి', 'హాయ్ నాన్న', 'మనమే', '8 వసంతాలు' సినిమాలు చేయాల్సి వచ్చింది. వాటన్నిటిలాగే 'ది గర్ల్‌ఫ్రెండ్' కూడా మంచి ప్రేమకథతో తెరకెక్కింది. దర్శకుడు రాహుల్ రవీంద్రన్ రాసిన ఈ కథలోని భూమా, విక్రమ్ పాత్రల మధ్య సంఘర్షణే నన్ను ముందుకు నడిపించింది".

◆ "సినిమాలో నాలుగు పాటలు ఉంటాయి. ప్రతి పాట సరైన సందర్భంలో వచ్చేలా స్క్రిప్ట్‌ని డిజైన్ చేసుకున్నారు దర్శకుడు. ప్రతి పాట సందర్భంలోనూ భూమా, విక్రమ్ పాత్రల్నే గుర్తు చేసుకుంటూ బాణీల్ని సమకూర్చేవాణ్ని. నాలుగు పాటల్లో చివరిగా విడుదల చేసిన 'నీదే నీదే...' పాట కోసం చాలా కష్టపడ్డా. సినిమాలో అది భూమా పాత్రకు సంబంధించిన ఓ ప్రార్థనాగీతంలా ఉంటుంది. ప్రతి అమ్మాయికి సంబంధించిన పాట అది".

◆ "నేపథ్య సంగీతానికి ప్రాధాన్యం పెరిగింది. ప్రేమకథలకీ నేపథ్య సంగీతం చాలా కీలకం. 'మనమే', '8 వసంతాలు' సినిమాలకు సమకూర్చిన నేపథ్య సంగీతానికి మంచి పేరొచ్చింది. ఇప్పటిదాకా నా నుంచి ఎక్కువగా మెలోడీలే వినిపించాయి. ఇకపై మాస్ సాంగ్స్ కూడా వింటారు. ఒకే తరహా సినిమాలు వచ్చినప్పుడు చేయాలనిపించదు కానీ, సితార, గీతా ఆర్ట్స్, మైత్రీ సంస్థల నుంచి అయితే ఏ అవకాశం వచ్చినా వదులుకోను. నన్ను ఈ పరిశ్రమలో నిలబెట్టిన సంస్థలు అవి. నేను మొదట గాయకుడిని, ఆ తర్వాత సంగీత దర్శకుడినయ్యా. సంగీత దర్శకుల్లో ఎక్కువమంది నాకు స్నేహితులు ఉన్నారు. వాళ్లు మా సినిమాలో ఒక్క పాటైనా పాడు అని అడుగుతుంటారు. అలా సమయం ఉందంటే కచ్చితంగా పాడటానికే ప్రయత్నిస్తుంటా. తెలుగులో ఈమధ్య చాలా సినిమాల్లో పాడాను. దాంతో తెలుగు త్వరగా నేర్చుకుంటున్నా. వచ్చే ఏడాదిలో తెలుగులో మాట్లాడతా".

❑ "నాకు ఇష్టమైన సంగీత దర్శకుడు ఎ.ఆర్. రెహమాన్. ఆ తర్వాత కీరవాణి అంటే ఇష్టం. నేను చదువుకునేటప్పుడు రెహమాన్ స్వరపరిచిన 'దిల్‌సే' సినిమాలోని పాటను తొలిసారి వేదికపై పాడాను. ఐఫా వేడుకల్లో పురస్కారం అందుకున్న అనంతరం నేను స్వరపరిచిన 'హాయ్ నాన్న' పాటని రెహమాన్ ముందు పాడటం ఎప్పటికీ గుర్తుండిపోతుంది. తమన్, దేవిశ్రీప్రసాద్, భీమ్స్ సంగీతం అన్నా నాకు ఇష్టమే. ప్రస్తుతం నా తొలి ప్రాధాన్యం తెలుగు సినిమానే. ప్రస్తుతం ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా ఆదిత్యహాసన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమాకి స్వరాలు సమకూరుస్తున్నా. మలయాళంలో ఆచితూచి సినిమాల్ని ఎంపిక చేసుకుంటున్నా. కన్నడ, మలయాళ, హిందీ భాషల్లోనూ సినిమాలు చేస్తున్నా"

అందుకే ముందే ప్రీమియర్లు వేశాం



టీనా, తిరువీర్

"ప్రేక్షకుల్ని ఆద్యంతం నవ్వించే సినిమా 'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో'. ఈ కథపై ఉన్న నమ్మకం, ధైర్యంతోనే రెండు రోజుల ముందే ప్రీమియర్లు వేశాం" అన్నారు హీరో తిరువీర్. ఆయన.. టీనా శ్రావ్య జంటగా నటించిన ఈ చిత్రాన్ని రాహుల్ శ్రీనివాస్ తెరకెక్కించారు. సందీప్ అగరం, అష్మిత రెడ్డి నిర్మించారు. నేడు విడుదల కానున్న నేపథ్యంలో గురువారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో తిరువీర్ మాట్లాడుతూ.. "ఇప్పటికే ఈ సినిమా ప్రీమియర్లకు వస్తున్న ఆదరణ చూస్తుంటే ఆనందంగా ఉంది. మంచి చిత్రాల్ని ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారని మరోసారి నిరూపితం కానుంది" అన్నారు. "ప్రేక్షకులు ఈ సినిమాకి పెట్టే ఖర్చుకు ఏమాత్రం నిరాశ చెందరు. దీన్ని కుటుంబం, మిత్రులతో కలిసి చూస్తే మరింత నచ్చుతుంది" అన్నారు దర్శకుడు రాహుల్ శ్రీనివాస్. ఈ కార్యక్రమంలో సందీప్ అగరం, టీనా శ్రావ్య, సురేశ్ బొబ్బిలి, మాస్టర్ రోహన్ తదితరులు పాల్గొన్నారు.

వినోదం.. సందేశం



చాందినీ చౌదరి, విక్రాంత్, దిల్‌రాజు, ఆనంద్ దేవరకొండ, మధుర శ్రీధర్ రెడ్డి

"వినోదం, బలమైన భావోద్వేగాలతో పాటు మంచి సందేశం ఉన్న చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు'. ఇది తప్పకుండా అందర్నీ అలరిస్తుంది" అన్నారు హీరో విక్రాంత్. ఆయన.. చాందినీ చౌదరి జంటగా నటించిన ఈ సినిమాని సంజీవ్ రెడ్డి తెరకెక్కించారు. మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రం ఈనెల 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం హైదరాబాద్‌లో ట్రైలర్‌ని విడుదల చేశారు. నిర్మాత దిల్‌రాజు, హీరో ఆనంద్ దేవరకొండ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ.. "ఇప్పుడు లివ్ ఇన్ రిలేషన్, పెళ్లి సులువు అయ్యాయి. కానీ, పిల్లలు పుట్టడమే సమస్యగా మారుతోంది. అందుకే ఈ చిత్రానికి ఆ టైటిల్ పెట్టుకున్నారు. ప్రస్తుతం సినిమా తీయడం కంటే మార్నింగ్ షోకి ప్రేక్షకుల్ని రప్పించి 'సినిమా సక్సెస్' అనిపించుకోవడం గొప్ప విషయమైంది. దాని కోసం ఈ చిత్ర బృందం ఎక్కువ కష్టపడాలి" అన్నారు. "ట్రైలర్ బాగుంది. మంచి వినోదంతో ఆకట్టుకుంటోంది. ట్రైలర్‌లో నాకిష్టమైన వెన్నెల కిశోర్, తరుణ్ భాస్కర్ లాంటి వాళ్లు కనిపించారు. ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ అవ్వాలని కోరుకుంటున్నా" అన్నారు ఆనంద్ దేవరకొండ. హీరో విక్రాంత్ మాట్లాడుతూ.. "ప్రేక్షకుల్ని థియేటర్లకు రప్పించే అంశాలన్నీ దీంట్లో ఉన్నాయి. నేనిందులో చైతన్య అనే సాఫ్ట్‌వేర్‌గా కనిపిస్తా" అన్నారు. "ఓ మంచి కాన్సెప్ట్ ఉన్న సినిమాకి ఏం కావాలో అవన్నీ దీంట్లో ఉన్నాయి" అన్నారు నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో చాందినీ చౌదరి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అకాడమీ మ్యూజియంలో 'భ్రమయుగం' చిత్రప్రదర్శన



మమ్ముట్టి

ఇటీవల ప్రకటించిన 55వ కేరళ రాష్ట్ర చలనచిత్ర అవార్డులలో సత్తా చాటిన 'భ్రమయుగం' చిత్రం, మరో అరుదైన ఘనతను సాధించింది. లాస్ ఏంజెలెస్ లోని 'అకాడమీ మ్యూజియం ఆఫ్ మోషన్ పిక్చర్స్'లో 'భ్రమయుగం' ప్రత్యేక ప్రదర్శనకు సిద్ధమైంది. నైట్ షిఫ్ట్ స్టూడియోస్ మరియు వైనాట్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి రాహుల్ సదాశివన్ రచన, దర్శకత్వం వహించారు. ఫిబ్రవరి 12, 2026న ఈ చిత్రాన్ని ప్రదర్శించనున్నారు. 'భ్రమయుగం' చిత్రంలో కొడుమోన్ పోట్టి అనే పాత్రలో మమ్ముట్టి అద్భుతమైన నటన కనబరిచారు.

పోరాడకుండా ఓటమిని అంగీకరించను



ఫర్హాన్ అక్తర్

"నేను శత్రువుతో పోరాడినప్పుడు నువ్వు ఏం చేస్తావు?", "తల పైకెత్తి చెబుతాను.. నేను నిజమైన దేశభక్తుడి భార్యనని" అంటోంది మేజర్ షైతాన్ సింగ్ భార్య పాత్రలో నటి రాశీ ఖన్నా. ఆమె బాలీవుడ్ నటుడు ఫర్హాన్ అక్తర్ జంటగా నటించిన పీరియాడికల్ వార్ చిత్రం '120 బహదూర్'. ఈ సినిమాని మేజర్ షైతాన్ సింగ్ భాటి జీవిత కథ ఆధారంగా.. 1962 ఇండియా-చైనా యుద్ధం నేపథ్యంలో జరిగిన వాస్తవ సంఘటనల స్ఫూర్తితో రజనీశ్ ఘాయ్ తెరకెక్కిస్తున్నారు. ఫర్హాన్, రితేశ్ సిధ్వాని, అమిత్ చంద్ర సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఈ నెల 21న థియేటర్లలో విడుదలకానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం ఇన్‌స్టా వేదికగా అధికారిక ట్రైలర్‌ను ఆవిష్కరించింది. "ఇండియా చైనాను పొరుగు దేశంగా మాత్రమే కాకుండా సోదరుడిగా భావించిన కాలం ఉంది. కానీ 1962లో ఈ సోదరభావం రెండువైపులా ఉండేది కాదని స్పష్టమైంది. మేజర్ షైతాన్ సింగ్ మాట్లాడుతున్నాను.. ఈ రాత్రి ఓ విధ్వంసకర తుపాను మనల్ని సమీపిస్తోంది. 3 వేల మంది చైనా సైనికులు రెజాంగ్ లా వైపు ముందుకు సాగుతున్నారు. మన దగ్గర 120మంది సైనికుల మాత్రమే ఉన్నారు. పోరాడకుండా నేను ఓటమిని అంగీకరించను.. మీ మనసు ఏం చెబుతుంది? మనం ఇక్కడ పోరాడతాం, ఇక్కడే చనిపోతాం, చివరి శ్వాస.. చివరి బుల్లెట్ వరకు.. శ్రీకృష్ణుని మహిమ! చేతుల్లో ఆయుధాలు, గుండెల్లో ధైర్యం..సిద్ధంగా ఉన్నారా?"లాంటి ఉత్కంఠని రేకెత్తించే సంభాషణలతో సాగుతున్న ఈ ట్రైలర్ యుద్ధవీరుల దేశభక్తి, త్యాగాల సన్నివేశాలతో ఆకట్టుకుంటోంది.

కేజీఎఫ్ నటుడి కన్నుమూత



హరీశ్ రాయ్

'కేజీఎఫ్' సినిమాలో చాచా పాత్రలో నటించి ప్రేక్షకులకు చేరువైన నటుడు హరీశ్ రాయ్(55) కన్నుమూశారు. కొంతకాలంగా థైరాయిడ్ క్యాన్సర్‌తో పోరాడుతున్న ఆయన చికిత్స పొందుతూ గురువారం ఉదయం 11 గంటలకు తుదిశ్వాస విడిచారు. కన్నడలో విజయవంతమైన చిత్రం 'ఓం'తో ఆయన గుర్తింపు దక్కించుకున్నారు. జోడిహక్కి, నల్ల, స్వయంవర, సంజు వెడ్స్ గీతా, మీండమ్ ఒరు కాదల్ కథై (తమిళం), సింహరూపిణి తదితర సినిమాల్లో ప్రతినాయకుడిగా, సహాయ నటుడిగానూ నటించారు. అనారోగ్యం కారణంగా ఆర్థిక సమస్యల్లో ఉన్నప్పుడు నటులు యశ్, ధ్రువ్ సర్జా తదితరులు సహాయం చేశారు. మంగళూరుకు చెందిన హరీశ్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. హరీశ్ మృతికి కన్నడ చిత్ర పరిశ్రమ ప్రముఖులు, చిత్రరంగంలోని వివిధ విభాగాలకు చెందిన వారు సంతాపాన్ని ప్రకటించారు. - న్యూస్‌టుడే, బెంగళూరు (రాజాజీనగర)

బాలీవుడ్ నటి, గాయని సులక్షణా పండిట్ ఇక లేరు



బాలీవుడ్ చిత్రాల ప్రముఖ కథానాయకి, గాయని సులక్షణా పండిట్ 71 ఏళ్ల వయసులో గురువారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. ముంబయిలోని నానావతి ఆసుపత్రికి తరలిస్తుండగా ఆమె తుదిశ్వాస విడిచారు. సోదరుడైన సంగీత దర్శకుడు లలిత్ పండిట్ ఈ విషయాన్ని ధ్రువీకరించారు. శుక్రవారం మధ్యాహ్నం అంత్యక్రియలు జరుగుతాయన్నారు. 1954లో ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌గఢ్‌లో సంగీత విద్వాంసుల కుటుంబంలో సులక్షణ పుట్టారు. దిగ్గజ సంగీత కళాకారుడు పండిట్ జస్రాజ్‌కు ఆమె మేనకోడలు. సులక్షణ మరో సోదరుడైన జతిన్ కూడా సంగీత దర్శకుడే. టీనేజిలోనే తన సంగీత ప్రయాణాన్ని ప్రారంభించిన సులక్షణ 'సంకల్ప్' (1975) చిత్రం కోసం పాడిన 'తూహీ సాగర్ హై' పాటకు ఫిలింఫేర్ అవార్డు అందుకొన్నారు. సంజీవ్‌కుమార్ నటించిన 'ఉల్‌ఝన్' (1975) చిత్రంతో నటిగా మారాక దాదాపు పదేళ్లు పలు చిత్రాల్లో కథానాయిక పాత్రలను పోషించారు. రాజేశ్‌ఖన్నా, జితేంద్ర, వినోద్ ఖన్నా, శశికపూర్, శత్రుఘ్నసిన్హా వంటి దిగ్గజాల సరసన నటించారు. 'సంకోచ్', 'ధరమ్‌కాంటా', 'హేరా ఫేరీ', 'అప్నాపన్', 'ఖాన్‌దాన్', 'వక్త్ కీ దీవార్', 'చెహరే పే చెహరా' వంటి చిత్రాలు ఆమె ఖాతాలో ఉన్నాయి. నటుడు సంజీవ్‌కుమార్‌తో ఆమె సాగించిన విఫల ప్రేమాయణం కారణంగా ఎక్కువగా వార్తల్లో నిలిచారు. ఇదే కారణంగా అవివాహితగానూ మిగిలిపోయారు. - ముంబయి

ఈనాడు ప్రతిభ
■ e-mail: support@epratibha.net
16
శుక్రవారం నవంబరు 7, 2025

వ్యర్థాలు - రీసైక్లింగ్, శక్తి ఉత్పత్తి

వ్యర్థాలు - రకాలు

☛ వ్యర్థాలను వివిధ రకాలుగా విభజించవచ్చు. అవి:

1) జీవ వ్యర్థాలు 2) అజీవ వ్యర్థాలు
3) ప్రమాదకర వ్యర్థాలు 4) పారిశ్రామిక వ్యర్థాలు
5) పరిశ్రమల్లో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలు
6) వ్యవసాయ వ్యర్థాలు 7) మున్సిపల్ వ్యర్థాలు

జీవ వ్యర్థాలు

జీవ వ్యర్థాలు అంటే సహజ పర్యావరణ ప్రక్రియల ద్వారా సులభంగా కుళ్లిపోయే సేంద్రియ పదార్థాలు. బ్యాక్టీరియా, శిలీంధ్రాలు లాంటి సూక్ష్మజీవులు ఈ వ్యర్థాలను విచ్ఛిన్నం చేసి, వాటిని తిరిగి భూమిలో కలిసిపోయే సరళ పదార్థాలుగా (నీరు, కార్బన్ డైఆక్సైడ్, మీథేన్, హ్యూమస్ లాంటివి) మారుస్తాయి. వీటిని సాధారణంగా తడి చెత్త అని కూడా పిలుస్తారు. ఈ వ్యర్థాలు పర్యావరణానికి హానికరమైనవి కావు. కానీ వీటి నిర్వహణ సరిగా లేకుంటే సమస్యలు ఉత్పన్నమవుతాయి.

రకాలు

జీవ వ్యర్థాలు ప్రధానంగా ఇళ్లు, వ్యవసాయం, ఆహార పరిశ్రమల నుంచి వస్తాయి.

- **గృహ వ్యర్థాలు లేదా వంటగది వ్యర్థాలు:** కూరగాయలు, పండ్ల తొక్కలు, మిగిలిపోయిన ఆహారం, పాడైన ఆహార పదార్థాలు, టీ పొడి, కాఫీ పొడి, గుడ్డు పెంకులు.
- **తోట వ్యర్థాలు:** రాలిన ఆకులు, కొమ్మలు, గడ్డి, ఎండిన పువ్వులు, పూల మాలలు.
- **వ్యవసాయ వ్యర్థాలు:** పంట కోత అనంతర అవశేషాలు
- **ఇతర వ్యర్థాలు:** కాగితం, కార్డ్ బోర్డ్ (ఇవి కూడా మొక్కల నుంచి వస్తాయి). పత్తి, జనపనార లాంటి సహజ వస్త్రాలు, మాంసం, ఎముకలు, చెక్క పొట్టు.

సమస్యలు

- **వ్యాధుల వ్యాప్తి:** చెత్తకుప్పలు ఈగలు, దోమలు, ఎలుకలు, ఇతర కీటకాలకు నిలయంగా మారి కలరా, టైఫాయిడ్ లాంటి వ్యాధులను వ్యాపింపజేస్తాయి.
- **వాయు కాలుష్యం:** డంపింగ్ యార్డుల్లో ఆక్సిజన్ లేని వాతావరణంలో జీవ వ్యర్థాలు కుళ్లినప్పుడు మీథేన్ వాయువు విడుదలవుతుంది. ఇది కార్బన్ డైఆక్సైడ్ కంటే 25 రెట్లు ఎక్కువ హానికరమైన గ్లోబల్ వార్మింగ్ వాయువు.
- **జల కాలుష్యం:** చెత్తకుప్పల నుంచి లీచెట్ అనే విషపూరిత ద్రవం ఊరుతుంది. ఇది భూమి లోపలికి ఇంకి, భూగర్భ జలాలను కలుషితం చేయడంతో పాటు తాగునీటిని విషపూరితం చేస్తుంది.



రోజువారీ జీవితంలో ఉపయోగించిన తర్వాత పనికిరాని పదార్థాలను వ్యర్థాలు అంటారు. ఇవి సాధారణంగా గృహాలు, పరిశ్రమలు, వ్యవసాయం, ఆస్పత్రులు, విద్యుత్ కేంద్రాలు తదితర చోట్ల ఉత్పత్తి అవుతాయి. వీటి నిర్వహణ సరిగా లేకుంటే విపత్కర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుంది. అనేక వ్యాధులకు కారణభూతంగా పరిణమిస్తాయి. నీరు విషతుల్యమవడమే కాకుండా గాలి నాణ్యత పడిపోయే ప్రమాదముంది. ప్లాస్టిక్ ఏళ్ల తరబడి నేలలో కలవకుండా ఉండటంతో భూమితో పాటు జీవుల ఆరోగ్యానికి చేటు చేస్తుంది.

'ఆర్ఆర్ఆర్' సూత్రంతో పర్యావరణానికి మేలు!

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
సైన్స్ అండ్ టెక్నాలజీ

జీవ వ్యర్థాల నిర్వహణ

జీవ వ్యర్థాలను సమస్యగా కాకుండా ఒక వనరుగా మార్చవచ్చు. వీటిని (తడి చెత్త) ప్లాస్టిక్ లాంటి జీవేతర వ్యర్థాలతో (పొడి చెత్త) కలపకుండా వేరు చేయాలి. తడిచెత్తను కంపోస్టింగ్ లేదా బయోగ్యాస్ ప్లాంట్ల ద్వారా విలువైన వనరుగా మార్చుకోవచ్చు.

- **కంపోస్టింగ్:** ఇది జీవ వ్యర్థాలను సేంద్రియ ఎరువుగా మార్చే అత్యంత ప్రభావవంతమైన పద్ధతి. ఆక్సిజన్ సమక్షంలో సూక్ష్మజీవులు ఈ వ్యర్థాలను విచ్ఛిన్నం చేసి, మొక్కలకు అవసరమైన పోషకాలు (కంపోస్ట్ ఎరువు)గా మారుస్తాయి.
- **బయోగ్యాస్:** జీవ వ్యర్థాలను ఆక్సిజన్ లేని వాతావరణంలో కుళ్లింపజేయడం ద్వారా బయోగ్యాస్ ఉత్పత్తి చేయవచ్చు. దీనిలో ప్రధానంగా మీథేన్ వాయువు ఉంటుంది.
- **గోబర్ గ్యాస్ ప్లాంట్:** గ్రామాల్లో పశువుల పేడను ఉపయోగించి బయోగ్యాస్ ప్లాంట్లను నడుపుతారు.
- **ఆధునిక ప్లాంట్లు:** నగరాల్లో హోటళ్లు, మార్కెట్ల నుంచి వచ్చే వేలాది టన్నుల తడి చెత్తను ఉపయోగించి పెద్ద బయోగ్యాస్ ప్లాంట్లను నడిపిస్తారు.

అజీవ వ్యర్థాలు

అజీవ వ్యర్థాలు అంటే సహజ పర్యావరణ ప్రక్రియల ద్వారా కుళ్లిపోని పదార్థాలు. వీటిని సాధారణంగా పొడి చెత్త అంటారు. ఇవి మానవ నిర్మిత రసాయనాలు లేదా ఖనిజాల నుంచి తయారవుతాయి. ఈ వ్యర్థాలు ప్రకృతిలో చాలా కాలంపాటు మార్పు చెందకుండా ఉండిపోతాయి. ఫలితంగా ఇవి పర్యావరణ, ముఖ్యంగా భూ కాలుష్యం, జల కాలుష్యానికి అతిపెద్ద ముప్పుగా పరిణమిస్తున్నాయి.

వర్గీకరణ

ప్లాస్టిక్ వ్యర్థాలు: ఇవి అత్యంత విస్తృతమైన, ప్రమాదకరమైన అజీవ వ్యర్థ పదార్థాలు. ప్లాస్టిక్ అనేది పెట్రోలియం నుంచి తయారైన ఒక పాలిమర్.

లోహ వ్యర్థాలు: ఇనుము, అల్యూమినియం, రాగి లాంటి లోహాలతో తయారుచేసిన వస్తువులను లోహ వ్యర్థాలుగా పరిగణించవచ్చు. ఇవి కుళ్లకపోయినా తుప్పు పట్టే అవకాశం ఉంటుంది.

గాజు వ్యర్థాలు: గాజు పూర్తిగా అజీవ వ్యర్థ పదార్థం. దీనికి కుళ్లిపోయే స్వభావం ఉండదు. ప్రకృతిలో వేల సంవత్సరాలపాటు ఉంటుంది.

రబ్బరు, తోలు: రబ్బరుకు కుళ్లిపోయే స్వభావం చాలా తక్కువ. ఇది ఎక్కువ సంవత్సరాలు మార్పు చెందకుండా ఉంటుంది.

నిర్మాణ వ్యర్థాలు: భవనాల కూల్చివేత లేదా నిర్మాణం నుంచి వచ్చే ఇటుకలు, సిమెంట్ ముక్కలు, ఇసుక, కంకర లాంటివి.

దుష్ప్రభావాలు

అజీవ వ్యర్థాలు పర్యావరణానికి, మానవ ఆరోగ్యానికి హాని కలిగించడమే కాకుండా భూమిపై దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపిస్తాయి. అదేవిధంగా జల కాలుష్యానికి కారణమై, జలచరాలకు ముప్పు కలిగిస్తాయి.

- ఇవి డంపింగ్ యార్డుల్లో పేరుకుపోయి, భూభాగాన్ని ఆక్రమిస్తాయి. ఈ వ్యర్థాలు కుళ్లిపోవు కాబట్టి ఆ భూమిని తిరిగి వ్యవసాయం, నివాసానికి ఉపయోగించలేం.
- ప్లాస్టిక్ లాంటివి నేలలో కరిగిపోకుండా ఉండిపోయి, నీటిని పీల్చుకునే సామర్థ్యాన్ని దెబ్బతీస్తాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు నదుల ద్వారా సముద్రాల్లోకి చేరి 'ప్లాస్టిక్ మహాసముద్రాలను' (Plastic Gyres) సృష్టిస్తున్నాయి.
- పెద్ద ప్లాస్టిక్ ముక్కలు కాలక్రమేణా చిన్న మైక్రోప్లాస్టిక్ కణాలుగా విచ్ఛిన్నమై, నీటిలో, గాలిలో, ఆహార గొలుసులోకి ప్రవేశిస్తున్నాయి.
- ఆహారం కోసం చెత్త కుప్పల వద్దకు వెళ్లే పశువులు ప్లాస్టిక్ కవర్లను మింగడం వల్ల వాటి జీర్ణ వ్యవస్థ దెబ్బతిని మరణిస్తున్నాయి.
- అజీవ వ్యర్థాలను కాల్చడం ద్వారా డైఆక్సిన్స్, ఫ్యూరాన్స్ లాంటి అత్యంత ప్రమాదకరమైన విష వాయువులు విడుదలవుతాయి.

నిర్వహణ

అజీవ వ్యర్థాలను ప్రకృతిలో కుళ్లిపోయేలా చేయలేం. కాబట్టి వాటిని నిర్వహించడానికి ప్రధాన మార్గం '3R' సూత్రాన్ని పాటించడమే.

- **తగ్గించడం (Reduce):** వ్యర్థాల ఉత్పత్తి అసలు జరగకుండా ఆపాలి. ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిలిపివేయాలి. మార్కెట్‌కు వెళ్లేటప్పుడు క్లాత్ బ్యాగ్‌లు లేదా జూట్ బ్యాగ్‌లను ఉపయోగించాలి.
- **తిరిగి వాడటం (Reuse):** వస్తువు పాడైపోయే వరకు దాన్ని వాడాలి లేదా మరొక ప్రయోజనం కోసం ఉపయోగించాలి.

  ఉదా: పాత గాజు సీసాలను నీరు నిల్వ చేయడానికి లేదా అలంకరణ వస్తువుల కోసం వాడటం.
- **పునర్వినియోగం (Recycle):** ఉపయోగించిన అజీవ వ్యర్థాలను సేకరించి, వాటిని ప్రాసెసింగ్ ప్లాంట్లకు పంపి, కొత్త ఉత్పత్తులను తయారు చేయాలి.



రచయిత
డాక్టర్ బిరుదు రవిబాబు
విషయ నిపుణులు

Word of the Day

Impaired 823

Telugu meaning: బలహీనమైన, దెబ్బతిన్న

English meaning: Impaired (ఇంపెయిర్డ్) is an adjective that means weakened or damaged, especially in function or ability.

Synonyms: Weakened, Defective

Antonyms: Healthy, Strong

Usage: **1.** His hearing was severely impaired after years of working in a noisy factory.

2. Driving with impaired vision can lead to serious accidents.

నోటిఫికేషన్స్

హెచ్ఎల్ఎల్ లైఫ్‌కేర్‌లో పోస్టులు

ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలోని హెచ్ఎల్ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్ ఒప్పంద ప్రాతిపదికన టెక్నీషియన్, సెంట్రల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 354. ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసేందుకు చివరి తేదీ 16 నవంబరు 2025.

అప్రెంటిస్ పోస్టులు

విశాఖపట్నం పోర్ట్ అథారిటీ (వీపీఏ) వివిధ విభాగాల్లో గ్రాడ్యుయేట్, టెక్నీషియన్ అప్రెంటిస్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 58. అర్హులైన అభ్యర్థులు 2025, నవంబరు 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

సింగిల్ గర్ల్ చైల్డ్ స్కాలర్‌షిప్ 2025

తల్లిదండ్రులకు ఏకైక బాలికా సంతానంగా ఉండి ప్రతిభ కలిగిన విద్యార్థినుల కోసం సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఉపకార వేతనాన్ని ఏటా అందిస్తోంది. ఇందుకు సంబంధించి సీబీఎస్ఈ - సింగిల్ గర్ల్ చైల్డ్ స్కాలర్‌షిప్ 2025 ప్రకటన వెలువడింది. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది 20 నవంబరు 2025.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలు/ అప్రెంటిస్ పోస్టులకు నేడే (నవంబరు 7) చివరి తేదీ

☛ దిల్లీ సబార్డినేట్ సర్వీస్ బోర్డులో 5,346 ఉద్యోగాలు. బీఏ, బీఎస్సీ, బీఈడీ, బీఈఐ, ఈడీ (డ్రాయింగ్/పెయింటింగ్/ఫైన్ ఆర్ట్స్)లో ఉత్తీర్ణులు అర్హులు.

☛ ఎన్ఐఈపీఎండీలో 17 ఫార్మసిస్ట్ పోస్టులు. డిప్లొమా, బీఫార్మసీ, బీఏఎంఎస్, బీయూఎంఎస్, ఎంఫిల్, ఎంఎస్/ఎండీ, బీఎన్‌వైఎస్, బీఎస్ఎంఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

☛ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో అప్రెంటిస్ పోస్టులు. ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్‌లో ఉత్తీర్ణులు అర్హులు.

☛ సీఎస్ఐఆర్ - టీకేడీఎల్‌లో ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టులు. బీటెక్, పీజీ ఉత్తీర్ణులు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

వందేమాతర గేయం @ 150 ఏళ్లు!

స్టడీ జోన్

స్వాతంత్ర్యోద్యమ సమయంలో 'వందేమాతర గీతం' దేశప్రజలను ఏకం చేసింది. ఉద్యమకారుల్లో ఉత్తేజాన్ని నింపింది. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడటంలో సామాన్యులకు స్ఫూర్తి మంత్రంలా నిలిచింది. ప్రస్తుతం ఇది ప్రతి భారతీయ పౌరుడి హృదయంలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది. ఈ గీతం భారతదేశ సంస్కృతి, చారిత్రక గుర్తింపుకి ప్రతీక. దేశ స్వాతంత్ర్య పోరాటంలో ప్రతిఘటన, ఐక్యత, ఆత్మగౌరవానికి చిహ్నంగా నిలిచిన **వందేమాతర గేయానికి నవంబరు 7న 150 ఏళ్లు** నిండుతాయి. ఈ సందర్భంగా పోటీపరీక్షల నేపథ్యంలో దీనికి సంబంధించిన ముఖ్య విశేషాలను నేటి స్టడీ జోన్‌లో తెలుసుకుందాం..!

నేపథ్యం

☛ బ్రిటిష్ ప్రార్థనా గీతం 'గాడ్ సేవ్ ది కింగ్'ని భారత జాతీయ గీతంగా ప్రకటించాలని ప్రభుత్వం భావించింది. దీన్ని మెజారిటీ భారతీయ జాతీయవాదులు తీవ్రంగా వ్యతిరేకించారు.

☛ ఆంగ్లేయుల చర్యకు ప్రతిస్పందనగా బంకిమ్‌చంద్ర ఛటోపాధ్యాయ 1875, నవంబరు 7న వందేమాతర గేయాన్ని రచించారు. సంస్కృతం, బెంగాలీ పదాలను మిళితం చేసి ఆయన దీన్ని రాశారు.

☛ ఛటోపాధ్యాయ 1882లో రచించిన 'ఆనందమఠ్' నవలలో దీన్ని ప్రార్థనా గేయంగా ఉపయోగించారు.

వ్యాప్తి


☛ నాటి బ్రిటిష్ రాజప్రతినిధి లార్డ్ కర్జన్ 1905, జులై 20న బెంగాల్‌ను రెండు రాష్ట్రాలుగా విభజిస్తూ అధికారిక ప్రకటన చేశారు. 1905, అక్టోబరు 16 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. దీనికి వ్యతిరేకంగా దేశప్రజలంతా భారతమాతను స్మరించుకుంటూ 'వందేమాతరం గేయాన్ని' పాడారు. దేశవ్యాప్తంగా 'వందేమాతరం' నినాదాలు చేశారు.



వందేమాతరం పేరుతో వార్తాపత్రికను నెలకొల్పింది ఎవరు? దీనికి ఎడిటర్‌గా ఎవరు వ్యవహరించారు? తదితర అంశాలతోపాటు గతంలో అడిగిన ప్రశ్నల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ

రాష్ట్ర ఆర్థిక సంఘం, సహకార సంస్థలు



భారతదేశం ఒక సమాఖ్య వ్యవస్థ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆర్థిక వనరుల పంపిణీ సక్రమంగా జరగాల్సి ఉంటుంది. దీని కోసం ఆర్థిక సంఘాలను ఏర్పాటు చేస్తుంటారు. ఈ సంఘం రాజ్యాంగబద్ధమైన సంస్థ. ఈ కమిషన్ ఇచ్చే సిఫార్సులకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. గ్రామీణ వ్యవసాయదారులను, వృత్తి కార్మికులను ఆదుకోవడానికి సహకార సంస్థలు ఏర్పాటయ్యాయి.

☛ భారతదేశంలో 70% ప్రజలు వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తున్నారు. వ్యవసాయం నుంచి నికరమైన ఆదాయం రాకపోవడంతో ఖర్చులు అధికమై, పొదుపు లేక రైతులు పెట్టుబడుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది.

☛ 1875లో దక్కన్ ప్రాంతంలో జరిగిన అల్లర్లు వ్యవసాయదారుల రుణబాధలను బ్రిటిష్ ప్రభుత్వానికి తెలిసేలా చేశాయి. ప్రభుత్వం 1876లో దక్కన్ వ్యవసాయదారుల ఉపశమన చట్టం చేసింది. 1883లో భూమి అభివృద్ధి రుణాల చట్టం, 1884లో వ్యవసాయదారుల రుణాల చట్టాలను అమల్లోకి తీసుకువచ్చింది.

సహకార వ్యవస్థ: ఆంధ్రప్రదేశ్‌లో మొదటి సహకార సంఘాన్ని 1918లో కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులో స్థాపించారు. ఇది స్వయం ప్రతిపత్తి కలిగిన సంఘం. ఏటా నవంబరు 14 నుంచి 20 వరకు సహకార వారోత్సవాలను నిర్వహిస్తారు.

సహకార పరపతి వ్యవస్థ, రాష్ట్ర ఆర్థిక సంఘం విధులు - తొలగింపు విధానం మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ONGC was established in which year?

Current Affairs

1. When is World Tsunami Awareness Day 2025 observed with the theme "Be Tsunami Ready"?
A) October 13 B) November 5
C) December 9 D) November 25
2. Which lake in Bihar was recently declared the newest Ramsar Site of India?
A) Gogabeel Lake B) Kanwar Lake
C) Loktak Lake D) Chilika Lake
3. Who has been appointed as the new Controller General of Defence Accounts (CGDA) in 2025?
A) Anuradha Prasad B) Rajiv Gauba
C) Vishvajit Sahay D) Sanjay Malhotra
4. Who was elected as the 10th President of Ireland?
A) Heather Humphreys B) ISHIBA Shigeru
C) Catherine Connolly D) Zohran Mamdani
5. Which legendary English cricketer was knighted in 2025 for his outstanding services to cricket?
A) James Anderson B) Joe Root
C) Ben Stokes D) Alastair Cook
6. UPI transactions in October 2025 hit a record value of approximately how much?
A) Rs.21.75 lakh crore
B) Rs.24.19 lakh crore
C) Rs.25.80 lakh crore
D) Rs.27.28 lakh crore
7. Who won the 2025 Ursula K. Le Guin Fiction Prize for outstanding contribution to speculative and imaginative writing?
A) Arundhati Subramaniam
B) Vajra Chandrasekera
C) Amitav Ghosh D) Salman Rushdie

SSC Exams Special

General Awareness

General Knowledge

8. Which Indian aircraft carrier was designed and built by Cochin Shipyard Limited (CSL), Kochi, and launched into water in 2013?
A) INS Vikrant B) INS Vishal
C) INS Arihant D) INS Viraat
9. In which state is the Shivrinarayan Fair, held every year during Magh Purnima (February) at the Shivrinarayan Temple dedicated to Lord Rama, celebrated?
A) Madhya Pradesh B) Odisha
C) Chhattisgarh D) Jharkhand
10. Who is the Indian author and diplomat best known for writing "The Shiva Trilogy" and the "Ram Chandra Series"?
A) Chetan Bhagat B) Arundhati Roy
C) R.K. Narayan D) Amish Tripathi
11. In which year was the UNESCO World Heritage Convention established to protect cultural and natural heritage sites around the world?
A) 1972 B) 1982 C) 1965 D) 1975

History

12. Which dynasty originally built the Golconda Fort, which later became the principal capital of the Qutb Shahi dynasty in Hyderabad?
A) Vijayanagara Dynasty
B) Kakatiya Dynasty
C) Bahmani Sultanate D) Yadava Dynasty
13. Who is known as the first revolutionary and the 'Father of militant nationalism in India'?
A) Khudiram Bose
B) Vasudev Balwant Phadke
C) Bal Gangadhar Tilak D) Bhagat Singh
14. Who was the first Indian woman to be accorded the title of Pandita and was also among the 10 women delegates at the 1889 Indian National Congress session?
A) Ramabai Sarasvati
B) Annie Besant C) Sarojini Naidu
D) Kadambini Ganguly
15. Which Bengali monthly journal, started in 1843 as the mouthpiece of Debendranath Tagore's Tattvabodhini Sabha, played a major role in the Bengal Renaissance?
A) Som Prakash B) Bangadarshan
C) Tattvabodhini Patrika
D) Samvad Kaumudi

Geography

16. In which Indian state is the Indravati Hydro Electric Project situated?
A) Uttar Pradesh B) Odisha
C) Chhattisgarh D) Madhya Pradesh
17. Which is the highest waterfall in the world, located in Venezuela?
A) Angel Falls B) Tugela Falls
C) Yosemite Falls D) Kaieteur Falls
18. Which planet is nearest to the Sun and takes only about 88 days to complete one revolution around it?
A) Venus B) Mercury
C) Mars D) Earth
19. The Sargasso Sea, known for its floating brown Sargassum seaweed, is a part of which ocean?
A) Pacific Ocean B) Indian Ocean
C) Arctic Ocean D) Atlantic Ocean
20. Cardamom Hills are located in which state?
A) Jammu & Kashmir
B) Himachal Pradesh
C) Kerala D) Maharashtra
21. ONGC was established in which year?
A) 1956 B) 1966
C) 1897
D) 1967

Scan the QR code for Key

These model questions were prepared by subject experts.

ప్రాక్టీస్ బిట్స్

ఇండియన్ ఎకానమీ

1. భారతదేశంలో భూసంస్కరణల్లో అంతర్భాగం కానిది గుర్తించండి?
   1) మధ్యవర్తుల రద్దు 2) కౌలు సంస్కరణలు
   3) భూకమతాలపై సీలింగ్ విధించడం
   4) రైతులకు గృహ రుణాలు మంజూరు చేయడం
2. ఎవరి అధ్యక్షతన ఏర్పాటైన కాంగ్రెస్ వ్యవసాయ సంస్కరణల కమిటీ భూ సంస్కరణలకు సంబంధించి కీలక సిఫార్సులు చేసింది?
   1) గుల్జారీ లాల్ నందా 2) మోహన్ భగత్
   3) జె.సి.కుమరప్ప 4) డా. ఎం.ఎస్.స్వామినాథన్
3. భూసంస్కరణ లాంటి కొన్ని చట్టాలకు న్యాయపరమైన రక్షణ కల్పించే అంశాన్ని రాజ్యాంగంలో ఏ షెడ్యూల్‌లో చేర్చారు?
   1) 7వ 2) 4వ 3) 9వ 4) 5వ
4. ఆచార్య వినోబా భావే ఆధ్వర్యంలో భూదాన ఉద్యమం ఎప్పుడు ప్రారంభమైంది.
   1) 1951, జనవరి 18 2) 1951, ఏప్రిల్ 18
   3) 2004, డిసెంబరు 1 4) 2004, జనవరి 1
5. కింది వాటిలో ఏ రాష్ట్రం ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ బిల్లు-2024కు ఆమోదం తెలిపింది?
   1) తెలంగాణ 2) కర్ణాటక 3) మహారాష్ట్ర 4) ఏపీ
6. భారతదేశంలో మొదటి 'గ్రామ్ దాన్' గ్రామంగా పిలిచే మొంగ్రోత్ ఏ రాష్ట్రంలో ఉంది?
   1) బిహార్ 2) ఉత్తరాఖండ్
   3) ఉత్తర్ ప్రదేశ్ 4) హిమాచల్ ప్రదేశ్

సమాధానాలు: 1-4; 2-3; 3-3; 4-2; 5-4; 6-3.

భయానక అనుభవాలను మిగిల్చే ప్రకృతి విపత్తుల్లో సునామీ ఒకటి. ఇది సంభవించినప్పుడు శక్తిమంతమైన అలల తరంగాలు ఉవ్వెత్తున లేచి సముద్ర తీరాలను ముంచెత్తి పెను విధ్వంసాన్ని సృష్టిస్తాయి. తిరోగమించే అలలు అందిన మేరకు జీవ, నిర్జీవ వనరులన్నింటినీ సముద్రంలోకి ఈడ్చుకెళతాయి. తీరంలోని ఎలాంటి నిర్మాణాలనైనా నాశనం చేసి, శిథిలాల దిబ్బగా మార్చగలిగిన ఆ పెనువిపత్తుకు ప్రధాన కారణాలు, దేశంలో అధికంగా సునామీ వచ్చేందుకు దోహదపడే భౌగోళిక పరిస్థితులు, దాని నుంచి తప్పించుకోవడానికి ఉన్న మార్గాల గురించి పోటీ పరీక్షార్థులు సమగ్రంగా తెలుసుకోవాలి. నియంత్రించలేని ఆ జల ప్రళయాన్ని పసిగట్టి హెచ్చరించేందుకు ఉన్న వ్యవస్థలు, ముందస్తుగా తీసుకోవాల్సిన నివారణ చర్యలు, తీర ప్రాంత ప్రజలకు ఉండాల్సిన అవగాహన, విపత్తు సమయంలో, ఆ తర్వాత వ్యవహరించాల్సిన తీరుపై పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలి.




ముప్పును తగ్గించే ముందస్తు సంసిద్ధత!

జనరల్ స్టడీస్

విపత్తు నిర్వహణ

సునామీ

(ఉపశమన చర్యలు)



హెక్

సునామీ అనే పదం 'సు' (Tsu), 'నామీ' (Nami) అనే రెండు జపనీస్ పదాల కలయికతో ఏర్పడింది. ఇందులో 'సు' అంటే ఓడరేవు లేదా తీరం, 'నామీ' అంటే తరంగాలు అని అర్థం. సముద్రాంతర్గత భూకంపాల వల్ల సముద్రపు నీరు పెద్దఎత్తున తీరప్రాంతాల వైపు స్థానభ్రంశం చెంది, తీర ప్రాంతాలను ముంచేసే ఎత్తయిన అలల పరంపరనే 'సునామీ' అని పిలుస్తారు.

ఈ అలల పరంపరకు 1963లో అమెరికా (హవాయి రాష్ట్రంలోని హోనోలులు నగరం)లో జరిగిన అంతర్జాతీయ శాస్త్రవేత్తల సదస్సులో సునామీ అనే పదాన్ని ఆమోదించారు. తమిళ భాషలో సునామీని 'అజి పెరలై' అని పిలుస్తారు. సునామీల నమోదు కార్యక్రమం క్రీ.పూ.479లో ఏజియన్ సముద్రంలో సంభవించిన ప్రమాదంతో ప్రారంభమైనట్లు ఆధారాలు ఉన్నాయి. సునామీలకు సంబంధించిన మొదటి జాబితాను 1934లో అమెరికాకు చెందిన హెక్ అనే శాస్త్రవేత్త రూపొందించారు.

సునామీలకు కారణాలు: 1) సముద్రాంతర్గత భూకంపాలు 2) అగ్నిపర్వత విస్ఫోటాలు 3) భూపాతాలు 4) ఉల్కాపాతాలు.

* ప్రపంచంలో 80% సునామీలు.. అగ్నిపర్వత విస్ఫోటాలు, భూకంపాలు సర్వసాధారణంగా సంభవించే 'రింగ్ ఆఫ్ ఫైర్' ప్రాంతంలోనే వస్తుంటాయి.



భారతదేశ తీరప్రాంతం మొత్తం సునామీ దుర్బలత్వంలో ఉంది. ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ (INCOIS) ప్రకారం భారతదేశ తీరాన్ని సునామీ తరంగాలు తాకాలంటే రిక్టర్ స్కేలుపై 7.5 కంటే ఎక్కువ తీవ్రతతో సముద్రాంతర్గత భూకంపం రావాలి. అండమాన్-సుమత్రా లేదా పాకిస్థాన్‌లోని మక్రాన్ ప్రాంతాల్లో మాత్రమే ఆ తీవ్రతతో సముద్రంలో భూకంపాలు సంభవించడానికి అవకాశం ఉంది. అంతటి ప్రభావంతో వచ్చిన భూకంపాలన్నీ సునామీలకు దారితీస్తాయని చెప్పడం కూడా సాధ్యం కాదు.

సునామీల లక్షణాలు: * సముద్రాంతర్గత ప్రాంతాల్లో భూకంపాలు ఏర్పడినప్పుడు విడుదలయ్యే గతిశక్తి కారణంగా ఉపరితల నీరు అంతర ప్రవాహంగా గంటకు దాదాపు 500 నుంచి 1000 కి.మీ. వేగంతో తీరప్రాంతాల వైపు కదులుతుంది. ఈ అంతర ప్రవాహం వల్లనే సునామీ కెరటాలను గుర్తించడం కుదరదు. సునామీ తీరాన్ని దాటేటప్పుడు సముద్ర ఉపరితల జలాలు సాధారణ స్థితిలో నిశ్చలంగానే ఉంటాయి.

* ఎడ్జ్‌వేవ్స్ అంటే సముద్రతీరానికి సమాంతరంగా ముందుకు, వెనుకకు కదులుతూ తీరాన్ని దాటే సంక్లిష్ట అలలు.
* షోలింగ్ లేదా వేవ్‌లైన్ అంటే తీరప్రాంతాన్ని ఒక దాని తర్వాత మరొకటి చేరే అలల పరంపర.
* రన్‌ఆఫ్ అంటే తీర ప్రాంతాల్లో సముద్ర కనీస మట్టంపై అలల ఎత్తును పరిగణించే ఒక ప్రమాణం. * సునామీ తరంగాల గరిష్ఠ ఎత్తు దాదాపు 30 - 45 మీటర్ల వరకు ఉంటుంది.
* సునామీ అనేది అతిపెద్దదైన ఒకే తరంగం కాదు. తరంగాల పరంపరతో కూడిన సముదాయం. ఆ తరంగాల పరంపరనే సునామీ వేవ్ ట్రైన్ అంటారు. * సునామీలు రోజులో ఏ సమయంలోనైనా సంభవించవచ్చు. వేకువజామున వచ్చే సునామీలకు ఎక్కువ తీవ్రత ఉంటుంది. * సునామీ అలలు తీరం చేరేకొద్దీ వాటి తరంగదైర్ఘ్యం తగ్గి, డోలనా పరిమితులు పెరిగి ఎక్కువ ఎత్తయిన తరంగాలు తీరాన్ని ముంచేస్తాయి. * సునామీల రాకను ముందుగా పసిగట్టడం, గుర్తించడం సాధ్యం కాదు. కానీ కంప్యూటర్ నమూనాలను ఉపయోగించి సునామీ సంభవించే సమయాన్ని కొద్ది నిమిషాల ముందు తెలుసుకోవచ్చు. * సునామీ ఉపసంహరణ అత్యధిక నష్టానికి కారణమవుతోంది. తరంగాలు సముద్రం వైపు తిరోగమిస్తున్నప్పుడు కట్టడాల పునాదులు, ఇళ్లు, ఇతర వనరులను సముద్రంలోకి ఈడ్చుకెళతాయి. దీని కారణంగా పెద్దస్థాయిలో ఆస్తి, ప్రాణనష్టాలు సంభవిస్తాయి. * 1896లో సంభవించిన పెను విపత్తు అనంతరం ప్రపంచంలోనే మొదటిసారిగా జపాన్‌లో సునామీ శాస్త్రం, ప్రతిస్పందన చర్యలు అనుసరించడం మొదలైంది. సునామీని నివారించడం సాధ్యం కాదు. సునామీల ఉపశమన కార్యక్రమాలు మూడు దశలుగా ఉంటాయి. అవి 1) సునామీకి ముందు చేపట్టే ఉపశమన చర్యలు 2) సునామీ సంభవించే సమయంలో చేపట్టే ఉపశమన చర్యలు 3) సునామీ అనంతరం చేపట్టే చర్యలు.

1 సునామీకి ముందు చేపట్టే ఉపశమన చర్యలు

ఎ) స్థల ప్రణాళిక, భూమి నిర్వహణ: సముద్ర ప్రణాళిక విస్తృత చట్రంలో భాగంగా వైపరీత్య ప్రాంతాల్లో అభివృద్ధి సాంద్రతను నిర్ధారిస్తారు. వ్యవసాయ భూములు, పార్కులు తదితర బహిరంగ స్థలాలను వినియోగానికి అనువుగా ప్రణాళిక రూపొందిస్తారు. దీంతో సునామీ ముప్పును తగ్గించవచ్చు.

బి) స్థల ఎంపిక: సముద్రతీరం నుంచి కొన్ని వందల అడుగుల దూరంలోని ప్రాంతాలు సునామీతో అధికంగా నష్టపోతాయి. అక్కడ ఇళ్ల నిర్మాణం, నివాసాల ఏర్పాటు సరికాదు. భవనాలను సగటు సముద్రమట్టం కంటే ఎక్కువ ఎత్తులో నిర్మించుకోవాలి.

* అత్యధిక శాతం సునామీ తరంగాలు 10 అడుగులు (3 మీటర్లు) కంటే తక్కువ ఎత్తులో ఉంటాయి. ఇళ్లను ఎత్తుగా నిర్మించుకుంటే అత్యధిక శాతం సునామీల నుంచి ఆస్తినష్టం జరగకుండా కాపాడుకోవచ్చు. తరంగాల వేగాన్ని తగ్గించడానికి వాటర్ బ్రేకర్లు నిర్మించాలి. నీటికి నానిపోకుండా, తుప్పుపట్టకుండా ఉండే సామగ్రితో భవనాలను నిర్మించుకోవాలి. * విపత్తు సమయంలో షెల్టర్లుగా పనికొచ్చే విధంగా కమ్యూనిటీ హాళ్లను ఎత్తయిన ప్రదేశాల్లో నిర్మించాలి.

సి) వరద నిర్వహణ: సునామీ తరంగాలు తీర ప్రాంతాలను వరదలతో ముంచెత్తుతాయి. ముందస్తు సన్నాహాల్లో వరద ఉపశమన చర్యలనూ జత చేయాలి.

డి) ఇంజినీరింగ్ నిర్మాణాలు: అధికశాతం మత్స్యకారుల నివాసాలు తీరప్రాంతాల్లోనే ఉంటాయి. వీటిని ఎలాంటి ఇంజినీరింగ్ ఉత్పత్తులు వినియోగించకుండా తేలికపాటి సామగ్రితో నిర్మిస్తారు. ఉత్తమ నిర్మాణ పద్ధతులను అనుసరించేలా వారికి అవగాహన కల్పించాలి.

ఇ) కమ్యూనిటీ తీసుకోవాల్సిన చర్యలు: ఇల్లు, పాఠశాల, పని ప్రదేశం లేదా ప్రజలు తరచూ సందర్శించే ప్రదేశాలు సునామీ ముప్పు ఉన్న ప్రాంతాల్లో ఉన్నాయా అనేది పరిశీలించాలి. వీధి సముద్ర మట్టానికి ఎంత ఎత్తులో ఉంది? తీరప్రాంతం నుంచి లేదా అధిక ముప్పు ఉన్న జలాల నుంచి ఎంత దూరంలో ఉంది? తదితర అంశాలనూ గుర్తించాలి.

* సునామీ వచ్చినప్పుడు సులభంగా తప్పించుకోవడానికి మార్గాలను రూపొందించుకోవాలి. * విపత్తు నిర్వహణ సామగ్రి, సరఫరా వ్యవస్థలను అందుబాటులో ఉంచుకోవాలి. * అత్యవసర సమాధాన, అనుసంధాన వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలి. * సునామీ వల్ల కుటుంబ సభ్యులు ఒకరి నుంచి ఒకరు వేరయితే తిరిగి కలుసుకోవడానికి అవసరమైన ప్రణాళికలను ముందుగానే సిద్ధం చేసుకోవాలి. * సుదూర ప్రాంతంలో ఉండే బంధువు లేదా స్నేహితుడి ఫోన్ నంబరును కుటుంబ కాంటాక్ట్ నంబరుగా ఇవ్వాలి.

2 సునామీ సంభవించే సమయంలో చేపట్టే ఉపశమన చర్యలు


* తీరరేఖ నుంచి వందల మీటర్ల దూరంలోపు భవనాలను నిర్మించడం లేదా వాటిల్లో నివసించడం చేయకూడదు. * సునామీ వచ్చినప్పుడు అవసరమైన వస్తువుల జాబితాను సిద్ధం చేసుకోవాలి. * తీరప్రాంతంలో ఉన్న ఇళ్లను ఎత్తులో నిర్మించుకోవాలి. దీంతో అత్యధిక శాతం సునామీల నుంచి ఆస్తి నష్టం జరగకుండా కాపాడుకోవచ్చు. * వరదలు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి.



* ఇళ్లను ఇంజినీరుతో తనిఖీ చేయించుకోవాలి. ఇళ్లను సునామీ అలలు తాకకుండా, వాటితో దెబ్బతినకుండా మరింత దృఢంగా నిర్మించుకోవడానికి సలహాలు తీసుకోవాలి. * అత్యవసర సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి స్థానిక రేడియో లేదా టీవీ స్టేషన్‌ను ఉపయోగించుకోవాలి. * స్థానిక అధికారులు ఇచ్చే సూచనలను పాటించాలి. * ఇంటి వద్ద ఉన్నప్పుడు సునామీ హెచ్చరిక వస్తే, కుటుంబ సభ్యులకు తెలియజేయాలి, అందరూ బయటకు వెళ్లాలి.

3 సునామీ అనంతరం చేపట్టే చర్యలు:

* అత్యవసర సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి రేడియో లేదా టెలివిజన్‌ను నిరంతరం ఉపయోగించాలి. * సునామీ వల్ల రోడ్లు ధ్వంసం కావచ్చు. వాటివైపు వెళ్లడం సురక్షితం కాదు. * గాయపడిన వారికి, చిక్కుకుపోయిన వ్యక్తులకు సహాయం అందించడానికి ముందు ఎవరికి వారు తమకు ఏమైనా గాయాలు అయ్యాయేమో అని పరిశీలించుకుని, అవసరమైతే ప్రథమ చికిత్స చేయించుకోవాలి. * కాపాడాల్సిన వారు ఎవరైనా ఉంటే, సరైన సామగ్రి ఉన్న నిపుణులకు ఫోన్ చేసి రప్పించాలి. * ప్రత్యేక సహకారం అవసరమైన శిశువులు, వృద్ధులు, రవాణా సౌకర్యం లేనివారికి, అత్యవసర పరిస్థితిలో అదనపు సహాయం అవసరమైన పేద కుటుంబాలు, దివ్యాంగులకు, వారికి అండగా వచ్చినవారికి సహాయపడాలి. * విపత్తు ప్రాంతాలకు దూరంగా ఉండాలి. అక్కడే ఉంటే సహాయక, అత్యవసర చర్యలకు ఆటంకం కలగడంతో పాటు కలుషిత నీరు, పగిలిన రోడ్లు, భూపాతాలు, బురద, వరదల అవక్షేప ప్రభావాల వల్ల ముప్పు కలగవచ్చు. * అత్యవసర సమాచారానికి మాత్రమే టెలిఫోన్ ఉపయోగించాలి. విపత్తు పరిస్థితుల్లో టెలిఫోన్ లైన్లు రద్దీగా ఉంటాయి. అత్యవసర ఫోన్లకు వీలుగా వాటిని క్లియర్ చేయాలి.





రచయిత: సక్కరి జయకర్

వ్యక్తిత్వం.. వైఖరి బాగుంటేనే!

జాబ్ స్కిల్స్



పెద్ద కంపెనీల ఉద్యోగ ఇంటర్వ్యూల్లో, ప్రాంగణ నియామకాల్లో అభ్యర్థుల సాంకేతిక పరిజ్ఞానంతోపాటు వ్యక్తిత్వం, వైఖరులనూ గమనిస్తారు. ఉద్యోగంలో చేరిన తర్వాత ఇతరులతో ఏవిధంగా వ్యవహరిస్తారు, ఉద్యోగ వాతావరణానికి అనుకూలంగా సర్దుకుపోగలుగుతారా లేదా అనే అంశాలను పరిశీలిస్తారు. దరఖాస్తు చేసుకున్న సంస్థలో ఉన్న పని సంస్కృతిని అర్థం చేసుకోవడం, శ్రద్ధగా పని చేసి ఉత్తమ ఫలితాలను అందించడం తదితరాలు ఉద్యోగంలో ఉన్నతికి దోహదపడతాయి. ఆ తరహా వైఖరిని, ఆశావాద దృక్పథాన్ని అలవరిచే ఉద్యోగ లక్షణాలను ఎలా పెంపొందించుకోవాలో తెలుసుకోవాలంటే **క్యూఆర్ కోడ్** స్కాన్ చేయండి.

సాంస్కృతిక బంధానికి ప్రతీక.. విశ్వకవి విగ్రహం!

భారత్-చైనా మధ్య ఉన్న సాంస్కృతిక బంధానికి ప్రతీకగా విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహాన్ని బీజింగ్‌లోని భారత రాయబార కార్యాలయంలో ఆవిష్కరించారు. దేశ అమ్ములపొదిలోని అధునాతన రఫేల్ యుద్ధ విమానంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గగన విహారం చేశారు. అణుశక్తితో పనిచేసే సబ్‌మెర్సిబుల్ డ్రోన్‌ను రష్యా విజయవంతంగా పరీక్షించింది. ఆగ్నేయాసియాలో ప్రాంతీయ స్థిరత్వం, ఆర్థిక వృద్ధి కోసం ఏర్పాటైన ఆసియాన్ కూటమి సభ్య దేశాల సంఖ్య పదకొండుకు పెరిగింది. సున్నితమైన హిమాలయ పర్యావరణ వ్యవస్థను రక్షించడం, కాలుష్యాన్ని నియంత్రించడమే లక్ష్యంగా బయటి రాష్ట్రాల నుంచి వాహనాలకు హరిత పన్ను విధించాలని ఉత్తరాఖండ్ ప్రభుత్వం నిర్ణయించింది. జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యంతో వార్తలుగా నిలిచే ఇలాంటి వర్తమానాంశాలు, వాటి పూర్వాపరాలను పోటీ పరీక్షార్థులు నిరంతరం తెలుసుకుంటూ ఉండాలి. భారత రక్షణ వ్యవహారాలకు సంబంధించి తాజా పరిణామాలు, వివిధ దేశాల్లో మారిన నాయకత్వాలు, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల కీలక విధాన నిర్ణయాలు, ప్రపంచ స్థాయి సదస్సులు, రాజకీయ పరిణామాలు, వైజ్ఞానిక ఆవిష్కరణలపై అవగాహన పెంచుకోవాలి.

కరెంట్ అఫైర్స్

1. వరదలకు సంబంధించి రియల్ టైమ్‌లో సమాచారాన్ని అందిస్తున్న భారత తొలి నగరంగా ఏది నిలిచింది?
   1) విజయవాడ 2) విశాఖపట్నం
   3) చెన్నై 4) ముంబయి

నోట్: ➾ 2025, అక్టోబరు నుంచి ఇది అమల్లోకి వచ్చింది.
➾ రియల్ టైమ్ ఫోర్‌కాస్టింగ్ అండ్ స్పేషియల్ డెసిషన్ సపోర్ట్ సిస్టం ద్వారా ఇది సాధ్యమైంది.

2. ట్రకోమా రహిత దేశంగా ఫిజీని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇటీవల ప్రకటించింది. ఫిజీతో కలిపి ఇప్పటి వరకు ఎన్ని దేశాలు ట్రకోమా రహిత దేశాలుగా గుర్తింపు పొందాయి?
   1) 26 2) 30 3) 35 4) 40
3. కింది వాటిలో మొంథా తుపానుకు సంబంధించి సరైనవి?



   ఎ) ఇటీవల (2025, అక్టోబరు) బంగాళాఖాతంలో వచ్చిన తుపాను పేరు మొంథా.
   బి) ఈ తుపాను పేరును సూచించిన దేశం థాయ్‌లాండ్.
   సి) థాయ్ భాషలో మొంథా అంటే 'సువాసన వెదజల్లే అందమైన పువ్వు' అని అర్థం.
   1) ఎ, బి 2) ఎ, బి, సి 3) ఎ, సి 4) బి, సి

నోట్: ➾ బంగాళాఖాతం, అరేబియా సముద్ర తీరాల్లో ఏర్పడే తుపాన్లకు హిందూమహాసముద్రం పరిధిలోని 13 దేశాలను సంప్రదించి పేర్లు రూపొందిస్తారు. అవి.. భారత్, బంగ్లాదేశ్, థాయ్‌లాండ్, మయన్మార్, మాల్దీవులు, శ్రీలంక, పాకిస్థాన్, ఒమన్, ఖతర్, యెమెన్, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ.
➾ యునైటెడ్ నేషన్స్ ఎకనామిక్ అండ్ సోషల్ కమిషన్ ఫర్ ఏషియా అండ్ ది పసిఫిక్ (ఈఎస్‌సీఏపీ - ఎస్కాప్) ఈ బాధ్యతను నిర్వహిస్తుంది.
➾ ప్రతిపాదించే పేర్లు హింసాత్మకం, వ్యతిరేక భావాలు వచ్చేలా ఉండకూడదు. చిన్న చిన్న పదాలతో ఉండాలి.
➾ 2004 నుంచి తుపాన్లకు పేర్లు పెడుతున్నారు.
➾ ఉత్తర హిందూమహాసముద్ర ప్రాంతం (నార్త్ ఇండియన్ ఓషన్ రీజియన్స్)లో వచ్చే తుపాన్లకు దిల్లీలోని ప్రాంతీయ ప్రత్యేక వాతావరణ కేంద్రం పేర్లు పెడుతుంది.

4. అణుశక్తితో నడిచే అండర్ వాటర్ డ్రోన్ 'పోసిడాన్'ను ఇటీవల పరీక్షించిన దేశం ఏది?
   1) అమెరికా 2) జర్మనీ
   3) రష్యా 4) ఇజ్రాయెల్

నోట్: ➾ ఇటీవల రష్యా అణుశక్తి ఆధారిత క్రూయిజ్ క్షిపణి 'బురెవిస్ట్‌నిక్'ను పరీక్షించింది.

5. ఏ దేశ అధ్యక్షుడిగా 'పాల్ బియా' ఎన్నికయ్యారు?
   1) కామెరూన్ 2) బొలీవియా
   3) ఫిజీ 4) ఉరుగ్వే

నోట్: ➾ 1982 నుంచి కామెరూన్ అధ్యక్షుడిగా ఉన్నారు.
➾ 92 ఏళ్ల వయసులో ఆ దేశానికి మళ్లీ అధ్యక్షుడయ్యారు.

6. అమెరికా, రష్యా మరిన్ని అణ్వాయుధాలు తయారు చేయకుండా నిరోధించేందుకు ఉద్దేశించిన ప్లుటోనియం ఒప్పందం నుంచి ఇటీవల రష్యా వైదొలగుతున్నట్లు ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించారు. ఈ రెండు దేశాల మధ్య ఆ ఒప్పందం ఏ సంవత్సరంలో జరిగింది?
   1) 2000 2) 2010 3) 2014 4) 2016
7. 2025, అక్టోబరు 29న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము భారత వైమానిక దళానికి చెందిన రఫేల్ యుద్ధ విమానంలో గగనవిహారం చేశారు. అయితే ఆమె ఏ సంవత్సరంలో సుఖోయ్-30 ఎంకేఐ ఫైటర్ జెట్‌లో ప్రయాణించారు?
   1) 2024, ఏప్రిల్ 8 2) 2025, ఏప్రిల్ 8
   3) 2023, ఏప్రిల్ 15 4) 2023, ఏప్రిల్ 8
8. కేంద్ర ప్రభుత్వం 8వ వేతన సవరణ సంఘం ఛైర్మన్‌గా ఎవరిని నియమించింది?
   1) రంజనా ప్రకాశ్ దేశాయ్
   2) కిరణ్ ప్రకాశ్
   3) నాగేశ్వరరావు
   4) రమణ



రంజనా ప్రకాశ్ దేశాయ్

9. రూ.8,800 కోట్ల భారీ వ్యయంతో 2034 ఫుట్‌బాల్ ప్రపంచకప్ ఆతిథ్యానికి స్కై స్టేడియాన్ని ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారు?
   1) జపాన్ 2) రష్యా
   3) సౌదీ అరేబియా 4) కెనడా
10. కింది వాటిలో 2025 సంవత్సరానికి రాష్ట్రీయ విజ్ఞాన్ అవార్డులకు సంబంధించి సరైంది?
   ఎ) ఒకరికి విజ్ఞానరత్న అవార్డు, ఎనిమిది మందికి విజ్ఞాన్‌శ్రీ, 14 మందికి విజ్ఞాన్ యువ అవార్డులు, ఒక విజ్ఞాన్ బృంద అవార్డు ప్రకటించారు.
   బి) జయంత్ విష్ణు నార్లికర్ (భౌతికశాస్త్రం)కు విజ్ఞాన్ రత్న అవార్డు వచ్చింది.
   సి) 2024 విజ్ఞానరత్న అవార్డు విజేత ప్రొఫెసర్ గోవిందరాజన్ పద్మనాభన్.
   డి) విజ్ఞానరత్న అవార్డును 2023, సెప్టెంబరు 21న స్థాపించారు. ఈ అవార్డు 2024 నుంచి ఇస్తున్నారు.
   1) ఎ, బి, సి 2) బి, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి
11. ఇటీవల కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) వెలువరించిన నివేదిక ప్రకారం భారతదేశంలోని హిమానీనద సరస్సుల నీటి విస్తీర్ణ ప్రాంతం 2011 నుంచి 2025 మధ్య ఎంత శాతం పెరిగింది?
   1) 29% 2) 27% 3) 32% 4) 40%
12. ఆసియాన్‌లో 11వ సభ్యదేశంగా చేరిన దేశం ఏది?
   1) ఫిజీ 2) శ్రీలంక
   3) తైమూర్-లెస్టే 4) మాల్దీవులు

నోట్: ➾ 46వ ఆసియాన్ సమావేశం 2025, మే 26, 27 తేదీల్లో మలేసియాలో జరిగింది.
➾ 47వ సమావేశం ఈ ఏడాది అక్టోబరులో మలేసియాలో జరిగింది. ఈ సమావేశం థీమ్: ఇన్‌క్లూజివిటీ అండ్ సస్టైనబిలిటీ.
➾ 48, 49వ సమావేశాలు 2026 లో ఫిలిప్పీన్స్‌లో జరుగుతాయి.



13. ప్రముఖ ఆన్‌లైన్ నిఘంటువు వెబ్‌సైట్ 'డిక్షనరీ.కామ్' 2025లో 'వర్డ్ ఆఫ్ ద ఇయర్' గా ఏ సంఖ్యను ప్రకటించింది?
   1) 97 2) 57 3) 47 4) 67

నోట్: ➾ ఈ సంఖ్యను కౌమార దశలోకి అడుగుపెట్టిన వారు జెన్‌ఆల్ఫా (2010 - 2025 మధ్య జన్మించినవారు) విపరీతంగా వినియోగిస్తున్నారు.
➾ 67 - దీన్ని కలిపి కాకుండా విడివిడి (ఆరు, ఏడు) గా చదవాలి.
➾ దీనికి అర్థం లేదు. ఏదో ఊరికే అలా వాడే పదం.

14. 'మెలిసా' హరికేన్ ఇటీవల ఎక్కడ సంభవించింది?
   1) కరేబియన్ దీవులు 2) ఫిలిప్పీన్స్
   3) జపాన్ 4) చైనా
15. 22వ ఆసియాన్-ఇండియా సదస్సు ఇటీవల ఎక్కడ జరిగింది?
   1) మలేసియా 2) వియత్నాం
   3) సింగపూర్ 4) మయన్మార్

నోట్: ➾ 2026వ సంవత్సరాన్ని ప్రధాని మోదీ ఆసియాన్ - ఇండియా మారిటైమ్ కో-ఆపరేషన్ ఇయర్‌గా ప్రకటించారు. (సముద్ర సహకార సంవత్సరం)

16. సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నియమితులయ్యారు. ఆయన ఎప్పటివరకు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తారు?




   1) 2025, నవంబరు 24 నుంచి 2027, ఫిబ్రవరి 9 వరకు
   2) 2025, నవంబరు 24 నుంచి 2028, ఫిబ్రవరి 9 వరకు
   3) 2025, నవంబరు 30 నుంచి 2026, ఫిబ్రవరి 9 వరకు
   4) 2025, నవంబరు 24 నుంచి 2025, డిసెంబరు 9 వరకు
17. కింది వాటిలో సరైంది?
   ఎ) కేంద్ర విద్యుత్తు మంత్రిత్వశాఖ ప్రకారం 2025, సెప్టెంబరు 30 నాటికి దేశ విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం 500.89 గిగావాట్లకు చేరింది.
   బి) 2014, మార్చి 31 నాటికి దేశ విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం 249 గిగావాట్లు మాత్రమే.
   సి) మొత్తం విద్యుత్తు సామర్థ్యంలో పునరుత్పాదక, జల, అణువిద్యుత్తు 256.09 గిగావాట్లు (51%). శిలాజ ఇంధన వనరులు (బొగ్గు, సహజవాయువు, డీజిల్) 244.80 గిగావాట్లు (49%)
   1) ఎ, బి 2) బి, సి 3) ఎ, బి, సి 4) ఎ, సి

నోట్: ➾ పునరుత్పాదక వనరుల్లో సౌరవిద్యుత్తు 127.33 గిగావాట్లు, పవన విద్యుత్తు 52.12 గిగావాట్లుగా ఉంది.

18. నీతిఆయోగ్ ఇటీవల దేశీయ సేవారంగానికి సంబంధించి రెండు నివేదికలు విడుదల చేసింది. మొదటి నివేదికలో 2024 - 25లో దేశీయ స్థూల విలువ(జీవీఏ)లో సేవారంగం వాటా ఎంత ఉందని తెలిపింది?
   1) 65% 2) 60% 3) 55% 4) 74%
19. రాష్ట్రీయ ఏక్తా దివస్ (జాతీయ సమైక్యతా దినోత్సవం) ఏ రోజున నిర్వహిస్తారు?
   1) అక్టోబరు 20 2) అక్టోబరు 26
   3) అక్టోబరు 31 4) అక్టోబరు 29

నోట్: ➾ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి రోజు.
➾ 2025 నాటికి సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మించి 150 ఏళ్లు పూర్తయ్యాయి. (1875, అక్టోబరు 31)
➾ 150వ జయంతిని పురస్కరించుకుని నవంబరు 1 నుంచి భారత్‌పర్వ్ - 2025 ఉత్సవాలను కేంద్రం ప్రారంభించింది. (నవంబరు 1 నుంచి 15)

20. అలసానే ఔట్టరా ఏ దేశ అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికయ్యారు?
   1) నమీబియా 2) జింబాబ్వే
   3) ఐవరీకోస్ట్ 4) కెన్యా
21. ఇటీవల భారత్‌ను సందర్శించిన కాన్‌స్టాన్షన్స్ కాంబస్ ఏ దేశ విదేశాంగ మంత్రి?
   1) సైప్రస్ 2) క్యూబా
   3) పరాగ్వే 4) ఉరుగ్వే
22. సఖారా ప్రైజ్ 2025 ఎవరికి వచ్చింది?
   1) అడ్రెజ్ పోక్జోబట్ 2) మ్జియా అమగ్లోబెలి
   3) 1, 2 4) నిహాన్ హిడంక్యో
23. ఇటీవల రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహాన్ని ఏ దేశ రాజధాని నగరంలో ఆవిష్కరించారు?
   1) జపాన్ 2) చైనా
   3) ఉత్తర కొరియా 4) దక్షిణ కొరియా
24. భారత సైన్యం కోసం స్వదేశీంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ రేడియోను ఎవరు అభివృద్ధి చేశారు?
   1) డీఆర్‌డీఓ 2) ఇస్రో
   3) హెచ్ఏఎల్ 4) టాటా
25. ఎస్‌జె-100 సివిల్ కమ్యూటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను ఇండియాలో తయారుచేయడానికి హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ ఏ దేశంతో ఒప్పందం చేసుకుంది?
   1) అమెరికా 2) జర్మనీ
   3) ఫ్రాన్స్ 4) రష్యా
26. 22వ వార్షిక కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ ఇండియా రీజియన్ జోన్-III సమావేశం నవంబరు 9 నుంచి 13 వరకు ఎక్కడ నిర్వహిస్తున్నారు?
   1) మణిపుర్ 2) నాగాలాండ్
   3) మేఘాలయ 4) అస్సాం
27. ఏ రాష్ట్రం బయటి నుంచి వచ్చే వాహనాలపై గ్రీన్ ట్యాక్స్ విధించాలని నిర్ణయించింది?
   1) కేరళ 2) అస్సాం
   3) సిక్కిం 4) ఉత్తరాఖండ్



రచయిత: బి.ధన్‌మోహన్ రెడ్డి

సమాధానాలు

1-3, 2-1, 3-2, 4-3, 5-1, 6-1, 7-4, 8-1, 9-3, 10-4, 11-2, 12-3, 13-4, 14-1, 15-1, 16-1, 17-3, 18-3, 19-3, 20-3. 21-1, 22-3, 23-2, 24-1, 25-4, 26-2, 27-4.

అమ్మాయిల పెళ్లికి ఊరంతా పెద్దలు!

ఈటీవీ భారత్: పశ్చిమ బెంగాల్‌లోని సుందర్‌బన్స్‌లో ఇద్దరు అమ్మాయిలు వివాహబంధంతో ఒక్కటయ్యారు. దక్షిణ 24 పరగణాల జిల్లాలోని మందిర్ బజార్‌కు చెందిన రియా సర్దార్, సుందర్‌బన్స్‌లోని



బకుల్తాలాకు చెందిన రాఖీ నస్కర్ పరస్పరం ఇష్టపడ్డారు. తమ ప్రేమను పెద్దలకు తెలియజేసి పెళ్లికి అనుమతి కోరగా.. రాఖీ తల్లిదండ్రులు ససేమిరా అన్నారు. దీంతో రాఖీ ఇల్లు వదిలిపెట్టి వచ్చేసింది. రియా కుటుంబసభ్యులు వీరి ప్రేమకు అండగా నిలబడటమే కాకుండా, ఊరి జనంతో కూడా మాట్లాడి ఒప్పించారు. స్థానికంగా ఉన్న ఒక ఆలయంలో అందరి సమక్షంలో వీరి పెళ్లి జరిగింది. ఇద్దరు వ్యక్తులు కలిసి జీవించాలంటే లింగభేదం అడ్డు కాదని, ప్రేమ సరిపోతుందని రియా తెలిపింది. మన దేశంలో స్వలింగ సంపర్కుల వివాహాలకు చట్టబద్ధత లేకున్నా.. సమాజంలో వారు వివక్షకు గురికాకుండా ప్రభుత్వాలు చూడాలని సుప్రీంకోర్టు గతంలో పేర్కొంది.

ఇది 58వ సారి: కాంగ్రెస్

దిల్లీ: ట్రంప్ వ్యాఖ్యల అనంతరం మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ విరుచుకుపడింది. ఆయన ఇలా వ్యాఖ్యలు చేయడం ఇది 58వసారి అని గుర్తు చేసింది. 'ఆపరేషన్ సిందూర్‌ను ఆపేందుకు వాణిజ్య ఒప్పందం, సుంకాలను ఉపయోగించానని ట్రంప్ మరోసారి చెప్పారు. వాషింగ్టన్‌లో మే 10న మొదటిసారి, తాజాగా 58వసారి ఈ మాట చెప్పారు' అని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఎక్స్ వేదిగా పేర్కొన్నారు.

న్యూయార్క్‌కు సాయం చేస్తాం: ట్రంప్

మయామీ: న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో జోహ్రాన్ మమ్దానీ గెలిస్తే నగరానికి అందించే ఫెడరల్ నిధులను తగ్గిస్తానని గతంలో హెచ్చరించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఫలితాల తర్వాత కొంత వెనక్కి తగ్గారు. మయామీలో జరిగిన అమెరికా బిజినెస్ ఫోరమ్ సమావేశంలో మాట్లాడిన ఆయన.. న్యూయార్క్ విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఇందుకోసం తాను కొంతైనా సాయం చేస్తానని ప్రకటించారు. మమ్దానీ, డెమోక్రాట్లపై మాత్రం ఆయన తన విమర్శలను కొనసాగించారు. కమ్యూనిస్టులు దేశాన్ని విపత్తులోకి నెట్టేశారని విమర్శించారు. ఇప్పుడు కొత్తగా వచ్చిన కమ్యూనిస్టు ఏం చేస్తారో చూస్తామని వ్యాఖ్యానించారు. విజయానంతరం మమ్దానీ ప్రసంగం ఆవేశపూరితంగా ఉందని పేర్కొన్నారు. ఈ కొత్త మేయర్ కమ్యూనిస్టు భావజాలం కలిగిన వ్యక్తి అని, న్యూయార్క్ నగరం కమ్యూనిస్టు క్యూబా, సోషలిస్టు వెనెజువెలాలా మారుతుందని విమర్శలు గుప్పించారు. ఈ నగర ప్రజలు ఫ్లోరిడాకు పారిపోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

19 మంది దక్షిణాసియా అమెరికన్ల విజయం: ఐఏఐఎఫ్

న్యూయార్క్: అమెరికా రాజకీయ భవిష్యత్తులో దక్షిణాసియా అమెరికన్ల భాగస్వామ్యం విస్తరిస్తోందని ఇండియన్ అమెరికన్ ఇంపాక్ట్ ఫండ్ (ఐఏఐఎఫ్) వెల్లడించింది. సిటీ కౌన్సిల్ అయినా, మేయర్ ఎన్నికలైనా, రాష్ట్ర స్థాయి ఎన్నికలైనా వారు తమ సత్తాను చాటుతున్నారని తెలిపింది. మంగళవారం విడుదలైన ఎన్నికల ఫలితాల్లో తాము బలపరిచిన 19 మంది దక్షిణాసియా అమెరికన్లు విజయం సాధించారని వివరించింది. ఇందులో వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా గజాలా హష్మీ, న్యూయార్క్ మేయర్‌గా జోహ్రాన్ మమ్దానీ ఎన్నికయ్యారని తెలిపింది.

✦ పెన్సిల్వేనియాలోని బక్స్ కౌంటీ డిస్ట్రిక్ట్ అటార్నీగా జో ఖాన్ ఎన్నికయ్యారని ఐఏఐఎఫ్ వెల్లడించింది.

కేరళలో 6 నెలల చిన్నారి హత్య

- అమ్మమ్మపై అనుమానాలు

కొచ్చిన్: కేరళలోని ఎర్నాకుళం జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. అంగమలీలో ఆరు నెలల చిన్నారిని గొంతు కోసి హత్య చేశారు. ఈ కేసులో ఆమె అమ్మమ్మను నిందితురాలిగా అనుమానిస్తున్నారు. పోలీసులు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. ఆంటోనీ, రూత్ దంపతుల కుమార్తె డెల్నా మరియా సారా. ఆమెను బుధవారం ఉదయం అమ్మమ్మ మంచం మీద పడుకోబెట్టి చిన్నారి తల్లి వంటగదిలోకి వెళ్లింది. తిరిగి వచ్చే సమయానికి పాప మెడపై గాయంతో రక్తపు మడుగులో ఉంది. వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించినప్పటికీ చిన్నారి మృతిచెందినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రస్తుతం నిందితురాలు ఆసుపత్రిలో ఉన్నారు. ఆమె అరెస్టుకు పోలీసులు ప్రయత్నాలు మొదలు పెట్టారు.

మరో బందీ మృతదేహాన్ని గుర్తించిన ఇజ్రాయెల్

జెరూసలెం: గాజా కాల్పుల విరమణ ఒప్పందం తొలి దశలో భాగంగా మరో బందీ మృతదేహాన్ని బుధవారం రాత్రి ఇజ్రాయెల్‌కు హమాస్ పంపింది. వైద్య పరీక్షల అనంతరం భౌతికకాయం.. 2023 అక్టోబరు 7న హమాస్ చేసిన దాడుల్లో మృతి చెందిన టాంజానియా జాతీయుడిదిగా ఇజ్రాయెలీ అధికారులు గుర్తించారు. ఒప్పందంలో భాగంగా ఇంకా ఆరు మృతదేహాలను హమాస్ అప్పగించాల్సి ఉంది. మరోవైపు లెబనాన్‌పై ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు గురువారం విరుచుకుపడ్డాయి. హెజ్‌బొల్లా స్థావరాలే లక్ష్యంగా దాడులు చేశామని ఇజ్రాయెల్ సైన్యం పేర్కొంది.

రష్యా చమురుశుద్ధి కర్మాగారంపై ఉక్రెయిన్ డ్రోన్ల దాడి

కీవ్: ఉక్రెయిన్ కూడా రష్యాపై దాడుల తీవ్రతను పెంచింది. బుధవారం రాత్రి నుంచి 75కు పైగా డ్రోన్లను ప్రయోగించింది. ఇందులో సుదీర్ఘశ్రేణి డ్రోన్లు కూడా ఉన్నాయి. ఈ దాడుల్లో వోల్గోగ్రాడ్ ప్రాంతంలోని ఓ భారీ చమురు శుద్ధి కర్మాగారంలో మంటలు చెలరేగాయి. రష్యా వ్యాప్తంగా 13 విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేయాల్సి వచ్చింది. మరోవైపు రష్యా డ్రోన్ల నుంచి కాపాడుకునేందుకు రుమేనియా, పోలండ్‌లు సరిహద్దుల్లో గగనతల రక్షణ వ్యవస్థలను మోహరించాయి.

షట్‌డౌన్‌పై పీటముడి!

- డెమోక్రాట్ల విజయంతో మరింత సంక్లిష్టం

వాషింగ్టన్: న్యూయార్క్ మేయర్ పదవికిసహా ఇటీవల జరిగిన ఎన్నికల్లో డెమోక్రాట్లు భారీ విజయం సాధించడంతో అమెరికాలో కొనసాగుతున్న షట్‌డౌన్ ముప్పు మరింత సంక్లిష్టంగా మారే అవకాశముంది. ఈ విజయాలు డెమోక్రాట్లలో సరికొత్త శక్తిని నింపాయని, ట్రంప్‌పై ప్రజాగ్రహానికి అద్దం పట్టాయని విశ్లేషకులు అంటున్నారు. ఈ కారణంగా షట్‌డౌన్‌పై కొద్దోగొప్పో జరిగే చర్చలపై నీలినీడలు కమ్ముకోవడం ఖాయంగా కనిపిస్తోంది. అమెరికా చరిత్రలోనే సుదీర్ఘంగా కొనసా



గుతున్న షట్‌డౌన్‌గా ప్రస్తుతం 37వ రోజుకు చేరుకుంది. ఇప్పుడు స్వయంగా ట్రంప్.. చర్చలకు వస్తేనే అంగీకరించే అవకాశం డెమోక్రాట్లకు దక్కుతుంది. అదీ గాక వారు ప్రతిపాదిస్తున్న ఒబామా కేర్‌కు నిధులు కేటాయించడానికీ అధ్యక్షుడు అంగీకరించాల్సి రావొచ్చు. ఇప్పటిదాకా డెమోక్రాట్లతో భేటీ అయ్యేందుకు ట్రంప్ ససేమిరా అన్నారు.

✦ మరోవైపు శుక్రవారం నుంచి అమెరికాలో 10 శాతం విమాన సర్వీసులను తగ్గించాలని నిర్ణయించారు. షట్‌డౌన్ కారణంగా సిబ్బంది కొరత తలెత్తి భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశమున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

ట్రంప్ వైదొలగాలంటూ ర్యాలీ

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విజయం సాధించి ఏడాదైన సందర్భంగా ఆయన వ్యతిరేకులు బుధవారం వాషింగ్టన్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి కొన్ని వారాల ముందే ప్లాన్ చేసుకున్నా.. మంగళవారం వెలువడిన ఎన్నికల ఫలితాల్లో డెమోక్రాట్లు విజయం సాధించడంతో ర్యాలీకి మరింత ఉత్సాహం వచ్చింది.

అణు పరీక్షలకు ఆదేశించిన పుతిన్?

వాషింగ్టన్: అణ్వాయుధ పరీక్షలను తాము తిరిగి ప్రారంభిస్తామని ఇటీవలే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన వేళ రష్యా అధ్యక్షుడు పుతిన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అణు పరీక్షలను తిరిగి ప్రారంభించడానికి ప్రతిపాదనలు సమర్పించాలని తమ అధికారులను బుధవారం ఆయన ఆదేశించారు. మరోవైపు అణు పరీక్షలకు సన్నాహాలు ప్రారంభించాలని పుతిన్ ఆదేశించలేదని, ప్రస్తుతానికి అలాంటి పనిని ప్రారంభించడం అవసరమా అని విశ్లేషించాలని మాత్రమే అధికారులకు చెప్పారని క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ తెలిపారు.

వేల మంది వీధుల్లోకి వచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. 'ట్రంప్ వెంటనే వైదొలగాలి' అంటూ నినాదాలు చేశారు. మూడు డజన్లకుపైగా సంస్థలు ఈ ర్యాలీకి నాయకత్వం వహించాయి.

80వేల వీసాల రద్దు

అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్న ట్రంప్.. వలసేతర వీసాలపైనా కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో జనవరి నుంచి 80వేలకు పైగా వలసేతర వీసాలను ట్రంప్ యంత్రాంగం రద్దు చేసినట్లు తెలిసింది. హింస, చోరీ కేసుల నుంచి మద్యం సేవించి వాహనం నడపడం వంటి ఉల్లంఘనలకు పాల్పడినవారే ఇందులో అధికంగా ఉన్నట్లు తెలిసింది.

సుప్రీం కోర్టు రద్దు చేసినా ప్రత్యామ్నాయం!

- సుంకాలపై ట్రంప్‌నకు అవకాశం

వాషింగ్టన్: ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాలకు సంబంధించిన ఆదేశాలను సుప్రీం కోర్టు రద్దు చేసినా.. ఆయనకు ప్రత్యామ్నాయం ఉందని తెలుస్తోంది. ఆయన తన సుంకాలు విధించే అధికారాలను మళ్లీ వినియోగించుకోవచ్చని సమాచారం. సుంకాలను విధించే అధికారం అధ్యక్షుడికి ఉందని బుధవారం ట్రంప్ తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించిన సందర్భంగా.. న్యాయమూర్తులు సందేహం వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ అంశం తెరమీదకు వచ్చింది. సుంకాలను విధించకపోతే.. అమెరికా అరక్షిత దేశంగా మారిపోతుందని, తృతీయ ప్రపంచ దేశాల సరసన నిలుస్తుందని కోర్టులో ట్రంప్ వాదించారు.

కోర్టు భవనం.. న్యాయానికి ఆలయం కావాలి

- ఏడు నక్షత్రాల హోటల్ కారాదు
- బాంబే హైకోర్టు నూతన భవన నిర్మాణ శంకుస్థాపనలో సీజేఐ

ముంబయి: కోర్టు భవనాల నిర్మాణంలో మితిమీరిన వ్యయాన్ని నివారించాలని, వాటిని న్యాయానికి ఆలయాలుగా తీర్చిదిద్దాలని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బి.ఆర్.గవాయ్ సూచించారు. కోర్టు భవనాలు విలాసవంతమైన ఏడు నక్షత్రాల హోటళ్లను తలపించరాదని పేర్కొన్నారు. ముంబయిలోని బాంద్రాలో బుధవారం బాంబే హైకోర్టు నూతన భవన సముదాయ నిర్మాణానికి సీజేఐ జస్టిస్ గవాయ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు.



రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రజాస్వామిక విలువలను ప్రతిబింబించేలా నిర్మాణం ఉండాలని, సామ్రాజ్యవాదాన్ని స్ఫురించనీయరాదని హితవుపలికారు. నూతన భవనాల నిర్మాణ సమయంలో జడ్జీల అవసరాలను తీర్చడంతో పాటు పౌరులకు, కక్షిదారులకు తగిన సదుపాయాలూ సమకూరేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గతంలో బాంబే హైకోర్టు జడ్జీగా విధులు నిర్వహించిన తాను ఇప్పుడు సీజేఐ హోదాలో అదే కోర్టుకు నూతన భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ నెలలోనే తాను పదవీ విరమణ చేయబోతున్న విషయాన్ని గుర్తు చేశారు.

జర్నలిస్టు రాణా అయూబ్‌కు బెదిరింపులు



ఠాణె: నవీ ముంబయికి చెందిన మహిళా జర్నలిస్టు రాణా అయూబ్‌కు తెలియని అంతర్జాతీయ నంబరు నుంచి వాట్సప్ ద్వారా హత్య చేస్తామంటూ బెదిరింపులు వస్తున్నాయి. ఈ మేరకు ఆమె ఫిర్యాదు చేసినట్లుగా పోలీసులు గురువారం తెలిపారు. 'హ్యారీ షూటర్ కెనడా అనే నంబరు నుంచి అయూబ్‌కు నవంబరు 2న పదే పదే వాట్సప్ కాల్స్ వచ్చాయి. ఆ కాల్స్‌కు ఆమె స్పందించలేదు. అనంతరం ఆ వ్యక్తి 1984 సిక్కు వ్యతిరేక అల్లర్లు, దివంగత ఇందిరా గాంధీని చంపిన హంతకులపై వాషింగ్టన్ పోస్టులో వ్యాసం రాయాలని, లేకపోతే చంపేస్తామని ఆమెను బెదిరించారు. అంతేకాకుండా ఆమె చిరునామా, వ్యక్తిగత సమాచారం తెలుసుకొని ఆమె తండ్రిని కూడా చంపేస్తామని హెచ్చరించాడు'' అని పోలీసులు తెలిపారు. రాణా వాషింగ్టన్ పోస్టు పత్రిక తరఫున పనిచేస్తున్నారు.

భాజపా కోటి సంతకాల సేకరణ

- శబరిమల విషయంలో ప్రధాని జోక్యం చేసుకోవాలని డిమాండ్

కోజికోడ్ (కేరళ): శబరిమల విషయంలో కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ.. భాజపా సామూహిక సంతకాల సేకరణ ప్రారంభిస్తోందని పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఎం.టి రమేశ్ గురువారం తెలిపారు. శబరిమలలో ఇటీవల జరిగిన బంగారం దొంగతనం వెనక పెద్ద కుట్ర ఉందని పేర్కొన్నారు. దీనికి సీపీఎంకు చెందిన ఏకేజీ సెంటర్ ప్రధాన కారణమని ఆరోపించారు. ఇందులో అంతర్జాతీయ రాకెట్ ప్రమేయమున్నట్లు అనుమానం ఉండటం వల్ల ఈ విషయం ఒక వ్యక్తికే పరిమితం కాదని కేరళ హైకోర్టు ఇటీవలి పరిశీలనలు సూచిస్తున్నాయని పేర్కొన్నారు. "శబరిమల ఆలయానికి ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారు. ఆలయ రక్షణకు కేంద్రం జోక్యం చేసుకోవాలి. మేం కోటి సంతకాలను సేకరించి ప్రధానికి ఇస్తాం'' అని అన్నారు. నవంబరు 10 నుంచి 20 వరకు సంతకాల సేకరణ జరుగుతుందని, రాజకీయాలకు అతీతంగా భాజపా కార్యకర్తలు ప్రతీ ఇంటికి సంతకాల సేకరణకు వెళతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కేరళలోని 25 ప్రాంతాల్లో నవంబరు 10 నుంచి 15 వరకు సంరక్షణ సంగమాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆలయ నిర్వహణ బాధ్యతలు భక్తులకు అప్పగించాలని డిమాండ్ చేశారు.



పట్నాలోని దానాపూర్ ప్రాంతంలో ఓటు వేసేందుకు ఓ వృద్ధురాలిని మంచంపై మోసుకెళ్తున్న స్థానికులు

అంత్యక్రియలు చేశాక.. ఇంటికొచ్చాడు

సూరజ్‌పుర్: ఛత్తీస్‌గఢ్‌లోని సూరజ్‌పుర్ జిల్లా చందర్‌పుర్‌కు చెందిన పురుషోత్తం (25) వారం రోజుల వ్యవధిలో భిన్న విధాలుగా గ్రామంలో చర్చనీయాంశంగా మారాడు.



రెండు రోజులపాటు కనిపించకుండా పోయిన పురుషోత్తం ఆచూకీ తెలియక అతడి కుటుంబం తీవ్ర ఆందోళనకు గురై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో మన్‌పుర్ ప్రాంత బావిలో దొరికిన ఓ మృతదేహాన్ని పోలీసులు చూపించారు. అది పురుషోత్తమే అని భావించిన కుటుంబసభ్యులు తీవ్ర ఆవేదనతో అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈ విషయం తెలిసి ఇంటికి వచ్చిన బంధువులు పురుషోత్తంను తాము అంబికాపుర్‌లో చూసినట్లు చెప్పడంతో అందరూ కంగుతిన్నారు. 45 కి.మీ.ల దూరంలో ఉన్న అంబికాపుర్‌కు వెళ్లి బంధువుల ఇంట ఉన్న పురుషోత్తంను మంగళవారం గ్రామానికి తీసుకువచ్చారు. అంత్యక్రియలు జరిగిన మృతదేహం ఎవరిదై ఉంటుందన్న విచారణ ప్రారంభించినట్లు ఏఎస్పీ సంతోష్ మహతో తెలిపారు.

ఫతేహ్‌పుర్‌లో నవాబ్ ఖాన్ సమాధి ముందు పూజలు

- 20 మంది మహిళలపై కేసు నమోదు

ఫతేహ్‌పుర్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఫతేహ్‌పుర్‌లో శతాబ్దాల నాటి నవాబ్ అబు సమద్ ఖాన్ సమాధి ముందు పూజలు నిర్వహించిన 20 మంది మహిళలపై కేసు నమోదైంది. నిషేధం ఉన్నా....లెక్కచేయకుండా కంచె దూకి సమాధి కట్టడంలోనికి ప్రవేశించేందుకు యత్నించడంతో స్థానిక నాయకుడు పప్పు సింగ్ భార్య సహా 20 మంది గుర్తుతెలియని మహిళలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నందుకు మహిళలు తమతో వాగ్వాదానికి దిగారని... అనంతరం సమాధి ముందు పూజలు నిర్వహించారని వివరించారు. అయితే...గతంలో ఈ ప్రాంతంలో 'ఠాకూర్జీ' 'శివలింగం' ఉన్న ఆలయం ఉండేదని, దీనిని కూల్చి నవాబ్ ఖాన్ సమాధి నిర్మించారంటూ ఆగస్టు 11న స్థానికంగా అల్లర్లు మొదలయ్యాయి. ఇక్కడ తమకు పూజలు నిర్వహించే అనుమతి ఇవ్వాలంటూ డిమాండ్లు చేశారు. ఈ నిర్మాణాన్ని కూల్చేందుకు యత్నించారు కూడా. దీంతో వెంటనే అధికారులు సమాధి పరిసరాలను మూసివేసి చుట్టూ కంచె నిర్మించారు. నిషేధాజ్ఞలు జారీ చేశారు. బుధవారం కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని పలువురు మహిళలు కంచె దూకి లోపలికి ప్రవేశించేందుకు యత్నిస్తుండగా పోలీసులు వారిని అడ్డుకుని కేసు నమోదు చేశారు.

కల్మేగీ బీభత్సం.. 114కు చేరిన మృతుల సంఖ్య

మనీలా: ఫిలిప్పీన్స్‌లో కల్మేగీ తుపాను బీభత్సం కొనసాగుతోంది. మృతుల సంఖ్య 114కు చేరింది. 127 మంది గల్లంతయ్యారు. విపత్తుదళ అధికారులతో గురువారం జరిగిన సమావేశంలో ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ తుపానుపై సమీక్షించారు. అనంతరం దేశంలో ఎమర్జెన్సీ విధిస్తున్నట్లు ప్రకటించారు.

ఇప్పటికైతే ఉద్యోగం వదల!

- మరో పదేళ్లు యూఏఈలోనే ఉంటా
- యాస్ లేదా సాదియాత్ ద్వీపంలో ఇల్లు కొంటా
- రూ.240 కోట్ల లాటరీ విజేత అనిల్ బొల్లా

ఇంటర్నెట్ డెస్క్: యూఏఈలో ఇటీవల నిర్వహించిన ఓ లాటరీలో రూ.240 కోట్లు (100 మిలియన్ల దిర్హామ్‌లు) గెలుచుకొన్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అనిల్ బొల్లా చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. తాజాగా స్థానిక మీడియాతో తొలిసారి మాట్లాడిన అతడు.. ప్రస్తుతానికి ఉద్యోగం మాత్రం వీడనని స్పష్టం చేశారు. "అక్టోబరు 18నాటి డ్రా నా జీవితాన్నే మార్చేసింది. లాటరీ సంస్థ నుంచి ఫోన్ రావడంతో ఆశ్చర్యం వేసింది. చేతిలో ఇంత డబ్బు ఉన్నప్పటికీ ప్రస్తుతానికి ఉద్యోగం కొనసాగిస్తా. యాస్ లేదా సాదియాత్ ద్వీపంలో తొలుత ఓ ఇంటిని కొనుగోలు చేస్తా. మరో పదేళ్లపాటు యూఏఈలో ఉండాలని అనుకుంటున్నా. పెట్టుబడులు పెట్టేందుకు, భవిష్యత్తు కోసం జాగ్రత్తగా ప్రణాళిక వేసుకోవడానికి ఈ విజయం అవకాశం కలిగించింది. నిపుణుల సలహాతో స్టాక్ మార్కెట్, రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు పెట్టాలనుకుంటున్నా. స్నేహితుడితో కలిసి ఓ ఐటీ కన్సల్టెన్సీ ప్రారంభిస్తా. ఈ డబ్బులో కొంత మొత్తాన్ని దాతృత్వానికి ఖర్చు పెడతా. నా తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలనేది నా కోరిక. వారిని ఇక్కడికే తీసుకొస్తా. యూఏఈ చాలా సురక్షితమైన దేశం. ఇక్కడ నా జీవితాన్ని నిర్మించుకోవడం సంతోషంగా ఉంది'' అని అనిల్ బొల్లా పేర్కొన్నారు.



తెలుగు రాష్ట్రాలకు చెందిన అనిల్ బొల్లా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ఏడాదిన్నర క్రితం యూఏఈ వెళ్లారు. ఇటీవల కొనుగోలు చేసిన 12 టికెట్లలో తల్లి పుట్టినరోజుతో కూడిన ఓ నంబర్‌కు జాక్‌పాట్ తగిలి రాత్రికి రాత్రే ఆయన కోటీశ్వరుడైపోయారు.

ఆయుర్వేద, యోగాతో కలిపి క్యాన్సర్‌కు సమగ్ర చికిత్స!


- ఆయుష్ మంత్రిత్వశాఖ వెల్లడి

దిల్లీ: ఆధునిక విధానాలతో ఆయుర్వేద, యోగా, ఇతర అంశాలను కలిపి దేశంలో భవిష్యత్తు సమగ్ర క్యాన్సర్ చికిత్సను పునర్నిర్వచించనున్నామని ఆయుష్ మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఆధారసహితంగా భారతీయ సంప్రదాయ చికిత్సలను ఇందులో మిళితం చేస్తామని తెలిపింది. ఇందుకోసం ఐసీఎంఆర్‌తో కలిసి దేశంలోని 5 ఎయిమ్స్‌లలో అత్యాధునిక సమగ్ర ఆరోగ్య పరిశోధన కేంద్రాలను సెప్టెంబరు 27వ తేదీన ఏర్పాటు చేశామని ఆయుష్ మంత్రిత్వశాఖ కార్యదర్శి వైద్య రాజేశ్ కోటేకా గురువారం పేర్కొన్నారు. జాతీయ క్యాన్సర్ అవగాహనా దినోత్సవం సందర్భంగా ఆయన ఈ వివరాలను వెల్లడించారు. ఎయిమ్స్ నాగ్‌పుర్ క్యాన్సర్ పరిశోధనకు నేతృత్వం వహిస్తోంది. ముంబయిలో టాటా మెమోరియల్ సెంటర్‌కు చెందిన అడ్వాన్స్‌డ్ సెంటర్ ఫర్ ట్రీట్‌మెంట్.. రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ ఇన్ క్యాన్సర్ (ఏసీటీఆర్ఈసీ), ఆయుష్ మంత్రిత్వశాఖల ఆధ్వర్యంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఆయుష్ మెడిసిన్ డెవలప్‌మెంట్ ఫర్ క్యాన్సర్ కేర్ ఏర్పాటైంది. క్లినికల్ స్టడీస్ కోసం ఏసీటీఆర్ఈసీతో ద సెంటర్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస్ (సీసీఆర్ఏఎస్) ఒప్పందం కుదుర్చుకుంది. గోవాలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద సంస్థ (ఏఐఐఏ).. దేశంలోనే తొలిసారిగా సమగ్ర క్యాన్సర్ పరిశోధన, కేర్ సెంటర్‌ను ప్రారంభించింది.

రేపటి నుంచి రాష్ట్రపతి ఆఫ్రికా పర్యటన

దిల్లీ: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శనివారం నుంచి అంగోలా, బోట్స్‌వానా దేశాల్లో ఆరు రోజుల పాటు అధికారికంగా పర్యటించనున్నారు. ఆఫ్రికా ఖండంతో భారత్ అభివృద్ధి సహకారాన్ని విస్తృతం చేయడమే ఈ పర్యటన లక్ష్యమని విదేశీ వ్యవహారాల శాఖ విడుదల చేసిన ఒక అధికారిక ప్రకటన తెలిపింది. తొలిదశలో రాష్ట్రపతి ఈ నెల 8 నుంచి 11 వరకూ అంగోలాలో పర్యటిస్తారు. ఆ తర్వాత ఆమె బోట్స్‌వానాకు బయలుదేరి వెళ్తారని ప్రకటన వివరించింది. ''ఈ నెల 8 నుంచి 13 వరకూ రాష్ట్రపతి అంగోలా, బోట్స్‌వానా దేశాల్లో పర్యటిస్తారు. ఈ రెండు దేశాలను ఒక భారత ప్రభుత్వాధినేత సందర్శించడం ఇదే ప్రథమం'' అని విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి సుధాకర్ దలేలా అన్నారు. ఆఫ్రికా ఖండంతో భారత సహకారం అంతకంతకూ సుదృఢమవుతోందనడానికి ఈ పర్యటన నిదర్శనం అని ఆయన అన్నారు. ఆఫ్రికా ఖండంతో భారత వాణిజ్యం 10 కోట్ల డాలర్లకు చేరుకుంటోందని దలేలా తెలిపారు. అంగోలాలో రాష్ట్రపతి ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొనడంతోపాటు 50వ అంగోలా స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల్లో పాల్గొంటారు. రాష్ట్రపతి ముర్ము తన బోట్స్‌వానా పర్యటన సందర్భంగా ఆ దేశ జాతీయ పార్లమెంటును ఉద్దేశించి ప్రసంగిస్తారు.

వివిధ కులాలకు ఓబీసీ హోదా వివాదం.. కలకత్తా హైకోర్టు విచారణపై సుప్రీం స్టే



దిల్లీ: పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో వివిధ కులాలకు ఓబీసీ హోదా కల్పించడాన్ని కొట్టివేయడానికి సంబంధించి కలకత్తా హైకోర్టులో తదుపరి విచారణను నిలిపివేస్తూ (స్టే) సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలిచ్చింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ పది పిటిషన్లు దాఖలు కాగా వీటిలో బెంగాల్ ప్రభుత్వం కూడా భాగస్వామిగా ఉంది. సుప్రీంకోర్టు పరిశీలనలో కేసు ఉన్నప్పటికీ హైకోర్టు ఈ నెల 18న విచారణ జరపబోతోందని రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది కపిల్ సిబల్ తెలియజేయడంతో సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం స్టే ఉత్తర్వులిచ్చింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ కె.వినోద్ చంద్రన్, జస్టిస్ విపుల్ ఎం.పంచోలి సభ్యులుగా ఉన్నారు. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదాపడింది.

మతమార్పిళ్ల నిరోధక చట్టాల వ్యతిరేక పిటిషన్లపై మా వాదనలూ వినండి

- సుప్రీంకోర్టును ఆశ్రయించిన 'అఖిల భారతీయ సంత్ సమితి'

దిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో తీసుకొచ్చిన మతమార్పిళ్ల నిరోధక చట్టాలను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లను హిందూ మత సంస్థ అఖిల భారతీయ సంత్ సమితి సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. వివిధ రాష్ట్రాల్లో దాఖలైన పిటిషన్లు అన్నింటికీ సుప్రీంకోర్టు గత సెప్టెంబరులో తన వద్దకు బదిలీ చేసుకుంది. ఈ వ్యవహారంలో తమ వాదనలూ వినాలని అఖిల భారతీయ సంత్ సమితి కోరుతూ సుప్రీంకోర్టులో ఈ పిటిషన్ వేసింది.

భాజపా నాయకుడి వివాదాస్పద వ్యాఖ్య

- ఆపై వివరణ ఇచ్చుకున్న కాషాయదళ నేత

ముంబయి: భాజపా ముంబయి నగర విభాగం అధ్యక్షుడు అమీత్ శతం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఏ 'ఖాన్'నూ ముంబయి నగర మేయర్ కాని వ్వబోమంటూ వ్యాఖ్యానించారు. అయితే ఆ వెంటనే తేరుకొని తన ఉద్దేశం అది కాదంటూ సంజాయిషీ ఇచ్చారు. తాను అన్న మాటలు జాతి వ్యతిరేక మనస్తత్వం కలిగిన వారిని ఉద్దేశించినవి అని పేర్కొన్నారు. భారతీయ సంతతికి చెందిన జొహ్రాన్ మమ్దానీ న్యూయార్క్ నగర మేయర్‌గా ఎన్నిక కావడంపై వ్యాఖ్యానిస్తూ భాజపా నేత పై వ్యాఖ్య చేశారు.

ఆ కప్పు టీ మా కొంప ముంచింది: పాక్

ఇంటర్నెట్‌డెస్క్: తాలిబన్లు ఇచ్చిన కప్పు టీ తమ కొంప ముంచిందని పాక్ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి ఇస్సాక్‌దార్ ఆవేదన వ్యక్తంచేశారు. ఐఎస్ఐ మాజీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఫయాజ్ హమీద్ అఫ్గానిస్థాన్ పర్యటనను ఉద్దేశించి విమర్శలు చేశారు. అఫ్గానిస్థాన్‌లో ప్రజాప్రభుత్వాన్ని కూలదోసి 2021లో తాలిబన్లు అధికారాన్ని హస్తగతం చేసుకున్న సంగతి తెలిసిందే. అనంతరం అదే ఏడాది అఫ్గాన్‌లో హమీద్ పర్యటించారు. ఆ పర్యటనకు సంబంధించిన వీడియోలో ఒక సమావేశంలో హమీద్ టీ తాగుతూ కనిపించారు. అంతా బాగానే ఉంటుందని తాలిబన్ పాలకులకు భరోసా ఇచ్చారు. ఆ కప్పు టీ తమకు ఎంతో నష్టాన్ని కలిగించిందని ఇస్సాక్‌దార్ తాజాగా వ్యాఖ్యలు చేశారు. "ఆ టీ తర్వాత మేం మా సరిహద్దులు తెరిచాం. దాంతో 35 వేల నుంచి 40 వేల మంది తాలిబన్లు చొరబడ్డారు. ఆ భేటీ తర్వాత పాక్‌లో అధికారంలో ఉన్న ప్రభుత్వం కరడుగట్టిన నేరస్థులను కూడా విడుదల చేసింది'' అని విమర్శించారు. కాగా, అఫ్గాన్‌లో తాలిబన్లు అధికారంలోకి వచ్చినప్పుడు పాకిస్థాన్ స్వాగతించింది. అప్పుడు ఇమ్రాన్‌ఖాన్ ప్రధానిగా ఉన్నారు.

పాక్ దుష్ప్రచారంపై జాగ్రత్త

- ఆ వీడియో పాతది: కేంద్రం

ఇంటర్నెట్ డెస్క్: 'ఆపరేషన్ సిందూర్' సమయంలో భారత్‌కు వ్యతిరేకంగా పెద్దఎత్తున దుష్ప్రచారానికి తెరలేపిన పాకిస్థాన్ ఇంకా తన వైఖరిని కొనసాగిస్తోంది. సామాజిక మాధ్యమాల వేదికగా మన దేశ ప్రతిష్ఠను మసకబార్చేందుకు ప్రయత్నిస్తోంది. తాజాగా కొన్ని పాకిస్థాన్ అనుకూల ఖాతాలు పాత వీడియోను తిరిగి ప్రసారం చేస్తూ ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయి. భారత్‌కు చెందిన ఎంఐ-17 హెలికాప్టర్‌ను క్షిపణి కూల్చివేసిందంటూ చేస్తోన్న దుష్ప్రచారంపై పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం దీటుగా స్పందించింది. ఇది 2019లో జరిగిన ఘటనకు సంబంధించిన వీడియో అని స్పష్టం చేసింది. భారత వాయుసేనకు చెందిన ఎంఐ-17 వీ5 హెలికాప్టర్.. జమ్మూకశ్మీర్‌లోని బద్గాం సమీపంలో అప్పట్లో కూలిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తూ 'ఎక్స్'లో పోస్టు పెట్టింది.

మళ్లీ పాక్-అఫ్గాన్ మధ్య ప్రారంభమైన చర్చలు

ఇస్లామాబాద్: పాకిస్థాన్, అఫ్గానిస్థాన్ మధ్య శాంతి చర్చలు తుర్కియేలోని ఇస్తాంబుల్‌లో మళ్లీ గురువారం ప్రారంభమయ్యాయి. సరిహద్దుల్లో రెండు దేశాల మధ్య ఇటీవల ఘర్షణలు చెలరేగిన సంగతి తెలిసిందే. గత నెల 15న కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. ఆ తర్వాత దోహాలో, ఇస్తాంబుల్‌లో జరిగిన రెండు రౌండ్ల చర్చల్లో ఆ ఒప్పందాన్ని పొడిగించారు. వాస్తవానికి ఇస్తాంబుల్‌లో జరిగిన చర్చలు విఫలమయ్యాయి. అయితే తుర్కియే చొరవతో మళ్లీ చర్చలు ప్రారంభమయ్యాయి.

దుబాయ్‌లో కేరళవాసికి జాక్‌పాట్

- 'బిగ్ టికెట్' ఈ-డ్రాలో స్నేహితులతో కలిసి 250 గ్రాముల బంగారం నెగ్గిన కున్నత్

ఇంటర్నెట్‌డెస్క్: దుబాయ్‌లో ఓ ప్రవాస భారతీయుడిని అదృష్టం వరించింది. అక్కడి బిగ్ టికెట్ ఎలక్ట్రానిక్ డ్రాలో ఆయన పావుకేజీ బంగారం గెలుచుకున్నారు. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం, కేరళకు చెందిన నితిన్ కున్నత్ రాజు ఉపాధి నిమిత్తం 2016 నుంచి దుబాయ్‌లో నివసిస్తున్నారు. ఆయన తన స్నేహితులతో కలిసి కొన్న టికెట్‌కు తాజాగా జాక్‌పాట్ తగిలింది. ఈ విషయాన్ని కున్నత్‌కు షో నిర్వాహకులు ఫోన్ చేసి చెప్పగా.. తొలుత ఆయన నమ్మలేదు. తర్వాత టికెట్ నంబరు 351853తో సహా చెప్పడంతో ఆశ్చర్యపోయారు. ఈ టికెట్‌పై 250 గ్రాముల బంగారం గెలుచుకున్నారు. అది 24 క్యారెట్ల గోల్డ్ బార్. మన దేశంలో పుత్తడి ధరల ప్రకారం దాని విలువ దాదాపు రూ.30 లక్షల వరకు ఉంటుంది. 10 మంది స్నేహితులతో కలిసి దీన్ని కొన్నానని, వారితో ఈ మొత్తాన్ని పంచుకుంటానని కున్నత్ వెల్లడించారు.

దేశీయ సర్వే నౌక ఐఎన్ఎస్ ఇక్షక్ ప్రారంభం

కొచ్చిన్: దేశీయంగా రూపకల్పన చేసి నిర్మించిన సర్వే నౌక ఐఎన్ఎస్ ఇక్షక్‌ను భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేశ్‌కుమార్ త్రిపాఠి గురువారం కొచ్చిన్‌లో ప్రారంభించారు. నౌకాదళానికి, భారతీయ నౌకానిర్మాణ రంగానికి ఇదొక మైలురాయి అని, ఈ ఏడాది ఇలాంటి పది ప్రారంభోత్సవాలు జరిగాయని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ప్రపంచ పరిస్థితులు, సాంకేతికత, వ్యూహాల నేపథ్యంలో నౌకాయానంలో సమూల మార్పులు వస్తున్నాయని చెప్పారు. ఆధిపత్యం, వనరులు, అనుసంధానత కోసం పెరిగిన పోటీలో మహాసాగరాలపై వ్యూహాలను మార్చుకోవాల్సి వస్తోందన్నారు. కోల్‌కతాలో తయారైన ఇక్షక్‌లో అధునాతన పరికరాలు ఉంటాయని చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్‌కు కట్టుబడి 80% దేశీయ పరికరాలనే దీనిలో వినియోగించారు. సముద్రంలో 11 వేల మీటర్ల లోతున కూడా ఇది జల్లెడపట్టి గాలించగలదు. సహాయక చర్యల్లో వైద్య సేవలకూ దీనిని వాడుకోవచ్చు.

తెలుగు రాష్ట్రాలకు గర్వకారణం

- వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా గజాలా హష్మీ ఎన్నికవడంపై చంద్రబాబు

ఈనాడు, అమరావతి: వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా భారత సంతతికి చెందిన గజాలా హష్మీ ఎన్నికవడంపై సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది రెండు తెలుగు రాష్ట్రాలకు గర్వకారణమని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. 'గజాలా హష్మీ హైదరాబాద్‌లో జన్మించారు. వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఎన్నికై చరిత్ర సృష్టించారు' అని చంద్రబాబు పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వ ఏర్పాటులో.. ప్రవాసాంధ్రుల కృషి అభినందనీయం

- లండన్‌లో జనసైనికుల ఆత్మీయ సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏర్పాటులో ప్రవాసాంధ్రుల కృషి అభినందనీయమని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. లండన్ పర్యటనలో భాగంగా గురువారం జన సైనికుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. 'రాష్ట్రంలో పుట్టి పెరిగి ఉద్యోగ రీత్యా అమెరికా, ఇంగ్లండ్, గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న తెలుగు వారంతా కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు ఎంతో సహకరించారు. అందరి సహకారంతో రాష్ట్రంలో ప్రజాస్వామ్యయుత పాలనకు శ్రీకారం చుట్టి అభివృద్ధి బాటలో పయనిస్తున్నాం. ప్రవాసాంధ్రులు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం, మాతృభూమికి తోడ్పాటు అందించడం, వివిధ రంగాల్లో ప్రతిభ చూపడం అభినందనీయం' అని దుర్గేష్ అన్నారు.

భాగస్వామ్య సదస్సుకు రండి: దుర్గేష్

విశాఖలో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించే భాగస్వామ్య సదస్సుకు హాజరు కావాలని వివిధ దేశాల పెట్టుబడిదారులను రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆహ్వానించారు. లండన్‌లో నిర్వహిస్తున్న ప్రపంచ ట్రావెల్ మార్కెట్-2025లో భాగంగా గురువారం వివిధ దేశాల పెట్టుబడిదారుల సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. రాష్ట్రంలో పర్యాటక రంగ అవకాశాలను వివరించారు. కొత్త పర్యాటక విధానం, ప్రభుత్వ ప్రోత్సాహకాల గురించి వివరించారు. వచ్చే ఏడాది సెప్టెంబర్ నిర్వహించే అరేబియన్ ట్రావెల్ మార్కెట్‌కు హాజరు కావాలని మంత్రిని నిర్వాహకులు ఆహ్వానించారు.

శ్రీసత్యసాయి శత జయంతి వేడుకలకు మంత్రి సత్యకుమార్‌కు ఆహ్వానం

ఈనాడు, అమరావతి: ఈనెల 23న శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో నిర్వహించే శ్రీసత్యసాయి బాబా శత జయంతి వేడుకలకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను నిర్వాహకులు ఆహ్వానించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో మంత్రికి ఆహ్వాన పత్రిక అందించారు.

ఎన్నికల్లో ఓడిపోయిన ప్రతిసారీ ఆరోపణలేనా?

కాంగ్రెస్‌పై భాజపా నేత జయప్రకాశ్ ధ్వజం

ఈనాడు, అమరావతి: ఎన్నికల్లో ఓడిపోయిన ప్రతిసారీ ఈవీఎంల తప్పు.. ఎన్నికల సంఘం పక్షపాతం.. దొంగఓట్లు అంటూ ఆరోపణలు చేయడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందని భాజపా రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల సంఘం, రాజ్యాంగాన్ని అవమానించేలా కాంగ్రెస్ దుష్ప్రచారం చేయడం సరికాదని గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాహుల్ గాంధీ దొంగఓట్లు ఆరోపణలు చేస్తుంటే.. ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల చప్పట్లు కొడుతున్నారని ఎద్దేవా చేశారు. రిగ్గింగ్, ఎన్నికలను అవినీతిమయం చేయడం అలవాటున్న కాంగ్రెస్ పార్టీ.. ఆరోపణలు చేసేముందు అంతర్మథనం చేసుకోవాలని హితవు పలికారు.

స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యాల సాధనలో అగ్రగామిగా గృహనిర్మాణ శాఖ

ఈనాడు, అమరావతి: స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యాల సాధనలో సచివాలయ విభాగాల్లో గృహనిర్మాణ శాఖ, విభాగాధిపతుల కేటగిరీలో ఏపీఎన్‌పీడీసీఎల్, జిల్లాల విభాగంలో విశాఖపట్నం అగ్రగామిగా నిలిచాయి. డేటా ఆధారిత పరిపాలన అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో ఈ ర్యాంకులను వెల్లడించారు. అగ్రగామిగా, అట్టడుగున నిలిచిన శాఖల వివరాల్ని ప్రజంటేషన్‌లో పేర్కొన్నారు. ప్రదానాలివి.

సచివాలయ విభాగాల్లో

అగ్రగామిగా నిలిచినవి	
1. గృహనిర్మాణం	100 (ఏ+)
2. పౌరసరఫరాలు	97 (ఏ+)
3. గిరిజన సంక్షేమ శాఖ	97 (ఏ+)
అట్టడుగున నిలిచినవి	
1. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్	18 (సి)
2. ఈడబ్ల్యూఎస్ సంక్షేమం	22 (సి)
3. బీసీ సంక్షేమం	25 (సి)

హెచ్‌వోడీల విభాగంలో

అగ్రగామిగా నిలిచినవి	
1. ఏపీఎన్‌పీడీసీఎల్	100 (ఏ+)
2. సీపీడీసీఎల్	100 (ఏ+)
3. ఎన్టీఆర్ వైద్య సేవ	100 (ఏ+)
అట్టడుగున నిలిచినవి	
1. కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (సీఏడీఏ)	3 (సి)
2. వ్యవసాయం	19 (సి)
3. బీసీ సంక్షేమం	25 (సి)

జిల్లాల విభాగంలో

అగ్రగామిగా నిలిచినవి	
1. విశాఖపట్నం	69 (బి)
2. గుంటూరు	66 (బి)
3. అనకాపల్లి	66 (బి)
అట్టడుగున నిలిచినవి	
1. వైఎస్సార్ కడప	49 (సి)
2. శ్రీసత్యసాయి	50 (బి)
3. పార్వతీపురం మన్యం	50 (బి)

గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో... రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపాలి

- 2029కి 1.5 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తి లక్ష్యం
- సలహామండలి తొలి సమావేశంలో రోడ్‌మ్యాప్‌పై చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న సీఎస్ విజయానంద్. చిత్రంలో నీతి ఆయోగ్ సభ్యుడు, ఏపీ గ్రీన్ హైడ్రోజన్ అడ్వయిజరీ బోర్డు ఛైర్మన్ డా. వీకే సారస్వత్

ఈనాడు, అమరావతి: హైడ్రోజన్ రైళ్లను నడిపే సాంకేతికతను అందిపుచ్చుకోవాలని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ సలహా మండలి అభిప్రాయపడింది. సచివాలయంలో గురువారం నిర్వహించిన తొలి సమావేశంలో.. రోడ్ మ్యాప్‌పై చర్చించి, పలు సిఫారసులు చేసింది. రాష్ట్రాన్ని గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఉన్న అవకాశాలు.. ప్రభుత్వ చర్యలపై చర్చించింది. 2030కి గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామి చేయాలన్నదే లక్ష్యమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ చెప్పారు. '2027కి 2 గిగావాట్ల ఎలక్ట్రోలైజర్ తయారీ సామర్థ్యానికి చేరుకోవడమే లక్ష్యం. 2029 కల్లా ఏడాదికి 1.5 మిలియన్ మెట్రిక్ టన్నుల(ఎంఎంటీపీఏ) గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేసే స్థాయికి రాష్ట్రాన్ని తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నాం. ఇప్పటికే కర్నూలులో ఒక గిగావాట్ సామర్థ్యంతో పీఎస్‌పీ ప్లాంట్ ఏర్పాటైంది. పూడిమడకలో రూ.1.85 లక్షల కోట్లతో హైడ్రోజన్ హబ్‌ను ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ అభివృద్ధి చేస్తోంది. దీనివల్ల 20 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యంతో రోజుకు సుమారు 1,500 టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తయ్యే అవకాశం ఏర్పడుతుంది' అని అన్నారు.

రైతుల ఆదాయం పెరుగుతుంది

బయోమాస్ ఉత్పత్తిలో దేశంలోనే ఏపీ మొదటి స్థానంలో ఉందని సలహా మండలి ఛైర్మన్, నీతి ఆయోగ్ సభ్యులు వి.కె.సారస్వత్ చెప్పారు. 'గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి బయోమాస్ ఉపయోగపడుతుంది. దీనివల్ల రైతుల ఆదాయం పెరగడంతో పాటు ఉపాధి అవకాశాలు వస్తాయి. దీన్ని వినియోగించే పరిశ్రమలకు నేషనల్ హైడ్రోజన్ మిషన్ కింద కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుంది' అని వివరించారు. రాబోయే రోజుల్లో పరిశోధనలపై దృష్టి సారిస్తామని నెడ్‌క్యాప్ వీసీఎండీ కమలాకర్‌బాబు అన్నారు. విశాఖలో జరిగే భాగస్వామ్య సదస్సులో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి సంబంధించి ఎంవోయూలు కుదుర్చుకోనున్నట్లు గ్రీన్‌కో ఏఎం రామ్‌కుమార్ తెలిపారు. గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ డిక్లరేషన్ రోడ్ మ్యాప్ (2025-29) గురించి మెంబర్ సెక్రటరీ డి.నారాయణరావు ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం సలహామండలి సభ్యులు.. సీఎం చంద్రబాబును కలిశారు.

గ్రానైట్ మిల్లులు, సీనరేజ్ గుత్తేదారు మధ్య వివాద పరిష్కారానికి కమిటీ ఏర్పాటు

ఈనాడు, అమరావతి: ఉమ్మడి ప్రకాశం, పల్నాడు జిల్లాల పరిధిలోని గ్రానైట్ కటింగ్, పాలిషింగ్ యూనిట్ల యజమానులు, ఆ ప్రాంత సీనరేజ్ వసూళ్ల గుత్తేదారు సంస్థ ఏఎంఆర్ మధ్య నెలకొన్న వివాదం పరిష్కారానికి కమిటీని ఏర్పాటుచేస్తూ గనులశాఖ సంచాలకుడు డబ్ల్యూబీ చంద్రశేఖర్ గురువారం ఆదేశాలు జారీచేశారు. గనులశాఖ సంయుక్త సంచాలకుడు డి.శ్రీనివాసరావు ఛైర్మన్‌గా, డీడీ శ్రీనివాసచౌదరి సభ్యునిగా, ప్రకాశం జిల్లా డీడీ టి.రాజశేఖర్ మెంబర్ కన్వీనర్‌గా, బాపట్ల, పల్నాడు జిల్లా గనులశాఖ అధికారులు రామచంద్ర, నాగిని సభ్యులుగా, గెలాక్సీ గ్రానైట్, మార్టూరు గ్రానైట్, పల్నాడు గ్రానైట్, చిలకలూరిపేట గ్రానైట్ యజమానుల సంక్షేమ సంఘాలకు చెందిన 9 మందిని సభ్యులుగా, ఏఎంఆర్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ డి.విశ్వనాథరాజు, ప్రకాశం జిల్లా ప్రాజెక్ట్ హెడ్ బి.నాగేశ్వరరావు సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ప్రస్తుతమున్న శ్లాబ్ విధానం, వాటి రేట్లు, అదనంగా ముడిరాయి తీసుకుంటే ఎంత ఫీజు చెల్లించాలి, గ్రానైట్ కటింగ్ పాలిషింగ్‌లో కొత్తగా వచ్చిన మిషనరీతో ఎంత ఉత్పత్తి పెరిగే అవకాశం ఉంది, తదితరాలు అన్నింటిపై అందరితో చర్చించి ఈ నెల 15 నాటికి నివేదిక అందజేయాల్సి ఉంటుందని ఉత్తర్వులో పేర్కొన్నారు.

అదనపు సొమ్ము డిమాండ్‌పై పేచీ..

గ్రానైట్ కటింగ్ చేసే బ్లేడ్ (కట్టర్)కు నెలకు రూ.35 వేల చొప్పున అధికారిక ఫీజుతోపాటు, అదనంగా మరో రూ.35 వేలు చెల్లించాలని.. గుత్తేదారు సంస్థ ఏఎంఆర్ డిమాండ్ చేస్తోందంటూ గ్రానైట్ యూనిట్ల యజమానులు నిరసన తెలియజేస్తున్నారు. కొద్దిరోజులు యూనిట్లలో పనులు సైతం ఆపేశారు. పలు సమస్యలపై గళం వినిపిస్తున్నారు. ఈ వివాదంపై మూడు రోజుల కిందట ఆ మిల్లుల యజమానులతో మంత్రులు కొల్లు రవీంద్ర, గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తదితరులు సమావేశం నిర్వహించారు. గనులశాఖ అధికారులు, మిల్లుల అసోసియేషన్ల ప్రతినిధులు, ఏఎంఆర్ ప్రతినిధులతో కమిటీవేసి, పరిష్కారం చేస్తామని హామీఇచ్చారు. ఈ మేరకు గనులశాఖ సంచాలకుడు కమిటీని ఏర్పాటుచేస్తూ ఆదేశాలిచ్చారు.

లోకేశ్‌తో మాధవ్ భేటీ



మాధవ్‌కు 'ద వాయిస్ ఆఫ్ పీపుల్ లోకేశ్ నారా' పుస్తకాన్ని అందిస్తున్న లోకేశ్

ఈనాడు, అమరావతి: విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌తో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, భాజపా రాష్ట్ర సంఘటన కార్యదర్శి మధుకర్ గురువారం భేటీ అయ్యారు. స్వదేశీ స్టిక్కర్‌తోపాటు..'నేషన్ ఫస్ట్' పుస్తకాన్ని లోకేశ్‌కు బహూకరించారు. ఎన్డీయే కూటమి ఆధ్వర్యంలో చేపడుతున్న ఇంటింటికీ స్వదేశీ, వందేమాతరం గీతానికి 150 ఏళ్లు, బిర్సా ముండా, వల్లభ్ భాయ్ పటేల్, వాజ్‌పేయీ జయంతి కార్యక్రమాలు.. ఇతరత్రా అంశాలను వివరించారు. ఈ సందర్భంగా 'ద వాయిస్ ఆఫ్ పీపుల్ లోకేశ్ నారా' పుస్తకాన్ని మాధవ్‌కు లోకేశ్ అందించారు.

బిహార్‌లో ఎన్డీయే ఓటమి తథ్యం

సీపీఎం నేత బీవీ రాఘవులు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: బిహార్ ఎన్నికల్లో ఎన్డీయే ఓడిపోవడం ఖాయమని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. ఏలూరులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ఎలాగైనా గట్టెక్కాలన్న ఉద్దేశంతో కుట్రలు, కుతంత్రాలకు భాజపా తెరదీసిందని విమర్శించారు. ఎస్ఐఆర్ పేరిట భాజపాయేతర సానుభూతిపరుల ఓట్లను ఏరివేసేందుకు ఎన్నికల సంఘం పని చేస్తోందని ఆరోపించారు. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ రావడం మంచిదేనన్న రాఘవులు.. 300 ఉద్యోగాలకు విపరీతమైన విద్యుత్తు, నీరు, రాయితీలివ్వడం సమంజసం కాదని పేర్కొన్నారు.

దేవస్థానం భూమిని ఆక్రమించిన కబ్జాదారుడు

తెదేపా కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: తమ గ్రామంలో దేవాలయ భూమిని ఆక్రమించి, వేరొకరికి విక్రయించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఏలూరు జిల్లా నూజివీడు మండలం గొల్లపల్లికి చెందిన పద్మజ కోరారు. ఈ మేరకు మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి హోంమంత్రి వంగలపూడి అనిత, మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. తన పొలాన్ని కౌలుకు తీసుకొని అప్పగించకుండా వేధిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం పాతనాగులూరుకు చెందిన శారద వినతిపత్రం సమర్పించారు. ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసి రూ.1.20 లక్షలు తీసుకున్న నాగరాజు అనే వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మాచవరానికి చెందిన అనిల్ ఫిర్యాదు చేశారు.

బార్సిలోనాలో అమరావతి నిర్మాణంపై ప్రజంటేషన్

- 'స్మార్ట్ సిటీ ఎక్స్‌పో వరల్డ్ కాంగ్రెస్-2025'లో పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్‌కుమార్

ఈనాడు, అమరావతి: స్పెయిన్‌లోని బార్సిలోనాలో నిర్వహిస్తున్న స్మార్ట్ సిటీ ఎక్స్‌పో వరల్డ్ కాంగ్రెస్ (ఎస్‌సీఈడబ్ల్యూసీ)-2025లో రాజధాని అమరావతి నిర్మాణ ప్రత్యేకతలపై రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ గురువారం ప్రజంటేషన్ ఇచ్చారు. రవాణా, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన ప్రణాళికలను ఆయన వివరించారు. రాష్ట్రంలో నగరాలు, పట్టణాల్లో అమలు చేస్తున్న ట్రాన్సిట్ ఓరియంటెడ్ డెవలప్‌మెంట్ (టీవోడీ), సర్క్యులర్ ఎకానమీ, నెట్-జీరో ఎనర్జీ లక్ష్యాలు, ఎలక్ట్రిక్ మొబిలిటీ, ఆధునిక డక్ట్ సిస్టం, పర్యావరణ హిత నిర్మాణ పద్ధతులను సురేశ్‌కుమార్ ప్రస్తావించారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ)తో అమలు చేస్తున్న వివిధ ప్రాజెక్టుల గురించి తెలిపారు. బార్సిలోనా నగరపాలక సంస్థ, బార్సిలోనా ఛాంబర్ ఆఫ్ కామర్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్న స్మార్ట్ సిటీ ఎక్స్‌పో వరల్డ్ కాంగ్రెస్‌లో 100కి పైగా దేశాల నుంచి 1,100 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఏపీ నుంచి పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్‌తోపాటు విశాఖ, తిరుపతి నగరపాలక సంస్థల కమిషనర్లు కేతన్ గర్గ్, ఎన్.మౌర్య హాజరయ్యారు. రాజధాని అమరావతి నిర్మాణంపై సురేశ్‌కుమార్ ఇచ్చిన ప్రజంటేషన్‌లో ముఖ్యమైన అంశాలివి.

సమగ్ర రోడ్డు నెట్‌వర్క్: 320 కిలోమీటర్ల ట్రంక్ రోడ్లు. జాతీయ/రాష్ట్ర రహదారులతో వీటి అనుసంధానం.

మౌలిక సదుపాయాలు: 1,281 కి.మీ. అంతర్గత రహదారులు, 2,360 కి.మీ మేర వర్షపు నీటి కాలువలు. 2,239 కి.మీ మేర నీటి సరఫరా పైపులైన్లు. 929 కి.మీ. పొడవైన డ్రైనేజీ వ్యవస్థ

ప్రజా రవాణా: మెట్రో కారిడార్లు. తాడేపల్లి, అనంతవరం, నిడమర్రులో ట్రాన్స్‌పోర్ట్ హబ్‌లు. 20 ఇంట్రాసిటీ బస్ టెర్మినళ్లు, 11 డిపోలు, అమరావతి రైల్వే స్టేషన్.

✦ రాజధాని అమరావతిలో వివిధ రంగాల్లో పైలట్ ప్రాజెక్టుల అమలుకు సాంకేతిక, వాణిజ్య సహకారం అందించేందుకు పలు సంస్థలు సంసిద్ధతను వ్యక్తం చేశాయి.



రాజధాని అమరావతి నిర్మాణంపై ప్రజంటేషన్ ఇస్తున్న పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్

60 రోజుల్లో ప్రభుత్వ సేవలన్నీ వాట్సప్‌లో అందించాలి

- శాఖలన్నీ ప్రింటెడ్ పత్రాలకు బదులు క్యూఆర్ కోడ్ ఆధారిత సమాచారాన్ని వాడుకోవాలి
- ఆర్టీజీఎస్ కార్యదర్శి కాటమనేని భాస్కర్

ఈనాడు, అమరావతి: అరవై రోజుల్లో ప్రతి ప్రభుత్వ సేవను వాట్సప్‌లో అందుబాటులోకి తేవాలని ఆర్టీజీఎస్ కార్యదర్శి కాటమనేని భాస్కర్ సూచించారు. 'డేటా ఆధారిత పాలన'పై గురువారం శాఖాధిపతులు, కార్యదర్శులకు ఆయన సమగ్ర ప్రజంటేషన్ ఇచ్చారు. ఆర్టీజీఎస్ వద్ద 6 పెటాబైట్ల సమాచారం అందుబాటులో ఉందని, శాఖల వారీ అవసరాలకు ఉపయోగించుకోవాలని తెలిపారు. కొన్ని శాఖలు ఇంకా ప్రింట్ చేసిన ధ్రువపత్రాలే అడుగుతున్నాయని, డౌన్‌లోడ్ చేసుకున్న క్యూఆర్ కోడ్ ఆధారిత పత్రాలు చట్టబద్ధమైనవేనని, వాటినే తీసుకోవాలన్నారు. క్యూఆర్ కోడ్‌తో వాటిని సరి చూసుకోవచ్చన్నారు. ప్రెడిక్టివ్ అనలటిక్స్ ద్వారా రాబోయే రోజుల్లో ఏం జరగబోతోంది? అనేది తెలుసుకోవచ్చని చెప్పారు. ఆర్టీజీఎస్ బృందంతో సమన్వయం చేసుకోవాలని, అంతర్గత సమావేశాలకూ సంబంధిత అధికారుల్ని ఆహ్వానించాలని కోరారు. వాట్సప్ సేవల్ని ప్రజలకు దగ్గరగా చేయాల్సిన బాధ్యత కలెక్టర్లు తీసుకోవాలన్నారు. 'రాష్ట్ర వ్యాప్తంగా 1.18 కోట్ల పత్రాలు ఆర్టీజీఎస్ ఏజెంట్ స్పేస్‌లో అప్‌లోడ్ చేశారు. అత్యధికంగా 23.27 లక్షల జీవోలు, 22.40 లక్షల లేఖలు, 16.03 లక్షల ప్రొసీడింగ్స్, 40.17 లక్షల ఇతర దస్త్రాలు ఉన్నాయి. అన్ని మండలాల్లోని పాత దస్త్రాల్ని స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలి' అని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని డ్రోన్లనూ డ్రోన్‌మార్ట్‌లో నమోదు చేయించాలని భాస్కర్ సూచించారు. దీనివల్ల వినియోగదారులకు ఖర్చు తగ్గుతుందని చెప్పారు.

వైద్య కళాశాలల్లో 94 అదనపు సీట్లు హుష్‌కాకి..

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటుచేసిన 6 వైద్య కళాశాలల్లో సకాలంలో ప్రొఫెసర్ల ఖాళీలు భర్తీ చేయకపోవడంతో 2025-26 సంవత్సరానికి యూజీ, పీజీ అదనపు సీట్ల మంజూరుకు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) నిరాకరించింది. కొద్ది నెలల క్రితం ప్రభుత్వం ప్రొఫెసర్ పోస్టుల్ని భర్తీ చేసినా.. అప్పటికే ఎన్ఎంసీ నిర్ణయం తీసేసుకోవడంతో రాష్ట్రం 44 పీజీ, 50 యూజీ అదనపు సీట్లు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. మూడో విడత కౌన్సెలింగ్ త్వరలో ముగియనున్నందున ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి.. తాజా పరిస్థితిని ఎన్ఎంసీ దృష్టికి తీసుకెళ్లి, ఒత్తిడి తీసుకురావాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ప్రొఫెసర్ పోస్టుల్ని భర్తీ చేశాక ఆ విషయాన్ని ఎన్ఎంసీకి సకాలంలో నివేదించకపోవడం సీట్లు నిరాకరించడానికి ఒక కారణమన్న అభిప్రాయం వినిపిస్తోంది.

నగరాల్లో కాలుష్య సెగ

- దేశంలో అత్యధికంగా ధారూహేడాలో..
- తెలుగు రాష్ట్రాల్లో సంతృప్తికరం
- సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ సంస్థ నివేదిక

ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా నగరాలు కాలుష్య హాట్‌స్పాట్లుగా మారుతున్నాయి. గాలి నాణ్యత ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ) ప్రమాణాలను సెప్టెంబరులో దేశంలోని 203 నగరాల్లో దాటిపోగా, అక్టోబరులో ఆ సంఖ్య ఏకంగా 255కి చేరింది. తెలుగు రాష్ట్రాల్లో మాత్రం గాలి నాణ్యత సంతృప్తికరంగానే ఉంది. వాయువులో పీఎం 10, పీఎం 2.5, సల్ఫర్‌డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్, ఓజోన్ వంటి పలు కాలుష్య కారకాలుంటాయి. వీటిలో అత్యంత ప్రమాదకరమైంది పీఎం 2.5(పార్టికులేట్ మేటర్). ఈ అతి సూక్ష్మ ధూళి కణాలు కంటికి కనిపించవు. నేరుగా ఊపిరితిత్తుల్లోకి చేరిపోతాయి. దేశంలో 299 నగరాల్లో పీఎం 2.5 కాలుష్య ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకుని సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్(సెరా) సంస్థ ఒక నివేదికను తాజాగా విడుదల చేసింది.

✦ దేశంలో నేషనల్ క్యాపిటల్ రీజియన్(ఎన్‌సీఆర్) మళ్లీ అత్యంత కాలుష్య ప్రాంతంగా నిలిచింది. ధారూహేడా(హరియాణా) ఘనపు మీటరు గాలిలో పీఎం 2.5 ఉద్గారాలు 123 మైక్రోగ్రాములతో దేశంలోనే అతికాలుష్య నగరంగా నిలిచింది.

✦ ఆ తర్వాత 10 స్థానాల్లోనూ ఉత్తర్‌ప్రదేశ్, హరియాణా, దిల్లీలకు చెందిన నగరాలే ఉన్నాయి.

✦ పీఎం 2.5 కాలుష్య ఉద్గారాలు ఘనపు మీటరు గాలిలో తిరుపతిలో 55, హైదరాబాద్‌లో 34 మైక్రోగ్రాములు నమోదయ్యాయి.

✦ డబ్ల్యూహెచ్‌ఓ లెక్కల ప్రకారం పీఎం 2.5 స్థాయి క్యూబిక్ మీటరు గాలిలో 15 మైక్రోగ్రాములు మించొద్దు. అంతకంటే అధికంగా ఉన్న ప్రాంతాల్లో దీర్ఘకాలం నివసించేవారిలో గుండె, ఊపిరితిత్తుల వ్యాధులు, ఆస్తమా వంటివి పెరుగుతాయి.

✦ దేశంలో పీఎం 2.5 ఉద్గారాలు ఘనపు మీటరు గాలిలో.. కేవలం 10 మైక్రోగ్రాములతో షిల్లాంగ్ దేశంలో అత్యంత స్వచ్ఛమైన గాలి ఉన్న నగరాల్లో తొలిస్థానంలో నిలిచింది.

తహసీల్దార్లు, ఆర్డీవోలు, డీఆర్వోలకు.. టోల్ ఫీజు నుంచి మినహాయింపు ఇవ్వండి

మోర్త్ కార్యదర్శికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని జాతీయ రహదారుల మీదుగా ప్రయాణించే తహసీల్దార్లు, డిప్యూటీ కలెక్టర్లు (ఆర్డీవో కేడర్), స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు (డీఆర్వో కేడర్) తదితర అధికారుల వాహనాలకు టోల్ ఫీజుల నుంచి మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. అధికారిక కార్యక్రమాల కోసం ప్రయాణించే ఆయా అధికారుల సొంత, అద్దె వాహనాలకు.. వారివద్ద ఉన్న ప్రభుత్వ గుర్తింపుకార్డు చూసి టోల్‌ఫీజు వసూలు చేయకుండా మినహాయించాలని కోరింది. ఈ మేరకు ఆర్‌అండ్‌బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు.. కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ (మోర్త్) కార్యదర్శికి లేఖ రాశారు. ఈ అధికారుల వాహనాలకు టోల్ ఫీజు తీసుకోకుండా చూడాలంటూ ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు. దీంతో ఆర్‌అండ్‌బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి.. మోర్త్‌కు లేఖ రాశారు. ఆయా అధికారులంతా ఎన్నికలు, జనాభా లెక్కలు, ప్రకృతి విపత్తులు, జాతీయ రహదారులకు భూసేకరణ విధుల కోసం, ప్రభుత్వం నిర్వహించే రాష్ట్ర, ప్రాంతీయ, జిల్లా స్థాయి సమావేశాలకు, వివిధ కోర్టుల్లో కేసుల నిమిత్తం హాజరయ్యేందుకు జాతీయ రహదారులపై ప్రయాణిస్తుంటారని, వీరికి టోల్ ఫీజు నుంచి మినహాయించేలా జాతీయ రహదారుల అధికారులకు తగిన ఆదేశాలివ్వాలని లేఖలో కోరారు.

'పత్తి సేకరణలో నిబంధనలు సడలించాలి'

ఈనాడు, అమరావతి: పత్తి సేకరణలో నిబంధనలు సడలించాలని, రైతులు తమ సమీపంలోని జిన్నింగ్ మిల్లుల్లో పత్తి అమ్ముకునేలా చూడాలని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు కేంద్రాన్ని కోరారు. గురువారం ఆయన కేంద్ర టెక్స్‌టైల్ శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌కు లేఖ రాశారు. కపాస్ కిసాన్ యాప్‌లో రైతు వివరాలు రియల్ టైమ్‌లో సమన్వయం చేసుకోవాలని.. దీనికి ప్రత్యేక సిబ్బందిని నియమించుకోవాలని కోరారు. వర్షానికి తడిసి, రంగు మారిన పత్తిని కొనుగోలు చేయాలన్నారు.

హైకోర్టు ఆదేశాల మేరకే... క్రీడా కోటా ఎంబీబీఎస్ అభ్యర్థుల తుది జాబితా

బెంగాల్ ఐపీఎస్ అధికారి కుమార్తెకు సీటు కేటాయింపుపై శాప్ స్పష్టత

ఈనాడు, అమరావతి: ఏపీ హైకోర్టు మార్గదర్శకాలను అనుసరించి క్రీడా కోటా ఎంబీబీఎస్ (నీట్) అభ్యర్థుల తుది జాబితాను రూపొందించి సంబంధిత విశ్వవిద్యాలయానికి సమర్పిస్తామని శాప్ తెలిపింది. పశ్చిమబెంగాల్‌కు చెందిన ఓ ఐపీఎస్ అధికారి కుమార్తెకు నిబంధనలకు విరుద్ధంగా ఏపీ క్రీడా కోటాలో ఎంబీబీఎస్ సీటు కేటాయించినట్లు కొన్ని ప్రసార మాధ్యమాల్లో తప్పుడు వార్తలు వచ్చాయని పేర్కొంది. గురువారం ఓ ప్రకటనలో వాటిని ఖండించింది. కేటాయింపులో శాప్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రమేయం ఉందని వచ్చిన ఆరోపణలు అవాస్తవమని స్పష్టంచేసింది. '2025-26 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ ప్రవేశాలకు సంబంధించి క్రీడా కోటా కింద అభ్యర్థుల ప్రాధాన్య క్రమ జాబితా(టెంటేటివ్ ప్రయారిటీ లిస్టు)ను గత నెల 9న ప్రకటించాం. దీనిపై అభ్యంతరాల స్వీకరణకు ఏడు రోజులు గడువిచ్చాం. తన కుమార్తె పద్మావతికి ఏపీ క్రీడా కోటా కింద సీటు మంజూరు చేయాలని ఐపీఎస్ అధికారి వీఎస్ఆర్ అనంతనాగ్.. శాప్‌నకు అర్జీ పెట్టారు. ఈ మేరకు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. ఆమెకు సీటు కేటాయించాలని ఏపీ హైకోర్టు బుధవారం ఉత్తర్వులిచ్చింది' అని శాప్ పేర్కొంది. దీనిపై శాప్ అధికారులు అప్పీలుకు వెళ్లనున్నట్లు సమాచారం.

ట్రాన్స్‌కో కార్యకలాపాలపై ఫొటోగ్రఫీ పోటీ

ఈనాడు, అమరావతి: ఏపీ ట్రాన్స్‌కో కార్యకలాపాలపై ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో జేఎండీ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ఉద్యోగులు, సాధారణ పౌరులు పోటీలో పాల్గొనవచ్చని తెలిపారు. 'విద్యుత్ రంగంలోని సాంకేతికత, మౌలిక సదుపాయాలతో పాటు ఇంజినీర్లు, సిబ్బంది అంకితభావాన్ని ప్రతిబింబించేలా ఫొటోలు ఉండాలి. 400/220/132 కేవీ సబ్‌స్టేషన్లు, హాట్‌లైన్లు వంటి అంశాలపై స్వయంగా తీసిన ఫొటోలను పోటీకి అర్హతగా పరిగణిస్తాం. వాటిని ఏపీ ట్రాన్స్‌కో ప్రచురణల్లో వినియోగించుకునేందుకు అభ్యంతరం లేదని డిక్లరేషన్‌ను జత చేయాలి. డిక్లరేషన్, ఇతర సమాచారం www.aptransco.gov.in వెబ్‌సైట్‌లో ఉంటుంది. ఎంపికైన ఫొటోలకు మొదటి బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.5 వేలు, తృతీయ బహుమతి రూ.3 వేలు అందిస్తాం. ఈ నెల 15లోగా photocontest@aptransco.gov.inకు ఫొటోలు పంపాలి' అని పేర్కొన్నారు.

వైద్య విద్యార్థులతో ఎన్‌సీసీ డైరెక్టరేట్ చెలగాటం

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రత్యేక ఎన్‌సీసీ కేటగిరీలో సీట్లు భర్తీ చేయకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. మొదటి విడత కౌన్సెలింగ్ ముందే ఎన్‌సీసీ డైరెక్టరేట్‌కు 400 మందికి పైగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వారి తాత్కాలిక ప్రాధాన్య క్రమాన్ని గత నెలలో విడుదల చేసింది. దీనిపై విజయవాడ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం అభ్యంతరాలను వెల్లడించాలని అభ్యర్థులకు సూచించింది. దాదాపు 10 మంది వరకు కొన్ని పాయింట్ల వద్ద అనుమానాలను లేవనెత్తారు. వీటిని ఈ నెల మూడో తేదీలోగా సరిచేయాలని ఎన్‌సీసీ డైరెక్టరేట్‌కు పంపగా ఇంత వరకు పరిష్కరించలేదు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి ఎన్‌సీసీ డైరెక్టరేట్ ప్రత్యేకంగా లేకపోవడంతో తరచూ హైదరాబాద్‌కు వెళ్లాల్సి వస్తోందని యూనివర్సిటీ వర్గాలు చెబుతున్నాయి. మూడో విడత కౌన్సెలింగ్ ముందే ఎన్‌సీసీ కేటగిరీ కౌన్సెలింగ్ పూర్తి కావాల్సి ఉందని వర్సిటీ పేర్కొంటోంది.

కెసిరెడ్డి బెయిల్ పిటిషన్‌లో వివరాలు సమర్పించండి: హైకోర్టు

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు కెసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యంలో వివరాలు సమర్పించాలని, కౌంటర్ వేయాలని సిట్‌ను హైకోర్టు ఆదేశించింది. అనంతరం విచారణను ఈ నెల 14కు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి గురువారం ఉత్తర్వులిచ్చారు. అంతకుముందు జరిగిన విచారణలో కెసిరెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, సీఐడీ/సిట్ తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు.

సంజయ్ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

ఐపీఎస్ అధికారి సంజయ్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. సీఐడీ, అగ్నిమాపక డీజీగా ఉన్న సమయంలో అవినీతికి పాల్పడ్డారని నమోదైన కేసులో సంజయ్ జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. ఈ క్రమంలో ఆయన మూడోసారి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ విజయవాడలోని ఏసీబీ కోర్టులో గురువారం విచారణకు వచ్చింది. దీనిపై తదుపరి విచారణ నిమిత్తం ఈ నెల 10వ తేదీకి కోర్టు వాయిదా వేసింది.

ఏపీ పారామెడికల్ బోర్డు పేరు మార్పు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పారా మెడికల్ బోర్డు పేరును 'ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్ కౌన్సిల్'గా మారుస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. వైద్యారోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ పర్యవేక్షణలోని పారా మెడికల్ బోర్డును గతంలో రద్దుచేసి, కొత్త కౌన్సిల్‌గా పునర్ వ్యవస్థీకరించారు.

జలవనరులశాఖ ఇంజినీర్లకు పదోన్నతులు ఇవ్వాలి



మంత్రికి వినతిపత్రం సమర్పిస్తున్న సంఘ నాయకులు రామచంద్రరావు, తిరుమలరావు తదితరులు

ఈనాడు, అమరావతి: జలవనరుల శాఖలో ఇంజినీర్లకు పదోన్నతులు ఇవ్వాలని ఇంజినీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.తిరుమలరావు.. మంత్రి నిమ్మల రామానాయుడికి వినతిపత్రం సమర్పించారు. ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల సమీక్ష అనంతరం సంఘ నాయకులతో కలిసి ఆయన గురువారం సాయంత్రం మంత్రితో మాట్లాడారు. తగిన విధివిధానాలతో పదోన్నతులు కల్పించాలని కోరారు. సంఘ నాయకులు రామచంద్రరావు తదితరులు ఆయన వెంట ఉన్నారు.